
డిసెంబర్ - 88
రూ 6/-



విశిష్ఠ సుగంధం
మైమరపించే తాజాదనం




క్రొత్త ప్రేమ్
మీకోసమే

ఇప్పుడు అనువైన ఆకారంలో క్రొత్త పరిమళంతో వస్తోంది.

Imageads 2418 Tel

ఎంతో కాలంగా ఉత్తమత్వంలో తమకు గల గుర్తింపును హెచ్ ఎమ్ టి వెలుగు లోనికి తెస్తోంది



హెచ్. ఎమ్. టి గడియారాలకు, ట్రాక్టర్లకు, యంత్ర పరికరాలకు, సి.ఎన్.సి. యంత్రాలకు నాణ్యతలో ఖచ్చి తత్వంలో గల అంతర్జాతీయ ఖ్యాతికి హెచ్. ఎమ్.టి బల్బులు మరియు ట్యూబులు ప్రతిబింబాలు.

హెచ్. ఎమ్. టి ల్యాంపులోని ప్రతి భాగమూ హెచ్. ఎమ్. టి వారే తయారు చేస్తారు. ఇవి 75 అతి కఠినమైన నాణ్యత పరీక్షలకు గురై మీ డబ్బుకు మరింత విలువ నిస్తాయి.

అందుకే, హెచ్. ఎమ్. టి బల్బులు మరియు ట్యూబులను ఎన్నుకోండి. అవి తమ పేరుకు తగ్గట్టు గా చిరకాలం మన్నుతాయి.

hmt
బల్బులు మరియు ట్యూబులు

పటిష్ఠమైనవి. విశ్వసనీయమైనవి.

NOW WITH ISI MARK

hmt Lamps

మీ జీవితంలో వెలుగు.

MAA COMMUNICATIONS/CI/HMT/TEL/88

వ్యవస్థాపకులు
వి.వి. రాఘవయ్య

సంపాదకులు
వి.లీలావతి రాఘవయ్య

సంపుటి-26 డిశంబర్-88 సంచిక-11

"ఇదండీ వరస"

ముఖచిత్రం : సీత

రి.జి.నెం: 1824, హైదరాబాదు-20, ఫోన్: 64104

ఉత్తరాలు



చిరంజీవి-భానుప్రియ ముఖచిత్రంతో వెలువడిన నవంబర్ '88 సంచిక చాలా బావుంది. "కంప్యూటర్ టీజింగ్" సమాధానాలు మమ్మల్ని ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. కె. సామ్రాజ్య లక్ష్మిగారు "జీవిత పోరాటం" కథను చాలా చక్కగా వ్రాస్తున్నారు. అబద్ధం పోటీ జ్యోతికే హైలెట్. ఫారిన్ టూర్‌మీద కర్టూన్స్ మమ్మల్ని కడుపుబ్బా నవ్విస్తున్నాయి.

కలిగిట్ల రాంబాబు
పాలకొల్లు

స్వచ్ఛంగా వస్తున్న మన 'జ్యోతి'కి అభినందనలు. అబద్ధాలపోటీ, కంప్యూటర్ టీజింగ్ శీర్షికలు ఆసక్తికరంగా ఉన్నాయి. మాటకట్లు మెదడుకి మేత పెడ్తుంది.

యర్రంశెట్టి శాయిగారి హ్యూమరాలజీ 'జ్యోతి'కే హైలెట్. ఎడిటర్‌గార్కి మనఃపూర్వక అభినందనలు.

వేల నాగేశ్వరరావు
అనకాపల్లి

నవంబర్ సంచికనుంచి ప్రారంభించిన పొన్నూరి సరిత్ నారాయణగారి సీరియల్ "ఆమె + అతడు = మనిషి" ప్రారంభంలోనే ఆకట్టుకుంది. హ్యూమరాలజీలోని "ఫారిన్ టూర్" మంచి సెట్టర్‌గా వుంది.

పి. శ్రీరామచంద్రమూర్తి
రైలుపేట

నవంబర్ నెల జ్యోతిపత్రిక అందమైన ముఖచిత్రంతో బాగుంది. 'హ్యూమరాలజీ' ప్రతినెలా ఎదురుచూసేలా వుంటుంది. కథలన్నీ నెలకొ నరిసదేలా వున్నాయి. మార్వతెస్ సీరియల్స్ అందిస్తున్న మీకు అభినందనలు.

కాయల రామానంద్
పెనుగొండ

ఈనెల పత్రిక మంచి కథలతోను, సీరియల్స్‌తోను మా ముందుకు వచ్చి విశేషంగా అలరించింది. 'జటాయువు' సీరియల్ ఆతృతగా చదివిస్తుంది. కథలలో 'చీకటి వేషం' బాగుంది. 'అబద్ధాల పోటీ' పేజీ గొప్పోళ్ళ గోత్రాలను తెలియచేస్తుంది.

కోడెబోయిన రమేష్‌బాబు
పాలకొల్లు

నవంబర్ 88 దీపావళి ప్రత్యేక సంచిక "జ్యోతి" ఆకర్షణీయంగా వుంది. దీపావళి కార్టూన్స్ కడుపుబ్బ నవ్వించాయి. "కంప్యూటర్ టీజింగ్" సూపర్బ్.

లంక వాసుదేవరావు
బొబ్బిలి

దీపావళి ప్రత్యేక సంచిక జ్యోతి మాసపత్రిక కన్నులపండుగగా వుంది. ముఖ్యంగా "జీవిత పోరాటం" నవలాను బంధం చాలా బావుంది. 'అర్థాంగుడు' 'మరో సూరేళ్ళు' 'చీకటి వేషం' కథలు అద్భుతంగా వున్నాయి. దీపావళిమీద కార్టూన్లు, జోక్సు నవ్వుకునేందుకు హాయిగా వున్నాయి. 'జటాయువు' సీరియల్‌లో ఝాన్సీరాణి పాత్ర మమ్మల్ని ఆకట్టుకుంది.

చోడవరపు నాగేశ్వరరావు
రమాదేవి
సికిందరాబాదు

సహధర్మం

చందు సుబ్బారావు

వీరమ్మ చూపులకు తుమ్మచెట్టుకు బొట్టు పెట్టినట్లుండేది! వీరమ్మ పని మంతురాలు. మగరాయుడు ...సుఖ మెరగని ప్రాణం. మొండిఘటం.... అనే వాళ్ళు, అంటే ఏమిటో నాకెంతకూ బోధ పడేదికాదు ....

అక్షరం ముక్కరాని వీరమ్మకు అన్నీ నోటి లెక్కలే...

ఉప్పు, పప్పు, ఉల్లిపాయ, చింతపండు, మిరపకాయ ... వగైరా సమస్తమూ ఊళ్ళో పెద్ద కొట్లలోకొని తట్టెడు వస్తువులు నెత్తిన పెట్టుకుని మోసుకుని యింటి కొచ్చేసరికి కాళ్ళు తడబడేదీ .... ఇంటి అరుగుమీద కూచున్న ముసలాడు దించటానికి ఎదురొచ్చేవాడుకాదు ... ఒకవేళ బరువు పట్టుకోలేక 'ఏవయ్యోవ్ కట్టుకున్నాయన, ఒక్క చెయ్యేసి దింపుతా' అనడిగేది ....

'ఓ సినీయమ్మ, చాతకాని ముండ... నన్ను దింపమంటావ్' అని విసుక్కునేవాడు.

వీరమ్మ వణికెకాళ్ళతో 'ఓరినీమనిషి కాల' అని 'ఒసే అంజావ్ .... ఒసేపుల్లీ, అరె ఎంకాయ్ ... సోవుడూ ... ఎవరన్నా ఇటొచ్చి దించండ్రా' అని కేకేసేది.

ప్రక్క గుడిసెల్లో నుంచి ఎవరో ఒకరు పరుగెత్తుకొచ్చి దించేవారు....దించి నోళ్ళు,

"ఏంది ముసలాయన... అమ్మమ్మ అట్టా బరువుతో ఉంటేలేచి అందుకోవే" అనేవాళ్ళు ....


"ఓసిసానిదాని కొడక ... నీసలా ఎవడడిగాడు...పో అవతలకి" అని కసిరేసేవాడు ... వాడు బిత్తరపోయి.

"అమ్మమ్మ ... ఏందీ ముసలాయన, నీ సొమ్ము తింటా నిన్ను కసురుతాడేంది. తలమీద బరువు దించలేడూ ..." అనడిగితే ...

"బరువు కాదురా పరమాత్మా. కొరివి పెట్టడు" కొట్లో కూచుని అనేది వీరమ్మ.

వీరమ్మను పల్లెజనం అంతా 'అమ్మమ్మ' అని పిలిచేవాళ్ళు. కొట్టు సామాన్లు అమ్మటమేకాదు ...

నిత్యం వాళ్ళ కష్టసుఖాలు వినేది. మొగుడూ పెళ్ళాల తగువులు తీర్చేది. చిల్లర మల్లర జబ్బులకు మందులిచ్చేది. కడుపు రాకపోతే ఏంచేయాలో ... వస్తే ఏంచేయాలో ఆడంగులకు 'సలా' లు యిచ్చేది.



మొగుడు కొడితే వీరమ్మకు మొర పెట్టుకునేవాళ్ళు ... మగాళ్ళను పిలిచి చివాట్లు పెట్టేది. మొగుడుచాటున ఓ ఆడది కప్పదాటువేస్తే వీరమ్మ చక్రం అడ్డం వేసేది.

"చాపలకు పోయిందిలేరా పోలిగా... ఊరికే గుచ్చి గుచ్చి యివరాలు కావాల, పో అవతలకి" అని పోలమ్మను రక్షించేది.

"ఎద్దంత మొగుడు, లంజ.... రెండో సారి తప్పుడుపని చెయ్యమాక .... వదిలేస్తాడు పో" అని పోలమ్మను హెచ్చరించేది.

అప్పులిచ్చి అన్నం పెట్టింది. చెరో అబద్ధమూ చెప్పి కాపరాలు నిలబెట్టింది. వెయ్యి మాటలు చెప్పి పెళ్ళిళ్ళు చేసింది. ఎవరైనా దిక్కులేని చావు చస్తే దగ్గరుండి దినవారాలు చేయించింది.

పల్లెకారుజనం అందరికీ వీరమ్మ, 'వీరమ్మమ్మమ్మ' అయ్యింది అందుకే. తన్ను కట్టుకున్న ముసిలోడు వెంకట్రామయ్య మాత్రం 'తాతయ్య' అవ్వలేదు. పల్లె జనానికి ముసిలాడ్ని చూస్తే వొళ్ళు మంట.

తెల్లవారుజామున లేచి, పోయి సరుకులు తెచ్చుకోవాలి...

తెల్లవారేముందుగా పప్పురుబ్బి పునుగులూ, గారెలూ, చేగోడీలు, జంతికలు చేసి కొట్లో పెట్టుకోవాలి.

పొద్దుపొడిచేముందు కొట్టి కాకాలి. ఏనిమిది కొట్టేసరికి ముసిలాడు "దీనెమ్మ కొట్టెక్కింది. నల్లమొద్దు, కాఫీ ఎవడిస్తాడు" అని గుంజుకునేవాడు.

వీరమ్మ గబగబా లేచొచ్చి కాఫీబెట్టి, ఆవకాయ పచ్చడివేసి ముసలాడిముందు ముక్కాలిపీట వేసి పెట్టేది. కాసేపాగి మళ్ళీ ముసలాడు —

"మంచినీళ్ళు దీనెమ్మ మొగుడిస్తాడు కాబోలు" అంటుండటం కొట్టుమీదున్న వీరమ్మ విని —

"అరెరెరె పుల్లిగా, మీ తాతయ్యకు మంచినీళ్ళు మరిచి పోయాను .... ముసిలి ముండను .... కాస్త అందియ్యరా" అని కొట్టుకొచ్చిన పుల్లయ్యతో అనేది. వెంకట్రామయ్య చివాలున లేచిపోయి ....

"ఓసి, సానిముండ .... పల్లెకుర్రోడి చేత్తో మంచినీళ్ళు తాగమంటావ్ .... నువ్వంటే జాతిలేని ముండవి, నీతిలేని పనులు చేస్తావ్....నన్ను చెయ్యమంటావ్ సానిదాని కూతుర" అనేవాడు .... విన్న పుల్లిగాడు చాలా ఆశ్చర్యపోయి, బాధపడి ...

"అమ్మమ్మా! ముసిలాణ్ణి ఎందుకట్టా భరిస్తన్నావ్?"

"భరతగదనాయనా? భరించక తప్పేదేముంది?"


"ఎంత పొగరు? అమ్మతల్లిలాంటి దాన్ని నిన్నే సానికూతురంటన్నాడు .... గన్నేరుపప్పు ఏసెయ్యలెవ్వా?"

"ఏమేత్తాంరా పుల్లయ్యా? ఇదిగో పసుపూ, కుంకుమా తగలడతయ్యిగదా" అని వూరుకుంటున్న. పొద్దున్నే కోమట్లకొంపలకుపోయి నిదర ముహాల్న చూడాలి తుమ్మచెట్టుముహం అయినా ఆ బొట్టుండబట్టి 'ఏం వీరమ్మతల్లీ? రా....రా' అంటన్నారు. యీ ముసిలాయన చస్తే ఎవరకు ఎదురైనా పొద్దున్నే దాపరించిందంటార్రా నాయనా' అని చెప్పేది.

వీరమ్మ చెప్పేది 'సబబే'. ఏదో ముసలాడు కుక్కకాపలా ఉండనియ్యి అనుకోవచ్చును ...కానీ అది ఇప్పుడే నిజం ... మొదట్నుంచీ కాదు.

* * *

వీరమ్మ కిప్పుడు డెబ్బయ్యేళ్ళు .... ఈ వేళ వెంకట్రామయ్యను ఎందుకు భరిస్తుందో చెబితే ఎవరైనా అర్థం చేసుకుంటారు. డెబ్బయ్యేళ్ళుగా ఎలా భరించిందో చెబుతే ఎవరూ నమ్మరు. నమ్మినా ఆమోదించరు.



వెంకట్రామయ్యకు వీరమ్మనిచ్చి నాలుగో ఏట పెళ్ళి చేసారు. పెళ్ళిలో పిల్లాడు దివిటీలా వెలిగిపోయాడట ... పక్కన వీరమ్మ చింతపండు కట్టలా కనిపించిందట.

వీరమ్మ వయస్కురాలైందాకా వెంకట్రామయ్యకు నలుపూ తెలుపూ తేడా తెలియలేదు...నిజం చెప్పాలంటే ఇద్దర్నీ కలిపిన ఏడాది దాకా తెలియలేదు. తెలుసుకునేలోపు నల్లటి వీరమ్మకు దేవుడిచ్చిన వరంలా తెల్లటి పిల్ల పుట్టింది.

'జ్ఞానలక్ష్మి' అని పేరుపెట్టాడు పురోహితుడు.

పిల్ల పుట్టింతర్వాత వెంకట్రామయ్య వీరమ్మ జోలికి మరి పోలేదు. పుట్టింటి నుంచి కాపరానికి తీసుకురానూలేదు.

గిరజాలు దింపి, లాల్చీవేసి, అత్తరు రాసి, చుట్ట వెలిగించి కొంకె కర్రపట్టుకుని నడిచే వెంకట్రామయ్య వల్లెవాటును చూసి భోగంవారకాంతలు కాలు కదలనిచ్చేవాళ్ళు కాదట.

వనజమ్మా ... సోములమ్మా... శ్రీశైలం ... కనకాంబరం....నగరాజి, పాపాయి, రాఘువాయీ ... ఇలా నాలుగేళ్ళ కొకరు మారుతూ వచ్చేసరికి నలభై ఏళ్ళ కాలం గడిచింది. నాలుగెకరాల మాగాణి హరించుకుపోయింది.

వీరమ్మను కూతుర్నీ ... అన్నలు నలుగురూ పోషించారు .... పోషించారంటే పూరికినేకాదు... గేదెపెట్టిన దున్నకుర్ర ఒకటుంటే రెండోదాని క్రింద వీరమ్మను కట్టుకుని కొండ్రదున్నుకుంటూ, పంట పండించుకు తింటూ పోషించారు...ఏ మాటకామాట. చెప్పుకోవాలి.

వీరమ్మ కేలోటూ రాకుండానేచూశారు, జ్ఞానలక్ష్మిని 'గేనలచ్చమ్మా' అంటూ భుజాలమీద మోసి పెంచారు. మా తుమ్మచెట్టు కడుపున 'పూలకుండీ' పుట్టిందిరా! అనుకుంటూ....ఈమధ్య వెంకట్రామయ్య రాలేదా? అంటే వచ్చాడు. లేదా కబురు పంపాడు.

ఊళ్ళో 'ప్లేగు' వ్యాధి వచ్చింది. ఎలికలు చచ్చిపోతన్నాయి .... వెంకట్రామయ్యకూ్కుడా సోకింది. రమ్మని కబురు పంపారు. అప్పుడొకసారీ ... కలరా వచ్చినప్పుడొకసారీ ...

మశూచిసోకి మంచంలో పడుంటే వనజమ్మా, సోములమ్మా, వెంకాయమ్మా ఎవరూ ముట్టుకోరాలేదు. వీరమ్మవచ్చి వెంకట్రామయ్యకు నెలరోజులపాటు ఒకటీ, రెండూ ఎత్తిపోసింది. వేపమండల్తో విసిరింది. కారుతున్న రసి తుడిచి శుభ్రం చేసింది.

కుండలు ఎండి కాస్త పొలుసులు రాలంగానే వెంకట్రామయ్య వీరమ్మను పుట్టింటికి పంపించాడు. ఈసారి క్షయ పుట్టిందాకా రానక్కరలేదన్నాడు!!

వీరమ్మ భుజంమీద చీరె చుట్టుకుని పుట్టింటికి పోయింతర్వాత వెంకట్రామయ్య పాపాయమ్మ యింటికి పోయాడు.

ముహంమీద మచ్చలుపడి వికృతంగా వున్న వెంకట్రామయ్యను చూసీ చూడగానే పాపాయమ్మ 'లోన' మనిషన్నాడని కబురు పంపింది.

సోములు తక్కువ కులంది కావటంచేత "సరేరండి...కానీ నెలదిరక్కుండా నాకు మామిడి పిందెల గొలుసు చేయిత్తానని మాటిచ్చి మరీరండి" అంది.

'అలాగేనని' నవ్వాడు వెంకట్రామయ్య.

"అమ్మవారొచ్చిన మనిషి అరవై రోజులు ఆడదాన్ని తాకరాదు. దూరంగా పడుకో ...." అని పక్కకు తిరిగి పడుకుంది సోములమ్మ.

"ఇహిహిహి" అని నవ్వి వెనకనుంచి మనిషి మీద చెయ్యివేసి తృప్తి పడ్డాడు వెంకట్రామయ్య.

* * *

జ్ఞానలక్ష్మి పెళ్ళయి వెళ్ళిపోయాక, వీరమ్మ అన్నయ్యలు ఇద్దరు ఒకసారి కృష్ణ వరదల్లో చచ్చిపోయారు. మూడో వాడు నిన్ను నేను పోషించలేనన్నాడు. నాలుగోవాడు పొట్టపట్టుకుని బెజవాడ పోయాడు.

వీరమ్మ స్వయంగా పొలందున్నినాట్లు వేసుకుంది. వడ్లబస్తా మోసింది ... పచ్చి మాగాణిలో నారుమోపులు నెత్తిన పెట్టుకుని నడిచింది. 'పది వోదెల' వరికట్టతో నిచ్చెనెక్కి కుప్పమీద విసిరింది.

తాను ఆడమనిషినన్న విషయం వీరమ్మ ఎప్పుడో మరచిపోయింది.

పాడు శరీరం కొంతకాలం గుర్తు చేసి చేసి, విసిగిపోయి వీరమ్మకు విశ్రాంతినిచ్చింది. ఇప్పుడు వీరమ్మ మినప బస్తా ఎత్తుకుంటుంది. మా రేవు పల్లి జనం యావత్తూ ముక్కుమీద వేలేసుకున్నారు!

* * *

కలరా వచ్చి మూడో అన్నయ్య చచ్చిపోయింతర్వాత వీరమ్మకు వూళ్ళో అండ లేకపోయారు. తన కండలే అండ, తన చెమటే స్నేహితులు, కాళ్ళే బంధువులు, కన్నీళ్ళే కావలసినవాళ్ళు అనుకుని పదేళ్ళు బ్రతికింది. అంటే వొక్కమాట, బ్రతికింది అహోరాత్రాలూ అఘోరిస్తూ 'అలో లక్ష్మణా' అంటూ బ్రతకలేదు.

గానుగెద్దులా తిరిగి సున్నం పిండిపిండి చేసింది. మైలురాయిలా ఎండకూ వానకూ, ఎండింది. పళ్ళచెట్టులా కాయలు కాసింది. తన ఫలాలు కోసి యితరులకిచ్చి మళ్ళీ చెట్టయి నిలిచిపోయింది.

అప్పుడప్పుడూ జ్ఞానలక్ష్మి, అల్లుడూ, పిల్లలూ రాగా, చూసుకుని మురిసిపోయింది. తన చెమట బ్రతుకులో వరాల మూట దొరికినట్లు సంబరపడిపోయింది. జ్ఞానలక్ష్మినీ పిల్లల్నీ ... పూలమీదకాదు ముత్యాలమీద నడవమంది. మూటలుగట్టి పంపిస్తాను అన్నది. అన్నంతపనీ చేసింది

వెంకట్రామయ్యను పూర్తిగా మరిచిపోయే వయసూ, మనసూ వీరమ్మకొచ్చాయి. ఇహ కన్నుమూద్దాం అనుకుంటూండగా

'వెంకట్రామయ్య సుఖవ్యాధుల్తో తీసుకుంటున్నాడని' కబురొచ్చిండి. ఉన్న యిల్లు శ్రీశైలం రాయించుకుందనీ, ఉత్త చేతుల్తో ఉన్నాడనీ, నవరంధ్రాల్నుండి చీమూ నెత్తురూ వస్తున్నాయని వార్త.

అయితే వెంకట్రామయ్య భార్యను రమ్మని కబురు పంపలేదు సుమండీ! వార్త చేరిందంతే ... వీరమ్మ వెళ్ళకపోను ...

అప్పట్లో ఓ చిన్న సంగతి జరిగింది.

వీరమ్మ సాగుచేసుకునే భూమి ప్రక్కనే పెద్దరెడ్డిగారి కొంద్ర వుంది. చిన్నగట్టు తగాయిదా ప్రారంభమై మాటా మాటా పెరిగింది. వీరమ్మ తగ్గలేదు.... నువ్వెంతంటె నువ్వెంతంది.

'నోర్ముయ్' అంటే తిరిగి పెద్దరెడ్డిని 'నోర్ముయ్' అంది. ఒక్కసారిగా వూళ్ళో వాళ్ళు. "అవురా, ఆడముండ, నల్లతుమ్మలంజ పెద్దరెడ్డిని అంత మాటనటమా! మనం బ్రతికున్నామా ... చచ్చామా" అని తర్కించుకున్నారు.

"మిమ్మల్ని గట్టిగా ముద్దుపెట్టుకున్నవాడెవడో తెలియకపోతే ఎవరిపై కేసు పెడతాం. అయినా అతడి ముఖం చూడకుండా ఎలా ఉన్నారు మీరు" ఆశ్చర్యంగా అడిగాడు లాయర్ తన క్లయింట్‌తో.

"ఆ తన్మయత్వంలో కళ్ళు మూసుకున్నాను మరి...."

—కె. వి. మధుసూదనరావు,
కాకినాడ.

వీరమ్మ మీదకొచ్చారు.

"మీదచెయ్యిపడితే 'ఒకడివి' పట్టుకుని కొరికేస్తాను జాగ్రత్త" అంది మచ్చలపులిలా కనిపించిన వీరమ్మ. అంత పనీచేసుండేది. అంతదాకా వాళ్ళే పోలేదు. పరువూ ప్రాణమూ కాపాడుకున్నారు. పోలీసు రిపోర్టిచ్చారు! ఈ ఆడది మమ్మల్ని హత్య చేయాలనుకుంటుంది అవటా, అని. వాళ్ళు వచ్చారు మదుపు తిన్నంతసేపూ వీరమ్మను తిట్టి, వెళ్ళిపోయారు.

ఏమీ కాలేదుకాని, వీరమ్మ మనస్సు ఇన్నేళ్ళకు ఒక్కసారి చివుక్కుమంది.

పొలంలో రైతులు, ఊళ్ళో పెద్దలు, పైనుంచి పోలీసులు రాత్రనకా పగలకా పైకొచ్చి యాగీ చేస్తుంటే ఒక్క మగాడైనా వచ్చి మాటసాయం లేకపోయనే.

ఒక్క మనిషి తోడు నిలబడి 'నీకెందుకు వీరమ్మ నేనున్నాను. ఉండు! అని చల్లని మాట చెప్పకపోయనే ....'

అని దిగులుపడింది వీరమ్మ. ఊరి రైతులు పలకరించక పోవటంతో గుండెల్లో బాధవేసింది. అప్పుడు తెలి

సింది వీరమ్మకు.

ఊరంతా ఒక కులమనీ ! తానొక కుల మనీ. అంతే .... పొలం తెగనమ్మింది. సామాను పడవమీదవేసి కృష్ణ కాలవ తె క్కించింది. ఇల్లు పైకప్పుకీకి పనికొచ్చే సామానంతా రెండోపడవెక్కించింది.

అటు అల్లుడు వాళ్ళ వూరికీ, ఇటు వెంకట్రామయ్య ఊరికీ మధ్య గొట్టిప్రోలు అనే వూరుంది. ఊరుబయట పల్లెకార్లుం టారు. వాళ్ళ దిబ్బమీద నాలుగుసెంట్లు స్థలం కొనుక్కుని సిమెంటు రాళ్ళతో యిల్లుకట్టింది. కొట్టు పెట్టింది.

వుడరె అంజావు, పుల్లాయి, నారిగాడు, ఆదిమ్మ, ఏసేబు, సువార్త, కిట్టప్ప, రాములమ్మ....సిసింద్రీ, టపాసూ చుట్టా లయ్యారు. నోరులేని ఆ జనం మధ్య బ్రతకటం వీరమ్మకు పండగయింది. వ్యవసాయం చేస్తున్న చేతులేమో కొట్టు పని పల్లేరుమీద బండినడకలా సాగింది'

జ్ఞానలక్ష్మి పిల్లలకు పెళ్ళిళ్ళయ్యాయి. మనవళ్ళు పుడుతున్నారు.

*   *   *

వెంకట్రామయ్య పాపాయమ్మ పంచ లోచేరి బ్రతుకుతున్నాడట. ఎంతకీ ఛీ అన్నా ఛా అన్నా వెళ్ళటం లేదట. ఇలా కాదని పాపాయమ్మ ఎవరికో చెప్పి కత్తితో పొడిపించింది.

ప్రభుత్వ ఆసుపత్రిలో పడవేసారు. పోలీసులు వచ్చి 'వీరమ్మ అంటే ఎవ రమ్మా' అని వాకబు చేసారు.

'నేనేనుబాబూ ! తమకేం కావాలి'

"నీ భర్త వెంకట్రామయ్యను ఎవరో కత్తితో పొడిచారు – చూద్దుగానిరా" అని తీసుకెళ్ళారు.

ఆదుగో...అప్పుడు వెంకట్రామయ్య వీరమ్మ దగ్గరకు చేరాడు. చేరాకుఅంటే నోరు తెరిచి పలకరించలేదు. ఎలా వున్నా వని అడగలేదు. ఆకలేస్తే బూతులు తిట్టాడు.

అయిందానికీ, కానిదానికీ 'సానిదాని కూతుర' అన్నాడు. "ముసలాయనకు సానోళ్ళంటే చుట్టరికం. అందుకే ఆ మాటలు" అనిమాత్రం అనేది వీరమ్మ మ్మమ్మ.

రోగాలన్నీ తగ్గాయీ అనుకుంటే వెంకట్రామయ్య ఉబ్బసం పట్టుకొచ్చాడు. మరి ఎలా వచ్చిందో ?!

రాత్రిళ్ళు నస, బుసకొట్టినట్టు ఖంగు ఖంగుమని దగ్గూ, కళ్ళె, పిల్లికూతలు.

"ఈ మందుబిళ్ళ మింగవయ్యా ముస లాయనా" అంటే 'ఆడబెట్టిపో అవతలికి' అని కసిరేవాడు.

అడబెట్టిన మందుబిళ్ళ కావాల ...

అది సంపాయించిన ఆడది మొహం చూపించరాదు.

*   *   *

వీరమ్మ ఎప్పుడు పుట్టిందో సరిగ్గా తెలిసేడికాదు నాకు.

పెద్ద గాలివానకు ముందనేది.

తాను పుట్టినప్పుడు ఆకాశంలో గొర్రెలు పరిగెత్తాయంట, అని చెప్పేది.

అప్పుడే ఇంగిసోళ్ళు బందరుకు రైలు పట్టాలు వేసారనేది.

తనకు పదేళ్ళనంగా ఊళ్లో తిరణాల జరిగింది. అమ్మోరికి వేటనేసాం .... ఆ ఏడు కరువొచ్చిందని చెప్పేది.

ఏ విధంగానూ వీరమ్మ పుట్టిన కాలం సరిగ్గా తెలియలేదు.

అటూ యిటూగా 1890...ప్రాంతం అనుకునేవాణ్ణి. రెండు శతాబ్దాల సుదీర్ఘ కష్ట జీవితం చూసిన వీరమ్మ, రెండేళ్ళ క్రితం తొంభయి ఎనిమిదో ఏట చనిపోయే దాకా తన జీవితకథంతా నాకు చెప్పేది.

*   *   *

ప్రాణం పోయేటప్పుడైనా వెంక ట్రామయ్య వీరమ్మను పలకరించలేదు. వెక్కిళ్ళొస్తున్నాయి. ఇహ అయిపోతాడని అందరూ 'అమ్మమ్మ' వెళ్ళు వెళ్ళె అని పంపించారు.

వీరమ్మ వెళ్ళి రెండు చేతులూ పట్టు కుని "ఏమయ్యా...కట్టుకున్నాయన ... ఎలావుందీ" అనడిగింది.

స్పృహ తెచ్చుకుని వెంకట్రామయ్య "చీ...పో...ఎదవ మొహం సువ్వూను. ఎట్టా వుంటదీ" అని కసిరాడు కాసేపాగి.

"అమ్మాయ్, గేనలచ్చమ్మా ...." అని పిలిచాడు. కూతురు జ్ఞానలక్ష్మి వెళ్ళి తండ్రి తల దగ్గర కూచుంది.

కూతురి చెవిలో "లచ్చమ్మా ! ఎవ్వ రికీ తెలియకుండా ఊరి కోమటాయన దగ్గర ఎయ్యిరూపాయలు దాచాను ఎళ్ళి తెచ్చుకో" అన్నాడు వెంకట్రామయ్య.


లక్ష్మికి ఏడవాలో నవ్వాలో తెలియ లేదు.

లక్ష్మి మెడపట్టుకుని వేలాడుతూ అలాగే ప్రాణం వదిలాడు.

"ఇంకేం ముసలాయన ? అయిపో యాడుగా .... కట్టెల అడితీకి పోయి రావాల. నాకు తప్పేదేముంది" అంటూ లేచింది వీరమ్మ. తొంభయ్యేళ్ళ వీరమ్మ చనిపోయింది భర్తకాదు. తోటి మనిషి అనుకుంటూ...

మనమలూ, మునిమనుమలూ, మేమంతా వారిస్తున్నా "మీవల్ల ఏమవుద్ది? ఎండలో కందిపోతారు .... ఉండండ్రా" అని చెప్పులేసుకుని రోడ్డెక్కింది!

***



ఇల్లు కట్టి చూడు

ప్రపంచ తెలుగు మహాసభలకు ఎలాగయినా వెళ్ళాలని అందరం దాని తాలూకు సీక్రెట్ ఇన్‌ఫర్మేషన్ లాగే ప్రయత్నంలో ఉన్నాం. 'కాంగ్రెస్ వాళ్ళను పట్టుకుంటే తేలిగ్గా వెళ్ళిపోవచ్చు' అన్నాడు జనార్థన్.

"కాంగ్రెస్ వాళ్ళను ఎలా పట్టుకోవటం"! అడిగాను నేను.

ఆ ప్రశ్నకు అందరూ ఘొల్లున నవ్వారు. నన్నో వెర్రి వెంగళాయిని చూసినట్టు కూడా చూశారు.

"రాజకీయ నాయకుల్ని ఎలా పట్టుకోవాలో తెలీదా! బలేవాడివయ్యా నువ్వు! ప్రపంచంలో అతి తేలికయిన విషయం అదే!"

ఆ విషయం గురించి డిస్కషన్స్ పూర్తయిపోయాక రంగారెడ్డి అసలు విషయం ప్రస్తావించాడు.

"ఆమధ్య మా అమ్మమ్మ చనిపోయిన విషయం మీకందరికీ తెలుసు కదా! ఇప్పుడు ఆమె తాలూకు ఇంటి స్థలం ఒకటి నాకు సంక్రమించింది అదక్కడుందో ఏమిటో ఇంతా వివరాలు తెలీవు. సరే హైద్రాబాద్‌లో స్థలం దొరకటమే మనలాంటి వాళ్ళకు అపురూపమయిన విషయం గనుక-అక్కడ ఇల్లు కడదామని మా ఆవిడ ఒకటే గొడవ చేస్తోంది."

మా కందరికీ హఠాత్తుగా రంగారెడ్డి మీద ఈర్ష్య కలిగింది.

రాజధానిలో స్థలం దొరకటం! ఇల్లు కట్టటం ఒక్క ఛీఫ్ మినిష్టర్‌కి మిగతా మంత్రులకి తప్ప మరెవరికీ సాధ్యం కాదని మా అనుమానం.

ఎందుకంటే వాళ్ళకు ప్రభుత్వం రూల్సేమీ వర్తించవు గనుక.

ఏదేమయినా మా అందరికి సొంత ఇల్లు లేకుండా ఉండటంకంటే ఒక్కడికయినా ఇల్లు ఉండటం మంచిదే అని అనిపించింది.

"ఇంక ఆలోచనెందుకు కట్టి పారెయ్-" అన్నాడు శాయీరామ్.

"కానీ అంత తేలిక్కాదని విన్నాను. మన ఫ్రెండ్స్ సర్కిల్లో ఇల్లు కట్టిన

యర్రంశెట్టి శాయి

హ్యూమరాలజీ-69

వాడెవడయినా ఉంటే వాడి సలహా అడుగుదాం-"

"దాన్దేముంది? టి. జె. ఎమ్. బాబు ఉన్నాడు కదా! రిసెంట్‌గానే ఇల్లు కట్టాడు. పదండి! అతని దగ్గర కెళ్దాం-" అన్నాడు జనార్థన్.

అందరం టి.జె.ఎమ్. బాబు ఇల్లు వెతుకుతూ బయల్దేరాం.

అరగంట సేపట్లో మా స్కూటర్లు నగరం బయటి కొచ్చేసినయ్. వనస్థలి పురం కూడా దాటిపోయేసరికి మాకు ఓపిక పోయింది.

"ఇంకెంత దూరం వెళ్ళాలి గురూ?" అడిగాడు గోపాల్రావ్.

"ఆ-ఎంత? ఇంకో రెండు కిలో మీటర్లు! చాలా దగ్గర-"

మరో రెండు కిలో మీటర్ల దూరం వెళ్ళాక మెయిన్ రోడ్‌నుంచి పక్కకు తిరిగాం. అదో మట్టి రోడ్డు. అంతా గుట్టలూ, రాళ్ళూ, చెట్లూ తప్పితే ఇంకేమీ కనిపించటం లేదక్కడ.

మరో కిలో మీటర్ దూరం తర్వాత మట్టిరోడు కూడా ఆగిపోయింది. ఓ సన్నని కాలిత్రోవ మాత్రం కనబడుతోంది.

"ఇంకెక్కడ?" అడిగాడు యాదగిరి ఆగిపోయి.

"అదిగో ఆ చెట్టుదాటున సగం కట్టినిల్లు కనిపించటం లేదూ? అదే మనాడిల్లు-" అందరం అదిరిపడ్డాం.

"ఏమిటి? ఇంత మారుమూల ఇరుగు పొరుగూ లేకుండా ఒక్కడే కాపురముంటున్నాడా?" ఆశ్చర్యంగాఅడిగాడు శాయీరామ్.

"ఇది మారుమూలేమిటి? బాగా డిమాండ్ ఉన్న ప్లేస్? అయినా మనాడింటికి కిలో మీటర్ దూరంలో ఇంకొకతను కూడా ఇల్లు మొదలు పెట్టాడట. ఇంక సందడికేం తక్కువని!"

అందరం బాబు ఇంటికిచేరుకున్నాం.

కాంక్రీట్ పిల్లర్స్‌తో కట్టాడది. ఉట్టి స్తంభాలూ, పైన కాంక్రీట్ శ్లాబ్ మాత్రం వేసి ఉంది. రెండేరెండు గదులకు మాత్రం గోడలు కట్టి ఉన్నాయ్. మిగతా గదులన్నీ ఓపెన్‌గానే ఉన్నాయ్. దగ్గరకు వేసి ఉన్న గది తలుపు తట్టాడు జనార్థన్.

లోపల దభేల్‌మన్న చప్పుడూ దాని వెనుకే పరిగెడుతున్న అడుగుల చప్పుడూ వినిపించింది. మాకు ఏమీ అర్థం కాలేదు.

"బాబూ!" మళ్ళీ తలుపు తట్టాడు జనార్థన్.

ఈసారి మళ్ళీ పరుగు చప్పుడు విని

పించింది.

ఆ తరువాత రెండు నిముషాలకు వాళ్ళావిడ తలుపు కొంచెంగా తీసి అడ్డం నిలబడింది.

"ఆయన ఊళ్ళో లేరండీ! విశాఖ పట్నం వెళ్ళారు ఆఫీస్ పనిమీద. ఇంకో వారం రోజులవుతుంది తిరిగి రావటానికి." అంటూ జనార్ధన్ ని మమ్మల్నీ చూసి చిరునవ్వుతో తలుపు తెరచింది.

"మీరా అన్నయ్యా! రండి! ఇంకెవరో అనుకున్నాను" అంటూ తలుపు తెరచింది. అందరం బిలబిల మంటూ లోపలకు నడిచాం.

ఆ గదిలో కుర్చీలూ, టీపాయ్, టి. వి. ఫ్లవర్ వాజ్ లూ-అంతా బాగానే ఉంది. కాకపోతే గోడలకింకా రంగు వేయలేదు.

"వైజాగ్ ఎప్పుడు వెళ్ళాడు? నిన్న సాయింత్రం కూడా కనిపించాడుగానీ నాతో ఏమీ చెప్పలేదే" అన్నాడు జనార్ధన్.

ఆమె జవాబు చెప్పటానికి సిగ్గు పడింది.

"నిజానికి అయన వైజాగ్ వెళ్ళ లేదన్నయ్యా! - ఇంట్లోనే ఉన్నారు. కానీ- అంటూ ఆ గడపలోనుంచే లోపలి గది అటకవేపు చూస్తూ "ఏవండీ! దిగండి! మన కాలనీ వాళ్ళే వచ్చారు" అంది.

డబ్బాలు, అట్ట పెట్టెలూ అన్నీ పక్కకు తోసుకుంటూ అటకమీదనుంచి కిందకు దిగాడు బాబు. మొఖం, బట్టలూ అంతా దుమ్ము అంటుకుపోయి భయం కరంగా కనిపించసాగాడు.

మాకు కొద్ది క్షణాలవరకూ నోట మాట రాలేదు.

టి. జె. యమ్. టవల్ తో మొఖం తుడుచుకుంటూవచ్చి కుర్చీలో కూర్చు న్నాడు.

"మరేంలేదు. అప్పులాళ్ళేమో అను కుని అటకమీదెక్కాను" చిరునవ్వుతో చెప్పాడతను.

"అప్పులాళ్ళేమిటి?" ఆత్రుతగా అడి గాడు రంగారెడ్డి.


"అదే! ఇల్లు కట్టాను కదా! అంచేత కొద్ది రోజులు కొంచెం ఇలా అప్పులాళ్ళ నుంచి తప్పించుకోక తప్పదులే!"

"కొద్దిరోజులంటే ఎన్నాళ్ళు?"

"ఆ! మహా అయితే అయిదారేళ్ళు! అప్పులిచ్చేవాళ్ళు మొదటి అయిదారు సంవత్సరాలే మహా దుడుకుగా ఉంటారు. తర్వాత వాళ్ళ పవర్ కొంచెం తగ్గిపోతుంది. అప్పుడు ఎదుట పడినా ఏం ఫర్లేదు. కాసేపు గొణికి పోతారు. అదే మరో అయిదేళ్ళు బాకీ తీర్చలేదనుకోండి! అప్పుడు ఆ గొణ గడం కూడా ఉండదట. మనం కన బడితే చాలు భోరున ఏడుస్తూ కాసేపు మనవెంట పడతారట. మనం చూడ నట్లు, వాడి ఏడుపుతో మనకేమీ సంబంధం లేనట్లూ వెళ్ళిపోవాలంట! మన కాలనీలో ఉండే బోస్ చెప్పా డివన్నీ! వాడు ఇల్లు కట్టి చాలాకాలం అయిపోయింది కదా?-"

రంగారెడ్డి కొంచెం నిరుత్సాహ పడి నట్లు మాక్కనిపించింది.

"ఇంతకూ ఏమిటిలా హటాత్తుగా



వచ్చేశారు? కొంచెం ముందే చెప్పి వస్తూండండి! సాధారణంగా బయట తలుపు చప్పుడవగానే నేను వెనుక తలుపు తీసుకుని అయిదారు కిలో మీటర్లు పరిగెత్తుకెళ్ళిపోతాను. మళ్ళా అయిదారు గంటల తర్వాతగానీ ఇల్లు చేరుకోను!"

"మరి మేము ఇందాక తలుపు కొట్టి నప్పుడు వెళ్ళలేదేం?"

"ఇంతకుముందే రెండుసార్లు వెళ్ళి ఇప్పుడే ఇంటికి చేరుకున్నాను. ఇప్పుడు మళ్ళీ పరుగెత్తాలంటే కొంచెం బద్ధకం వేసింది. అందుకని రిస్క్ తీసుకుని అటక ఎక్కేశాను. నిజం చెప్తున్నాను అటక చాలా రిస్క్ తో కూడుకున్న వ్యవహారం. కొంతమంది అప్పులాళ్ళు ఎంత తెలివిమీరి పోయారంటే సరాసరి ఇంట్లో కొచ్చేసి అటకమీద కెక్కి వెతుకుతున్నారు. రెండుసార్లు దొరికి పోయాననలా! అలా దొరికిపోయినప్పుడు పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉంటుందిలే!"

"సంగతేమిటంటే మన రంగారెడ్డి ఇల్లు కట్టాలని అనుకుంటున్నాడు! నీ అనుభవాలేమిటో చెప్తే-దానినిబట్టి-"

టి. జె. యం. బాబు రంగారెడ్డివేపు చూశాడు జాలిగా.

"ఏం గురూజీ మీరు కట్టాలను కుంటున్నారా?" ఆశ్చర్యంగా అడి గాడు.

"అవును! ఏం?"

"అహహ-ఏం లేదు! మీరు సాధా రణంగా పీస్ ఫుల్ గా ఉండే జీవితం కాస్తా ఊపిరితిరగనంత పనితో నిండి పోతుంది-ఇల్లు కట్టటం మొదలయిం దంటే! ఇప్పుడున్న సంతోషం ఉండదు. ఆకలి వేయదు, నిద్రరాదు! నేను కంటినిండా నిద్రపోయి పదిహేను రోజులయింది."

రంగారెడ్డి మరింత నిరుత్సాహ పడి పోయాడు.

"అయినాగానీ మనం భయపడ కూడదు. ఎందుకో తెలుసా?"

అందరం ఆత్రుతగా అతని వేపు

చూశాం.

"ఎందుకంటే—మనసులో ఎంతో సెక్యూరిటీ ఫీలవుతాం! మనదేశంలాంటి దిక్కుమాలిన దేశంలో గవర్నమెంట్ సెర్వెంట్స్‌కి ఆ ఫీలింగ్ చాలా అవసరం. మీకు తెలుసో తెలీదో మా ఆఫీస్‌లో సీనియర్ క్లర్క్‌గా పనిచేసిన మూర్తిగారి గతేమయింది? రిటైరవగానే గవర్నమెంట్ క్వార్టర్స్ ఖాళీ చేయించేసార్లు. దాంతో తక్కువ అద్దె ఉన్నా ఇంటికోసం తిరిగి తిరిగి చివరకు వడ కొట్టి చచ్చిపోయాడు-అదీగాక ఇంకో ముఖ్యమయిన విషయం ఒకటుంది. అదేమిటంటే మనం మన సొంత ఇంట్లో ఉంటున్నాం అనే ఫీలింగ్! అహా! ఎన్ని బాధలయినా పడనీ! నా కెంత ఆనందంగా ఉంటుందో తెలుసా? ఈ ఇల్లసలు పూర్తవనీ, అవకపోనీ-నేను అటకమీదే కాపురం ఉండనీ! అయినా ఫర్లేదు-'నా యిల్లు'! ఆహా! ఎంత అద్భుతమయిన ఫీలింగు మీకు తెలీదు. మీరు గవర్నమెంట్ కాలనీలో ఉన్నారు గనుక మీకా ఫీలింగ్ తెలీదు. కానీ నాలాగా అద్దె ఇళ్ళల్లో కొంతకాలం గడిపినాడికి తెలుస్తుంది."

వాళ్ళావిడ ఉందరికీ మంచినీళ్ళు తెచ్చిచ్చింది.

"సారీ అన్నయ్యగారూ! మేము కాఫీ టీ తాగటం మానివేశాం. ఈ ఇల్లు కట్టిన దగ్గర్నుంచీ! ఏదో మనకు వీలయిన పొదుపు మనం చేయాలి కదా!" అందామె దిగులుగా.

"అవునవును! తప్పదు మరి!" అన్నాడు కాయీరామ్ భయంగా.

మేమందరం లేచి బయటకు నడువబోతూండగా ఓ వ్యక్తి స్కూటర్‌మీద వచ్చి ఇంటిముందు ఆగాడు. మాతో బాటు బయటకు రాబోతున్న టి. జె. యమ్. బాబు అతనిని చూడగానే చెంగున వెనుకకు గెంతి పెరటి తలుపు తీసుకొని మెరుపులా పారిపోయాడు.

"ఉన్నాడా?" ఆ వ్యక్తి మమ్మల్ని అడిగాడు.

"లేడు! అందుకే మేము వెళ్ళిపోతున్నాం" అన్నాడు కాయీరామ్ చప్పున.

"నీయవ్వ! నా బాకీ సంగతేమో గానీ వసూలేయటానికి పెట్రోల్‌కి దానికి డబుల్ అయేట్లుంది థూ" అనుకుంటూ వెళ్ళిపోయాడతను.

మేము రింగ్‌రోడ్ దగ్గర కొచ్చేసరికి కనకయ్య పాన్ డబ్బా దగ్గర నిలబడి 'నమస్తే సార్' అంటూ గట్టిగా అరిచాడు.

దాంతో స్కూటర్లు ఆపక తప్పలేదు.

ఎందుకంటే కనకయ్య అందరికి బాగా తెలుసు. అతను రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో ప్యూన్. మా కాలనీలో కొంత కాలం ఉన్నా తర్వాత బంజారా హిల్స్‌లో ఓ అందమైన మేడ కట్టుకుని వెళ్ళిపోయాడు.

"ఏమిటి కనకయ్యా! ఇటువక్క వచ్చావేమిటి?" అడిగాడు రంగారెడ్డి.

"ఈ ఏరియాలో వెయ్యి గజాల ప్లాట్ ఉంది సార్! అందులో ఎనిమిది పోర్షన్లతో ఇల్లు కట్టానీ మధ్యే! అద్దె వసూలు చేసుకోటాని కొచ్చాను-"

అన్నాడు బెన్సన్ అండ్ హెడ్జస్ సిగరెట్ పెట్టె తీసి ఓ సిగిరెట్ వెలిగించుకుని మాకూ ఆఫర్ చేస్తూ. మా కాలనీ వాళ్ళందరం విల్స్ సిగరెట్ తాగటమే ఓ లగ్జరీ భావిస్తుంటాం! అలాంటిది అతను ఆ ఫారిన్ సిగరెట్స్ ఆఫర్ చేసేసరికి తలో సిగరేట్ తీసుకుని కాల్చసాగాం.

"అద్దె ఎంత వస్తుంది—ఎనిమిది పోర్షన్లకూ?" అడిగాడు కాయీరామ్ కుతూహలంగా.

"ఎంతసార్? చాలా తక్కువ! మొత్తం మూడువేల ఆరొందలకంటె ఒక్క పైసా కూడా ఎక్కువరాదు-"

మా గుండె లవిశిపోయాయ్. నెలకు మూడువేల ఆరొందలు ఇంటి అద్దె కింద వస్తుందా? మేము రిటరయేప్పుడు కూడా మాకంత జీతం రాదు.

మా అందరికీ పాన్ డబ్బాలోనుంచే కూల్ డ్రింక్స్ ఇప్పించాడతను. మాకు అతనిమీద జాలివేసింది. ఎప్పుడో కాలనీమేట్స్ అయినంతమాత్రాన పాపం ఇంత డబ్బు తగలేసి మా అందరికీ కూల్‌డ్రింక్స్ తాగించాలని ఎక్కడుంది? కేవలం మామీద అభిమానంతోనే కదా!


"పాపం మనాడికి లిఫ్ట్ ఇద్దాం- మన స్కూటర్‌మీద" అన్నాడు గోపాల్రావ్ జాలిగా.

"అవునవును- పాపం అంత ఖర్చు పెట్టి కూల్‌డ్రింక్స్ కూడా తాగించాడు. ఆ డబ్బుపెడితే బస్‌లోనయినా వెళ్ళిపోయేవాడు" అన్నాడు జనార్ధన్.

"అవ్ కనకయ్య! నా స్కూటర్ వెనుక కూర్చో లిఫ్ట్ ఇస్తాను" అన్నాడు యాదగిరి.

కనకయ్య చిరునవ్వు నవ్వాడు.

"వద్దు సార్! మీ దయవల్ల మొన్నే కారుకొన్నాను- వస్తాన్సార్! మళ్ళీ కలుస్తా" అంటూ పక్కనే పార్క్‌చేసి ఉన్న మారుతీ కార్లో కూర్చుని డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళిపోయాడు.



కొద్దిక్షణాలవరకూ మాకెవ్వరికీ మాట రాలేదు. నిశ్శబ్దంగా స్కూటర్స్ స్టార్ట్ చేసుకుని కాలనీ చేరుకున్నాం.

"హు! ఆఫ్టరాల్ రిజిస్ట్రారాఫీస్‌లో ప్యూన్ ఎనిమిది పోర్షన్లున్న ఇల్లుకట్టగా లేంది నేనెందుకు కట్టలేను! కట్టేస్తా" అన్నాడు రంగారెడ్డి ఆవేశంగా.

"అవును! కట్టగలవ్" అన్నాడు శాయిరామ్.

"కావాలంటే ఇల్లు కట్టటానికి ఎక్కడయినా లోన్ సంపాదించాలి. హౌసింగ్ లోన్ ఎక్కడ దొరుకుతుంది?"

"స్టేట్ గవర్నమెంట్‌వాళ్ల 'లోన్స్' అనేవి ఇవ్వటం మానేశారట." చెప్పాడు గోపాల్రావ్.

అలాంటిమాట చెప్పినందుకు మా తలనిమీద వళ్ళు మండిపోయింది.

"ఎందుకు ఇవ్వటం లేదు" ఉక్రోషంగా అడిగాడు రంగారెడ్డి.

"ఎన్టీఆర్ ప్రభుత్వమయ్యా! ఈ ప్రభుత్వంలో ఏ డిపార్ట్‌మెంట్‌కీ ఫండ్స్ ఉండవ్!" వెటకారంగా అన్నాడు శాయిరామ్.

"అవ్! నేను గవర్నమెంట్ లైబ్రరీ మెంబర్‌గదా! మొన్న యండమూరి లేటెస్ట్ నవల రక్తాభిషేకం గురించి లైబ్రరీ ఓళ్ళనడిగా! అందరూ నన్ను పాగల్‌గాన్ని చూసినట్లు చూసినగిన్ను! సంగతేమంటే ఎన్టీఆర్ కాలువులో కెక్కుతూనే తెలుగోండ్లకు పుస్తకాలు కొనేది బంద్ చేసిండంట! దీనిదిక్కు రెళ్ళ అయిదేండ్లనుంచి లైబ్రరీల్ల ఒక్క కొత్త పుస్తకం లేదు-" మండిపడుతూ అన్నాడు యాదగిరి.

"నాకూ అదే అర్థంకావటం లేదు. లైబ్రరీల కోసం మనం మున్సిపాలిటీలకు పన్నుకడుతున్నాం! అది అపటానికి ఎన్టీఆరెవరు?" తనూ తిరగబడ్డాడు జనార్దన్.

"పుస్తకాల్సంగతి అట్లా ఉండనీండి! రిక్రూట్‌మెంట్ బాన్ అంట! మా అన్నయ్య కొడుక్కి ఎన్టీఆర్ వచ్చిన దగ్గర్నుంచి ఇంటర్‌వ్యూలుకూడా లేవు. కాంగ్రెసోళ్ళ పరిపాలనలో కనీసం ఎగ్జామినేషన్స్, ఇంటర్‌వ్యూలయిన వస్తూండేవి!" గోపాల్రావ్ అన్నాడు.

"అయినా ఈ గవర్నమెంట్ లోన్ ఎందుగ్గానీ. హెచ్.డి.ఎఫ్.సి. వాళ్ళు లోన్స్ ఇస్తున్నారుగదా! అక్కడికెళ్తే సరి" సలహా ఇచ్చాడు చంద్రకాంత్.

రంగారెడ్డి మొఖంలోకి కళ వచ్చేసింది.

"ఆ! ఇస్తారా? ఎక్కడ ఆ ఆఫీసు?"

"బషీర్‌బాగ్‌లో ఉంది! రేపువెళ్దాం."

ఆ రాత్రి రెండింటికి రంగారెడ్డి ఇంట్లో నుంచి కేకలు వినబడితే పరుగుతో వెళ్ళాను. వాళ్ళావిడ అప్పటికే నిద్రకళ్ళతో అక్కడ మూగిన కాలనీ వాళ్ళకు సంగతి వివరిస్తోంది.

"మరేంలేదు. ఆయనకు కలొచ్చింది! ఇల్లంతా కట్టాక ఎన్టీఆర్ వచ్చి పడగొడుతున్నాట్ట!"

(సశేషం)

జటాయువు

సీరియల్

ఆమెకు రెండు ఆలోచనలు బాగానే వున్నట్టుగా అనిపిస్తోంది. అంతలోనే రెండు ఆలోచనలు బాగా లేనట్టుగా అనిపిస్తోంది.

ఆ అడవి ప్రాంతంలో పెరిగితే రాజేష్‌కి చదువు సంస్కారం సరిగా అంటవనీ మొద్దులా తయారౌతాడని ఆమెకు అనుమానం లేకపోలేదు,

అన్నిటికి మించి—

తన చేతిలో భర్త చనిపోయినపుడు ఆ విషయాన్ని పేపర్లన్నీ ప్రముఖంగా రాశాయి. అలా అలా ఆ విషయం కొడుక్కి తెలుస్తుందేమోనని, తెలిస్తే తండ్రిని చంపినందుకు తనని రాజేష్ అసహ్యించుకుంటాడేమోనని ఆమె భయం.

కొడుకు తనని అసహ్యించుకునే పరిస్థితి ఏ తల్లి ఎదుర్కోలేదు.

ఝాన్సీరాణి గదిలోంచి బైటికి వచ్చింది. పినతల్లి అప్పటికే పనుల్లో మునిగి వుంది. పినతండ్రి గొడ్లపనులు చూస్తున్నాడు. ఆమె స్నానం వగైరా ముగించింది.

"అమ్మా- నువ్వొచ్చావుకదా- పోనీ ఇవాళ స్కూలు మానేస్తాను" అన్నాడు రాజేష్ నిద్రలేవగానే.

వీరభద్రరావ్ పమ్మి

జరిగిన కథ

ఝాన్సీరాణి తన భర్త ప్రకాశరావుని హత్యచేసి అరెస్ట్ అవుతుంది. కేసు కోర్టులో నడుస్తుండగా తన కొడుక్కి ఈ విషయాలన్నీ తెలియనీయకుండా తన పినతండ్రి దగ్గరకు పంపిస్తుంది. కోర్టువారు డిఫెన్సువారి వాదనతో ఏకీభవించి ఝాన్సీరాణిని నిర్దోషిగా విడుదల చేస్తారు.

ఆమె కూడా పినతండ్రివద్దకు చేరుకుంటుంది. అక్కడే ఆమె శాశ్వతంగా నివాసం ఏర్పాటుచేసుకొని వుండటమా? లేక రాజేష్‌తో ఏ పట్నానికోపోయి అక్కడ నివాసం ఏర్పరచుకోవటమా? అనే ఆలోచనలతో సతమతమౌతుంటుంది.

ఇక చదవండి

"పోనీ మానెయ్యి" అంది.

"అమ్మా ఝాన్సీ- నేను పొలం వెడుతున్నాను. ఓ గంట పోయాక నువ్వు రాజేష్ సరదాగా అలా రండి" అని సోమయ్య వెళ్ళిపోయాడు.

భోజనాలు ముగించి సోమయ్యకి అన్నం క్యారేజీ తీసుకుని ఝాన్సీరాణి రాజేష్‌తో కలిసి పొలంవైపు వెళ్ళింది. సోమయ్య క్యారేజీలో అన్నం తిన్నాక తన పొలమంతా చూపిస్తూ అక్కడ వ్యవసాయం తాలూకు విశేషాలు చెప్తూ చాలాసేపు తిప్పాడు.

చివరికి కందులపంట వేసిన పొలందగ్గరకి వచ్చారు. ముందు సోమయ్య



కుక్క టైగర్ నడుస్తోంది. వెనకాలే సోమయ్య, అతని జీతగాడు, ఝాన్సీరాణి, రాజేష్ నడుస్తున్నారు, కందిమొక్కలు దట్టంగా అలుముకుని వున్నాయి. ఏపుగా, ఎత్తుగా పెరిగిన కందిమొక్కలు కొద్దిరోజుల్లో పంటకొస్తాయి.

హఠాత్తుగా టైగర్ మొరగడం మొదలెట్టింది. అది హడావుడిగా వెనక్కి ముందుకి పరుగెడుతూ తోకాడిస్తూ భయంకరంగా మొరుగుతోంది.

సోమయ్యకి ఏదో అనుమానం కలిగింది. మునికాళ్ళమీద నిలబడి మొక్కల లోపలికి చూస్తున్నాడు. కుక్క మొరుగుతూ ముందుకి పరుగెత్తుకెళ్ళింది.

"ఎరేయ్- నువ్వు దానివెనకాలే పరుగెత్తు" అన్నాడు సోమయ్య జీతగాణ్ణి.

వాడు పరుగెత్తాడు.

కొంచెం బాగా ముందుకెళ్ళి "మేకలయ్యా- మేకలు. మొక్కల్ని నాశనం చేసేత్తన్నాయి" జీతగాడు అరిచాడు.

కుక్క మొరుగుడికి మేకలు బిలాబిలా బైటికివచ్చి పరుగెత్తడం మొదలెట్టాయి. కుక్క వాటిని తరుముతోంది.

"ఒరేయ్- మేకల్ని పట్టుకోరా" అని జీతగాడితో అని సోమయ్య మరోవైపు పరుగెత్తాడు.

కాసేపట్లో సోమయ్య, జీతగాడు చెరో మేకని పట్టుకున్నారు. అవి ప్రాణాలు పోతున్నట్టుగా అరుస్తున్నాయి.

ఝాన్సీరాణి, రాజేష్, సోమయ్య, జీతగాడు మేకలతో సహా దగ్గర్లో వున్న పెద్ద గట్టుదగ్గరకి వచ్చారు. అక్కడో చిన్న పాక వుంది. చేలల్లో పంటలేనపుడు గొడ్లని అక్కడ కట్టేస్తారు.

సోమయ్య చాలా కోపంగా, రోషంగా వున్నాడు.

"ఈవేళ వెధవలకి గట్టిగా బుద్ధి చెప్పాలి" అన్నాడు.

ఝాన్సీరాణి సోమయ్యలో అంత కోపం ఎప్పుడూ చూళ్ళేదు. కుక్కకి భయపడి మిగిలిన మేకలు పారిపోయాయి. మొక్కల్లోంచి ఇద్దరు కుర్రాళ్ళు బైటికి వచ్చి మేకల వెనకాలే పరుగెత్తారు. కుక్క వాళ్ళని కూడా కొంతదూరం తరిమింది.

"అదిగో చూశావా- కావాలనే కుర్రాళ్ళ మేకల్ని చేలోకి తోలేశారు" అన్నాడు సోమయ్య.

"భీముడుదొంగ కొత్తుకొడుకండీ- ఆడు కావాలనే ఇయన్నీ చేయిత్తన్నాడు" అన్నాడు జీతగాడు.

"ఎవరతను?" ఏమీ అర్థంగాక అడిగింది ఝాన్సీ.

"ఇక్కడ భీముడని ఓ దొంగ వెధవున్నాడు. వాడు పేరుకి భీముడుగాని-లక్షణాలన్నీ కీచకుడివి. ఈ మేకలన్నీ వాడివే. ఎవరి పొలం కాస్త సదరుగా కనబడితే వాళ్ళ పొలంలో మేకల్ని మేపేస్తాడు. పైగా ఏవన్నా అంటే పోట్లాటకి

వస్తాడు. ఇక్కడ కోయలు అమాయకులు. వాళ్ళని దోచుకుతినే రాబందులు ఈ భీముడిలాంటివాళ్ళు."

"ఓసారి పిల్చి గట్టిగా చీవాట్లు పెట్టకపోయావా?"

"ఓసారా- రెండుసార్లా- పదిసార్లు చివాట్లేశాను. ఇదిగో ఇలా పట్టుకున్నపుడేమో- పాలిగాపు కుర్రాడు వదిలేసాడు తప్పయిపోయింది అంటాడు. పట్టుకోనప్పుడేమో అసలా మేకలు నావికావు అంటాడు- దొంగవెధవ పదినిముషాల్లో ఇక్కడికొస్తాడు. చూద్దువుగాని" అన్నాడు సోమయ్య.

జీతగాడు గడ్డితో తాడు పేని రెండు మేకల్ని రాటకి కట్టేసాడు.

"తాతయ్యా- మేకల్ని ఇంటికి తీసికెళ్ళిపోదాం. పలావు చేసుకోవచ్చు" అన్నాడు రాజేష్.

అంత కోపంలోను సోమయ్య రాజేష్ మాటలకి నవ్వాడు.

"ఒకడి సొమ్ము మనకెందుకులే అని ఆలోచిస్తున్నాను. కోసెయ్యాలంటే నిముషం పని."

సోమయ్య, ఝాన్సీ ఆమాటా, ఈమాటా మాట్లాడుకుంటూ కూర్చున్నారు. ఝాన్సీ పినతండ్రిని అక్కడ పొలాల గురించి, వ్యవసాయం గురించి, పొలాల రేట్లగురించి అడుగుతోంది.

సోమయ్యకి ఆమె మనసులో ఆలోచనలు మెల్లగా అర్థం అవుతున్నాయి.

ఆమె అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకుంటే బావుంటుందని అతనికి కోరికగా వుంది. అతనికా పిల్లలు లేరు. భార్యతరపు కుర్రాణ్ణి ఒకణ్ణి చేరదీస్తే వాడు రోజుకో కొత్త సమస్య సృష్టించడం మొదలెట్టాడు. పదిహేనేళ్ళకే వాడు అడకూలీల వెంటబడి సోమయ్యకి చెడ్డపేరు తెచ్చిపెట్టాడు. త్వరలోనే ఆ కుర్రాణ్ణి అతని తలిదండ్రుల దగ్గరకి పంపేసాడు.

ఇంకెవరి కుర్రాణ్ణైనా తెచ్చి పెంచుకుందామని అతనెప్పుడూ ఆలోచించ లేదు. ఎవరొచ్చినా తమ ఆస్తిమీద ప్రేమతో వస్తారుతప్ప తనమీద, తన భార్య మీద ప్రేమతో రారని అతని నమ్మకం.

ఏ చంటిపిల్లాణ్ణో తెచ్చి పెంచుకోడానికి మాలక్ష్మికి అంత ఓపికా లేదు. అది వయసూ కాదు.

ఝాన్సీ కనక అక్కడ వుంటే తమ వృద్ధాప్యంలో కాస్తంత చేదోడు వాదోడుగా వుంటుంది. పైగా రాజేష్ బాగా అలవాటయ్యాడు.

అసలు సోమయ్యకి రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించాల్సిన అవసరంలేదు. కాకపోతే పూర్వం పట్నంలో వ్యాపారంచేసి దెబ్బతిని, సగంచచ్చి ఆ ప్రాంతం చేరుకున్నాడు. ఒకరిమీద ఆధారపడటం అతని కసలు ఇష్టంలేదు. మళ్ళీ తన స్వశక్తిమీద తన కాయ కష్టంమీద నిలబడి తనకి, భార్యకి జీవితాంతం లోటురాకుండా, ఒకరిమీద ఆధారపడకుండా గడిచిపోవాలన్నది అతని ఆలోచన.

ఝాన్సీరాణి తన ఆస్తిమీద ఆశలో అక్కడ స్థిరపడదని అతనికి తెలుసు. ఎందుకంటే తండ్రినుంచి, భర్తనుంచి సంక్రమించిన ఆస్తి ఆమెకుంది.

ఆమె అక్కడ స్థిరపడటమంటూ జరిగితే తమమీద ప్రేమతో జరుగుతుంది.

పైగా మొదట్నుంచీ మాలక్ష్మికి ఆమెమీద ప్రేమాభిమానాలు ఎక్కువ.

వాళ్ళు పాకలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూండగానే భీముడు ఓ జీతగాణ్ణి తోడు తీసుకుని మేకలకోసం అక్కడికి వచ్చాడు.

భీముణ్ణి చూడ్డంతోనే సోమయ్యకి కోపం నషాళాన్నంటించింది.

"నువ్వసలు మనిషివా- పశువ్వా? నిండు చేలోకి మేకల్ని ఒదిలేస్తావా? నీ కసలు బుద్ధుందా?"

"అదికాదు సోమయ్యా. పాలెగాడు..."

"ప్రతిసారి ఇదేమాట చెప్తున్నావ్. ఈసారి నీ మేకల్ని పంచాయతీలో పెడతాను. అక్కడ చెప్పుకో ఏం చెప్పుకుంటావో?"

"ఈసారికి తప్పయిపోయింది. మేకల్ని ఒదిలెయ్."

"మనిషిజన్మ ఎత్తాక సిగ్గుండాలి. ఏవైనాసరే ఈసారి మేకల్ని వదల్ను. నీ దిక్కున్నచోట చెప్పుకో."

"అంతేనా?"

"అంతే."

"అంతేనా?"

"అంతే."

"అయితే...."

"ముమ్మాటికీ అంతే."

"అయితే మేకల్ని విప్పి తీసికెడతాను."

"తీసికెళ్ళు చూస్తాను."

"తీసికెడతాను."

"తాడుమీద చెయ్యివెయ్యి చూస్తాను."

ఘర్షణ పెరుగుతోంది.

ఝాన్సీరాణి గుండె దడదడలాడుతోంది.

భీముడు చూడ్డానికి ఘటోత్కచుడిలా ఉన్నాడు.

అతడి కూడా వచ్చిన జీతగాడు బకాసురుడిలా ఉన్నాడు.

సోమయ్య పీలగా, రివటలా ఉంటాడు.

"రేయ్- మేకల్ని ఇప్పరా!" భీముడు తనకూడా వచ్చిన జీతగాణ్ణి ఆజ్ఞాపించాడు.

వాడు ముందుకెళ్ళాడు. సోమయ్య జీతగాడు వాడికి అడ్డంవెళ్ళి లాగి ఓ తన్ను తన్నాడు. వాడు వెల్లకిల్లా పడ్డాడు.

భీముడు ముందుకెళ్ళి సోమయ్య జీతగాణ్ణి ఓ తోపుతోశాడు. వాడు కింద పడబోయి ఆనుకున్నాడు. సోమయ్య వెళ్ళి భీముణ్ణి ఓ గెంటు గెంటాడు.

అంతే! బస్....

ఓ పక్కన జీతగాళ్ళిద్దరూ కలియబడ్డారు. మరోవైపు యజమానులిద్దరూ కలియబడ్డారు.

రాజేష్ భయంభయంగా చూస్తున్నాడు.

ఝాన్సీరాణి ఆత్రంగా "బాబాయ్. నువ్వొచ్చెయ్." అని అరుస్తోంది.

తన్నుకుంటున్నారు. కొట్టుకుంటున్నారు. గెంటుకుంటున్నారు. నానా రభసగా ఉంది.

చివరికి భీముడు సోమయ్యని కిందపడేసి గుండెలమీద ఎక్కి కూర్చున్నాడు.

సోమయ్య ఊపిరాడక గవరుస్తున్నాడు.

భీముడు సోమయ్యకన్నా బలంగా ఉన్నాడు. పైగా వయసులో చిన్నవాడు. సోమయ్య గుండెలమీద కూర్చుని చేతుల్తో డొక్కలో పొడవడం మొదలెట్టాడు. బైటపడాలని సోమయ్య విపరీతంగా గింజుకుంటున్నాడు. కాని సాధ్యపడలేదు. జీతగాళ్ళిద్దరూ ఒకర్నొకరు కొట్టుకుంటూనే ఉన్నారు.

సోమయ్య పరిస్థితి చూస్తే ఝాన్సీరాణికి భయం వేసింది. అటు, ఇటు కలియజూసింది. మూలగా ఉన్న బాణాకర్ర ఆమె కళ్ళబడింది. పరుగున వెళ్ళి దాన్ని చేతుల్లోకి తీసుకుంది. భీముడి వెనకవైపుకి వెళ్ళి కర్ర ఎత్తి గట్టిగా బలంగా అతని నెత్తిమీద కొట్టింది. ఊహించని ఆ దెబ్బకి భీముడు తల రెండు చేతులతో పట్టుకుని మ్రాన్పడిపోయాడు.

ఇదే అదునుగా తీసుకుని సోమయ్య భీముణ్ణి కిందకి గెంటేసి లేచి నిలబడ్డాడు.

తనని ఎవరు కొట్టారో తెల్సుకోడానికి భీముడికి రెండు నిముషాలు పట్టింది.

"నన్ను కొడతావే లం...." అని ఆమె మీదకి వెళ్ళబోయాడు. సోమయ్య వెనకాల్నుంచి భీముణ్ణి గట్టిగా తన్నాడు. అతను ఆపుకోలేక బోర్లాపడ్డాడు.

అప్పటికే భీముడి జీతగాడు సోమయ్య జీతగాడి చేతిలో ఓడిపోయి పరుగు లంకించుకున్నాడు.

సోమయ్య, అతని జీతగాడు కల్సి భీముడికి మరో నాలుగు తగిలించారు.

"ఆడదాని చేతిలో దెబ్బలు తిన్నావు. పో చచ్చు వెధవా!" అని సోమయ్య భీముణ్ణి ఓ గెంటు గెంటాడు.

భీముడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పారిపోవడం తప్ప వేరే గత్యంతరం లేదు.

"పోలీసులకి చెప్పి కేసు పెట్టించకపోతే నా పేరు భీముడే కాదు." అని వడివడిగా అడుగులేసుకుంటూ వెళ్ళిపోయాడు.

"రాజేష్- ఆ మేకల్ని ఒదిలెయ్యరా!" అన్నాడు సోమయ్య.

"తాతయ్యా మరి పలావు."

"ఛీ- వాడి మేకలు మనకెందుకురా. ఒదిలెయ్. గట్టిగా తన్నులు తిన్నాడు కదా- ఇంక మేకల్ని చేలోకి ఒదలడు." అన్నాడు సోమయ్య.

రాజేష్ మేకల్ని వదిలేసాడు.

"టైగర్- ఉస్కో" అనేసరికి కుక్క మేకల్ని తరుముకుంటూ పరుగెత్తింది.

"బాబాయ్- దెబ్బలు గట్టిగా తగిలాయా" ఝాన్సీరాణి సోమయ్యకి దగ్గరగా వచ్చి అడిగింది.

"అబ్బె- లేదమ్మా" అన్నాడేగాని వీపుమీద గీసుకుపోయి రక్తం కారుతోంది. పైగా కొంచెం కుంటుతున్నాడు కూడా. ఝాన్సీరాణికి జరిగినదంతా కలలా అనిపిస్తోంది.

తనకంత ధైర్యం ఆ క్షణంలో ఎలా వచ్చిందా అని ఆమె ఆశ్చర్యపోయింది.

ఇప్పుడే కాదు....

చిన్నతనంలో కుక్కని కాల్చినపుడు....

భర్తని చంపినపుడు ...

"ఝాన్సీ నువ్వసలు ఆడపిల్లలా ప్రవర్తించవు." తల్లి మాటలు జ్ఞాపకం వచ్చాయి. అంతలోనే ఆమెకు రాజేష్ మనసులో మెదిలాడు.

జరిగినదంతా అతను "కళ్ళారా చూశాడు. అసలు తన మనసులో, శరీరంలో, రక్తంలో 'హింస' ఉన్నట్టుగా ఉంది. 'అదే లక్షణం వాడికీ వస్తుందేమో' అనుకుని ఆమే భయపడింది. ఆమె గుండె దడదడలాడింది.

"పద బాబాయ్- ఇంటికెడదాం."

సోమయ్యని జాగ్రత్తగా నడిపించుకుంటూ అందరూ ఇంటివైపు బైల్దేరారు.

ఝాన్సీకి భీముడు వెళ్ళిపోతూ అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి.

"పోలీసులకు చెప్పకపోతే ..."

భగవాన్!

మళ్ళీ పోలీసులు, కోర్టులు, లాయర్లు—


"చరిత్ర పునరావృతం అవుతోందా?" అనుకుంది.

కొంతదూరం వెళ్ళేదాకా ఎవరూ గమనించలేదు. సోమయ్యకి తల వెనకాల్నుంచి రక్తం కారుతోంది. రక్తాన్ని చూసేసరికి ఝాన్సీకి కళ్ళు తిరిగాయి.

అయినా నిభాయించుకుని సోమయ్యని కూర్చోబెట్టి తన పైట కొంగుతో రక్తం వస్తున్నచోట మెల్లిగా అద్దింది.

ఇంకా రక్తం వస్తోంది.

వెంటనే తన చీరకొంగు చింపి సోమయ్య తలకి కట్టుకట్టింది.



సోమయ్యని తొందరగా ఇంటికి తీసికెళ్ళాలి. లేకపోతే ప్రమాదించేట్టుగా అనిపించింది.

దెబ్బ తగిలినందువల్ల సోమయ్య తొందరగా నడవలేకపోతున్నాడు. పోనీ జీతగాణ్ణి ఇంటికి పంపి బండి కట్టుకుని రమ్మందామంటే ఇంకా ఆలస్యం అయిపోతోంది.

దారిలో ఓ గుడిసెదగ్గరే ఆపి నీళ్ళు తాగించింది. ఝాన్సీ, జీతగాడు చెరో చెయ్యి పట్టుకుని సోమయ్యని నడిపిస్తున్నారు. అతను మూలుగుతున్నాడు.

సోమయ్య కింద పడిపోయినపుడు ఏ రాయో తగిలి ఉంటుంది. ఎవరూ చూడలేదు.

"పిన్నీ- పిన్నీ- బాబాయ్‌కి...."

ఝాన్సీ కేకలు విని మాలక్ష్మి బైటికి వచ్చింది.

మూలుగుతూ, కుంటుతూ నడుస్తున్న సోమయ్యని అతని తలమీద కట్టుని, దానికి అంటిన రక్తాన్ని చూసేసరికి మాలక్ష్మికి స్పృహ తప్పుతున్నట్టుగా అనిపించింది.

"అయ్యో- అయ్యో- నా మారాజు కేమైంది. పండులా వెళ్ళిన నారాజు చితికిపోయి తిరిగివచ్చాడా?" అని ఆమె ఘొల్లుమంది.

"పరవాలేదు పిన్నీ- ప్రమాదమేమీలేదు. కంగారుపడకు. ముందు లోపలకి తీసికెళ్ళి పడుకోబెట్టాలి" అంది.

"లోపలకి తీసుకురండి...."

ఝాన్సీకి కొత్త కంఠం వినిపించేసరికి అటువైపు చూసింది.

మనిషి పొడుగ్గా పచ్చగా ఉన్నాడు. తెల్లటి లాల్చీ, పైజమా వేసుకున్నాడు. అతనెవరో- ఎక్కణ్ణుంచి వచ్చాడో తెలియదు.

అతని మాట ఆప్యాయతతో కూడి గంభీరంగా ఉంది. మనిషి కూడా అలానే ఉన్నాడు.

అంత కంగారులోను ఝాన్సీ అతని మొహంలోకి రెండోసారి చూడకుండా ఉండలేకపోయింది.

మాలక్ష్మి కంగారుపడిపోతోంది. ఆమెకు కాళ్ళు చేతులు ఆడటం లేదు.

"దయానందా- ఆయనకేం భయంలేదుగా- పరవాలేదుగా." పచ్చగా, పొడుగ్గా ఉన్న మనిషిని మాలక్ష్మి అడిగింది.

"కంగారుపడకండి. ఏం భయంలేదు." అని వేణ్ణీళ్ళు తెప్పించి అందులో కొంచెం సబ్బు కలిపి గాయం అయినచోట శుభ్రంగా కడిగాడు దయానంద. పసుపు తెప్పించి నీళ్ళతో కలిపి ముద్దలాచేసి గాయం దగ్గర పెట్టి కట్టుకట్టాడు.

రక్తం కారడం తగ్గింది.

"రాజేష్."

దయానంద పిలుపుకి రాజేష్ వచ్చి "ఏమిటి?" అన్నాడు.

"నువ్వు తొందరగా వెళ్ళి ఆచారిగార్ని రమ్మని చెప్పు. తాతయ్యకి దెబ్బ తగిలిందని చెప్పు" అన్నాడు.

"పోనీ నేను కూడా వెళ్ళనా?" ఝాన్సీ పరిచయంలేని దయానందని అడిగింది.

"అక్కర్లేదు. రాజేష్ అయితే సైకిల్‌మీద వెళ్ళొస్తాడు. పైగా నువ్వు బాగా అలసిపోయినట్టున్నావ్" అన్నాడు.

రాజేష్ హడావుడిగా బైల్దేరాడు.

"వెళ్ళేటప్పుడు స్పీడ్‌గా వెళ్ళు. ఆచారిగారికి సైకిల్ లేకపోతే. ఆయనకి సైకిలిచ్చేసి నువ్ నడిచిరా."

వెనకాల్నుంచి దయానంద అరిచాడు.


"అలాగే" రాజేష్ సైకిలెక్కాడు.

అతని గుండెలు దడదడ కొట్టుకుంటున్నాయి.

అంతక్రితం జరిగిన సంఘటనలన్నీ అతని కళ్ళముందు గిరగిరా తిరుగుతున్నాయి. అంతా షాక్‌లా ఉంది.

అన్నిటికీ మించి తన తల్లి కర్రతో భీమునంతటి భారీ మనిషిని కొట్టడం....

ఆమె కొట్టిన దెబ్బ మొత్తం గొడవని నిర్ణయించింది. అది తగలకపోతే భీముడు తన తాతయ్యను చంపేసి ఉండేవాడు. అలాంటి సాహసవంతురాలైన తల్లి కడుపున పుట్టినందుకు అతనికి గర్వంగా ఉంది.



తన తండ్రి బతికుంటే జరిగినదంతా విని ఏమనుకునేవాడో అన్న ఆలోచన ఒక్క మెరుపులా వచ్చి మాయమైంది.

దయానంద చెప్పిన విషయం జ్ఞాపకం వచ్చి సైకిల్ స్పీడుగా తొక్కడం ప్రారంభించాడు. అడ్డదారిలో డొంకలమ్మట సైకిల్ ముందుకి పోతోంది.

మరి కొంచెం దూరం వెళ్ళేసరికి దారిలో ఓ చిన్న తాచుపాము పడగవిప్పి ఆడుతూ కనిపించింది. అది చేస్తున్న బుసలు స్పష్టంగా, దూరంగా వినిపిస్తున్నాయి.

రాజేష్ సైకిలాపి దిగాడు.

దూరంగా పక్కనుంచి వెళ్ళిపోయేందుకు అవకాశంలేదు పైగా తాచుపాము మనిషినిచూస్తే వెంట పడుతుందని అతని కెవరో చెప్పారు. దానికి భయపడితే వెనక్కి వెళ్ళిపోవాలి. రాజేష్ ఆ ప్రాంతానికి వచ్చాక చాలా పాములు కనిపించాయి. అతను చూస్తుండగానే సోమయ్య నాల్గైదు పాముల్ని చంపాడు. కాని ఒంటరిగా పాముకి ఎదురుపడటం అదే మొదలు.

రాజేష్ గుండె వేగంగా కొట్టుకుంటోంది.

గుండె కొట్టుకోడం అతనికి స్పష్టంగా చెవులకి వినిపిస్తోంది.

అంతలోనే ఏదో ధైర్యం అతన్ని దుప్పటిలా చుట్టుకుంది.

తల్లి ధైర్యం జ్ఞాపకం వచ్చింది.

పాము శరీరమంతా నేలమీద తలపాగలా చుట్టుకుని తలమాత్రం పైకి పెట్టి ఆడుతుంది.

రాజేష్ ఒక్కక్షణం ఆలోచించాడు.

పక్కనే ఉన్న పెద్దరాయి తీసుకుని గురి తప్పకుండా బలంగా దాని తల మీద వేసాడు.

గురి తప్పలేదు.

రాయి బలంగా పాము పడగమీద పడింది. తల చిట్లింది. రక్తం చివ్వున పైకి చిమ్మింది. కోపంతో, పగతో, బాధలో అది మెలికలు తిరుగుతూ మధ్యలో తల కొద్దిగా పైకెత్తుతూ బుసకొడుతోంది.

రాజేష్‌కి ఇదే మంచి అదను అనుకుని మరో పెద్ద రాయి విసిరాడు.

రెండు నిముషాలు గిలగిల కొట్టుకుని పాము చచ్చి పడింది. రాజేష్‌కి గర్వం కలిగింది.

సైకిల్ తీసుకుని చచ్చిన పాముకేసి చూస్తూ ముందుకి వెళ్ళిపోయాడు.

* * * *

సోమయ్య కళ్ళు మూసుకుని మత్తుగా పడుకున్నాడు. దయానంద పక్కనే స్టూలుమీద కూర్చుని ముసలాయన మొహంలోకి చూస్తున్నాడు.

అసలేం జరిగిందో, ఎలా జరిగిందో ఝాన్సీరాణి వివరంగా చెప్పింది.

"నువ్వు చాలా మంచి పని చేసావ్" అన్నాడు దయానంద.

"చాలా రక్తం కారింది. చూడగానే హడలిపోయాను" అంది ఝాన్సీ.

పాలు తెప్పించి సోమయ్య తల తన వళ్ళో పెట్టుకుని మెల్లిగా తాగించాడు దయానంద. మరి కొన్ని నిముషాల తర్వాత సోమయ్య మెల్లగా కళ్ళు తెరిచాడు. తన మొహంలోకి చూస్తున్న దయానంద కళ్ళలోకి చూశాడు.

"ఓ దయానందా—నువ్వా!" అని చిన్నగా నవ్వాడు.

మాలక్ష్మి భర్త మొహంలోకి చూసింది. ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి.

"అయినా ఈ వయసులో వాళ్ళతో పోట్లాటలెందుకు? ఈ బాధలు కొని తెచ్చుకోడమెందుకు?" అంది భర్తతో.

"మగాడు—చచ్చేదాకా మొగాడే—పిచ్చిదానా

"నిజమే—మనకి వయసు పైబడుతోంది. ఆ విషయం గుర్తించకుండా యుద్ధాలకి పోతే ఎలా?"

ఆమె కళ్ళనుంచి నీళ్ళు కారుతున్నాయి.

"మనకు కొడుకు ఉంటే ఇలాంటి ఆపదలో ఆదుకునేవాడు. భగవంతుడికి కరుణ లేకపోయింది" అంది.

సోమయ్య నవ్వాడు.

"అది మన తప్పుకాదు.

ఈవేళ ఝాన్సీ మొగాడి కన్నా మెరుగనిపించింది. తను కర్రతో భీముడి తలమీద కొట్టకపోతే నేను ఇంటికి తిరిగి వచ్చేవాడ్ని కాదు" అన్నాడు సోమయ్య.

(సశేషం)

ప్రాణసంకటమైన చక్రశిథిలం

ఉన్నట్టుండి ఏదో భరించలేని శబ్దం గుండె బ్రద్దలు చేసింది. అధిగమించిన వేగంతో పరిగెత్తుతున్న బస్సు ప్రయాణీకుల అందర్నీ ఒక్కసారి కుదిపి, బాణం తగిలిన పక్షిలా కీచు మంటూ అరిచి ఆగిపోయింది.

డ్రైవరు కిందికి దిగేడు. చక్రాల వేపు వొంగి పరిశీలనగా చూస్తూ, అన్నాడు- 'దిగండి! బండి దెబ్బతింది.'

కండక్టరు కూడా దిగి చూసేడు. అదేమాట తనూ చెప్పేడు. ప్రయాణీకు లందరం క్రిందికి దిగేం. వెనుకవైపు వెలికివచ్చిన చక్రాలకేసి చూస్తూ- డ్రైవరు కండక్టరుతో ఏదో మాట్లాడు తున్నాడు. ఓ ముసిలాయన కండక్టర్ని అడిగేడు- 'రిపేరు వొచ్చిందేవిటి?'

"మరేనండీ?"

"ఇప్పుడప్పుడే కదల్దేవిటి?"

"కదల్దండి" కండక్టరు ఏదో పాపి యున్నట్లు చెప్పేడు.

"అసలేవైందేవిటి?" మళ్ళీ అడిగేడు ముసిలాయన.

"ఎనక స్ప్రింగాలు దెబ్బతిన్నాయ్. నాలుగణాలు ఎదరికెళిపొస్తె బండి తిరగ పడిపోయేది. లేచినవేళ మంచిది."

"సైడు మిర్రర్లొంస్సూసేను. రెండూ ఎలిపికొచ్చేసినయ్." డ్రైవరు తన సామ ర్థ్యాన్ని ప్రకటించుకున్నాడు. ముసిలాయన ముక్కుమీద వేలేసుకున్నాడు. ఆయన భార్య కాబోలు గుండెలమీద చెయ్యి పెట్టుకుంది.. ఆ చెయ్యి క్రింద మంగళసూత్రాలున్నాయి.

ఎవరో మరోవ్యక్తి అన్నాడు. "ఎంత ప్రమాదం తప్పింది!"


"ఇప్పుడేవిటి చెయ్యడం?" మరో ఆసామీ ప్రశ్నించేడు.

"చక్రాలు పిరాయించాలండి." డ్రైవరు జవాబు చెప్పేడు.

"ఎంతసేపవుతుంది?" నే నడిగేను.

"సెప్పలేనండి, యిటేపొచ్చే లారీ ఏదన్నా ఆపుసేసి వొయిజాగెల్లి హెడ్డాపీసుకి రిపోర్ట్రిస్తే, స్పేరు బండో, రిపేరికి టీపో తోల్తారు. నే నెల్లాలి- ఆళ్లు రావాలి. పిటింగిద్దాక బండి కదలాలి. ఏటి సేత్తాంలెండి? నయ్యం! పేణాలు దక్కేయ్!" డ్రైవరు జవాబు చెప్పేడు.

మళ్ళీ ఎవరో విద్యార్థి అడిగేడు- "మరయితే అందాకా రాంభజనే అన్న



మాట?"

"మరి తప్పదండి. లేటవుద్ది నేనా" అన్నాడు కండక్టరు.


అప్పటికే జనం చాలా మంది చుట్టూరా చెట్లక్రిందికీ, పచ్చికమీదికీ చెదిరిపోయేరు. రాంభజన చేస్తానన్న విద్యార్థి కూడా, మరో నలుగురు మిత్ర బృందంతో కలిసి కాస్త దూరంలో మెత్తటి గడ్డిమీద బైఠాయించేడు. భజన మొదలుపెట్టేందుకేమో-జేబుల్లోంచి చిడతలు తీస్తారులావుంది అనుకున్నాను. కాని పేకతీసి ఆట పరిచేరు. చప్పుడు లేని భజన.

వొంటరి ప్రయాణీకుణ్ణవడంవల్ల నాకేమీ తోచడంలేదు. కాస్సేపటిక్రితం బస్సులో కూర్చుని మరో రెండుగంటల కల్లా విశాఖపట్నంలో కాఫీ త్రాగొచ్చు ననుకున్నాను. తీరా యిప్పుడు కాఫీ త్రాగడం కోసమే ప్రాణాల్తో మిగిలి నట్టయింది. చేతి వాచీ చూసుకొన్నాను. నాలుగైంది. సాయంత్రపు చల్లదనం కొంచెం కొంచెం తెలుస్తోంది. ఎండల్లో తారురోడ్డు ఎంచక్కా మెరుస్తోంది. రోడ్డు కిరువైపులా వచ్చని చెట్లూ, పొలాలూ, పొదలూ, దూరాన ఎత్తుగా కొండలూ, యింకా ఎత్తుగా వంగిన ఆకాశం- ప్రకృతి అందం ప్రయాణంలో బాగా కనబడుతుందనుకుంటా.

రుమాలుతో ముఖం తుడుచుకుని దూరంగా చూసాను. చెట్లమధ్య ఏదో చిన్న పల్లెటూరు కనబడింది. దాదాపు మైలు దూరం వుండొచ్చు. ఎల్గాగో అలా నాకు కాలహరణంచెయ్యాలనుంది మెల్లగా కదిలేను. పిల్లగాలి పీలుస్తూ, పిల్ల కాలువగట్లు దాటుకుంటూ నెమ్మదిగా నడిచేను. అరగంట గడిచేసరికి ఆ వూళ్ళోకి అడుగుపెట్టేను.

బాగా చిన్న వూరులా ఉంది. బహుశా వెయ్యిగడప వుంటుందేమో యిళ్ళన్నీ దాటుకుంటూ మట్టి రోడ్డు మీద మరో నాలుగు నిముషాలు నడిచేక చెరువొకటి కనబడింది. చెరువు కివతలగా ఒంటిగా, వెలివేయబడినట్టున్న ఒక పాత పెంకుటిల్లు జబ్బు మనిషిలా నిలబడివుంది. దాని కెదురుగా చిన్న ఖాళీ స్థలం ఉంది. స్థలమంతా పచ్చిక మొలిచింది.

బాగా నడవడంవల్ల కాళ్ళు పీకుతున్నాయి. అక్కడికి పోయి కాస్సేపు కూర్చుందా మనిపించింది. అటువైపు కదిలేను. పచ్చికలోకి అడుగు పెట్టగానే స్థలం మధ్యగా ఏదో నా దృష్టి నాకర్షించింది. చకచకా అక్కడికి వెళ్ళేను. అది ఏదో మహాశిల్పం తాలూకు అవశేషం. మోకాళ్ళ క్రిందికి విరిగిపోయి మిగిలిన పాదాల జంట అది. రాతిమీద చెక్కేరు. అందమైన ఆభరణాల్ని, క్రిందికి జారిన వస్త్రాన్ని ఆకర్షణీయంగా అలంకరించి మలిచేరు. అది ఏనాటి శిథిలమో!- దానిలో యింకా నాజూకుతనం తొణికిసలాడుతోంది. పవిత్రత వుట్టి పడుతోంది. ఎవరో మహత్తర శిల్పస్రష్ట చేతుల్లో సృష్టించబడినట్టుంది అది. ఇంతకుముందు నేను మొహెంజొదారో, హరప్పా శిథిలాలు చూసేను. అమర శిల్పి జక్కన్న సినిమా కూడా చూసేను. నాకు శిల్పాలంటే పిచ్చి. ఆ పాదాల్ని చూడగానే,



నే నింతవరకూ చూడని గొప్ప శిల్పితనం నాకు వాటిలో కనబడింది. ఇష్టంగా వాటిని చేతుల్తో ముట్టుకు చూసేను. అరగంట సేపు చూసేను. నడిచినంత సేపు. ఆ స్త్రీ మూర్తి పాదాలు నాకెంతో నచ్చేయి. నా కప్పుడనిపించింది-ఆ పాదాలు ధరించే పూర్తి విగ్రహం చూడగలిగితే ఎంత బాగుణ్ణో కదా....అని. కాని, ఆ అవకాశం నాకు దక్కలేదు. కేవలం శిథిలం మాత్రం చూడగలిగేను. అది నా మనస్సులో ముద్ర వేసింది. దాని పూర్తి స్వరూపాన్ని చూడలేక పోయినా, కనీసం దాన్ని మలిచిన 'మహాశిల్పి'నైనా చూసి తీరాలనిపించింది. ఆయనది బహుశా ఈ వూరే అయ్యుంటుంది. ఆయనిక్కడి వాడే అయ్యుంటాడు- అనే వూహలు నాలో కలిగేయి. ఆయన్ని కలుసుకుని, మనసారా అభినందించే భాగ్యం గలిగితే బాగుణ్ను అనుకున్నాను.

వంగినవాణ్ని లేచి నిలబడ్డాను. వూళ్ళో వాకబు చేద్దామని వెనక్కి తిరిగేను. ఎదురుగా పాత పెంకుటింట్లో ఎవరో నివాసం వున్నట్లు తోచింది. ముందు అక్కడికి పోయి అడిగిచూస్తే సరి- అనుకుని ఆ యింటి వేపు దారి తీశాను. ఇల్లు సమీపిస్తున్న కొద్దీ, నా మనస్సు నీడలో ఆ శిథిలం యింకా స్థిరపడుతోంది. దగ్గరకొచ్చేను. ఇల్లు కూడా శిథిలావస్థలోనే వుంది. విరిగిపోయిన నాగరికతా చిహ్నంలా, చితికిపోయిన అంతస్తుకి ప్రతీకలా కనబడింది. వానొచ్చినప్పుడు కాళ్ళు బురద కాకుండా యింటిముందు నాపరాతి ముక్కలు పరిచేరు. నేల బాగా వున్నా వాటి మీదగానే నడిచి, అరుగులమధ్య మెట్లెక్కేను. తటపటాయించలేక తలుపు తట్టేను. సమాధానంలేదు. నెమ్మదిగా నెట్టేను. దగ్గరగా జేరవేసిన తలుపు, సన్నటి శబ్దంతో తెరుచుకొంది. తల ముందుకువొంచి లోపలికి చూసేను. చాలా పెద్ద గది. హాలనుకుంటా.

జీర్ణావస్థలో ఉంది. గోడలకి అక్కడక్కడ పెచ్చులూడిపోతే మట్టిరాసేరు. కిటికీ పక్కగా చాంతాడుతో దణ్ణెం కట్టేరు. దానిమీద ఒక వెలిసిన చీరె, ఒక వెలవని జాకెట్టూ, యింకా ఏవో పాత బట్టలూ, పేద బట్టలూ వదేసి వున్నాయి. ఏవో నాలుగైదు అందమైన శిల్పాల్ని గోడలు భరించగలుగుతున్నాయి. క్రిందగోడ వారే బల్లలు పరిచేరు. ఆ బల్లలమీద పెద్దవి, చిన్నవి రకరకాల చక్కటి శిల్పాలెన్నో వున్నాయి. వాటిలో చాలాభాగం స్త్రీ మూర్తులు. మిగతా వాటిలో రెండు ముసిలి గాంధీలు, నాలుగు పడుచు గోపికలు-మధ్య ఒక చిలిపి క్రిష్ణుడు, హృదయం లేకుండా తల మాత్రమే వున్న హిట్లరు, చెయ్యి విరిగిన ఛత్రపతి శివాజీ, జూలు మాసిన సింహమూ మొదలైనవి వున్నాయి. క్రిష్ణుడి చేతిలో పిల్లన గ్రోవిలేదు. విరిగిపోయిందనుకుంటా—డ్యాన్సు చేస్తున్నట్టున్నాడు. సింహం నోట్లో బూజు పట్టింది. ఓ గోపికకి రొమ్ములమధ్య లోయగా జారిన చోట బీట తీసింది-క్రిష్ణుడిమీది ప్రేమకి గుండెలో చోటు చాలక హృదయం పగిలినట్టు, అన్ని శిల్పాలూ అద్భుతంగా వున్నాయి నాకు. అపూర్వమైన ఆ శిల్ప సంపదని కాపాడేందుకని, తాపత్రయంతో మిగిలినట్టుగా వుంది హాలు. ఋతు పవనాల తాకిడికీ, సూర్యుడు విసిరిన నిప్పులకి ధైర్యంగా ఎదురు నిలిచి, చివరికి జీవం వీడిపోగా ఆ సందర్భంగా క్రిందికి వొరిగిన యింటి పైకప్పు, నడుం విరిగిన పాక్ సిపాయిని గుర్తు చేస్తోంది.

నే ననుకున్న యిల్లు యిదే అయి వుంటుందని నిశ్చయించుకొని లోపలికి అడుగెట్టేను. విసనకర్ర శబ్దం వినిపించింది. హాల్లోకి సన్నటి పొగలు ప్రవేశిస్తున్నాయి. లోపల వంట గదిలో ఎవరో పొయ్యి రాజేస్తున్నట్టుంది. తల పక్కకి తిప్పేను. వీధి వైపున్న గోడవార, కిటికీ పక్కగానున్న పాత మంచంమీద ఒక వ్యక్తి పడుకుని వున్నాడు. బహుశా నే చూడాలనుకునే 'మహాశిల్పి' యీ వ్యక్తేనేమో! నన్నాయన గమనించలేదు. తెరచివున్న కిటికీగుండా బయటికి చూస్తున్నాడు. దాదాపు అరవై ఏళ్ళ వయసుండొచ్చు. ఇంటిలాగే తనూ శుష్కించి వున్నాడు. సాయంత్రపు వెలుగులో ఆయన పెద్ద గడ్డం వెండిలా మెరుస్తోంది. మీసాలకీ, గడ్డానికీ నడుమ దాగివున్న సన్నటి పెదాల కలయికలో, అనుభవాలు మిగిల్చిన గర్వం ఏదో వొంపు తిరిగినట్టుంది. లోతైన ఆయన కళ్ళలో లోయల్లో దాగిన ప్రశాంతత కనబడుతోంది. అంత వయసొచ్చినా, ఆ కళ్ళలో చురుకుదనం చచ్చిపోనందుకు కాస్త ఆశ్చర్యమేసింది. అలా ఒక్క క్షణం చూసేక నా కాయన అంపశయ్యమీద పడుకొన్న భీష్ముడిలా అగుపించేడు.

ఇంకా ఇక్కడ నా ఉనికి గుర్తింపబడక పోడంతో నా 'మహాశిల్పి' మీద నాకు ఆత్రుత పెరిగింది. చిన్నగా దగ్గేను. ఆయనకు వినబడినట్టుంది. "ఎవరూ?-" అంటూ తల నాకేసి తిప్పి చూసేడు. నేను మంచం దగ్గరికి నడిచి 'నేనండీ!' అని పేరు చెప్పేను. ఆయన యింకా ప్రశ్నార్థకంగానే చూసేడు. నేను మళ్ళీ చెప్పేను-'నేనీ ప్రదేశానికి చాలా కొత్తవాణ్ణి. విశాఖపట్నం వెళ్తూంటే దారిలో ఈ వూరి దగ్గర హఠాత్తుగా బస్సు పాడయింది. రిపేరు చేస్తున్నారు. నాలుగ్గంటలుపైగా ఆలస్యం ఉందిట. ఎందుకో ఈ ఊరు చూసిపోదామని సరదా పుట్టింది. ఇలా వచ్చేను.' 'వచ్చేక' అని నేను ఇంట్లోకి ప్రవేశించిన కారణం చెప్పబోయేంతలో, ఆయన 'అలాగా అబ్బాయ్! చాలా సంతోషం!' అన్నాడు. 'అమ్మాయ్! కాసిని మంచినీళ్ళు పట్టుకురామ్మా!' అంటూ కూతుర్ని కాబోలు-పిలిచి నా వైపు తిరిగేడు. ముఖంలో ఎంతో అనుభవం, పరిజ్ఞానం, స్వచ్ఛత వుట్టిపడుతున్నాయి. ఏదో గొప్ప కుటుంబంలో పుట్టి చివరికి చితికి పేదవాడైపోయిన వ్యక్తిలా వున్నాడాయన. కూర్చోమని చెప్పేడు. మంచం పక్కనేవున్న పాత కుర్చీలో కూర్చున్నాను.

శిల్పాలకేసి చూస్తూ నేనన్నాను-నిజంగా యీ రోజు నేను చాలా అదృష్టవంతుణ్ని. ఇక్కడి మీ యింట్లో అద్భుతమైన శిల్పాలెన్నో చూడగలిగేను. నాకు శిల్పాలంటే చచ్చే పిచ్చి. మొదట్లో బయటినుంచి యీ యిల్లు చూసినప్పుడు, యీ లోపల యింత శిల్ప శోభ వుంటుందని వూహించలేదు. అపూర్వంగా వున్నాయివి. ఇవన్నీ చూస్తూంటే—ప్రయాణీకుల బస్సులు యిలాగ అప్పుడప్పుడు పాడవుతూ వుండాలనిపిస్తోంది నాకు."

ఆయన భళ్ళున నవ్వేడు. ఆ నవ్వులో సంతోషంకంటే గర్వమూ, తృప్తి కలిసి కనిపించేయి. నాకెందుకో యిల్లు కూలిపోతుందేమోనని భయమేసింది. కప్పుకేసి చూసేను.

ఆయన నవ్వు పూర్తి చేసి, నా మోకాలిమీద చెయ్యి బలంగా మోపేడు-బాగుందబ్బాయ్! ఇన్నాళ్ళకి నా శిల్పాల గొప్పతనం చవి చూడగలిగిన మనిషి నా దగ్గరికి వచ్చినందుకు నాకు పరమానందంగా వుంది' అన్నాడు. 'నా కళ కూడా నాలాగే ముసిలిదై పోయిందనుకున్నాను. లేదు. అదింకా పడుచుగా బ్రతికే వుంది. ఎప్పటికీ అలాగే వుంటుంది. చరిత్రలో నా శిల్పాలు నాలుగు కాలాలపాటు నిలుస్తాయి. చాలు. అది చాలబ్బాయ్! అదే నాక్కావలసింది.' ఆయనలో వుద్రేకం కనబడింది.

వెంటనే నాకు నా 'మహాశిల్పి' యీ వ్యక్తేనని తెలిసింది. ఆయనమీద పూజ్యభావం ఏర్పడింది. నాలో ఆయనంటే ఎంతగానో ఆసక్తి పెరిగింది. సాటిలేని తన అభిమాన తార దర్శన భాగ్యం లభించిన మూడవ తరగతి ప్రేక్షకుడికి కలిగే అనుభూతిలాంటి అనుభూతి! యీ క్షణం ఆయన సమీపంలో నాకు కలిగింది. నా జన్మ చరితార్థమైనట్టు భావించేను. మీకు నవ్వొచ్చు, కాని నాకు శిల్పాలంటే అంత పిచ్చి!-

ఇంతలో 'మహాశిల్పి' కూతురు మంచి నీళ్ళు తెచ్చి యిచ్చింది. ఆమె లోపలికి

తిరిగి వెళ్తొన్నప్పుడు చూస్తే ఆయన చేతిలో ప్రాణం పోసుకున్న శిల్పం ఏదో కదిలినట్లనిపించింది నాకు. మెరిసేలా తోమిన గ్లాసుమీద కదిలిపోయే ఆమె రూపం చిత్రంగా సాగి మెరిసింది.

ఆమె లోనికి వెళ్ళేక, ఆయన్ని పేరడిగేను. చెప్పేడు. మనిషికి తగ్గ పేరు-నరసింహాచార్యులు.

మంచినీళ్లు త్రాగుతూ అనుకున్నాను-ప్రతి గొప్ప కళాకారుడి దృష్టిలోనూ అతడికష్టమూ - యిష్టమూ, ఓర్పూ - నేర్పూ అన్నిటినీ మేళవించుకొని వెలిసిన కళాఖండం ఏదో వొకటి వుంటుంది. అలాగే యీ నరసింహాచార్యులుగారికి కూడా ఏదోవొక మాస్టర్ పీస్ వుండే వుంటుంది అనిపించింది. మంచినీళ్ళ గ్లాసు క్రింద పెట్టి, ఆయనకి నా వుద్దేశ్యం తెలియజెప్పే ధోరణిలో 'చూ డం డి' అంటూ అడగబోయేను.

"వెంటనే ఆయన నేను చూడలేనబ్బాయ్!" అన్నాడు.

ఒక్కసారిగా నా ఆలోచనా ప్రవాహం ఆగిపోయింది. నాలో ఆయన జవాబు రగిల్చిన ఆశ్చర్యం గుండెని ఝల్లు మనిపించింది.

ఇందాకే నాకు నరసింహాచార్యులు గారి శిల్ప చాతుర్యమంతా ఆయన కళ్ళలో కొట్టొచ్చినట్టు కనబడింది. ఇంతవరకూ, గొంతుక విని, చూదాయగా నా వయస్సు పసిగట్టిన ఆయన యొక్క గ్రుడ్డితనం తెలీక — ఆ కళ్లు చెప్పని భావాలెన్నో నాలో వూహించుకున్నాను. పొరపాటు జరిగిపోయిందని

"పొద్దుట్నించి ఎక్కడికెళ్ళావురా?" అడిగింది తల్లి రామూని.

"పోస్ట్‌మేన్ ఆట ఆడుకుంటున్నాం మమ్మీ! అందరికీ ఉత్తరాలిస్తున్నా."

"ఉత్తరాలెక్కడివిరా నీకు?"

"నీ పెట్టెలో ఎర్రరిబ్బన్ కట్టి దాచావే. అవే!"

"ఆ!!!"

—గొల్లపూడి శైలజ, హైద్రాబాద్.

కించబడ్డాను.

నా మౌనం ఆయన తెలుసుకున్నట్టుంది. మాటలు కదిపేడు— 'ఇంత సేపూ నాకు కళ్లున్నాయనుకున్నావ్ కదూ?' నవ్వేడు 'ఎందుకు లేవూ వున్నాయ్. కాని యివి శిల్పాలు చెక్కడానికి పనికిరావు. వెలుతురు చూడలేవు. అదపా దడపా వుద్రేకాలొస్తే కాసిని కన్నీళ్లు కారుస్తాయంతే. అంతకుమించి వీటికే పని చేతకాదు. నేనూ అంతే. నడవలేను. కళ్లు పోయినప్పుడే కాళ్ళూ పోయాయి. అప్పట్నించీ యీ మంచమే నా జీవితం' ఆయన ఆగేడు.

నేను మళ్ళీ యిందాకటిలాగే చలించేను. 'నా మహాశిల్పి' అంధుడూ, అశక్తుడూ అయిపోయినందుకు తీరని జాలితో నా మనస్సు రెపరెపలాడింది. ఆయనకేసి చూసేను. శరీరమూ, జీవితమూ కలిసి మిగిల్చిన కష్ట నష్టాలకి తగినంత బాధ నరసింహాచార్యులు గారిలో నాకు కనిపించలేదు. ఆయనే చెప్పేడు-'కళ్లు పోయాయనికాసీ నాకే

అయినా నా కెందుకో తృప్తి వుండేది కాదు. ఎన్ని మలిచినా కూడా, నే చెక్కాల్సిన శ్రేష్ఠమైన శిల్పం యింకా తయారు కాలేదనే అనిపించేది. అలాగే రోజుల తరబడి చెక్కేవాణ్ణి. దాంతో ఆదాయం లేకపోగా ఆస్తంతా హరించుకు పోడం మొదలెట్టింది. అప్పుడిక లాభంలేదని, నన్నేదో బాగుచేస్తారంటూ మా పెద్దలంతా కలిసి నాకు పెళ్ళి చేసేశారు. కాని పెళ్ళయ్యాక నా ధోరణి మరీ ఎక్కువై పోయింది.కారణం ఏవిటో తెలుసా?- మా ఆవిడ అచ్చం అప్సరసే అనుకో. ఈ కాలం పిల్లలు దాని అందం ముందెందుకూ పని చెయ్యరు. ముసిలి పీనుగ పెళ్ళాం సొగసు వర్ణిస్తున్నాడనుకునేవ్. నా మాటల్లో అసలు ఉత్ప్రేక్షలుండవు. ఉన్నదున్నట్టే. నే బొమ్మ చెక్కినా అంతే. అయిందా. అప్పుడేం చేశానూ?' అంటూ పక్కకి వొత్తిగిల్లేరాయన.

"ఏంచేసేరు?"

"శిల్పం చేశాను. అమర శిల్పం. మా ఆవిడ శిల్పం. అచ్చం అప్సరసని అప్సరసలా చెక్కేశా ననుకో. పోలికలన్నీ పోతపోసినట్టు తీసుకొచ్చాను. కాని, కాని యిప్పుడది లేదు. చచ్చిపోయింది. ఉంటే చూసుకుని ఎంత మురిసిపోయేదో! నన్నెంత మెచ్చుకునేదో." నరసింహాచార్యులు గారి కంఠం బొంగురుపోయింది. ముందు చెప్పినట్లుగా ఆయన చూడలేని కళ్ళు చెమర్చేయి. ఆయనలో బాధ చూసేను. నరాలు గిజగిజలాడేయి.

అంతలోనే ఆయన అనుభూతి మార్చుకున్నాడు. మామూలు ధోరణి తెచ్చిపెట్టుకోడానికి ప్రయత్నించి, గొంతు సర్దుకుంటూ అన్నాడు.

"చూడబ్బాయ్! షాజహాను పెళ్ళాన్ని ప్రేమించేకదూ తాజమహలు కట్టించేడు? కాసి, నన్ను చూడు. నేనూ ప్రేమించాను నా భార్యను. షాజహానుకంటే అమితంగా ప్రేమించానేమో కూడా. ప్రేమించడమే కాదు- ప్రపంచంలో అందాన్నంతా ధిక్కరించేలా ఉన్న 'ఆమె' రూపాన్ని అపూర్వంగా మలిచాను. పెళ్ళాన్నంత ప్రేమించీ షాజహాను తాజమహలు తనుగా తను కట్టలేకపోయాడు. ఎవరిచేతో కట్టించాడు. కాని నేను! నా చేతుల్తో నేను మలిచాను దాన్ని. ఇప్పుడు చూడు! పెద్ద కొండరాయి వుండేదక్కడ. దొలిచి ప్రాణాలు

మాత్రం విచారంలేదు. ఎ(ం)దుకో తెలుసా?-ఈ చేతుల్తో ఈ మహత్తర శిల్ప సృష్టి ఏనాడో పూర్తి చేసేశాను. నా జీవితంలోనే సాధిద్దామనుకున్న మహా ఫలితం ఏనాడో సాధించేశాను. అదేమిటనుకున్నావ్? కళాఖండం. నేను చెక్కిన శిల్పాలన్నీ వొక ఎత్తు. అదొక్కటీ ఒక ఎత్తు. చూపులక్కూడా ఎత్తయిందేలే—24 అడుగులు.' నరసింహాచార్యులు నిర్విచారంగా మాట్లాడేరు. నాకు వెంటనే ఆ కళాఖండాన్ని తనివితీరా చూడాలనిపించింది. కాని, ఆయన తన కళాఖండం ఎంత గొప్పదో చెప్పేడేగాని, ఎలా వుందో, ఎక్కడుందో చూడమని మాత్రం చెప్పలేదు. అంచేత నేనే కలుగజేసుకుని, "ఏదీ? ఎక్కడుందీ మీ కళాఖండం?" అని ఆతృతగా ఆసక్తిగా అడిగేను.

నరసింహాచార్యులుగారు నా ప్రశ్న విని, మోచేతులమీద సగం లేచేరు. మంచంమీంచిలేచి క్రింద పడతారేమోనని భయం వేసింది. పట్టుకోడానికి సిద్ధపడాలనుకున్నాను. కాని సగం లేచేక ఆయన అలాగే వుండిపోయి మొదలెట్టేరు - 'చూడబ్బాయ్! నువ్వు అశోకుడి గురించి చదివే వుంటావు. షాజహాను గురించి కూడా చదివే వుంటావు."

నాకు చిరాకేసింది — కళాఖండం చూపించకుండా మాటమారుస్తాడేమిటా? అని ఒక వేళ సస్పెన్సు కలిగిద్దామనుకుంటున్నాడేమో! హిచ్‌కాక్, గడ్డం పెంచుకుంటే యిలాగే ఉంటాడేమో! అనుకున్నాను. ఏమైనా చేసేదిలేక వినడం మొదలెట్టేను. ఆయన చెబుతున్నాడు-'చెప్పుకోదంకాదుగానీ నాకూ ఉంది పెద్ద చరిత్ర. నన్నడిగితే నాకున్న గతం షాజహానుక్కూడా లేదంటాను. చూడబ్బాయ్! ఒక్క సంగతి యిన్నాళ్ళకి నేనంటే అభిరుచితో వచ్చిన మనిషివి నువ్వొకడివి కనబడుతున్నావ్ - బహుశా మనిద్దరికీ ఏదో పూర్వజన్మ సంబంధం వున్నట్టుగా ఉంది. సమయం వొచ్చింది కాబట్టి చెబుతున్నా విను. అసలు సంగతేమిటంటే-

అప్పట్లో నాకు పాతికేళ్ళవయస్సూ, పాతికెకరాల భూమీ వుండేవి. నిత్యం పూల శిల్పాలు చెక్కాలనే ధ్యాసతప్ప మరో దృష్టి వుండేదికాదు. ఆ రోజుల్లో ఈ చేతుల్తో నేను ముట్టని మట్టిగానీ, కొట్టని రాయిగానీ లేదు. చాలా మట్టి బొమ్మలు చేశాను. కనిపించిన రాయి నల్లా తెచ్చి, ఖరారైన బొమ్మలెన్నో ఖచ్చితంగా చెక్కాను. ఆ మీదట దేశంలో గొప్ప శిల్పాలన్నిటికీ మించిన మహా శిల్పాలు చెక్కాలనుకున్నాను. అంతే. వెంటనే బయల్దేరి దేశమంతా తిరిగాను. చూశాను. చాలా చూశాను. హంపీ శిధిలాలు, అజంతా ఎల్లోరాలు, ఆగ్రా, ఢిల్లీలు, గొప్పగొప్ప కోటలు, దేవాలయాలూ, మసీదులు-ఉహ్? వొహ టేవిటి? సమస్త పూర్లు చూశాను. తిరిగొచ్చాకనే అనుకున్నంత పనీ చెయ్యగలిగాను. గర్వపడుతున్నాననుకునేవ్! అప్పుడీ అగ్రహారం చుట్టుపక్కల నేనంటే తెలియని మనిషిలేడు. అద్భుతమైన శిల్పినని అంతా మెచ్చుకునేవారు.

పోశాను. అదే నా కళాఖండం!"- గర్వంగా కిటికీవేపు చాచిన చేత్తో సూచిస్తూ చూపించేడు. తటాలున నేను ఆత్రంగా వంగి చూసేను. బాగా చూసేను. నాకేమీ కనిపించలేదు. ఇందాక నే నిలబడ్డ పచ్చగడ్డి స్థలం, దాని వెనక పొలాలూ, దూరాన కొండ అంచులూ తప్ప మరేమీ కనిపించలేదు.

నరసింహాచార్యులు గారింకా మాట్లాడుతున్నాడు- "నేను గొప్పవాణ్ణి కాదూ? షాజహానుకంటే గొప్ప చరిత్ర పురుషుణ్ణి కాదూ? చెప్పబ్బాయ్!"

నాకేం మాట్లాడాలో తెలియలేదు. నరసింహాచార్యులుగారు ఏదో గొప్ప కళాఖండాన్ని చూపిస్తాడనుకున్నాను. చూస్తాననుకున్నాను. ఫలితంగా నాలో గొప్ప నిరుత్సాహం కదిలింది. నరసింహాచార్యులుగారికి పిచ్చేమోనన్న అనుమానం కూడా కలిగింది. నాకేమీ కనిపించడంలేదని చెబుదామనిపించింది. నా కళ్ళు ఆయనవి, ఆయన కళ్ళు నావి అయిపోయినట్టుగా వుంది. నెమ్మదిగా కూర్చున్నవాణ్ణి లేచేను, పెదవి కదిలేంతలో పెద్ద శబ్దం వినబడింది. వెనక్కి తిరిగి చూసేను. నేల విడిచిన నీటి గిన్నెను పైకెత్తుకుంటూ, జారవిడిచిన నీలి పైటను మెడచుట్టూ తిప్పుకొంటోంది- 'మహాశిల్పి' కూతురు.


ఆయన పిలిచేడు- "అమ్మాయ్ నువ్వేనా? ఒక్కసారి యిలా రామ్మా!"

ఆమె గిన్నె క్రిందపెట్టి గబగబా వచ్చింది. ఎందుకో కంగారుపడుతోంది. నిటారుగా నిలబడింది. ఆమె నడిచి వచ్చిన సవ్వడి విన్నాక ఆయన. "చూడమ్మా! ఇతన్ని కాస్త అలా తీసుకువెళ్ళి మీ అమ్మ బొమ్మని చూపిస్తావూ!" అన్నాడు.

"రండి!" అంటూ కదిలింది. ఆమె మాట్లాడ్డం మొదటిసారిగా విన్నాను. ఆమెని అనుసరించేను. ఇద్దరం గుమ్మం దాటి, ఘట్లు దిగేం. నాపరాళ్ళ మీదుగా నడిచేం. మరో క్షణానికల్లా- చాలా సేపటి క్రితమే నేను తాకిచూసిన రాతి పాదాల దగ్గరికి నడిచి ఆమె ఆగిపోయింది. నేనూ ఆగేను.

"చూడండి!" ఆమె రెండవసారి మాట్లాడింది.

నేను చూసేను. ఇప్పటికిగాని నా మెదడు పని చేయలేదు. కళాఖండం ఊహలోపడి శిథిలాన్ని విస్మరించేనని మెలకువ కలిగింది. నివ్వెరపోయేను. ఇదా నా 'మహాశిల్పి' కళాఖండం! ఇదా నరసింహాచార్యులుగారి చరిత్ర దాటే కళాఖండం! దీనికోసమేనా కనబడలేదని నిరుత్సాహపడ్డాను! దీనికోసమేనా నరసింహాచార్యులుగారికి పిచ్చి వుందని అనుమానించేను!- అనిపించింది. గుండె బరువెక్కినట్టయింది. మనస్సు మరోసారి రెపరెపలాడింది. కళాఖండపు ఖండాన్ని మరోసారి చూసేను. విరిగిన పాదాలు- మెత్తగా, సుకుమారంగా అనిపిస్తున్నాయి. పాదాల దిగువకి జారిన పలుచని వస్త్రభాగం చిరిగిన కలువ రేకులా వుంది. ఏవేవో ఆభరణాలు, నగిషీలు- వనితనమంతా పాదాల్లోనే వుపయోగించేసినట్లుంది. మిగిలిన శిల్పమంతా చూడగలిగితే ఎంత బాగుణ్ణు!- యింతక్రితం చూసినప్పటిలాగే అను



కుంటున్నాను. మరోలా అనుకోడం తెలియడం లేదు.

ఆమె అడిగింది "చూశారా?"

"వచ్చేముందే చూసేను. ఇది రెండవ సారి" క్షణం ఆగేను. "మీ అమ్మగారి పాదాలూ ఇలాగే ఉండేవనుకుంటాను."

"అవును."

"ఆవిడపోయి ఎన్నాళ్ళయింది?"

"పదేళ్ళు షుమారు."

"ఎలా పోయేరు పాపం."

"నాన్న చంపేశాడు."

హఠాత్తుగా అదిరిపడ్డాను. వణికేను. "ఎందుకు?" అని మాత్రం అనగలిగేను.

"అమ్మలాంటి బొమ్మని చెయ్యాలని నాన్నెంతో కష్టపడ్డాడు. అమ్మని ఎదురుగా కూర్చోబెట్టి, రోజుల తరబడి ఎన్నో బొమ్మలు చెక్కాడు. ఏవీ అమ్మకి నచ్చలేదు. ప్రతి శిల్పంలోనూ ఏదో ఒక వంక చూపించేది. నాన్నకి పట్టుదల హెచ్చు. మానలేదు. ఇంకా ఎన్నెన్నో చెక్కాడు. ఎంతో డబ్బు ఖర్చుపెట్టాడు. చివరికి అమ్మ విసుగెత్తిపోయింది. తనకోసం దరిద్రాన్ని కొని తెస్తున్నారంది. తనలాంటి శిల్పం తయారు చెయ్యడానికి అన్నాళ్ళూ, అన్ని రాళ్ళూ పాడుచెయ్యాలా అనడిగింది. ఆఖరికి, నాన్నకు శిల్పాలు చెక్కడమే చేతకాదంది. పైగా పాడుబొమ్మలు చెక్కి వచ్చేటి బ్రతుకంతా పాడుచేస్తున్నారని ఆ బొమ్మలన్నీ పగలకొట్టింది. నాన్న కప్పుడు విపరీతంగా కోపం వచ్చింది. ఆయన కెప్పుడూ కోపం రాలేదు. అదే మొదటిసారి నాన్నకి తన చేతిమీద నమ్మకం ఎక్కువ. తన శిల్పాలే ఆయన ప్రాణాలు. తన నేర్పునీ తన శిల్పాన్నీ కించపరచడం నాన్న సహించలేకపోయాడు. అమ్మతో ఘర్షణ పడ్డాడు. ఆ ఘర్షణలో చేతనున్న ఉలిని అమ్మమీదికి కోపంగా విసిరాడు. కణతకి తగిలింది. రక్తం కారింది. అంతే అమ్మ చచ్చిపోయింది." ఇలా చెప్పేంతసేపూ ఆమెలో నిర్లిప్తత తప్ప మరే భావం లేదు. బహుశా పాత భావాలన్నీ ఘనీభవించి గుండెని రాయిచేసి వుంటాయి. బ్రతికున్నప్పుడు నరసింహాచార్యులుగారికి తెలిస్తే కూతురి గుండెని కూడా శిల్పంగా చెక్కేవాడేమో!"

ఆమె చెప్పడం అయిపోలేదు. "అమ్మ పోయాక నాన్న కోపమూ పోయింది. ప్రాణంలేని రాళ్ళకి ప్రాణంపోసిన ఉలితో, ప్రాణం ఉన్న అమ్మప్రాణం కాస్తా బలి తీసుకున్నానని కుమిలిపోయాడు. చాలారోజులు విచారంతోనూ, పశ్చాత్తాపంతోనూ గడిపాడు. చివరికి అమ్మ జ్ఞాపకార్థం అయిదేళ్ళు రాత్రీ పగలూ కష్టపడి యీ శిల్పం చెక్కాడు అమ్మ బ్రతికి ఉంటే దీనికి వంక పెట్టేది కాదు. అంత బాగా చెక్కాడు; నిజం చెప్పాలంటే అమ్మలాంటి బొమ్మని అమ్మపోయాక తయారు చెయ్యగలిగాడు నాన్న." ఆమె ఆగింది. పరాయివ్యక్తితో ఆమె యింతసేపు నిబ్బరంగా, ధారాళంగా మాట్లాడగలిగిన మనిషి అని నేను మాత్రం వూహించలేదు. చీర కొంగుతో చెంపల్ని తుడుచుకొని అంది. "కాని శిల్పమంతా పూర్తయ్యాక, అమ్మ భుజాల మీద నిలబడి- తల పాపిట నవరిస్తూ చివరి మెరుగులు చెక్కుతూంటే కాలు జారి నాన్న క్రిందపడిపోయాడు. తలకి పెద్ద గాయం తగిలింది. మెదడు దెబ్బ తిందిట. అప్పట్నించీ నాన్న చూడలేడు. నడవలేడు. అమ్మని చంపినందుకు శిక్షనుకుని ఆ స్తమానం కన్నీళ్ళు పెట్టుకుంటాడు."

మగాడిలా మాట్లాడే స్త్రీ ఎప్పుడూ తెలియదు నాకు. ఆమె మాటలు వింటోంటే 'మహాశిల్పి' కూతురు కాక, కొడుకు మాట్లాడుతున్నట్టనిపించింది నాకు. నే నడిగేను. 'మీరు మగాడిలా ఎందుకు మాట్లాడుతున్నా'రని కాదు.

"మరయితే ఎందుకిదిలా శిథిలమైపోయింది?"

"ఎవరో గొప్ప వ్యక్తిట. ఆ మధ్య యీ వూరొచ్చాడు. స్వాములవారో, సన్యాసో- తెలీదు నాకు. దేశమంతా కాలినడకనే నడుస్తాట్ట. ఏదో వుపన్యాసాలిచ్చాడు. మునసబుగారు ఈ ప్రదేశాన్ని ఆయనకి భూదానం చేశాడు. అప్పుడాయన యీ విగ్రహాన్ని చూశాడు. అసహ్యించుకున్నాడు. అమాయకులైన ప్రజల్లో యిలాంటి శిల్పాలు చెడ్డ ఆలోచనల్ని ప్రేరేపిస్తాయట. శృంగార వాంఛల్ని రేకెత్తిస్తాయట."

"బహుశా అప్పుడు ఆయనలో అలా రేకెత్తి వుండొచ్చు."

"ఏమో! శిష్యులతో కలసి విగ్రహాన్నంతా ఛిన్నాభిన్నం చేసి వెళ్ళిపోయాడు. కోపంలో అమ్మని చంపేసినా- యీ బొమ్మ చెక్కి నాన్న మళ్ళీ అమ్మకి ప్రాణం పోశాడు. కానీ రెండవ సారి కూడా అమ్మ చంపబడింది. నే నడ్డుపడ్డాను, ఏడిచాను, తల బాదుకున్నాను. లాభంలేకపోయింది. పైగా 'మా అమ్మని చంపకండి' అని ఏడిస్తే అందరూ నన్ను అపహాస్యం చేశారు. సిగ్గు భరించలేక నేనుకూడా చచ్చిపోయాననుకున్నాను. ఇక నేను చెయ్యగలిగిందల్లా ఆ క్షణంలో ఒక్కటే మిగిలింది. ఈ అమానుష విషయం నాన్నకు తెలియకుండా జాగ్రత్తపడ్డాను.

తెలిస్తే యీనాస్నగుండె పగిలేది పాపం. యింకా యిక్కడ అమ్మ శిల్పం వుందను కుంటున్నాడు. ఆ ఆసరాతోనే నాన్న బతికున్నాడు." రెండు సెకన్లు ఆగింది. "చూడండి లోపలికి వెళ్ళాక నాన్న మిమ్మల్ని అడుగుతాడు. అమ్మ శిల్పం ఎలా ఉందని?- దయచేసి, బాగుందని చెప్పండి!- నాన్నకోసం. నాకీ ప్రపంచంలో నాన్న తప్ప ఎవరూ లేరు. నాన్నా! పరవతి తప్ప మాకు మరో బ్రతుకుతెరువు లేదు. నాన్నని నేను కాపాడుకోవాలి. కాదు మీరే కాపాడాలి. ఇంతకంటే నాకు మరో మార్గంలేదు. నాన్నని కాపాడి పెట్టండి! మా బ్రతుకు నిలబెట్టండి! అమ్మబొమ్మ బాగుందని చెప్పండి! చిన్న అబద్ధం- చెబుతారు కదూ!" ఆమె గొంతులో దైన్యం, వేడికోలు నా మనస్సుని కదిపేయి. నేను చాలా చాలా చలించేను. అంతా నాకో చిత్రమైన అనుభూతిలా వుంది. 'అలాగే' అన్నాను. ఆమె చేతులు కలిపి నమస్కారం చేసింది. కృతజ్ఞత అనుకుంటా.

"పదండి వెళ్దాం" అంది.

ఆమె వ్యక్తిత్వంలో తెలియని వైరుధ్యమేదో వుంది. నా కర్థంకాలేదు. ఇద్దరం వెనక్కి తిరిగి నడిచేం. సాయంత్రం పలుచని చీకటి రాకని చూచాయగా సూచిస్తోంది. నాకు ప్రయాణం గుర్తొచ్చింది. త్వరపడాలని పించింది.

ఆమెతో ఇంట్లోకి ప్రవేశించేను. లోపల వెలుగు బాగా తగ్గింది. నరసింహాచార్యులుగారి మంచంకేసి నేను వడివడిగా నడిచేను. ఆయన రెండు చేతులూ కలిపి పట్టుకున్నాను. లేని వుత్సాహోద్రేకాలని సృష్టించుకున్నాను. అన్నాను-

"ఆచార్యులుగారూ! నిజంగా యీ రోజు నా జన్మ తరించింది. అసమానమైన శిల్పకళ దర్శించే భాగ్యం నాకు కలిగించేరు. మీలాంటి మహాశిల్పులు నూటికీ కోటికి ఎక్కడో ఏ వొక్కరో వుంటారు. పొగడ్త అనుకోకండి. నాకు పొగడ్డం చేతకాదు. అసలు నా అనుమానం మీరేదో దైవాంశతో పుట్టివుండాలని. ఇంత అద్భుతమైన కళాఖండం ఎప్పుడూ, ఎక్కడా, చివరికి కలలో కూడా నేను చూడలేదు."

నేను అప్పుడప్పుడూ శ్రవ్యనాటికల్లో పాల్గొన్నాను. బాగానే అనగలిగేను. ఎంచేతనంటే నా మాటలకి నరసింహాచార్యులుగారిలో, ఎదురు చూసిన ప్రశంసా భావాలన్నీ ఎంతో బాగా కనిపించేయి. తెగని సంతోషం, తృప్తి నరసింహాచార్యులుగారి గ్రుడ్డి కళ్ళల్లో నీటిని తిప్పేయి. గిల్టీగా ఫీలయ్యేను.

నరసింహాచార్యులుగారు పొంగిపోయేరు. మంచి వుత్సాహాన్నీ, మంచి కృతజ్ఞతనీ మాటల్లో చెప్పేరు- "చాలా సంతోషమబ్బాయ్! చాలా సంతోషం! నాకీరోజు నా చిన్నప్పటి దీపావళి పండగంత హాయిగా ఉంది. నా కళాఖండాన్ని బాగా చూశావు కదబ్బాయ్!- ఆ కళ్ళూ, ముక్కూ, శంఖులాంటి మెడా, గుండ్రంగా జారిన భుజాలూ, వాటి మించే జారిపడే కళ్ళూ, కాళ్ళూ పోగొట్టుకున్నాను- అంత నునుపుగా చెక్కేను దాన్ని- బాగా చూశావు కదూ? నే చెప్పిం

ఇంకా ఏదో అంటున్నాడు. నాకేమీ వినిపించడంలేదు. వినిపించినా అర్థం కావడంలేదు. కాళ్ళక్రింద పుట్టుకొచ్చిన పుణ్యభూమి తొలుచుకుపోతున్నట్టుగా ఉంది.

"ఈపాటికి బస్సు దాదాపు బాగయిపోయి ఉంటుంది. ఆలస్యమైతే అందుకోలేను, విశాఖపట్నం వెళ్ళాలి. ఇక సెలవు తీసుకుంటానండి!" అన్నాను.


"మంచిదబ్బాయ్! క్షేమంగా వెళ్ళు! ఎప్పుడన్నా వీలువడితే ఇటుకేసో చూపు చూడు."

"ఎంతమాట వస్తానండి!" అని ఆయన చూడలేకపోయినా, నరసింహాచార్యులుగారికి నమస్కారం పెట్టి కదిలేను. ఆమె వీధి గుమ్మందగ్గర నిలబడి కనబడింది. కృతజ్ఞతని చిరునవ్వుగా తయారుచేసి పెదాలమధ్య చూపించింది. ఇప్పటికిగానీ నాకు ఆమె అందంకేసి మనసు పోలేదు. కాని టైము తక్కువగా వుండడంవల్ల ఒకేమాట "వస్తానండి!" అని చెప్పి మెట్లు దిగేను.

నాపరాతి ముక్కలమీద నడుస్తున్నాను.

పాపం! కండలు కరిగించుకుని కళాఖండం మలిచిన నరసింహాచార్యులుగారు తన ప్రేమ కథకి చరిత్రలో షాజహానుకంటే వున్నత స్థానం వుంటుందనుకుంటున్నాడు. కళ్ళు పోగొట్టుకుని పిచ్చిగా వూహించుకుంటున్నాడు. కాని ఆయనికి తెలియదు. ఊహల్ని కాదనే నిజం వుంది. కళాఖండమూ, ప్రేమా, చరిత్రా ఏవీ ఆయనకు దక్కలేదు. అవును. ఎలా దక్కుతాయి? నరసింహాచార్యులు లేనివాడు. అతి సామాన్యుడైన కళాకారుడు. సామ్రాజ్యాధినేత కాడు. రాజకీయ నాయకుడూ కాడు. కేవలం పేదశిల్పి. పేదవాళ్ళ ప్రేమలో ఎంత బలంవున్నా ప్రయోజనం లేదు. మహా ధనవంతుడైన షాజహాను చక్రవర్తి అపూర్వమూ, అద్భుతమూ అయిన తాజ్ మహల్ కట్టించి నరసింహాచార్యులుగారి లాంటి పేదవాళ్ళ ప్రేమకి విలువ లేకుండా చేసాడు. ఎవడో రాజకీయ సన్యాసి మహాశిల్పాన్ని నాశనంచేసి ఆయన చరిత్ర నిలువకుండా నిర్జీవంచేసేడు. ఛీ!- వీళ్ళా భారతదేశం మనుషులు! గురజాడకవి దేశమంటే మట్టికాదు, మనుష్యులే అని చెప్పేడుగానీ- నా కిప్పుడు యిలాంటి మనుషులు పుట్టే దేశాన్ని వొట్టి 'మట్టి' అనుకుంటేనే బాగున్ననిపిస్తోంది. లేకపోతే, కొన్నాళ్ళకి దేశంమీద ఏవగింపు కలిగి, నాలో వుందనుకొనే కొద్దిపాటి దేశాభిమానం చచ్చిపోతుందేమోనని భయం కూడా వేస్తోంది.

అలా ఆలోచనలు పేర్చుకుంటూ కొంతదూరం నడిచేక, ఎందుకో వెనక్కి తిరిగి చూడాలనిపించింది. చూసేను! నరసింహాచార్యులుగారి పాత పెంకుటిల్లు చిన్న అట్ట సెట్టింగులా కనబడింది. నాలో యిప్పుడు- ఒక గొప్ప కళాఖండాన్ని చూడలేకపోయాననే దిగులు తొలిగిపోయి, నా 'పేద మహాశిల్పి' నరసింహాచార్యులుగారి ప్రేమనీ, తృప్తినీ, చరిత్ర స్థానాన్నీ కాపాడగలిగానన్న సంతోషభావం కమ్మగా, తియ్యగా కలిగి పెరిగింది.



పీలా బాలామణి అనకాపల్లి

ప్ర. మానవ సృష్టియే లేకపోతే ఈ భూగ్రహం ఎలా వుండేదో ఊహించ గలవా కంప్యూటర్?

జ ఊహించగలను. వారే కోతి రూపంలో ఉంటారు

గోపరాజు రాధాకృష్ణ మోరి

ప్ర. ఒలింపిక్స్‌లో 'తిండి పోటీలు' పెడితే మనవాళ్ళకి ఏవేనా పతకా లొచ్చేవంటావా కంప్యూటర్?

జ కల్తీ ఆహారం తినే పోటీలో స్వర్ణం తప్పక వస్తుంది.

శారద హైదరాబాద్

ప్ర. నేనో అందమైన.... 'తిలక్ కవిత్వం' లాంటి అమ్మాయిని....! మరి నన్ను మీరు పెళ్ళిచేసుకుం టారా కంప్యూటర్‌గారూ?

జ చేసుకుంటానుగానీ నువ్వో హామీ పత్రం రాసివ్వాలి. ''ఈ అందం నా స్వంతం. మరే అందానికి అనుసరణగానీ అనువాదంగానీ కాదు. మరే కంప్యూటర్‌తోనూ నాకెలాంటి సంబంధం లేదు. ఒక వేళ నా మాట అబద్ధమని తేలినట్ల యితే మొత్తం ఫిక్స్ చేసిన హనీ మూన్ ప్రోగ్రాం కాన్సిల్ చేసేం దుకు కంప్యూటర్‌కి పూర్తి అధి కారముంది.''

బి. విజయభాస్కర్ గాంధీ చౌక్

ప్ర. విద్యార్థులు, నరరూప రాక్షసులుగా మారేది ఎప్పుడు....?

జ రోజూ

పీలా సుబ్బమ్మ అనకాపల్లి

ప్ర. 'మహిళా మండలి' అంటూ మన స్త్రీలు మతిలేని పనులు చేస్తున్నారు? దానిపై నీ వ్యాఖ్య ఏమిటి?

జ ప్రతి మహిళామండలి వెనుక మగ మండలి హస్తం ఉంటుంది

మధుసూదనరావు కొండయ్యపాలెం

ప్ర. కులవృత్తులు మాని ఉద్యోగాలకై ఎగబడుతున్నారు కొందరు. ఉద్యో గాల ఆశపోయి కులవృత్తులలోకి పోతున్నారు మరికొందరు. ఈరెండు రకాలుగా లేనివాళ్ళు నాశనమైపోతు న్నారు. ఈ తారతమ్యాలన్నింటికీ పరిష్కారం ఎప్పుడో?

జ కులవృత్తులూ ఉద్యోగాలూ కూడా దొరకనప్పుడు

కె. ఆర్. ప్రసాద్‌రావు సత్తుపల్లి

ప్ర. ప్రేమ పవిత్రం. పెళ్ళి పవిత్రం. మరి విడాకులు...?

జ పిల్లలు పుట్టకముందయితే దేశానికే పవిత్రం

పాట్నీడి చక్రరావు విశాఖపట్నం

ప్ర. మానవుడి శక్తిని, మేధస్సును మించి పనిచేసే ఓ కంప్యూటరూ! 'స్వార్థం'లో కూడ మానవుడిని మించిపోవుగద!

జ హ్హ హ్హ హ్హ 'పిచ్చివాడా! ఇంకో కంప్యూటర్ నాకంటె పైకి రానంత కాలం మనకి స్వార్థం ఉండదు

ప్ర. దేశంలోని దుర్భిక్షం పోవాలంటే?

జ ప్రజలు వలస వెళ్ళాలి

కోడేబోయిన రమేష్‌బాబు పాలకొల్లు

ప్ర. తొలి చూపులోనే ప్రేమలోపడే వారివెనుక ఏమి వుంటుంది?

జ రెండో చూపులో ప్రేమ

కాజ హనిత ఏలూరు

ప్ర. "సమాజం" అంటే?

జ కాజ హనిత మిగతా ప్రజలు

ప్ర. నేటి చిత్రాలలో హీరోయిన్‌కు క్లబ్ డాన్సర్స్‌కు వున్న తేడా?

జ బూతు సాహిత్యం

ప్ర. స్త్రీ రాజకీయాలలో అవసరమా?

జ స్త్రీ ఎక్కడయినా అవసరమే

యస్. రవి సత్తుపల్లి

ప్ర. "నాకు సన్మానాలంటే అయిష్టం" అని అతనికి జరిగే జన్మానసభలో అతని మాటలు. దీనిపై మీ కామెంట్?

జ ఆ సన్మానాలకు హాజరయే వారి మానసిక స్థితిని చెకప్ చేయించాలి

పీలా సత్యగోపి అనకాపల్లి

ప్ర. హరించిపోయే అందాలను గురించే ఆలోచిస్తారు తప్ప, ఆయుస్సు పెంచే ఆరోగ్యం గురించి ఎందుకు ఆలో చించరు కంప్యూటర్?

జ తీరా ఆయుస్సు పెరిగాక అందం లేకపోతే ఘోరున ఏడవాల్సి వస్తుంది గనుక

ఎ. ఎల్. సువర్చల రైలుపేట

ప్ర. పదహారు సంవత్సరాలు ఎన్నో కష్టనష్టాలను భరించి కని, పెంచి, పెద్దచేసిన తల్లిదండ్రులకంటే, ఆ

రోజే తాళికట్టిన భర్తను, స్త్రీ ఎందుకు నమస్కరిస్తుంది?
జ. ప్రాణభయంవల్ల

జి. రమేష్ ప్రత్తిపాడు
ప్ర. తెల్ల టోపీకి ఎర్ర టోపీకి తేడా ఏమిటి?
జ. లాఠీ లాఠీ
ప్ర. గోడలకి చెవులుంటాయట మరి మందాలకి?
జ. కళ్ళుంటాయ్

సూర్యప్రకాశరావు రామరాజులంక
ప్ర. ఆడవారు "తాము 'అబల'లంకాదు 'సబల'లం" అని నిరూపించుకోవాలంటే?
జ. భర్తను కట్నకానుకలు తెమ్మని వేధించి కిరసనాయిలు పోసి తగలెయ్యాలి


కె. నన్నీ అనకాపల్లి
ప్ర. కంప్యూటర్! నీకే దేవుడు ప్రత్యక్షమయితే నువ్ కోరే వరమేమిటి?
జ. మిగతా కంప్యూటర్లన్నీ నాశనం అయిపోవాలని

ఎ. వి. భాస్కర్ అనకాపల్లి
ప్ర. ఒకప్పుడు దేశ స్వాతంత్ర్యంకోసం పోరాడేవారికి ప్రజలు చేయూతనిచ్చినారు కాని ఇప్పుడు దేశ శ్రేయస్సు కొరకు పాటుపడేవారిని ప్రజలే కాల్చి చంపుతున్నారు? ఎందుచేత?
జ. అందరూ ఒకేసారి దేశశ్రేయస్సు కోరటంవల్ల

పి. రమేష్‌బాబు హైదరాబాద్
ప్ర. ఒలింపిక్స్‌లో ఇండియాకు పతకాలు రాకపోవడానికి కారణం?
జ. అన్నీ మిగతా దేశాలు తీసేసుకోవటంవల్ల

సి. వి. నరసింహదాసు విజయనగరం
ప్ర. 'నీకు తెలిని విషయమేమిటో చెప్పుకో చూద్దాం!'
జ. ఫీడ్ చెయ్యకుండా దాచిన విషయాలు

పి. రమేష్‌బాబు తెనాలి
ప్ర. ఇల్లు పీకి పందిర' అంటే?
జ. చిన్న ఇల్లు ఎస్టాబ్లిష్ చేయటం



అందరూ వైద్యులే

హాస్పిటల్‌లో పని ముగించి ఇంటికి వెళ్దామనుకుంటున్న సమయంలో నా ఫ్రెండ్ దగ్గరనుండి ఫోనొచ్చింది.

వాడి వాయిస్ నీరసంగా ఉంది.

అదే అడిగాను నేను.

"పది రోజులనుండీ జ్వరం" అన్నాడు వాడు.

"మరి ఇన్ని రోజులనుండీ ఏం చేస్తున్నావ్? నాకు ఫోన్ చేస్తే వచ్చి చూసేవాణ్ణి కదా?" కాస్తంత కోపంగా అడిగాను నేను.

"మామూలు జ్వరమేకదా, దానంతట అదే పోతుందేమో అనుకొన్నాను. అదీ కాక హడావుడి రాజుగారు ఏవో మందు లిస్తున్నారు తగ్గుతుందేమో అనుకున్నా" అన్నాడు రాజు.

"డాక్టర్ కాదనుకో కాని కాస్తంత వైద్యం తెలుసంటాడు. ఇలా తెలిసిన వాళ్ళకి తనకు తోచిన మందేదో ప్రిస్క్రైబ్ చేస్తూ ఉంటాడు. చిట్కా వైద్యం నుండి అలోపతి వరకు అన్ని రకాల మందులూ వాడుతూంటాడాయన మా నాన్నగారికి ఆయన వైద్యంమీద నమ్మకం ఎక్కువ, మా నాన్నగారి సంగతి తెలుసుకదా!" అన్నాడు రాజు.

అదన్నమాట సంగతి. తండ్రికి జడిసి మా వాడు పదిరోజులుగా జ్వరం తగ్గక పోయినా నాకు ఫోన్ చేయలేదు. నేను ట్రీట్‌మెంట్ మొదలెడితే వాళ్ళ నాన్నగారికి ఎక్కడ కోపం వస్తుందోనని వాడి భయం. వాళ్ళ నాన్నగారికి హడావుడిరాజు మందుమీద నమ్మకముందంటే, ఇంకెవరు

డాక్టర్ శ్రీధర్

"హడావుడి రాజా? ఆయనెవరు?" అడిగాను నేను ఆ పేరుకి ఆశ్చర్య పడుతూ.

"మా ఇంటిదగ్గరే మా దూరపు బంధువొకాయన ఉన్నాడులే మాంచి హడావుడి మనిషి అందరూ ఆయన్ని హడావుడి రాజు అనే పిలుస్తారు."

"డాక్టరా?" అడిగాను నేను.


వైద్యంచేసినా ఆయన ఒప్పుకోకపోవచ్చు.

"సరే సాయంత్రం నే వస్తాలే!" అని ఫోన్ పెట్టేసాను.

నేను, రాజు చిన్ననాటినుండి స్నేహితులం. ఇంటర్మీడియట్ వరకు కలిసే చదువుకొన్నాం. ఇంటర్మీడియట్ తరువాత నాకు మెడిసిన్‌లో సీటు రావటం వాడికి రాకపోవటం మూలాన ఇద్దరం

విడిపోవాల్సి వచ్చింది. నేను మెడిసిన్ పూర్తిచేసేసరికి వాడు బి. యస్. సి. కంప్లీట్‌చేసి బ్యాంక్‌లో క్లర్క్‌గా జాయినయ్యాడు. రాజు వాళ్ళ నాన్నగారు రామలింగరాజుగారిదో విచిత్రమైన మనస్తత్వము. తాను పట్టిన కుందేటికి ఎట్టి పరిస్థితిలోనూ మూడే కాళ్ళుంటాయనే రకం ఆయన.

సాయంత్రం నేను వెళ్ళేసరికి రాజు వాడి బెడ్‌రూమ్‌లో పడుకొని ఉన్నాడు నేను గుమ్మందగ్గర ఉండగానే వాళ్ళ నాన్నగారు పలకరించారు.



"రావోయ్ రా. నీ ఫ్రెండ్ పడకేసాడు చూశావా?"

నేను ఆయనకి నమస్కారంచేసి రాజు బెడ్‌మీద ఓ మూలకి కూర్చున్నాను

రాజు బాగా నీరసంగా కనిపిస్తున్నాడు. దవడలు లోపలికి పీక్కుపోయాయి. గడ్డం బాగా మాసిపోయి ఉంది.

"టెంపరేచర్ ఎంతుందో చూశావా?" అడిగాను రాజుని.

"ఇందాకే నోట్‌చేసా వందడిగ్రీలుంది" అన్నాడు వాడు.

బెడ్ ప్రక్కనే ఉన్న టేబుల్‌మీద వాడు వాడుతున్న మందులు కాబోలు, ఉన్నాయి. వాటిని చేతిలోకి తీసుకొని చూశాను నేను.

"అవన్నీ హడావుడి రాజుగారు ఇచ్చిన మెడిసిన్స్" అన్నాడు రాజు.

"పది రోజులనుండీ ఇవే వాడుతున్నావా?" అనడిగాను.

"అబ్బేలేదు ఇంతకుముందు ఇంకేవో రెండుమూడు రకాలు వాడినా తగ్గకపోతే మందులు మార్చి ఇవి ప్రెస్క్రైబ్ చేసాడు" అన్నాడు రాజు.

"ఈ మధ్య వస్తున్న జ్వరాలు, అవేమిటి, వైరల్ ఫీవర్స్ కాబోలు, త్వరగా తగ్గిచ్చేదని కదా, ఇంకా రెండురోజులు పట్టొచ్చునన్నారు హడావుడి రాజుగారు" అన్నారు రామలింగరాజుగారు.

"ఏంటి బయాటిక్స్, ఏంటి పైరటిక్స్ ఇస్తున్నట్టున్నాడు"

అప్పటిదాకా ఆ రూమ్‌లో ఉన్న నాలుగవ మనిషిని చూడలేదు నేను. రామలింగరాజుగారి ప్రక్కనే కూర్చొని ఉన్నాడాయన. బహుశా 35 ఏళ్ళుంటాయేమో అతనికి.

"ఈయన సుబ్బారావుగారని ఇక్కడే జంతర్ మంతర్ ఫార్మస్యూటికల్స్‌లో కెమిస్టుగా పని చేస్తున్నాడు" అన్నారు రామలింగరాజుగారు.

"జంతర్ మంతర్ ఫార్మస్యూటికల్సా?" ఆశ్చర్యంగా అడిగాను నేను. ఆ పేరెక్కడా విన్లేదన్న అనుమానం ధ్వనించేలా-

"అబ్బే మేం మందులకు కావలిసిన రా మెటీరియల్స్ మాత్రమే సప్లయిచేస్తాం అందుకే మీరు వినుండరు, నేనూ ఇదే ఫీల్డులో పని చేస్తున్నాను కాబట్టి నాకూ కాస్తో కూస్తో ఈ మందుల విషయం తెలుసు. మా ఇంట్లో వచ్చే చిన్న చిన్న జబ్బులకి నేనే ట్రీట్‌మెంట్ యిస్తూ ఉంటాను. మన రాజుకికూడా ఆంపెనిసిలిన్ తీసుకోమని హడావుడిరాజుకంటే ముందే నేను సజెస్ట్ చేసాను" అన్నాడాయన.

"ఆంపెనిసిలినా?" అయోమయంగా అడిగాను నేను.

"అదే ఆంపిసిలిన్, ఆంపిసిలిన్" అన్నాడు రాజు.


"ఆ- అదే నేనూ అంటున్నది ఈ పేంక్రియాస్ జబ్బులున్నాయి చూసారూ, ఇవి పవర్‌ఫుల్ ఆంటిబయాటిక్స్ ఇస్తేగాని తగ్గవు" అన్నాడాయన.

"పేంక్రియాస్ జబ్బేమిటీ? ఎవరికి?" అడిగాను నేను. నాకంతా అయోమయంగా ఉంది.

"ఆయన ప్రతీదీ పేంక్రియాస్ మూలానే వచ్చిందంటాడులే. నువ్వూరుకో, లేకపోతే మరోగంట పేంక్రియాస్ మీద లెక్చరిస్తాడు. ఇప్పటికే రెండు గంటలనుండీ సుత్తిభరించలేక ఛస్తున్నా" అన్నాడు రాజు నాకు మాత్రమే వినబడేలా.

కానీ సుబ్బారావుగారు మాత్రం దొరికిందే సందు అన్నట్టుగా అందుకున్నాడు.

"రాజుకి ఏ జబ్బూ లేదండీ వాడి పేంక్రియాస్ చాలా వీక్ అందుకే ఇలా మామూలు జ్వరాలుకూడా ఇన్నిరోజులు తగ్గకుండా పీల్చేస్తాయి. అదీ మామూ



లుగా అయితే రెండుమూడు రోజుల్లో తగ్గవలసిన మాటకాని పేంక్రియాస్ దెబ్బ తినడంతో వీడి రోగ నిరోధకశక్తి పూర్తిగా పోయింది. ఏమంటారు రామలింగరాజుగారు?" అన్నాడాయన రాజు వాళ్ళ నాన్నగారి కేసి తిరిగి.

"అవునవును" తలూపుతూ అన్నారు రామలింగరాజుగారు.

నాకు మతిపోయినట్టయింది. 'పేంక్రియాస్ వీకవడానికీ, వీడి జ్వరానికీ ఏమిటి సంబంధం? అయినా వీడి పేంక్రియాస్ వీకవడమేమిటి? అది ఈ సుబ్బారావుగారికెలా తెలిసింది? సడన్‌గా నా మెడిసిన్ పరిజ్ఞానం ఎందుకూ పనికిరాకుండా పోతోందనిపించింది.

క్యూరియాసిటీ చంపుకోలేక అడుగకూడదనుకుంటూనే అడిగాను మెల్లగా-

"పేంక్రియాస్ వీకని మీకెలా తెలిసింది?"

"అ-దాందేముందండీ.... వెరీసింపుల్ కావాలంటే మీరూ చూడండి. రాజు పొట్ట చూసారా? కుడివైపు మాత్రమే ఎలా పైకి క్రిందికీ కదులుతోందో" అన్నారు సుబ్బారావుగారు రాజా షర్టుని పైకి తీసి పరీక్షగా పొట్టవైపు చూస్తూ.

నాకుమాత్రం ఏమీ అబ్‌నార్మాలిటీ ఉన్నట్టుగా అనిపించలేదు. ఎడమవైపు కాస్తంత నీడ పడటంమూలాన కావచ్చు ఊపిరి తీసుకున్నప్పుడల్లా కుడివైపు మాత్రమే పొట్ట పైకీ క్రిందికీ కదులుతున్నట్టనిపిస్తోంది.

"రోజూ సమయానికి భోంచేస్తే ఈ పేంక్రియాస్ జబ్బులు రావు ఏమంటారు రామలింగరాజుగారు?" అడిగారు సుబ్బారావుగారు.

"కరెక్టు, వెధవ, ఏ ఒక్కరోజూ టైమ్‌కి భోంచేయడు" అన్నారాయన.

ఈలోగా రూమ్ లోపలికి సుడిగాలిగా దూసుకువచ్చాడో మనిషి కాస్తంత పెరిగిన గెడ్డం, చింపిరి జుత్తు, ఖద్దరులాల్చీ, పైజామాలో సినిమాల్లో కనిపించే విప్లవవాదిలా ఉన్నాడతను.

"వీరే హడావుడి రాజుగారని మా నాన్నగారి క్లోజ్‌ఫ్రెండ్ ఇతను నా ఫ్రెండ్. ఇక్కడే గవర్నమెంట్ హాస్పిటల్‌లో డాక్టర్" పరిచయం చేశాడు రాజు.

ఆయన నావంక ఒకసారి పరీక్షగా చూసి రామలింగరాజుగారి వంక తిరిగాడు.

"మన రాజుకి ఒక గ్లూకోజ్ బాటిల్ ఎక్కిస్తే బాగుంటుందని తెచ్చాను ఇవ్వమంటారా?"

"అదంత అవసరమంటారా? నాకేమీ డీహైడ్రేషన్ లేదుకదా" అన్నాడు రాజు భయంగా గ్లూకోజ్ బాటిల్‌వంకా, ఇంట్రావీనస్ సెంట్ వంకా చూస్తూ.

నేనూ వారించబోయాను. కానీ మధ్యలోనే రామలింగరాజుగారు అడ్డుకొని-

"ఇచ్చేయండి కుర్రవెధవ వాడికేం తెలుస్తుంది? వాడలానే అంటాడు మీరిచ్చేయండి!" అన్నారు.

అయన ఆమాట రాజునే ఉద్దేశించి అన్నాడో లేక నన్నే అన్నాడో అర్థం కాలేదు నాకు.

పాపం రాజు నావంక నిస్సహాయంగా చూసాడు. నేనూ 'ఏం చేస్తాం' అన్నట్లు చూశాను వాడివంక.

హడావుడి రాజుగారు గ్లూకోజ్ బాటిల్‌ని మంచం రాడ్‌కి తగిలించి ఐ. వి. సెట్‌ని కనెక్ట్‌చేసి ఫ్లూయిడ్ స్టార్టుచేశారు.

"నేను వస్తానండి. ఇంకా బోల్డుమంది పేషెంట్ల ఇళ్ళకు వెళ్ళాలి. బాటిల్‌పూర్తి కాగానే డిస్‌కనెక్ట్ చేయండి, లేదా నాకు కబురంపండి. వస్తా" అంటూ వచ్చినంత హడావుడిగా వెళ్ళిపోయాడు.

"పేరుకి తగ్గ మనిషి" అనుకున్నాను నేను.

నా కళ్ళముందే రాజుకి అనవసరంగా ఇంట్రావీనస్ ఫ్లూయిడ్స్ ఎక్కిస్తుంటే చూస్తూ ఊరుకోవాల్సి వచ్చినందుకు నాకు చాలా బాధ అనిపించింది.

కొద్ది నిముషాలకే రాజు మెల్లగా వణకడం ప్రారంభించాడు.

కాళ్ళదగ్గరున్న బ్లాంకెట్ తీసి కప్పాను నేను. కాని అలా ప్రారంభమైన చలి మరో ఐదు నిముషాలు గడిచేసరికి విపరీతంగా మారి గడగడా వణకడం మొదలెట్టాడు రాజు.

ఇంట్రావీనస్ ఫ్లూయిడ్స్‌వల్ల అప్పుడప్పుడూ ఇలా చలిరావడం జరుగుతుంది కాబట్టి నేను ఫ్లూయిడ్స్ స్టాప్‌చేసి నీడిల్ చేతిలోంచి లాగెయ్యబోయాను.

"ఆగండాగండి." దాదాపు అరిచినట్లుగా అన్నారు సుబ్బారావుగారు.

ఉలిక్కిపడి ఆగిపోయాను.

"చలిరావటం ఐ. వి. ఫ్లూయిడ్స్‌వల్ల కాదు"

"మరి?" అన్నాను నేను అయోమయంగా.

"ఆ మంచం క్రింద చూడండి మీకే తెలుస్తుంది" అన్నారు సుబ్బారావుగారు విద్యాలాసంగా.

నేను మంచం క్రిందికి తొంగిచూశాను అక్కడ రాజు వాళ్ళ పెంపుడు కుక్క తప్ప ఇంకేమీ కనిపించలేదు నాకు.

"అర్థంకాలేదా?" అన్నట్లు నావంక చూసారు సుబ్బారావుగారు.

"ప్రైవేట్ హాస్పిటల్స్‌లోనూ, నర్సింగ్‌హోంలోనూ గ్లూకోజ్‌వల్ల చలి ఎందుకురాదో తెలుసా? అక్కడ కుక్కలూ గట్రా ఏవీ ఉండవు గనక" అన్నాడాయన తనేదో గొప్ప విషయాన్ని కనుకున్నట్టు.

మంచం క్రింది కుక్కకి, ఇంట్రా వీనస్ ఫ్లూయిడ్స్ వల్ల వచ్చే చలికీ ఏం సంబంధముందో ఎంత ఆలోచించినా అంతుపట్టలేదు నాకు.

"జంతువుల పైనుండి వచ్చే గాలి ద్వారా కలిగే ఎలర్జీతో అలా చలిరావడం జరుగుతుందన్నమాట. అందుకే నర్సింగ్ హోమ్స్‌లోకి కుక్కలూ తదితర జంతుజాలం రాకుండా నీట్‌గా ఉంచుతారు. అదే జనరల్ హాస్పిటల్స్‌లో తరచూ ఇలా గ్లూకోజ్ మూలాన చలిరావడం పరిశుభ్రత లేకపోవడం మూలానే. మీరా కుక్కని తరిమేసి సుబ్బరంగా డెట్టాల్ పెట్టి కడిగేయండి. చలి ఆగిపోతుంది" అన్నారు సుబ్బారావుగారు.

వెంటనే రాజు వాళ్ళ నాన్నగారు భార్యని కేకేసి కుక్కని తరిమేసి డెట్టాల్‌తో క్లీన్ చేయించారు. అసలే వచ్చేపోయే వారికి కాఫీలు, టిఫిన్లు అందించలేక సతమతమౌతున్న ఆవిడ ముక్కుతూ మూలుగుతూ వచ్చి క్లీన్‌చేసి వెళ్ళింది.

ఈ తతంగమంతా అయ్యేసరికి రాజు మరింత వణకడం మొదలెట్టాడు. ఇహ నేను వూరుకోలేక రామలింగరాజుగారు, సుబ్బారావుగారు వారిస్తున్నా వినకుండా నీడిల్ వాడి నేతిలోంచి లాగేసాను. నా బ్యాగ్ తెరిచి డిస్‌పోసబుల్ సిరింజితో ఒక ఆంప్యూల్ ఇంజెక్ట్ చేసిన అరగంటకు గానీ వాడి చలి ఆగలేదు.

ఈలోగా వాడి ఫ్రెండ్స్ కాబోలు, ఇద్దరు రాజుని పరామర్శించటానికి వచ్చారు. వాళ్ళలో ఒకతనికి హోమియోపతి కొద్దిగా తెలుసట.

"నిన్న రాత్రి మీరు క్షేమంగా ఇంటికెళ్ళారా?" అడిగాడు కండక్టర్ ఓ పాసింజర్ని.

"వెళ్ళాను. నీ కెందుకొచ్చిందా అనుమానం?"

"రాత్రి మీరెక్కిన ఖాళీ బస్‌లో ఇంకొక స్త్రీ ఎక్కితే మీరు లేచి సీట్ ఇచ్చి నుంచుంటే అనుమాన మొచ్చింది."

—గొల్లపూడి శైలజ, హైద్రాబాద్.

"ఈ క్రానిక్ జ్వరాలకి హోమియోని మించిందిలేదు. ఆర్సెనిక్ 200 గనక రోజుకొక డోస్ వేసుకుంటే టప్పున జ్వరం దిగిపోతుంది" అన్నాడతను రాజుతో.

"నా ప్రాణమే పోయేటట్టుంది ఇంకా సేపయితే" అన్నాడు రాజు నీరసంగా.

"నువ్వేమీ కంగారు పడకు. నేవెళ్ళి పేంక్రియాస్ టాబ్లెట్లు పంపిస్తా" అన్నారు సుబ్బారావుగారు గుమ్మంవైపు కదులుతూ.

"పోనీ మళ్ళీ హడావుడిరాజుకి కబురంపించమంటావా?" అడిగారు రామలింగరాజుగారు.

నేను నా బ్యాగ్‌లోనుండి స్టెత్ తీసి రాజుని ధరోగా ఎగ్జామ్‌చేసాను. ఒక టెంపరేచర్ తప్పితే మరేమీ అబ్‌నార్మాలిటీ కన్పించలేదు.

"ఒరేయ్ రాజూ, నేనొక సలహా ఇస్తాను పాటిస్తావా?"

"మరికొన్ని మందులు వేసుకోమనడం తప్పించి మరేదైనా చెప్పు పాటిస్తా" అన్నాడు రాజు.

"అబ్బే నేనూ అదే చెప్పబోతున్నా. నువ్వీక్షణంనుండీ ఏ మందూ వేసుకోకు" అన్నాను నేను.

"మరి జ్వరమెట్లా తగ్గేట్టు?"

"నా మాటమీద నమ్మకముంటే ఈ క్షణంనుండీ మందులన్నీ మానేయ్" రిపీట్ చేసాను. "నీ జ్వరం దానంతట అదేపోతుంది. మళ్ళీ నాకు ఎల్లుండి ఫోన్‌చేసి చెప్పు" అన్నాను నేను వెళ్ళడానికి ఉద్యుక్తున్నవుతూ.

"సరే" ఒప్పుకున్నాడు రాజు.

* * *

రెండురోజుల తరువాత రాజు ఫోన్ చేసాడు జ్వరం తగ్గిందంటూ.

"నాకు ముందే తెలుసు తగ్గుతుందని" చిన్నగా నవ్వుతూ అన్నాను.

"మందులు పూర్తిగా మానేసింతర్వాత జ్వరం తగ్గటమేమిటి? నాకేమీ అర్ధంకావటంలేదు, ఇంతకూ నాకొచ్చిన జ్వరం దేనివల్ల" అడిగాడు రాజు.

"డ్రగ్ ఫీవర్" అన్నాను.

తరచుగా వచ్చే వైరల్ ఫీవర్‌లాంటి జ్వరాలను మామూలు మందులతో తగ్గించటానికి బదులు రకరకాల ఏంటిబయాటిక్స్ వాడటంమూలాన కలిగే ఒక రకమైన వ్యాధి డ్రగ్ ఫీవర్. మందులన్నీ మానేస్తే కాని జ్వరం తగ్గదు ఈ వ్యాధి వచ్చిన వారికి-

అదే చెప్పాను వాడితో-


హడావుడిరాజు, సుబ్బారావు, ఇంకా అతని ఫ్రెండ్స్ తలొకరకంగా సజెస్ట్ చేసి ఇచ్చిన మందుల మూలాన వచ్చిన డ్రగ్‌ఫీవర్ మందులన్నీ మానేస్తేగానీ తగ్గలేదన్నమాట. ఈమాటే అంటే అన్నాడు రాజు.

"మరి వీళ్ళంతా పూర్తి నాలెడ్జిలేకుండా ట్రీట్‌మెంట్ ఎందుకు చేస్తారంటావ్?"

"నీకొక సంగతి తెలుసా? ప్రపంచంలో అన్ని వృత్తులలోనూ ఎక్కువమంది ప్రాక్టీస్‌చేసే వృత్తి వైద్యం. ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో స్వంతానికో లేక మరొకరికో ఏదో ఒక రకమైన వైద్యాన్ని సజెస్ట్ చేస్తూనే ఉంటారు. దీనివల్ల అప్పుడప్పుడూ ఇలాంటి ఫలితాలు తప్పవు" అన్నాను నేను.

"చెప్పడం మరిచాను. నీరసంగా ఉంటోంది కదాఅని నిన్నటినుండీ అవేవో వెల్లుల్లిపాయల మాత్రలట ఒంటికి మంచిదని అమ్మ చెబితే వేసుకుంటున్నాను. ఫర్లేదంటావా?" అడిగాడు రాజు.

తల పట్టుకొని కుర్చీలో కూలబడిపోయాను నేను.



చాంపేయ మాల

విజయేంద్ర ముందుకు వచ్చి ఎలా డైలాగు పలకాలో, ఎక్కడ పదం విరచాలో, ఎక్కడ ఒత్తి చెప్పాలో చెప్పాడు స్వయంగా.

భావపూరితంగా, ఆవేశం కసీ నిలువెల్లా రగులుతున్న శ్రామికుడిగా చాలా చక్కగా చెప్పాడు విజయేంద్ర డైలాగ్. అతడే గనుక హీరో అయ్యుంటే ఆ డైలాగ్‌కు చిల్లరకాసులు గాల్లోకి ఎగిరేవి థియేటర్లో! కానీ అతడికి హీరోకాదగ్గ పర్సనాలిటీ లేదు.

"లైట్‌బాయ్! నువ్వు ఇంకొంచెం ముందుకురా! కళ్ళు క్లియర్‌గా కవర్ కావాలని చెప్పానుగా!"

కె.ఉషారాణి



జరిగిన కథ

ఎన్నో ఆదర్శభావాలు అభ్యుదయభావాలు కలబోసుకుని సినీ రంగప్రవేశం చేసిన సుధాంశ తన స్థానం సుస్థిరం సమున్నతం చేసుకుందుకు అందరూ నడిచిన పంథాలో నడవక తప్పలేదు.

పిల్లలపై సినిమాల చెడు ప్రభావం పడుతుందని సుధాంశ భార్య పిల్లలతో సహా పుట్టింటికి వెళ్ళిపోతుంది. హీరో విష్ణు ఒక డైలాగ్‌ని చాలాసార్లు తప్పుచెప్తూ కోపంగా వుంటాడు. ఇక చదవండి

తిలక్ తలవూపి మరింత ముందుకి వచ్చాడు.

విష్ణు ముఖంలో స్పష్టంగా బయటపడుతోంది విసుగు. కాదూ మరి. మధ్యాహ్నంనించీ మరో పిక్చరుకు డబ్బింగ్ చెప్పాలి. మధ్యాహ్నందాకా ఈ సెట్లోనే గడిచిపోతే, ఇక అక్కడ వర్క్ ఎలా?

హీరోగారికి త్వరగా ముగించి బయటపడాలన్న ఆరాటం.

దర్శకుడికి తీస్తున్న సీన్ పర్‌ఫెక్ట్‌గా రావాలన్న తపన.

విజయేంద్రకు చాలాకాలం తర్వాత వచ్చిన అవకాశం ఆ పిక్చరు. ఏదో లాగించేస్తే ఆ తర్వాత తను మిగలడు. అందుకే పట్టుదలగా వున్నాడు.

విష్ణుకున్న స్థానబలిమికొద్దీ అతడ్ని ఒక్కసీనులో అంతంతసేపు ఏ డైరక్టరూ నిలపడు. అతడికున్న ఇమేజి ఇలాంటిది. అతడు గొప్పగా నటించక్కర్లేదు అభిమానులకు. అతడెలా నటించినా అదే గొప్ప.

ఉత్తర దక్షిణ ధృవాల్లాంటి వాళ్ళిద్దర్నీ కలిపి నిలిపిన నిర్మాతమాత్రం ఈ గొడవేమీ పట్టించుకోకుండా హోటల్ గదిలో ఎంజాయ్ చేస్తున్నాడు.

విష్ణుకు కోపం వచ్చేస్తూ వుందన్న విషయం గ్రహించేసిన మేకప్‌మన్ ప్రక్కనేవున్న ట్రాలీ పుల్లర్‌తో గుసగుసలాడాడు.

"హీరోగారికి కోపం వచ్చిందిరా! ఎవరికో మూడింది."

ఆ మూడటం ఎవరికి అన్నదే ఇక్కడ ప్రశ్న.

దర్శకుడా- కాదు, అతడు చిత్రానికి ప్రాణంపోసే బ్రహ్మ. అతడితో తగాదాపడడు హీరో.

నిర్మాతా- కానేకాదు. హీరో అడిగినంత డబ్బూ అరచేతుల్లో పొదివిపట్టి అందించే కల్పవృక్షం అతడు. అతడ్నెప్పుడూ కసిరికొట్టడు.

కెమెరామన్‌తోనా- అసలే కాదు. వాళ్ళతో ఏదైనా గొడవపడితే....ఆ కసి మనసులో పెట్టుకుని ముఖం చెడగొట్టి పారేస్తాడు. భవిష్యత్తును మొత్తం బూడిద చెయ్యగల భస్మాసుర హస్తం అతడి చేతిలో కెమెరా. అతడ్నేమీ అనడానికి వీల్లేదు. అతడు కూడా.

మరి హీరోగారి కోపానికి గురై నిలిచే అర్భకుడు ఎవరని?

ఉంటాడు.


ఏ ట్రాలీపుల్లరో, మరే లైట్‌బాయో! ఇంకే వాటర్‌బాయో.... ఎవడికో మూడుతోంది.

"లైట్సాఫ్, స్టార్ట్ కెమెరా, యాక్షన్" విజయేంద్ర కంఠం ఖంగుమంది.

సీన్ నెం 13, షాట్ నెం 3, టేక్ నం 13....

విష్ణు ముఖం అప్పటికే విసుగుతో ఎర్రబడిందేమో, కోపం ముంచుకొచ్చి మరింత కందిపోయింది.

"న్యాయం వుందీ వుందీ అంటూ న్యాయాన్ని మా కందిస్తామంటూ గొంతు చించుకుని..."



డైలాగ్ తప్పిపోయిన కోపం పగిల్లి బ్రద్దలైంది.

"యూ, బాస్టర్డ్...." విష్ణు విసిరికొట్టిన డైలాగ్ షీట్ తిలక్ చేతిలో లైటుకు తగిలి భళ్ళున పగిలింది.

"కళ్ళలోకి ఫోకస్ చేస్తావేం, చూసుకోనక్కర్లేదు?" విష్ణు తిలక్‌ని నానా మాటలూ అంటూంటే అందరూ చూస్తున్నారు. ఒక్కరూ అతడ్ని అదేమని అడిగినవాళ్ళు లేరు.

హీరోగారి మనసు క్షుణ్ణంగా చదవగల అసిస్టెంటు పరిస్థితి వెంటనే గ్రహించేశాడు.

"పే....క....ప్!" ఒక్క కేకతో కొన్ని గంటలపాటూ పడ్డశ్రమ ఏ మాత్రమూ ఫలితానికి రానిదైంది.

విష్ణు చరచరా వెళ్ళిపోతూంటే అతడ్నేమీ అనలేక తిలక్‌ను కొరకొరా చూసి పోయాడు డైరెక్టరు విజయేంద్ర.

సెట్‌లో మిగిలినవాళ్ళు తిలక్‌ని కోపంగా చూడ్డంలేదు. వాళ్ళ చూపుల్లోని సానుభూతి మరీ భరించరానిదై తలదించేసుకుని ప్రక్కకు నడిచాడు తిలక్.

* * * *

"వాడి ఖర్మ బాగోలేక వాడలా లైట్‌స్టాండూ, రిఫ్లెక్టరూ పట్టుకుని తిరుగుతున్నాడు కానీ.... వాడే అదృష్టవంతుడయితే ఈపాటికి ఏ. ఒన్ హీరో అయ్యేవాడు. అసలు ఈ ఫీల్డులోకి రావడం హీరో అవుదామనే సార్!"

రత్నం చెప్తున్నది వింటూ భోంచేస్తున్న సుధాంశ నవ్వాడు.

"ఈ ఫీల్డులోకి వచ్చే ప్రతి ఒక్కరూ హీరోలవుదామనే వస్తారు రత్నం! ఎవ్వరూ క్లాప్‌బాయ్‌గానో, ట్రాలీపుల్లర్‌గానో స్థిరపడాలనుకోరు."

"అందరి విషయమూ నేను చెప్పడం లేదు సార్! తిలక్ మాటే, వాడు ఏ హీరోగారి అబ్బాయో, నిర్మాతకు ముద్దులకొడుకో అయ్యుంటే.... వాడి దశ ఎంత గొప్పగా వుండేదో! పాపం, పిచ్చివెధవ అకారణంగా అందరిలో అవమానం పాలయ్యాడు."

"ఊఁ. కాసిన్ని మంచినీళ్ళివ్వు."

"నేను చెప్తున్నానని కాదు కావాలంటే మీరే తిలక్‌ని పిలిచి ఓసారి చూడండి. వాడిలో ఎంత టాలెంట్ వుందో."

"చూద్దాంలే, ఖాళీ వున్నప్పుడు గుర్తుచెయ్" సుధాంశ మాటలు త్రుంచేశాడు. "మళ్ళీ మూడుగంటలకి కదూ షూటింగ్. అప్పటిదాకా నన్ను విసిగించకు" రెస్ట్‌రూంలోకి పోబోతున్న సుధాంశను మెల్లిగా పిలిచాడు రత్నం.

"సార్! మరీ.... మరీ ..."

"ఏమిటీ, మీ కుర్రాడు.... అదే ఆ తిలక్ మాటేగా, చూద్దాం అన్నాగా."

"అదికాదు సార్!" రత్నం నీళ్ళు నములుతూ విషయం బయటపెట్టాడు. "నాకు ఓ వారంరోజులు సెలవిప్పిస్తే...."

"సెలవా, వారంరోజులా?" సుధాంశ చిరాగ్గా అన్నాడు. "నీకు మతిగానీ పోయిందా ఏం? వారంరోజులు నువ్వు రానంటే...."

"మీ వర్క్‌కేమీ పర్వాలేదు సార్! మా అబ్బాయి వుంటాడు ఈ వారంరోజులూ. వాడికన్నీ చెప్పిపెట్టాను. మా చెల్లెలు కొడుకు పెళ్ళి సార్! పోకపోతే ఇంటిమీదకు యుద్ధానికొస్తుందది."

"పెళ్ళికి వారంరోజు లెందుకయ్యా?"

"వారం కాకపోతే....నాలుగు రోజులు....సార్! సార్! ఈ ఒక్కసారికే...."

సుధాంశ ఆలోచనలోపడ్డాడు. రత్నం ఈ ఆరేళ్ళలో ఎప్పుడూ ఇలా సెలవడగలేదు. పాపం, ఎంత అవసరమో!

"సరేలే, వెళ్ళు. నాలుగురోజుల్లో వచ్చేయి. మీ అబ్బాయి వస్తాడన్నావు ఎవరూ?"

"అబ్బాయంటే మా ఇంటిప్రక్కే వుంటాడు సార్! అదే ఇందాక నేను చెప్పలా.... తిలక్."

"ఎవరో ఒకరు, కాస్త జాగ్రత్తగా వుండమను. నువ్వుమాత్రం త్వరగా వచ్చెయ్." సుధాంశ జేబులోంచి రెండు వంద కాగితాలు తీశాడు. "ఇదిగో, పెళ్ళికి వెళ్తున్నావుగా, ఖర్చుకుంచుకో!"

"థాంక్‌యూ సార్! థాంక్‌యూ". రత్నం సంతోషంగా అందుకున్నాడు.

* * * *

'ఇది తొలి రాత్రి'

బ్యానర్ గాలికి రెపరెపలాడుతోంది. పెద్ద కటవుట్ ఆకర్షణీయంగా

మెరుస్తోంది.

'మహిళా ప్రేక్షకుల నీరాజనాలందుకుంటున్న గొప్ప కుటుంబ కథాచిత్రం'

రేడియోలో విని విని విసుగెత్తిన ప్రకటన ఆ పేరు చూడగానే మరోసారి చెవుల్లో గింగురుమంది.

"ఇదేమిటండీ! ఈ సినిమాకి వచ్చాం." కంపరంగా పాత పోస్టర్ పైనుంచి చూపులు తిప్పుకుంది. "లవకుశో, మూగమనసులో చూస్తే బావుండదూ?"

"అబ్బ మమ్మీ! నీదంతా ఓల్డ్ టేస్ట్. ఈ పిక్చర్ ఎంత బావుందను కున్నావ్. "వనజవైపు చూసి అదోలా నవ్వాడు రమాకాంత్.

"ఔను గోమతీ! ఈ సినిమా చాలా బావుండబట్టే అమ్మాయి నాలుగు సార్లూ. అబ్బాయి పదకొండుసార్లూ చూశారు. మనం ఇంత మంచి సినిమా కనీసం ఒక్కసారన్నా చూడకపోతే ఎలా? పైగా ఆడవాళ్ళు మళ్ళీ మళ్ళీ చూస్తున్నారంట. నీకు నచ్చుతుందేమోలే!"

వినోద్ టికెట్స్ పట్టుకురావడంతో లోపలకు నడిచారు.

అప్పటికే ముప్పాతిక భాగంపైగా నిండింది హాలు. ఏదో పాట వినిపిస్తుంది పాట.... అంటే అందులో సాహిత్యం పాలు ఏమీలేదు. అప్పుడప్పుడూ వినిపించే మూలుగులూ, కెవ్వుకెవ్వున అరుపులూ.... ఒకటే డ్రమ్స్ మోత—

వినోద్ హుషారుగా తల్లివంక చూశాడు.

"మమ్మీ! సినిమాలో ఈ పాట వచ్చినపుడు ఆడియన్స్ చూడు ఎంత జోరెక్కిపోతారో!"

గోమతి అర్థంకానిదానిలా రమాకాంత్‌వైపు చూడబోయింది. అతడు ఆమె



చూపుల కందకుండా ముఖం తిప్పుకున్నాడు.

ఎలాగైతేనేం సినిమా ప్రారంభం అయ్యింది. సెన్సార్ సర్టిఫికెట్ చూపించిన వెంటనే.... గుండెలు బద్దలయ్యేలా వినిపించిన చప్పుడు.

తెరపై వర్షం పడుతోంది. ఉరుములూ, మెరుపులూ, పిడుగులూ.... మహా భయంకరమైన వర్షంలో ఓ కారు.... అటూ ఇటూ ఊగిపోతూ వస్తోంది.

ఆ కారును వెంబడిస్తూ ఓ పది గుర్రాలు. గుర్రాలమీద మనుష్యులు. వాళ్ళ చేతుల్లో తుపాకీలు, ఒరల్లో మెరుస్తున్న కత్తులూ....

జానపదమో, సాంఘికమో అర్థంకాని సందిగ్ధావస్థ ఆరంభంలోనే ఏర్పడింది.

గోమతికి అనలే బి.పి. ఆ శబ్దాలూ, ఆ భయంకరమైన సీనూ.... కొంచెం ప్రక్కకు జరిగి వనజ చెయ్యి పట్టుకుంది గుబులుగుబులుగా.

వనజ అప్పటికి ఐదోసారి చూడ్డం ఐనా.... అదే మొదటిసారిలా కళ్ళు పెద్దవిచేసి చూస్తోంది. తల్లి చేతిని విదిలించుకుంటూ "ష్! వుండు మమ్మీ!" అంది.

కార్లో ఇద్దరు వ్యక్తులు. అందులో వెనకసీట్లో కూర్చున్న అతన్ని దిగిపొమ్మంటూ బలవంత పెడ్తున్నాడు డ్రైవరు. వెనకనుంచీ చీకట్లో, వర్షంలోనూ గురితప్పకుండా తగులుతూ కారు అద్దాలను బద్దలుగొడుతున్న తుపాకీ తూటాలు.

చివరకు ఎలాగైతేనేం.... వెనక వ్యక్తి కారు దిగేశాడు, చంకలో ఓ బ్రీఫ్ కేసు ఇరికించుకుని ప్రక్కగా వున్న పొదల్లోకి పరుగుతీశాడు.

అతడలా వెళ్ళడం ఆలస్యం ఇలా కారుని చుట్టాయి గుర్రాలు.

పొదల్లో పరుగుతీస్తున్న వ్యక్తి ఓ చావుకేక విని అరక్షణం పాటూ పరుగు ఆపాడు. అతడి ముఖం పైకి ఫోకస్ చెయ్యబడ్డ లైటువెలుగులో మెరుస్తున్న కంటి తడి.

అప్పుడు మొదలయ్యాయి టైటిల్స్.

రమాకాంత్ తలతిప్పి గోమతిని చూశాడు.

కుర్చీలో ఓ మూలగా ఒదిగి భయంభయంగా తెరవైపు చూస్తోంది.

రమాకాంత్ నవ్వుకున్నాడు. "పిచ్చి గోమతీ! ఇన్నాళ్ళుగా ఈ తరం సినిమాలకి దూరంగా వున్నావు. ఇప్పుడు బాగా చూడు. ఎలాంటి సినిమాలు మన పిల్లలు పదేపదే చూడాలనుకుంటున్నారో నువ్వూ చూసి తెలుసుకో!" అనుకున్నాడు.

టైటిల్స్ ముగిసి సినిమా మొదలయ్యింది. అందరూ పద్దెనిమిది, ఇరవై ఏళ్ళ లోపువాళ్ళే ఆడపిల్లలు ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారు. తెల్లటి నిక్కర్లూ, షర్టులూ వేసుకున్న ఆడాళ్ళ శరీరంపైన కెమెరా యధేచ్ఛగా ఫుట్‌బాల్ ఆడుతోంది.

రకరకాల యాంగిల్స్‌లో ఫుట్‌బాల్ ఆట చూపించారు కాసేపు.

హీరోయిన్ విసురుగా కాలితో తన్నిన బాల్ గాల్లో ఎగురుతూ, ఎగురుతూ....

పోయి హీరోగారు మేడమీద ఎక్సర్‌సైజ్ చేస్తూంటే అతగాడి తలపైన పడింది.

ఇక మొదలు. హీరోగారు మేడమీదనుంచీ ఒక్క డైవ్‌తో ఆడపిల్లల పార్కులో వాలాడు.

అప్పుడు అభిమానుల ఈలలూ, చప్పట్లూ....

"ఏయ్, మా బాల్ మాకిచ్చెయ్."

"అబ్బ, ఎంత బావుందో ఈ బాల్ గుండ్రంగా, మెత్తగా...."

హీరోగారి చూపులన్నీ మరోచోట. మాటమాటకీ మరో అర్థం దాచుకుని....

"ఏం మీ దగ్గర ఇంకా బాల్స్ వుంటాయిగా.... ఈ ఒక్క బాల్ నాకిస్తే మీదేం పోతుంది?"

వెకిలిగా నవ్వుతూ మెలికలు తిరుగుతున్న హీరో కమెడియన్‌కన్నా అధ్వాన్నంగా వున్నాడు.

రమాకాంత్ పైకి లేచాడు. అతడికి కూర్చో బుద్ధిపుట్టడం లేదు.

అందర్నీ దాటివస్తోంటే.... ఇంకా ఎక్కువగా వినిపిస్తున్న కేకలూ, విజిల్స్.

"ఇంకే అద్భుతమైన డైలాగులు అప్పజెప్తున్నాడో హీరో!"

రమాకాంత్ సిగరెట్ వెలిగించుకున్నాడు.

'లోపల గోమతి సినిమాని భరిస్తూ వుంటుంది.' దాదాపు పది, పన్నెండు నిముషాలు తీరిగ్గా సిగరెట్ కాల్చుకుని లోపలకు వెళ్తే....

తెరమీదంతా దుఃఖమయం. థియేటర్లో కూడా ఎందరో రసహృదయులు కరిగి నీరవుతున్నట్టుగా.... ముక్కు ఎగబీల్చుకుంటున్న చప్పుళ్ళు.

రమాకాంత్ వెదుక్కుంటూ వెళ్ళి సీట్లో కూలబడ్డాడు.

"ఇదే నాయనా! నీకు యుక్తవయసు వచ్చేదాకా ఈ విషయం చెప్పకూడదని మీ నాన్న ఒట్టు వేయించుకున్నారు. అందుకే ఇన్నాళ్ళూ దాచాను. ఇప్పుడు నా బాధ్యత తీరింది. ఇక నీ ఇష్టం. ఎలా ఆ దుర్మార్గుల ఆట కట్టిస్తావో, ఎలా నీ ఆస్తి రక్షించుకుంటావో...." మాట సగంలోనే ఆగింది. ఆ పాత్రను సాగనంపేశాడు దర్శకుడు.

"అమ్మా! అమ్మా!" పెడబొబ్బలు పెడుతూ దుఃఖించాడు కథానాయకుడు. "అమ్మా! అమ్మా! నీ కోరిక తీరుస్తాను. ఆ దుండగుల భరతం పడ్తాను నీ ఆత్మకూ, నా తండ్రి ఆత్మకూ శాంతి చేకూరుస్తాను."

వెనక విపరీతమైన శబ్దాలతో మ్రోగుతున్న వాయిద్యాల సాయంతో భీమ ప్రతిజ్ఞను, భీష్మ ప్రతిజ్ఞను మించిన ప్రతిజ్ఞ చేశాడు నాయకుడు.

మ్యూజిక్.... గుండెలు బద్దలుకొట్టే శబ్దాలు.... సీను మారింది. హీరోగారి గెటప్ మారింది.

రేసుగుర్రంలా ఎత్తుగా బలంగా వున్న ఓ మాంఛి గుర్రంపై బయల్దేరారు హీరోగారు.

మళ్ళీ జనం అరుపులూ, ఆనందం....

రమాకాంత్ చెయ్యిమీద గిల్లింది గోమతి.

"ఏమండీ! ఈ శబ్దాలకు గుండెదడ వచ్చేలా వుంది. వెళ్ళిపోదామండీ!"

"మధ్యలో ఎలా వెళ్తావ్! పూర్తిగా చూడు."

తెరమీది డ్యూయెట్ నాయికా నాయకుల ప్రణయంలాకాక పరుగుపందెంలా వుంది.

రమాకాంత్ వినోద్‌వైపు చూశాడు. తల్లీ, తండ్రి వున్నారు కాబట్టి నిగ్రహించుకున్నాడు కానీ.... లేకపోతే అతనూ ఈలలువేసి గోలచేసేవాడే!

అసంబద్ధమైన సంభాషణలతో, అసహజమైన సన్నివేశాలతో సినిమా నడుస్తోంది.

చిత్రం ఎక్కడంటే.... సినిమాలో నాయకుడి ప్రతి మాటా, ప్రతి కదలికా ప్రేక్షకుల హర్షధ్వానాలతో అందుకుంటోంది.

రమాకాంత్‌కి ఆశ్చర్యంగా వుంది. ప్రేక్షకుల అభిరుచే నిజంగా మారిపోయిందా. లేక నేటి మేటి దర్శక శిఖామణులు వాళ్ళనీ స్థాయికి దిగజార్చారా?

ఇంటర్వెల్‌దాకా నడిచిన సినిమాలో రెండు ఫైట్సూ, రెండు డ్యూయట్లూ, మూడు పేథటిక్ సీన్స్ తప్ప ఏమీ లేదు.

రమాకాంత్ గోమతిని నవ్వుతూ అడిగాడు.

"ఎలాగుంది సినిమా?"

అభిప్రాయం చెప్పడం కూడా అనవసరం అన్నట్టుగా నీరసంగా వెనక్కివాలి కళ్ళు మూసుకుంది ఆమె.

మళ్ళీ మొదలైంది సినిమా.

ఎక్కడ్నించి ఊడిపడిందో ఓ వృద్ధమాత.... 'నేను నీ తల్లిని నాయనా!' అంటూ హీరోని పట్టుకుని బోరుమంటోంది.

ఊహించని మలుపులతో, ఊపిరాడని వేగంతో నడుస్తోంది కథ.

ఆఖర్న పే...ద్ద పోట్లాట. కొండలు, గుట్టలు, రైళ్ళు, కార్లు, జీపు, గుర్రాలు.... అన్నీ ఎక్కి కొట్టుకున్నారు విలన్, హీరో. చిట్టచివరకు విలన్ ఛావుతో దుష్టశిక్షణ అమలుపరచి హీరో పేరుని సార్థకం చేసుకున్నాడు నాయకుడు.

మళ్ళీ 'ఎప్పుడో చూపించిన సీను. హీరోయిన్ హీరోగారితో కలగన్న ప్రణయ సన్నివేశం.

'ఇది తొలి రాత్రి' అన్న పాటను ఆఖరుగావేసి సినిమా పేరు మరోసారి గుర్తుచేశారు.

ఎ ఫిల్మ్ బై సుధాంశ.

చివర్లో తెర నలంకరించిన అక్షరాలు.

రమాకాంత్ నిర్లిప్తంగా, నిర్వేదంగా నవ్వుకున్నాడు.

* * * *

"తిలక్! ఎనీ స్పెషల్ లెటర్స్?" రాత్రి పడుకోబోయే ముందు రొటీన్‌గా రత్నం నడిగే ప్రశ్న అది. రత్నం ఇన్విటేషన్స్ లాంటివి తప్ప అతడి దృష్టికి రాడు. అభిమానుల ప్రశంసలకూ, విమర్శించేవారి ఉత్తరాలకూ.... అతడే సమాధానాలు రాసేస్తాడు సుధాంశ లెటర్‌హెడ్ మీద. తిలక్‌కు సుధాంశ కాల్‌షీట్లూ, వర్కింగ్ స్పాట్లూ చెప్పాడే తప్ప ఈ ఉత్తరాల గొడవ మర్చిపోయాడు రత్నం. అందుకే తిలక్.... రెండు ఉత్తరాలు సుధాంశ కందించాడు.

అందులో ఒకటి ఓపెన్ చెయ్యలేదు. అది నిర్మల వ్రాసింది.

రెండోది తెరిచి వుంది.

"నాకొచ్చే ఉత్తరాలకు నువ్వే సమాధానం వ్రాయాలి. రత్నం చెప్పలేదా?"

"మామూలుగా వున్నవాటికి రాశాను సార్! ఇది మీరు చూస్తే.... ఏం రిప్లయ్ రాయాలో చెప్తే బావుంటుందని...." తిలక్ మధ్యలోనే ఆగిపోయాడు.

"ఓ.కె. ఉదయం చెప్తానులే. అన్నట్టు రత్నం ఎప్పుడు వస్తున్నాడో తెలిసిందా?"

"ఇంకో రెండు రోజులు పట్టచ్చు సార్!"

"ఊఁ. నువ్వెళ్ళు. చాలా పొద్దుపోయిందికదూ?" సుధాంశ బెడ్‌రూంలోకి వెళ్ళిపోయాడు.

విశ్రాంతిగా పక్కమీద వాలి ముందు నిర్మల ఉత్తరం చదివాడు.

అంతా మామూలే! పిల్లలూ, తనూ బావున్నారు. ఇప్పట్లో రాదలచుకోలేదు.

సుధాంశ ముఖం చిట్లించి ఉత్తరం ప్రక్కకు పడేసి రెండో ఉత్తరం తెరిచాడు.

సుధాంశగారూ!

నమస్తే!

గుర్తున్నానా సార్? నేను రమాకాంత్‌ని. ఆగష్టు 8వ తారీఖు, సాయంత్రం షో మొదలుపెట్టే వేళ, అలంకార్ టాకీసు.... మీ మొదటి పిక్చరు రిలీజయిన నాలుగోరోజు....

ఆరోజు వర్షం కూడా పడుతోంది. అప్పుడు కలిశాం మనం.

ఏం సార్, గుర్తుకొచ్చానా? ఐనా అప్పుడు నా కెదురైన సుధాంశ కొత్తగా దర్శకుడి హోదాలో అడుగుపెట్టాడు, మరిప్పుడో.... హిట్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకుని ఏటా నాలుగైదు విజయవంతమయిన చిత్రాలు ఆంధ్ర ప్రేక్షకులకు అందిస్తున్నవాడు.

ఆనాటి మీరు మీకు గుర్తులేకపోయినా నాకు గుర్తున్నారు. మిమ్మల్ని మీకొక్కసారి గుర్తుచేద్దామనే ఈ చిన్ని ప్రయత్నం.

సుధాంశగారూ! ఏమిటండీ ఇది? ఏమైపోతున్నారు మీరు రోజురోజుకీ? మొట్టమొదటి చిత్రంలోనే మహోన్నతమయిన దర్శకత్వ ప్రతిభను చూపిన మీరు ఇలా మారిపోయారెందుకని?

ఆకాశంనుండీ క్రిందకు జారిన సలలిత గంగా ప్రవాహం పరమ పావనుడైన ఈశ్వరుని శిరస్సు నధిరోహించిందట.... ఆ ఘనత చాలక.... శీతల సుమ హిమ శిఖరారోహణం చేసి.... తనను తాను మరచిన వేగంతో భూతలంపై పయనించి.... మరీ ఉన్మత్తురాలై పాతాళ ప్రవేశం చేసిందట.

అలాగుంది మీ ఉనికి కూడా! ప్రతి చిత్రంలోనూ ప్రతిభకు మెరుగులు దిద్దేందుకు మారుగా మరింత దిగజారుతూ....

ఎందుకు సార్ ఈ మార్పు? ఇదంతా వ్యాపార దృక్పథంతో మీరుచేస్తున్న కళాసేవ కదూ?

సార్! సుధాంశగారూ! నేలబారు జనం కోసం సినిమాలు తీసే దర్శకులు చాలామంది కొల్లలుగా వున్నారు. మీలాంటి ప్రతిభావంతులు కూడా అదే దోరణిలో పడిపోతే.... మాలాంటి కళాతృష్ణగలవాళ్ళ గతి ఏమిటి?

పాత చిత్రాలలోని ఘనతను, గొప్పతనాన్ని తలుచుకుని మురిసిపోవడమే మావంతు చెయ్యకండి.

ప్లీజ్, ఇప్పటికైనా మీలో వున్న సృజనాత్మకతను తట్టి లేపండి.

చిత్రాల సంఖ్యను పెంచే ప్రయత్నం వద్దు సుధాంశగారూ! చిత్రాల ఖ్యాతిని పెంచే ప్రయత్నం చెయ్యండి.

కళామతల్లికి సుందరమయిన అలంకారాలు చెయ్యండి సార్! అసహ్యంగా రంగులు పులిమి ఆమెను వికృతంగా మార్చకండి!

అతిచనువు తీసుకున్నానంటూ ఆగ్రహించినా పర్వాలేదు. ఒక్కసారి ఆలోచించండి.

—రమాకాంత్.

సుధాంశకు నిద్ర ఎప్పుడో తేలిపోయింది. పెదవులు తడి ఆరిపోతున్నట్టుగా, దాహంతో గొంతుక ఎండిపోతున్నట్టుగా....

గ్లాస్ జార్ ఎత్తి గటగటా సగంపైగా నీళ్ళు తాగేశాడు.

'చిత్రాల సంఖ్యను పెంచే ప్రయత్నం వద్దు సుధాంశగారూ! చిత్రాల ఖ్యాతిని పెంచండి.'

కళామతల్లికి సుందరమయిన అలంకారాలు చెయ్యండి సార్! అసహ్యంగా రంగులు పులమకండి.'

రమాకాంత్ ఎదురుగా నిలబడి దీనంగా అడుగుతున్నట్టుగానే వుంది.

(సశేషం)

ఈ నెల అత్యుత్తమ అబద్ధం పోటీ

మొదటి అత్యుత్తమ అబద్ధం

రూ॥ 100-

ఇటీవల ఒక పరిశీలనలో దూరదర్శన్ ప్రసారములో అధికార పార్టీకన్న ప్రతిపక్షాలకే ఎక్కువసేపు ప్రాధాన్యత ఇచ్చినట్లు వెల్లడి అయినది. —హెచ్. కె. ఎల్. భగత్ ప్రకటన. (9-10-88 ఈనాడు)

సత్యనారాయణ పండా
కాశీబుగ్గ

రెండవ అత్యుత్తమ అబద్ధం

రూ॥ 75/-

"మన విద్యావిధానం దివ్యంగా ఉంది" —ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీ నవనీతరావు. (18.11-88 స్వాతి వీక్లీ ఇంటర్వ్యూలో)

జె. వి. సుధాకర్
హైదరాబాద్

మూడవ అత్యుత్తమ అబద్ధం

రూ॥ 50/-

గుప్తుల కాలంనాటి స్వర్ణయుగాన్ని ఇప్పుడు శ్రీ రామారావుగారు మన రాష్ట్రానికి అందిస్తున్నారు. —శ్రీ గాలి ముద్దుకృష్ణమనాయుడు (ఉదయం డైలీ 1.11.88)

కె. విజయలక్ష్మి
నంద్యాల

ఇతర ఉత్తమ అబద్ధాలు

"నేను కవితలు వ్రాస్తాననే ఆవిడ నన్ను ప్రేమించి పెళ్ళిచేసుకుంటానంటోంది."

వి. జగదీశ్వరరావు
విశాఖపట్నం

నా పర్యటన ఓట్లుకోసం కాదు. —ముద్రగడ పద్మనాభం (11-11-88 ఉదయం డైలీ)

రాబోయే ఎన్నికల కోసం మా పథకాలనే కాపీకొట్టి కాంగ్రెసు 8 సూత్రాల పథకం తయారుచేసింది. —ఎన్.టి.ఆర్. (10-11-88 ఆంధ్రజ్యోతి దినపత్రిక)


"పోలీసుస్టేషనుకు వచ్చిన అందరిని నిందుతులుగా కాక సోదరులుగా చూడడాన్ని పోలీసులు అలవరచుకోవాలి" —కోడెల శివప్రసాదరావు (5-11-88 ఆంధ్రజ్యోతి డైలీ)

అభిమానులతో ఓరోజు సరదాగా గడుపుతాను. —సినీనటుడు సుమన్ (6 నవంబర్ 88 భూమి ఆదివారం అనుబంధంలో)

కె. వి. మధుసూదనరావు
కాకినాడ

ఆరోగ్యం బాగాలేని నా భక్తుల్ని చేతితో ముట్టుకుంటే జబ్బు నయమై పోతుంది. నేను రాళ్ళు తింటాను. ఈ సమాజానికి నా జీవితమే ఒక సందేశం. —నగ్న సన్యాసిని మంగమ్మవ్వ (1-11-88 ఆంధ్రపత్రిక డైలీ)

సుర్రా నూకేశ్వరరావు
అనకాపల్లి



ఉత్ప్రేరకాలు నేను తీసుకోలేదు. నేను అమాయకుడిని. —బెన్ జాన్సన్ (4-11-88 స్వాతి వీక్లి)

పీలా నాగేశ్వరరావు
అనకాపల్లి

"నా పెళ్ళయినాక ఆర్టిస్టుగానూ, వ్యక్తిగతంగానూ మెరుగుదలను పిలవు తున్నాను" —జయప్రద (ఆంధ్రప్రభ డైలీ 20 అక్టోబర్ 1988)

"తెలుగుదేశం పార్టీ అధికారంలోనికి వచ్చిననాటినుంచి ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రంలో ఏర్పడలేదు" —మాజీ ముఖ్యమంత్రి శ్రీ కోట్ల విజయభాస్కర్ రెడ్డి (ఆంధ్రభూమి డైలీ 19 అక్టోబర్ 1988)

యస్. రవి
మసీద్‌వీధి

"సత్యభామలో స్వాతిశయం, అందం సమపాళ్ళలో ఉన్నాయి. అవి నాలోనూ వున్నాయని నా నమ్మకం. అవిగాక ఆ పాత్రలో నేను లీనమై నటిస్తాను" —సినీనటి జమున (సితార 10-16 డిసెంబర్ 88)

డి. వి. యస్. రాజు
తూరంగి

ఆర్థిక సహాయాన్ని అందించే విషయంలో ఏ రాష్ట్రంపట్ల కేంద్ర ప్రభుత్వం పక్షపాతం కనబరచడం లేదు. —కేంద్ర ఆర్థికమంత్రి ఎస్. బి. చవాన్ (26-10-88 ఉదయం దినపత్రిక) ఉమామహేశ్వరరావు పాలకొల్లు.



అభినందన



జ్యోతి వెలిగించి సభను ప్రారంభిస్తున్న శ్రీ మురళీమోహన్

రాష్ట్రంలోని సుప్రసిద్ధ సాంస్కృతిక సంస్థ "అభినందన" వారు ప్రతి సంవత్సరం సాహితీ, సాంస్కృతిక, చిత్ర రంగాలలో మహామహులైన కీ॥ శే॥ల పేరిట అవార్డులు నెలకొల్పి, వాటిని అవే రంగాలలో సుప్రసిద్ధులైన సమకాలీనులకు ఇవ్వటం జరుగుతోంది. అలాగే ఈ సంవత్సరం కూడా ఈ అవార్డులను అక్టోబరు 25వ తారీఖున హైదరాబాదులోని త్యాగరాయ గానసభలో కన్నులపండుగగా జరిగిన ఓ సభలో బహూకరించారు. అహ్లాదకరమైన వాతావరణంలో అనేక మంది కళాభిమానుల మధ్య జరిగిన ఈ సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ శ్రీమతి కుముద్‌బెన్ జోషి విచ్చేశారు. కళాబంధు శ్రీ టి. సుబ్బిరామిరెడ్డి సభకు అధ్యక్షత వహించారు.



సుప్రసిద్ధ సంపాదకులు కీ॥ శే॥ ముట్నూరి కృష్ణారావు స్మారక అవార్డును జ్యోతి మాసపత్రిక సంపాదకురాలు శ్రీమతి లీలావతి రాఘవయ్యకు అందజేస్తున్న గవర్నర్



సుప్రసిద్ధ నటులు కీ॥ శే॥ చిత్తూరు నాగయ్య స్మారక అవార్డును శ్రీ గుమ్మడికి అందజేస్తున్న గ[illegible]

తలుపు చప్పుడయ్యేటప్పటికి తలెత్తి చూశాను. అంతే! అలా చూస్తూ వుండిపోయాను. ఆశ్చర్యం, ఆనందం నా కనుబొమలు ముడివడ్డాయ్. ఎవరీ అపరిచిత వ్యక్తి? నాతో ఈమెకు ఏం పని? ఇంతకుముందెవ్వరైనా చూశానా? ఏమో చూసినట్లే అనిపిస్తోంది? ఎక్కడ? ఎప్పుడు? అన్నీ ప్రశ్నలే? నాకు తెలియకుండానే చిరునవ్వు నవ్వాను.

"నమస్కారం! లోపలికి రావచ్చా?" నేనింకా ఆశ్చర్యంలోనే వున్నాను. ఎంత చనువుగా మాట్లాడుతోంది. నేను బాగా తెలుసా? ఆ! రండి. అంటూ కుర్చీలోంచి లేచి ఫోల్డింగ్ చెయిర్ వేసి 'కూర్చోండి', అన్నాను మర్యాదగా. నవ్వుతూ వచ్చి కూర్చుంది. నేను ఇంకా నిలబడే వున్నాను. 'అరె! నిలబడి వున్నారే! కూర్చోండి' అంది తను. మంత్రముగ్ధుడిలా కూర్చున్నాను. ఇంకా ఆ అమ్మాయినే చూస్తున్నాను. ఆమెకు క్రేపీ తెలియదు. నా కుర్చీపక్కన వుంచిన కాగితాలవైపు నిశితంగా చూస్తూ "ఏమిటి రాస్తున్నారు? కధా?" నేను కూడా వాటివైపు చూసి, చిన్నగా నవ్వి

రామకృష్ణ
స్పందన

'ఏదో సరదాగా అప్పుడప్పుడూ వ్రాస్తూ వుంటాను' అన్నాను. 'పాడుతూ కూడా వుంటారట కదా?' అనడిగింది. ఎవరు చెప్పారీమెకు? ఏమిటిలా చకచకా అడిగేస్తోంది? ఒక అమ్మాయి తనెవరో తెలియదు., అయినా ఎప్పటినుండో పరిచయం వున్నదానిలా మాట్లాడుతోంది. తనేమో సమాధానాలు ఇస్తున్నాడు. తనకుమాత్రం అ అమ్మాయిని ఎక్కడో చూసినట్లుగా అనిపిస్తోంది. కానీ ఎక్కడ? అది తెలియకే ఇంతసేపూ సందిగ్ధం.

ఆలోచనలోంచి తేరుకొని 'నేను మిమ్మల్ని ఎక్కడో కలిశాను. కానీ ఎక్కడో గుర్తురావడం లేదు అన్నాను.

'నన్నా! ఇంతకుముందు కలిశారా? ఎక్కడ! లేదు' అని ఖచ్చితంగా చెప్పింది. కానీ నాకు నమ్మబుద్ధికావటం లేదు. లేదు! ఎక్కడో చూశాను. ఆ కళ్ళు, ఆ నవ్వు,



మాట్లాడే తీరు. నాకు చిరపరిచితంగా అనిపిస్తోంది. కాసేపు తనే అదీ.... ఇదీ.... మాట్లాడింది. వస్తానండీ! అంటూ వెళ్ళిపోయింది. నేనింకా ఆలోచనలోనే వున్నాను. నేను ఆలోచనలోంచి తేరుకొని నవ్వుతూ లేచేప్పటికే తను వెళ్ళిపోయింది.

* * *

తెల్లవారుఝాము మూడు గంటలకు ఎందుకో మెలకువ వచ్చింది. అక్కణ్ణించి మళ్ళీ ఆలోచన ఆ అమ్మాయి వైపుకు మళ్ళింది. ఆ అమ్మాయిని ఎక్కడ చూశాను? అలా ఎంతసేపు ఆలోచించానో తెలియదు. చటుక్కున జ్ఞాపకం వచ్చింది. నాకు ఇంక నవ్వు ఆగలేదు పెద్దగా నవ్వేశాను. నాకు 'జూహీచావ్లా' (హిందీ సినిమా నటి) బాగా తెలుసా? కలిశాను కూడానా? ఆ! అమ్మాయితో ఇలే వాదించానే, ఇంతకు ముందు మిమ్మల్ని చూశానని. నాకు ఎందుకలా అనిపించింది? పోనీ నేను ఆ సినీయాక్టర్ని చూసింది కూడా ఒకే ఒక్కసారి. అదీ ఎప్పుడో చాలా నెలల క్రితం. అయినా ఎందుకిలా అనిపించింది. మళ్ళీ నవ్వొచ్చింది. రేపు ఆ అమ్మాయితో ఈ విషయం చెప్పాలి. ఏమనుకుంటుంది? అమ్మో! ప్రతీ అబ్బాయీ అమ్మాయిని వల్లో వేసుకో

డానికి చేసే పొగడ్త అనుకుంటుందా? 'షటప్' అన్నా ఆశ్చర్యపోనక్కరలేదు. నాకు ఆ విషయం బయటపెట్టడానికి ధైర్యం చాల్లేదు.

* * *

తెల్లవారిపోయింది. ఆలోచనలన్నీ ఆ అమ్మాయిచుట్టూ తిరుగుతున్నాయ్. గబగబ మొహం కడుక్కొని, షేవ్ చేసుకొని, స్నానం కూడా కానిచ్చేసి, డ్రెస్ తగిలించేసుకొని బయట ఏ హోటల్లోనో టిఫిన్ కొట్టేసి ఆఫీసు కెళ్ళ[illegible] అంతా రెడీ అయ్యి తలుపు తెరిచేప్పటికి ఎదురుగ్గా ఆ అమ్మాయి. నా ఆనందం వర్ణనాతీతం అయ్యింది. 'గుడ్ మార్నింగ్' ఏమిటి అప్పుడే ఆఫీసుకి వెళ్ళిపోతున్నారా? అడిగింది. నా ఆనందం బాపతు ఆలోచనలోంచి ఇంకా నేను బయటికి రాలేదు. రావాలని కూడా లేదు నాకు. 'ఏమ్మల్నే! అప్పుడే ఆఫీసుకి వెళ్ళిపోతున్నారా?' మళ్ళీ అదే ప్రశ్న. అవునండి. ఏ హోటల్లోనో టిఫిన్ తిని, 'అటునుండి అటే ఆఫీసుకి వెళ్తాను' అన్నాను. 'సరే అయితే' అంటూ చకచకా మెట్లుదిగి వెళ్ళిపోయింది. నేను రూం లాక్ చేసి కిందికి వచ్చాను. గేటు దాటబోతూంటే వినిపించింది. 'త్వరగా వస్తారా?' అని. అది నేను ఊహించనిది, చటుక్కున వెనక్కి తిరిగాను కానీ సమాధానం చెప్పడానికి, కాస్త తడబడ్డాను. కానీ ఆ విషయం బయట పడకుండా- ఆః వచ్చేస్తాను.... వచ్చేస్తాను.... అంటూ రెండు అడుగులు వెనక్కి వేసి ముందుకు కదిలాను.

* * *

మళ్ళీ ఆఫీసులో అవే ఆలోచనలు. "ఎందుకు ఆ అమ్మాయి నాతో మాట్లాడటానికి అంత ఆసక్తి చూపుతోంది? తను ఎవరితోనైనా అలాగే మాట్లాడుతుందా? నా అంతరాత్మ అందుకు అంగీకరించలేదు. "లేదు అందరితో అలా మాట్లాడదు. అలా మాట్లాడకుండా వుంటే బావుణ్ణు[illegible] దురాశ. మనస్సు పనిమీద లగ్న[illegible]మవటంలేదు. నా అంతరాత్మ హెచ్చరిస్తోంది "ఏం! ఏమిటా ఆలోచనలు. ఏదో మాట్లాడినంతమాత్రాన నువ్వు ఏమిటేమిటో వూహించేసుకొని ఊహాలోకంలో విహరిస్తున్నావ్. తర్వాత బాధపడతావ్. బాధపడతావ్. అంటోంది.

నిజంగా బాధపడాల్సొస్తుందా? అదే నిజమైతే నేను తట్టుకోగల్నా? లేనిపోని ఆశలు పెట్టుకుంటున్నానా? వద్దు తరువాత వచ్చే పరిణామాలకు తట్టుకోలేను. ఇప్పుడే మనస్సును కంట్రోల్ చేసుకోవటం మంచిది. అనుకున్నాను. అలా అనుకొని ఓ క్షణం కూడా కాలేదు. "త్వరగా వచ్చేస్తారా?" అన్న ఆ అమ్మాయి మాటలు రింగురింగున చెవిలో తిరుగుతున్నాయి. ఇలా నాకూ నా అంతరాత్మకు ఘర్షణ జరుగుతోంది. ఆఫీసుటైం అయిపోయింది. మామూలుగా అయితే ఏకంగా రాత్రి భోజనం కానిచ్చి ఏ తొమ్మిదిగంటలకో రూముకి వెళ్ళేవాణ్ణి. కానీ ఈ రోజు అలా కాదే. "త్వరగా వచ్చేస్తారా?" అన్న ఆ అమ్మాయి మాటలు మనస్సును తొలిచేస్తుంటే ఎలా ఆగగలను. గబగబ రూముకి వచ్చేశాను. నా కోసం ఎదురుచూస్తూ వుంటుంది అనుకున్న నాకు ఘోరంగా నిరాశ ఎదురైంది. తను కనిపించలేదు. ధైర్యంచేసి మా యింటి ఓనరుగారి ఇంటి తలుపు తట్టాను. ఆమె బయటికి వచ్చారు. ఎలా మాట్లాడటం మొదలుపెట్టాలి. 'నాకు ఏమైనా లెటర్స్ వచ్చాయాండీ!' ఏదో ఒకటి అడగాలిగా! అడిగేశాను. ఆమె నవ్వుతూ "లేదు బాబూ!" ఏం ఏమైనా రావాల్సినవి వున్నాయా? అనడిగారు. మాటలు పెంచడానికి అవకాశం దొరికింది. "అవునండీ. అసలు ఎప్పుడో రావల్సింది. ఇంకా రాలేదూ అంటే- ఈ పోస్టల్‌వాళ్ళమీద అస్సలు నమ్మకం లేకుండా పోతోంది." ఇదంతా ఏదో మాటలు పెంచాలనే తప్ప.... వచ్చే లెటరూ లేదు.... పోయే లెటరూ లేదు. అలా మరికాసేపు పనికిమాలిన కబుర్లు చెప్పి.... ఇక లాభం లేదని ధైర్యం చేసి- "మీ ఇంటికి ఎవరో బంధువులు వచ్చినట్టున్నారు కదండీ" అన్నాను. ఇక వూసగుచ్చినట్టు విషయాలన్నీ చెప్తుందికదా అని ఎదురుచూసిన నాకు నిరాశ మిగిలింది. "బంధువులా.... ఎక్కడ.... ఎవరూ రాలేదే. అనేశారామె. ఇంకెలా విషయం రాబట్టటం. ఇక లాభంలేదు. డైరెక్ట్ ఎటాక్ చెయ్యక తప్పదని నిశ్చయించుకొని- "బంధువులు అంటే చాలామంది అని కాదండీ. ఎవరో బంధువుల 'అమ్మాయి' వచ్చినట్టుంది కదా!" అన్నాను. అప్పుడామె చిన్నగా నవ్వి, అదా! ఆ అమ్మాయి నాకు మనుమరాలు. మద్రాసులో వుంటారు వాళ్ళు. ఫ్రెండ్స్‌తో



ఎక్స్‌కర్షన్‌కని వచ్చిందట. చూసి వెళ్దామని నా దగ్గరకొచ్చింది. ఈరోజు వెళిపోతుంది. అన్నారామె- అంతే మెదడు మొద్దుబారింది.... గుండెను ఎవరో పిండినట్లుగా అయ్యింది. చాలా ఎత్తునుంచి అగాధంలో పడిపోయినట్లుగా అనిపించింది. ఇంక అక్కడ వుండలేకపోయాను. ఏడవలేక నవ్వినట్లుగా నవ్వి.. నా రూముకెళ్ళి అలాగే కుర్చీలో కూర్చుండిపోయాను. మనసంతా చిరాకుగా అయిపోయింది. [illegible] నన్ను నేను మర్చిపోయాను. నా అంతరాత్మ నామీద జాలిపడింది. "నేను ముందే చెప్పానుకదః అలా ఆశలు పెంచుకొని ఊహల్లో విహరించొద్దనీ.... అయిందేదో అయింది. జరిగింది మర్చిపో" అని ఓదార్చబోయింది. నాకు వుక్రోషం వచ్చింది.... అభిమానం దెబ్బతింది.... రెండు చేతుల్తో జుట్టుపట్టుకొని వున్నదిలా "నో" అని గట్టిగా అరిచాను. బయటికి కాదు మనస్సులో. అలా ఎంతసేపు వున్నానో తెలీదు. "ఏమిటి

అలా కూర్చున్నారు? ఎంతసేపైంది వచ్చి?" అన్న ప్రశ్నకు కళ్ళు తెరిచి చూశాను. ఎదురుగా నవ్వుతూ ఆ అమ్మాయి. సంతోషం రాబోయింది కానీ వెంటనే గుర్తొచ్చింది. ఆమె వెళి పోతున్న సంగతి. పేలవంగా నవ్వాను. ఆ అమ్మాయితో మాట్లాడాలనీ వుంది. కానీ మాట్లాడితే బాధ మిగుల్తుందని తెలుసు. చెప్పలేనంత కోపం వచ్చింది ఆ అమ్మాయిమీద. ఎందుకు నాతో మాట్లాడాలి. నన్ను వూహాలోకంలో విహరించేట్టు ఎందుకు చెయ్యాలి. ఒక్క రోజు వుండి వెళ్ళేదానికి నాతో మాట్లా డక పోతేనేం. నా వుక్రోషం ఇలా ఆలోచింపజేస్తూంటే....। "ఏం! మాట్లాడి నంత మాత్రాన నువ్వెందుకు ఆశలు పెంచుకోవాలి...." అని దుయ్యబట్టింది నా అంతరాత్మ.

రండి! కూర్చోండి! చాలాసేపైంది వచ్చి! సమాధానమైతే చెప్పానుగానీ.... మాటలో జీవంలేదు. నా గొంతు నాకే కొత్తగా వినిపించింది. "సారీ అండీ. ఈ రోజు మేము మద్రాస్ తిరిగి వెళ్ళి పోతున్నాం.టిక్కెట్ల రిజర్వేషన్ సంగతి తెల్సుకుందామని వెళ్ళాను. తీరా వెళ్ళిం తర్వాత గుర్తొచ్చింది మీతో చెప్పలేదని వెంటనే వచ్చాను" అంది. ఆ మాట నాకు అమృతం కురిసినట్లుగా అనిపిం చింది. ఇందాకటి నిరాశ పటాపంచ లైంది. మళ్ళీ సంతోషం హద్దులు దాటింది. నాకోసం మళ్ళీ వచ్చిందన్న ఆనందం నన్ను వెర్రివాణ్ణి చేసింది. గతం పూర్తిగా మర్చిపోయి సంతో షంగా కబుర్లు చెప్పుకున్నాం. నేను ఏవైతే చెప్పాలనుకున్నానో అన్నీ చెప్పేశాను. ఆఖరుకు "జూహీచావ్లా" విషయం కూడా. ఆ మాట అన్నప్పుడు కొద్దిగా సిగ్గుపడింది. కానీ నేనను కున్నట్లు 'షటప్' అని మాత్రం అన లేదు. నేను చెప్పాలనుకున్నది చెప్పే శాను. మనస్సు ప్రశాంతంగా వుంది. కొంతసేపటికి తనే అడిగింది, "ఇంతకీ నా పేరు తెలుసా?" అని. "ఏమిటి" అన్నాను. "మాధురి" అంది.... తను ఒకసారే అని వుంటుంది కానీ నాకు మాత్రం అనేకసార్లు అన్నట్లుగా విని పించింది.

వాచీవంక చూసుకొని "ట్రెయిన్ టైమయ్యింది. నేను వెళ్తాను" అంటూ లేచింది. నేనూ లేచాను.

గుమ్మంవరకూ వెళ్ళి.... "స్టేషన్ వరకూ వచ్చి నాకు సెన్డాఫ్ యివ్వరా? అంది. నా మనసు ఆనందంతో వుక్కిరి బిక్కిరి అవుతోంది. "తప్పకుండా" అంటూ బయలుదేరాను.

* * *

స్టేషన్‌లో తన ఫ్రెండ్స్ ఎదురు చూస్తూ వున్నారు. ట్రెయిన్ కదల బోతోంది. గబగబ తను ఎక్కేసింది. నేను కన్నార్పకుండా అలా చూస్తూ వుండిపోయాను. తను చెయ్యి వూపుతోంది. నేనూ చెయ్యి వూపాను నా ప్రమేయం లేకుండానే. ఆనందం లేదు. ఉత్సాహం లేదు. నిస్తేజంగా వుంది నా ముఖం. ట్రెయిన్ స్పీడు అందుకుంది."మాధురి" నాకు దూరంగా.. చాలా దూరంగా..వెళ్ళిపోయింది. మళ్ళీ నాకు కనిపిస్తుందా?..ఏమో....!!

ఆమె + అతడు = మనిషి

సీతాయల్

"యువతకు మీరేదయినా స్ఫూర్తినిచ్చే విషయాలు చెప్పండి" అని కోరారు అక్కడివాళ్ళు.

"నేనా?... నేనేం చెప్పగలను. మీలోనే ఎవరైనా మాట్లాడండి."

తప్పదని పట్టుబట్టడంతో—

"నేనుగా ఏమీ చెప్పలేను కాని ఈ సందర్భంలో స్వామి వివేకానంద యువతకిచ్చిన పిలుపుని మీకు చెప్తాను."

ప్రియమైన యువకులారా!

మీలో అంతర్లీనంగా అద్భుత శక్తిసామర్థ్యాలున్నాయి. మీరు చేయవల్సిందల్లా మీపై మీరు అపారమైన నమ్మకం కలిగి ఉండటమే. ప్రతిక్షణం నిర్భయంగా నిర్భీతిగా జీవించండి. ధీరత్వాన్ని ప్రదర్శించండి.

ప్రపంచం మిమ్మల్ని పిలుస్తూంది. ఉత్సాహం ఉరకలువేసే యువశక్తి కోసం. యువరక్తం కోసం నిరీక్షిస్తోంది.

నీ గురించి నువ్వు తక్కువగా అంచనా వేసుకోవడంకంటే ఘోరమైన పాపం మరొకటిలేదు. ఎప్పుడూ నీ గురించి ఉన్నతంగా ఆలోచించు. ఉన్నతమైన ఆశయాలను ఏర్పరుచుకో. వాటి సాధనకోసం అహర్నిశలు శ్రమించండి. ఏ దశలోనూ మీపై మీకున్న నమ్మకాన్ని చెదరనీయకండి. ఈ విశ్వంలో దేనినైనా కఠోర పరిశ్రమతో సాధించుకునే ప్రతిభా పాటవాలు, నిరాశ నిస్పృహలు బయటకు దూసుకు వస్తాయి. అంచేత నా కోరిక ఒక్కటే. భయాన్ని దరిచేరనీయకండి. ఎలాంటి సమయంలోనైనా తట్టుకొని నిలబడగల్గే గుండె నిబ్బరాన్ని ఏర్పర్చుకోండి.

సంపత్‌నారాయణ్ పొన్నూరి

జరిగిన కథ:

నలుగురు యువకులను కమ్యూనిజం పుస్తకాలు వున్నాయంటూ అరెస్టుచేస్తే- వాళ్ళ తరపున వాదించి వాళ్ళని విడుదల చేయిస్తాడు లాయర్ హరీష్. ఇక చదవండి



బూజుపట్టిన మూఢనమ్మకాలను పట్టుకొని వేలాడకండి. సూర్యకాంతిలా దూసుకుని వచ్చే నూతనభావాలకు స్వాగతం చెప్పేందుకు సంసిద్ధంగా ఉండండి.

—స్వామి వివేకానంద

"కనుక మీ యువత వివేకానంద చెప్పిన విషయాల్ని మీలో జీర్ణింపచేసుకోవాలి. మీ యువతే నేటి సంఘానికి మూలస్తంభాలు" చెప్పి, చివరగా "జైహింద్" అంటూ తన ఉపన్యాసం ముగించాడు. ఆ ప్రాంతమంతా కరతాళధ్వనులతో హోరుతో మారుమ్రోగింది.

వాళ్ళతోపాటు డిన్నర్ తీసుకొని ఇంటికి బయల్దేరిన హరీష్‌కి సెండాఫ్ చెప్పడానికి వాళ్ళంతా స్కూటర్‌దాకా వచ్చారు.

స్కూటర్ స్టార్ట్ చెయ్యబోతుండగా "సార్...." అంటూ ఓ కవరు అందించాడు కిరణ్.

ఏమిటి? అన్నట్లు కనుబొమ్మలు ముడిపడ్డాయి హరీష్‌కి.

చూశాడు. లోపల కొంత డబ్బు వుంది.

"ఎందుకీ డబ్బు?"

"మీ ఫీజు సార్."

అతనన్నాడు నవ్వుతూ "నా ఫీజు ఎంతో తెలుసా? అసలు నీకు."

"తెల్సు సార్ మీరు ఎక్కువగా డిమాండ్ చేస్తారని, కానీ కొందరికి నార్మల్‌గా తీసుకుంటారని తెల్సు అందుకే అది...."

అతను చెప్పడం ఆగిపోయాడు.

దగ్గరకు రమ్మని చెప్పి సున్నితంగా చెంపమీద తట్టి డబ్బు కవర్ని తిరిగి ఇచ్చేస్తూ "దీన్ని ఏదైనా మంచికి ఉపయోగించండి. వస్తాను" గేరు మార్చబోయాడు.

అప్పుడన్నాడో యువకుడు "సార్ మీరు మాతో ఒకళ్ళుకావడం మాకు చాలా ఆనందంగా ఉంది సార్" అని.

"ఓకే.... వస్తాను" అందరూ ఉత్సాహంగా అతనికి సెండాఫ్ చెప్పారు.

రివ్వున వీచిన చల్లటిగాలితోపాటు టప....టపా....మని చినుకులు పడ్డాయి. ఆకాశం వంక చూసి క్లచ్ వదిలాడు.

* * * *

స్కూటర్ హారన్ విన్న సుబ్బులు పరిగెత్తుకుంటూ వచ్చి గేటు తీశాడు.

అప్పటికే పూర్తిగా తడిసిపోయాడు. అయినా అతను వర్షంలో తడిచానే అనే ధ్యాసలేదు.

"అయ్యగారు భోజనం వడ్డించమంటారా?"

"వద్దురా.... నేను చేశాను."

అతను బట్టలు మార్చుకొని తల తుడుచుకుంటున్నాడు.



వాల్ క్లాక్ పదిగంటలు కొట్టింది.

ఉరుములు మెరుపుల్తో వర్షం కూడా ఎక్కువైంది.

* * * *

వరండా బైట మెట్లమీద గడ్డంక్రింద చెయ్యేసుకుని కూర్చున్న అతని చేతిలో సిగరెట్టు కాలుతూంది. నైట్ డ్రస్సులో ఉన్నాడు. మెట్ల ముందున్న వర్షం నీళ్ళలో వర్షం నీటి చినుకులు పడీపడటంతోటే నీళ్ళలో రింగ్ ఆకృతి ఏర్పడి మరుక్షణం నీళ్ళలో కలిసిపోతున్నాయి. అతనూ చాలా సేపట్నించి వర్షాన్ని చూస్తున్నాడు. వర్షానికి తలలు వాల్చి వూగుతున్న చెట్లమధ్య గిరజాల జుట్టు వ్యక్తి. బుట్ట జాకెట్టుతో ఉన్న స్త్రీ, అతని చేతిలో ఆమె చెయ్యి. ఆమె అతని చెయ్యి పట్టుకుని వర్షంకి చెయ్యి అడ్డు పెట్టుకుని త్రుళ్ళి త్రుళ్ళి నవ్వుతూ మాట్లాడుతోంది. ఆమె నవ్వుకి ముత్యాల్లాంటి పళ్ళు మెరుస్తున్నాయి. పైట కొంచెం జారి వుంది. పట్టించుకోలేదు ఆమె. అతని సముఖంలో ఆమె సర్వం మర్చిపోయినట్లుగా ఆనందడోలికల్లో ఊయల ఊగుతోంది. అతని చూపుల్లో ఆమె దేవత. చటుక్కునో మెరుపు మెరిసింది. అంతకుముందు వరకూ అతను చూస్తున్న దృశ్యం చెదిరిపోయింది. ఊహలోంచి వాస్తవంలోకి వచ్చిపడ్డాడు. అప్పటివరకూ కల్పిస్తున్న సన్నజాజి లతలు ముద్దమందారాలుపోయి. ఉమ్మెత్తులు, జిల్లేళ్ళ గోచరించాయి అతనికి. "చుప్" అని నిట్టూర్చాడు. వర్షానికి కాలనీ అంతా నద్దు మణిగిపోయింది. అతని కంటికి మాత్రం నిద్ర రావడంలేదు. సిగరెట్టుమీద సిగరెట్టు అలా తగలబడిపోతునే ఉన్నాయి. గార్డెన్‌లో ఉన్న నియోన్‌లైటు వెలుతుర్లో మొక్కల ఆకులమీద నీటి చుక్కల మెరుస్తున్నాయి. "ఏయి గౌరమ్మ

ఏంటి వగలగొడ్తున్నావు" వినిపించడంతో ప్రక్కకి తిరిగి చూశాడు. బల్లమీద పడుకున్న సుబ్బులు నిద్రలో కలవరిస్తున్నాడు. నవ్వుకుని మళ్ళీ గార్డెన్ వైపు దృష్టి సారించాడు. అక్కడ్నించి మెట్లముందు వర్షం నీళ్ళమీదకు మారింది. అతనేదో ఆలోచనల్లో వున్నాడు. అవి తెగడం లేదు. ఆలోచనల్తోపాటు ఏవో ఊహలు ఆ ఊహలు రూపాలుగా మారుతున్నాయి. ఎవరో పిల్లాడు వర్షంలో ఆడుతున్నాడు, ఆకాశం వంక చూస్తూ చేతులుచాచి "అల్లిబిల్లి" అంటూ తిరుగుతున్నాడు. అంతలో ఎవరో ఆడపిల్ల వచ్చింది. ఇద్దరూ చేతులు- చేతులు పుచ్చుకుని 'అల్లిబిల్లి అంటూ తిరుగుతున్నారు.

వేళ్ళ మధ్య సిగరెట్టు చురుక్కుమని వాటేసింది. గతంలోంచి భవిష్యత్తులోకి ఊహల్లోంచి వాస్తవంలోకి- వచ్చిపడి సిగరెట్టు కాలిన వేళ్ళవంక చూసుకున్నాడు. అతని పెదాలపై దరహాసం కదిలింది.

* * * *

సిటీలో పేరున్న క్రిమినల్ లాయర్ కృష్ణమోహన్‌గారివద్ద జూనియర్‌గా పని చేసేవాడు. సీనియర్ లాయర్ ఓరోజు చూడు హరీష్! నీతో మాట్లాడాలి కూర్చో" అన్నాడు. ఎదుట సీటు చూపిస్తూ.

సిగరెట్టుని యాష్‌ట్రేలో దులుపుతూ "నా దగ్గర జూనియర్స్‌గా పనిచేయడానికి చాలామంది వచ్చారు. కొంతకాలం ఉండి వేరే ప్రాక్టీసు పెట్టుకుంటామని వెళ్ళిపోయేవాళ్ళు. కానీ నేనుగా ఎవ్వరినీ నీ కొచ్చిన అనుభవం చాలు సొంతంగా ప్రాక్టీసు చేసుకో అని ఎవ్వరితోనూ చెప్పలేదు. ఆ విషయం నీకు చెపుతున్నాను. నా దగ్గర పని చేసిన ఈ సంవత్సరం అనుభవంతో నీ తెలివితేటలు నన్నెంతో ఆకర్షించాయి. నీకు ఈ అనుభవం చాలు అందుకని" అంటూ చేతిలో సిగరెట్టుని యాష్‌ట్రేలో వేసి" నువ్వు వేరే ప్రాక్టీసు పెట్టుకో, నీ సమయస్ఫూర్తిని వినియోగించుకోడం నా కిష్టంలేదు ఏమంటావ్" అంటూ ముగించారాయన.

సార్! నాకు సంపాయించాలనే ఆలోచనలేదు. మీకేం అభ్యంతరం లేకపోతే ఇంక కొంతకాలం మీ దగ్గరే వుండాలని వుంది.

"అభ్యంతరమా! నీ భవిష్యత్తుని దృష్టిలో వుంచుకుని నీకా సలహా ఇచ్చాను అంతేకాని మరొకటి కాదు."

"సార్" చెప్పాడు హరీష్——

"——నామీద మీకున్న అభిమానానికి కృతజ్ఞుణ్ని——" "మరో విషయం. నేను ఈ మాట అడుగుతున్నందుకు నువ్వు మరోలా అర్థం చేసుకోవద్దు. నీది మాది ఒకేశాఖ అందుకని" అంటూ ఆగిపోయారాయన.

"ఆc.....అందుకని ఏమిటి సార్ మీరేదో చెప్పడానికి సంశయిస్తున్నారు ఫరవాలేదు చెప్పండి" అంటూ ఆయన చెప్పబోయేదానికి కోపరేషన్ ఇచ్చారు.

ఆయన పేపర్ వెయిట్‌ని టేబుల్‌మీద సున్నితంగా తిప్పుతూ "మా



కా_్రికను నీ కిద్దామని ఆలోచన. కట్నం విషయంలో నీకు లోటు చేయము. 'చేసుకు తీరాలి' అనే కండిషన్ ఏమీలేదు. చేసుకోమని అభ్యర్థిస్తున్నాను. మిగతా విషయాలు మీ తాతగారితో మాట్లాడుతాను" అంటూ పేపర్ వెయిట్‌ని ప్రక్కన పెట్టారు.

హరీష్ పెదాలపై చిరునవ్వు మెరిసిపోయింది.

"సార్! నాకు పెళ్ళి చేసుకోవాలనే తలంపే లేదు. మీమాట కాదంటున్నందుకు క్షమించండి."

"ఈ విషయంలో క్షమాపణకు తావులేదు. కానీ నువ్వు యిష్టపడితే అంతకుమించి మాకు వేరే ఆనందం ఏమీ వుండదు" ఆయన మాటల్లో కొంచెం విషాదం తొంగి చూస్తూంది.

అక్కడ్నించి తను వెల్తున్నట్లు చెప్పి ఎదురు గుమ్మంనుంచి బైటకి వస్తూ కుడివైపు గుమ్మం ప్రక్కన డోర్ కర్టెన్ వెనుక ఎవరో నిలబడినట్లు, కాలివేళ్ళకు గోరింటాకుబట్టి ఆ నిలబడింది స్త్రీ అని గ్రహించాడు. కాని ఆ విషయానికి అంతగా ప్రాముఖ్యత ఇవ్వలేదు తను.

కొంతకాలం గడిచాక తనంతట తానుగా వేరే ప్రాక్టీసు పెట్టుకుంటాననే ఉద్దేశ్యం సీనియర్ ముందు వెలిబుచ్చాడు. అందుకాయన హర్షం ప్రకటించి తనకు తెలిసిన క్లయింట్స్‌కి హరీష్ పేరు సిఫారసు చేసి హరీష్ వృత్తిలో పైకి రావడానికి సహకరించాడు. తీసుకున్న కేసులు తక్కువే అయినా అన్నింటిలో విజయం సాధించాడు. హరీష్ అంటే మేజిస్ట్రేట్స్‌కి సదభిప్రాయం. కొన్ని సంచలనాత్మకమైన... పరమైన కేసుల్లో కృషిచేసి విజయం సాధించాడు.

• • •

ఆ రోజు ఆదివారం.

సాయంత్రం అయిదు గంటలవుతుండగా హరీష్ స్కూటర్ కాలనీలోంచి మెయిన్‌రోడ్డెక్కి కారల్‌మార్క్స్ రోడ్ చౌరస్తా దగ్గరనుంచి కుడివైపుకి తిరిగి రయీస్ కెనాల్ బ్రిడ్జి దాటి తాలూకా ఆఫీసు ముందునుంచి గవర్నమెంటు హాస్పిటల్ మీదుగా లోబ్రిడ్జిలోకి వచ్చింది. రోడ్డంతా వర్షపు నీటితో ట్రాఫిక్ జామయిపోయింది. నీళ్ళలోంచి అవతలవైపు కెనాల్ రోడ్డుమీదకు వెళ్ళేసరికి పదినిమిషాలు పట్టింది. అక్కడ్నించి ప్రకాశం బ్యారేజీమీదకు పోనిచ్చి ఎడమచేతివైపుకి ప్రక్కకి తిప్పి కృష్ణవేణి మందిరానికి ఒకప్రక్కగా స్కూటర్‌ని స్టాండ్ వేశాడు.

మొహంమీద పడిన వెంట్రుకల్ని సరిచేసుకుంటూ కృష్ణవేణి మందిరం ప్రక్కన వున్న కట్టడంమీద చేతిగుడ్డ పరిచి కూర్చున్నాడు. కృష్ణానది వుధృతంగా ప్రవహిస్తోంది. జాలర్లు బోటుమీద చేపలు పడుతున్నారు. (జాలర్లనే పురాణాల్లో గంగపుత్రులంటారు) అనకట్ట ప్రక్కనున్న కరంటు స్తంభాలమీద కొంగలు గుంపులుగుంపులుగా కూర్చున్నాయి తినుబండారాలమ్మేవారి సందడి ఎక్కువగా వుంది.

'బండ వెధవ' ఏటిమీదకు చూస్తున్న అతను ఉలిక్కిపడి విస్మయంగా ఆ పిలుపు విన్పించినవైపుకి చూశాడు. ఓ నాలుగేళ్ళ పిల్లాడు మందిరం ప్రక్కనున్న నంది విగ్రహం ఎక్కడానికి ప్రయత్నిస్తూ విగ్రహం పట్టుకుని పాకుతున్నాడు. ఆ పిల్లాడు చేసే ప్రయత్నం అవుతూ 'బండ వెధవా' అని మరోసారి అంది ఆమె. ఆ పిల్లాడు నంది విగ్రహం పట్టుకుని రానని మొండికేస్తున్నాడు. ఆమె సున్నితంగా నవ్వుతూ బుగ్గలు చిదిమి పిల్లాడ్ని చేతుల్లోకి తీసుకొని ముందుకి సాగిపోయింది. ఆ బిడ్డపట్ల, తల్లి మమకారాన్ని, ఆప్యాయతలు చూసిన అతని హృదయం పులకించి అనిర్వచనీయమైన అనుభూతి చెంది రెక్కలు చాచి ఆకాశానికి ఎగిసిన అతని మనస్సు, మరుక్షణం అంబరంనుండి ఘట్టుతప్పి పాతాళానికి జారిపోయింది. అతని వదనంలో విషాదఛాయలు తొంగిచూశాయి. మనస్సు మూలిగింది. తనముందు ఎవరో నిలబడినట్లయి కల్పనాజగత్తునుండి వాస్తవంలోకి వచ్చాడు.

"బాబూ! ప్రొద్దుటినుంచి అన్నం తినలేదు ధర్మం చెయ్యండి" అంటూ చెయ్యి ముందుకి చాపి నిల్చుంది. పది సంవత్సరాలకంటే ఎక్కువలేని అమ్మాయి, సుమారు ఐదు సంవత్సరాల అబ్బాయి చెయ్యిపట్టుకుని.

ఆ యిద్దరినీ పరీక్షగా చూశాడు. తైలసంస్కారంలేక చింపిరిగా వున్న తలలు, అతుకులమయంగా వున్న గౌను, బొడ్డుక్రిందకు జారిపోయిన నిక్కరుతో వళ్ళంతా మట్టికొట్టుకుపోయి, చీమిడితో ఎండిపోయిన ముక్కు ఇంకా పరీక్షగా గమనిస్తే చూడలేకుండా వున్న వాళ్ళ రూపాలు చూస్తుంటే శ్రీశ్రీ మహాప్రస్థానం గుర్తొచ్చింది అతనికి.



"దీనులారా! హీనులారా!
కూడులేని గూడులేని
పశులారా భిక్షులారా!!

ఆలోచిస్తుండగా దృష్టి మరలిందతనికి. దుర్గగుడిమీద దేదీప్యమానంగా లైట్లు వెలుగుతున్నాయి. ఘాట్‌రోడ్డు మీదనుంచి వాహనాలు పైకిపోతున్నాయి.

అమ్మవారి వైభవాన్ని చూసి నిత్యం ధూప, దీపారాధన చేయడానికి ఎంతో మంది భక్తులు వస్తారు. కనీసం అమ్మవారైనా వాళ్ళకు కన్పించి 'నాకు పెట్టే నైవేద్యం చిక్కిశల్యమైన బ్రతికివున్న శవాలకు పెట్టండి. నా చుట్టూ వెలిగించే ఒక్కో ప్రమిద చీకటి దెయ్యం ఆవహించిన గుడిసెలలో వెలిగించండి' అని చెప్పదు!

"వీళ్ళెలా జీవిస్తారు? సక్రమమైన మార్గాల్లో జీవించగలరా? అసలలా జీవించడానికి అవకాశం వుందా? ఆలోచిస్తున్నాడతను.

ధర్మం అడిగితే అలా చూస్తున్నాడేమిటి! తిడతాడో కొడతాడో అనే భయంచేత వెర్రిగా చూస్తున్నారు.

వాళ్ళ చూపుల్లో మార్పు గమనించి తన ఆలోచనకి ఫుల్‌స్టాప్ పెట్టి అటుగా పోతున్న తినుబండారాలతన్ని పిలిచి వాళ్ళిద్దరికీ తిండి కొనిచ్చాడు. బ్యారేజిమీద జనసమ్మర్దం ఎక్కువైంది. లైట్లు వెలిగాయి.

* * * *

సిగరెట్టు అంటించుకొనుచుండగా "హరీష్‌గారూ!" అన్న పిలుపు వినబడి అవైపు చూశాడు.

ప్లీడర్ కృష్ణమోహన్‌గారి ఆఖరి కుర్రాడు తేజా చెయ్యి వూపుతూ అతని వైపు రాసాగాడు.

అగ్గిపుల్లను ప్రక్కకు విసిరి "నువ్వొక్కడివే వచ్చావా?" అన్నాడు

"ఊహూఁ" అంటూ తలతిప్పుతూ అమ్మగారూ, అన్నయ్య, అక్కయ్య వాళ్ళంతా వచ్చారు అన్నాడు.

"ఏరి ఎక్కడున్నారు?"

"అదిగో అక్కడా!" అంటూ బ్యారేజి ఫెన్సింగ్‌ని ఆనుకుని వున్న వాళ్ళ కుటుంబ సభ్యుల్ని చూపించాడు.

"మీరు మా యింటికి రావడంలేదు?"

"మొన్న వచ్చాను. నీవు స్కూలుకెళ్ళావట."

"ఐసీ" అంటూ కళ్ళు చిత్రంగా తిప్పి మమ్మీవాళ్ళు నా కోసమే వెతుకుతున్నట్లున్నారు. అని హరీష్ కూర్చున్న కట్టడం ఎక్కి "మమ్మీ, మమ్మీ" అంటూ చప్పట్లు కొట్టి పిలిచాడు.

ఆ పిలుపు విన్నవాళ్ళు హరీష్ కూర్చున్నవైపు వస్తుండటంతో వాళ్ళు దగ్గరకు రావడం చూసి చేతిలో సిగరెట్ అవతలపారేసి, కట్టడంమీంచి లేచి నుంచున్నాడు.

కృష్ణమోహన్ కుటుంబ సభ్యులు అతన్ని సమీపించగానే ఒక్కడుగు ముందుకువేసి లాయర్‌గారి భార్యని సమీపించి తన నమస్కారం తెలియచేశాడు.

ఆమె చిరునవ్వుతో అతని నమస్కారాన్ని వారిస్తూ "ఎలావున్నావు హరీష్ మొన్న యింటికి వచ్చావట, నేను లేను.

"అవునండి."

వాళ్ళంతా యింతకుముందు హరీష్ కూర్చున్న దగ్గర కూర్చున్నారు. హరీష్ స్కూటర్‌మీద చెయ్యివేసి వాళ్ళకు ఎదురుగా నుంచున్నాడు.

కృష్ణవేణి మందిరానికి ఒక ప్రక్కగా నిల్చున్న ఆ కుటుంబ సభ్యుల్లో ఒకరు మిగిలినవారిని పట్టించుకోకుండా దూరంగా సుదూరంగా నదిమీద ఎక్కడో చూస్తున్నాయి వారి చూపులు. సున్నితమైన ముక్కు బిగిసివుంది. మొహంలో నాజూకయిన బింకపు చాయలు స్పష్టమవుతున్నాయి. చిరుచెమటలు పట్టిన ఆమె వదనం లైట్ల వెలుతురులో అద్వితీయమైన రూపాన్ని సంతరించుకుంది. ఆమే కార్తీకా!.... సంపెంగలాంటి ముక్కు, తమ్మిపువ్వులాటి కళ్ళూను!

పిల్లలందరూ ఐస్‌క్రీం బండిమీద దండయాత్ర చేస్తున్నారు.

"అందరూ తీసుకున్నారా" అని ఒకటి లాయర్‌గారి భార్య కివ్వబోయాడు హరీష్.

"నాకువద్దు బాబు! వాళ్ళకివ్వు" అంటూ అంతలోన "కార్తీక ఏది? ఎక్కడుందిరా" అంటూ పిల్లల్ని అడిగిందామె.

"అదిగో! అక్కడుంది" తేజా వేలెట్టి చూపాడు.

"నువ్వు తీసుకో కార్తీకా!"

"నాకు వద్దు పిన్నీ" ఆమె మాటల్లో కరుకుదనం వుంది.

చేతిలో ఐస్ కరిగిపోవడం ప్రారంభించటంతో, ఏంచెయ్యాలో తోచక తానుగా కార్తీక వున్నవైపుకి వెళ్ళాడు.

ఆమె ఇదేమి పట్టించుకోలేదు. బ్యారేజివైపు చూస్తూ నించుంది.

"హల్లో! ఇఫ్యూ డోన్ట్ మైండ్ ప్లీజ్ టేక్‌యిట్" తీసుకోమని అభ్యర్థించాడు.

కార్తీక హరీష్ వంక చూసి తీసుకుంది.

"థ్యాంక్స్!"

"దేనికి?"

"మీరు తీసుకున్నందుకు."

ఆమె దగ్గర్నుంచి లాయర్‌గారి భార్య కూర్చున్న దగ్గరకు వచ్చాడు.

నువ్వు అప్పుడప్పుడు ఇంటికి వస్తుండు. ఈయనగారి దగ్గర చాలామంది జూనియర్స్ పనిచేశారుగానీ వాళ్ళెవరూ మా కుటుంబంలో కలవలేదు. నిన్ను మా కుటుంబంలో ఒకడిగా చేసుకుందామనుకున్నాం. కానీ అది ప్రాప్తం వున్నట్లు లేదు.

ఆమె ఏ విషయం గురించి మాట్లాడిందో హరీష్‌కి అర్థం అయింది.

ఆమె ఆ సంభాషణ ప్రస్తావించినపుడు కార్తీక వున్నవైపు చూశాడు హరీష్. కార్తీక అక్కడలేదు. జాలర్లు వలవేస్తుంటే ముందుకువెళ్ళి చూస్తూ వుంది.

"కార్తీకకు ఏమైనా సంబంధాలు చూస్తున్నారా?"

రెండు సంబంధాలు వచ్చాయి. ఫోటోలు పంపారు. ఏదీ నచ్చలేదండి. వాళ్ళందరికి ఇది నచ్చింది. పదిరోజులలో ఆ సంబంధం చేసుకుతీరాలని పట్టు బట్టాడు. ఇదేమో వాళ్ళ బాబాయి దగ్గరకి వెళ్ళి కళ్ళనీళ్ళు పెట్టుకుంది అంటూ "పిల్లలెక్కడ" అని అటూ ఇటూ చూసింది.

అందరూ తలో చోట వున్నారు.

లోగొంతుకతో మాట్లాడుతూ "హరీష్‌ని తప్ప ఎవ్వరినీ చేసుకోను బిన్నాన్నా! అతను చేసుకోనంటే సరి లేకుంటే యం.ఎస్‌సి. రిసర్చిచేసి స్టేట్స్‌కి వెళ్ళిపోతానని చెప్పింది.

ఆమె మాటలు విన్న హరీష్ ఒక్కసారిగా షాక్ అయి కార్తీకవైపు చూశాడు. ఆమె యిటు చూడ్డంలేదు.


(సశేషం)

అన్నపూర్ణ

ప్రకాశం యింటికి రాలేదు. రాత్రి ఎనిమిదయినా....అన్నపూర్ణ ఆత్రంగా కొడుకు రాకకోసం వేచివుంది.... సాయంత్రం చేసిన వేడి జున్ను అప్పటికే చల్లారిపోయింది. ఆవుపాల జున్ను ప్రకాశానికి అమితమైన యిష్టం.... అన్నపూర్ణ కళ్ళ వెలుగు ప్రకాశం. యాభైయేళ్ళ వయస్సూ, లాయరుగా మంచిపేరూ, సంపాదనగల రంగనాధరావు రెండవ భార్యగా అన్నపూర్ణ కాపురానికొచ్చింది. యాభైయేళ్ళ భర్త లభించడం ఆమె అదృష్టమేనని భావించారు తలితండ్రులు....కారణం ఎదిగి ఉన్న కూతురికి ఎన్నాళ్ళకి సంబంధం కలసి రాకపోవడం, వచ్చిన సంబంధాలు కట్నంకోసం మళ్ళిపోవడం.... జీవితంపట్ల నైరాశ్యం ఆవరించి ఉన్న రోజుల్లో అన్నపూర్ణ తల్లిగా మారింది. అంతే! నాటినుండి ఆమె భర్తమీద, అపురూపమైన ప్రకాశం మీద మమకారం పెంచుకుంది....అయితే ఆమె ఆనందాన్ని కళ్ళారా చూడలేని దేవుడు ఆమెకి భర్తని దూరం చేసాడు.... కృంగి పోలేదామె. ప్రకాశాన్ని పట్టి బట్టి చదివించి వృద్ధిలోకి తెచ్చింది.... బేంక్ ఆఫీసర్‌గా పని చేస్తున్న కొడుకుని చిన్న పిల్లాడిలానే భావిస్తుందామె.

నిత్యం వేళకి యింటికి తిరిగి వచ్చే ప్రకాశం ఆ రోజు ఆలస్యం చెయ్యడానికి గల కారణం ప్రసూన. అతని బేంక్‌లోనే ఉద్యోగం చేస్తోంది.... పేరున్న చిత్ర కారుడు తీరిగ్గా కూర్చుని గీసిన రంగుల చిత్రంలా ఉంటుంది ప్రసూన....వయస్సుతో పాటు పెరిగిన అందచందాలు ఆమెది....యువకుల కళ్ళకి ఆమె అప్పుడే విడిన రోజా పువ్వు. ఆమె సంస్కారం, నడత నీటుగా, ధీటుగా ఉంటాయి. ఎవరినీ నొప్పించని ఆమె తత్వం ప్రకాశానికి నచ్చింది....అతనామె ఆకర్షణకు లోనయ్యాడు. ఆమె సుందర రూపం అతని కళ్ళల్లో నిలచి, కలల్లో కనిపించేది. స్నేహం. యిద్దరి మధ్యా నాంది వాచకం పలికింది. ప్రేమ బీజంలా అంకురించింది,

తన పుట్టిన రోజని యింటికి ఆహ్వానించింది ప్రసూన.. కానుకగా ఓ మంచి చీర పాక్ చేయించి పట్టుకు



జి.రామనారాయణ

వెళ్ళాడు ప్రకాశం....అతని రాకకోసం ఎదురు చూస్తున్నాడు విశ్వనాథం.... ప్రసూన తండ్రి....తండ్రిని పరిచయం చేసింది ప్రసూన. ఆమె కళ్ళు జ్యోతుల్లా మెరుస్తున్నాయి.

మాటలు మొదలయ్యాయి....ఆ జంట అలా నవ్వుతూ మాట్లాడుకుంటూంటే ఓ శ్రోతగా మిగిలాడు విశ్వనాథం.... అతనొకప్పుడు సర్కారు గుమస్తాగా పనిచేసి రిటయిరయిననాటికి అసిస్టెంట్ ఆఫీసర్ కాగలిగేడు.... పెద్దవాళ్ళయిన యిద్దరు మొగ పిల్లలు తనని ఉద్దరిస్తారనుకొని పెద్ద చదువులు చదివించాడు. అయితే వాళ్ల అతని అంచనాని తారుమారుచేసి, ఉద్యోగాలు రాగానే ఎవరి మానాన్న వాళ్ల పెళ్ళిళ్ళు చేసుకుని, వేరే వెళ్ళిపోయారు. పది రోజులు పాటన్నా వారింట వుండి వద్దామని వెడితే....అతన్నొక చుట్టాన్ని చూసినట్టు చూస్తారు కోడళ్ళు....కొడుకులు ముభావంగా మాట్లాడతారు. తమకి పెళ్ళి కెదిగిన చెల్లెలు ఉందన్న తలంపు రాదు వారికి. తన సర్వీసులో పైసా మిగల్చకుండా, అప్పులు చేసి వారిని పెంచినందుకు వారు చూపించే ప్రేమ అంతగరళంగా ఉంటుందనుకోలేదు విశ్వనాథం....సరిగ్గా అదే సమయానికి స్వశక్తితో బేంక్ ఉద్యోగిని కాగలిగింది ప్రసూన....

"ప్రసూనని ప్రకాశం పెళ్ళి చేసుకుంటే బాగుండును...."అనుకున్నాడు విశ్వనాథం మనస్సులో...."అయితే కట్నకానుకలు యిచ్చుకునే స్థితిలో తను లేడు...."సందేహం మొదలయింది.

గంటకు పైగా కాలక్షేపం చేసి యింటికి బయలు దేరాడు ప్రకాశం. అప్పుడు సరిగ్గా తన ఉద్దేశ్యం వ్యక్తం చేసాడు విశ్వనాథం. కూతురి పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు.

"అంతా మా అమ్మగారిష్టం....మీరు వచ్చి కలియండి"అన్నాడు ప్రకాశం.

"ఎల్లుండి ఆదివారం ఉదయం వస్తాను...." ఎడ్రసు తెలుసుకుంటూ అన్నాడు విశ్వనాథం,

"అలానే...."గుడ్ నైట్ చెప్పి స్కూటర్ ఇంటి త్రోవ పట్టించాడు ప్రకాశం....

ఆలస్యంగా యింటికి వచ్చిన ప్రకాశాన్ని ఏమని ప్రశ్నించలేదు అన్నపూర్ణ....ఉత్సాహంగా ఉన్న కొడుకు అంతరంగాన్ని అంచనా వెయ్యగల శక్తిలేనిది కాదామె....వయసు పెద్దది. వాడెటువంటి తప్పటడుగు వెయ్యరాదన్నది మాత్రమే ఆమె కోరిక.

తల్లికి ప్రసూన విషయం ఎలా చెప్పడమని సందిగ్ధంలో పడ్డాడు ప్రకాశం....తల్లి అందించిన జున్ను ప్లేటు అందుకుని మౌనంగా తినసాగాడు.

"ఎలా ఉంది బాబూ?...."

"ఎంతో బావుంది...."


"వేగిరం నువ్వింటికి వచ్చివుంటే వేడిమీద మరింత బావుండేది ..."

"అవునమ్మా అనుకోని ఆలస్యం జరిగింది...." అంతకన్నా మంచి అవకాశం రాదని ప్రసూన విషయం క్లుప్తంగా చెప్పాడు ప్రకాశం. అప్పటికే అన్నపూర్ణలో సంక్షోభం మొదలయింది.... ప్రకాశం అప్పుడే పెద్దవాడయ్యాడు.... స్వతహాగా నిర్ణయం తీసుకునే స్థితికి వచ్చాడు.

"ఆదివారంనాడు వాళ్ళ నాన్నగారు మనింటికి వస్తారమ్మా...."

"ఎందుకుబాబూ.... నీ నిర్ణయాన్ని ముందే తెలియజేసావు కదా?" కించపడిందామె.

"ఆహా ఎంతమాత్రం కాదు. నీదే



తుది నిర్ణయం...." సంభాషణ అక్క డికి ఆగిపోయింది.

ఆదివారం రానే వచ్చింది....అన్న సమయానికి అయిదు నిమిషాలు ముందు గానే విశ్వనాథం వచ్చాడు.

"మీ అమ్మగారేరి?" సోఫాలో కూర్చుంటూ ప్రశ్నించాడు విశ్వనాథం. సమాధానంగా అన్నపూర్ణ వంటగదిలో నుండి కాఫీ కప్పులతో వచ్చింది. కప్పుల్ని టీపాయ్‌మీద వుంచుతూ దర్పంగా కూర్చుందామె వారి కెదురుగా.... నమస్కరిస్తున్న విశ్వనాథం దృష్టి ఆమెపై పడింది.... ప్రతి నమస్కారం చేస్తున్న అన్నపూర్ణ కళ్ళు అప్పుడే అతన్ని చదివేస్తున్నాయి.... గతం యిద్దరిలోనూ ఒకేమారు తొంగి చూసింది.

* * *

పాతికేళ్ళక్రితం.... ఆ రోజు కూడా సరిగ్గా ఆదివారమే....అన్నపూర్ణయింటి ముందు జట్కా ఆగింది.... ఇంటికి వచ్చిన అతిధుల్ని ఆహ్వానించడానికి తబ్బిబ్బవుతున్నాడు ఆమె తండ్రి జగన్నాధం.

పాత కాలంనాటి తల్లి పట్టుచీర, నగలు ధరించి అందంగా అలంకరించుకొని బుట్టబొమ్మలా వుంది అన్నపూర్ణ. అంతకుముందు అలాంటి అలంకరణలు రెండు మూడు మార్లుగా అనుభవమే ఆమెకు. ఏదో నేరం చేసినట్టుగా వెళ్ళి పదిమంది ముందూ కూర్చోవాలి. అందరూ తనని బొమ్మని చూసినట్టు చూస్తారు....అర్ధమైన ప్రశ్నలూ వేస్తారు. వాటన్నింటికి సహనంగా సమాధానాలు చెప్పాలి.

ఈ మారు వచ్చిన పెళ్ళికొడుకు పేరు విశ్వనాధమని, మంచివాడని, పట్నంలో సర్కారు గుమస్తాగా పని చేస్తున్నాడని వినికిడి....

వచ్చినవారు వద్దంటూనే కాఫీ ఫలహారాలు ముగించారు.

"అమ్మా అమ్మాయిని త్వరగా తీసుకురండి.... మళ్ళీ వర్జ్యం వచ్చేస్తుంది...." తల్లి ఊతనివ్వగా మరబొమ్మలా నడుస్తూ వచ్చి చాపమీద కూర్చుంది అన్నపూర్ణ.....ప్రశ్నలు మొదలయ్యాయి. పాట పాడమన్నారు. సిగ్గు విడిచి పాడింది.

"అబ్బాయినొకమారు చూడమ్మా." అన్నారు చూసింది.... అతను నిండుగా కుర్చీలో కూర్చొని క్రీగంట ఆమెను చూస్తున్నాడు. ఆ చూపుల్లో తనపట్ల యిష్టం కానవచ్చింది అన్నపూర్ణకి.... అదే నిజమయితే తన కన్నె చెరవిడుతుంది....తండ్రి ఎదమీద కుంపటి దిగుతుంది.... విశ్వనాధం, అతని తలిదండ్రులు వీధి వరండాలోకి వెళ్ళి చెవులు కొరుక్కున్నారు. ఇక తన అవసరం లేదని లోనికి వచ్చేసింది అన్నపూర్ణ....

"అమ్మాయి మాకు నచ్చింది...." అన్నాడు విశ్వనాధం తండ్రి.

"శుభం...." అన్నారు.

"ఆఁ ఇక మిగిలిన విషయాలు మాట్లాడుకుంటే.... ముహూర్తాలు పెట్టుకోవచ్చు."

"చెప్పండి....సందేహిస్తారెందుకు?" అన్నారు.

"మా అబ్బాయికి పాతిక వేలిస్తామని యిప్పటికే రెండు సంబంధాలు వచ్చాయి.... అయితే వాటిని మావాడిష్టపడలేదు..." అంటున్నాడు విశ్వనాధం తండ్రి...."

జగన్నాధం గుండెలదిరాయి...

"అమ్మాయి నచ్చింది కాబట్టి... యిరవై వేలు కట్నంగా యివ్వండి... ఆపైన అత్తగారి లాంచనాలు... వగైరాలు మీకు తెలియనివికావు..."గుండెను అరచేత పట్టుకుని అభ్యర్ధన నిండిన స్వరంతో అన్నాడు జగన్నాధం.

"అంతిచ్చుకోలేము...నాకున్న ఆస్తి ఈ యిల్లొక్కటే... స్కూలు మాష్టరుగా నా సంపాదన మీకు తెలియంది కాదు... ఈ యిల్లు అమ్మగా వచ్చిన పదివేలు కట్నంగా యివ్వగలను... నా మాట. కాదనకండి..." వేడుకున్నాడు జగన్నాధం...

పదివేలా?! పదరా విశ్వం... బండి తప్పిపోతుంది మళ్ళీ..." లేచాడాయన విశ్వం చెయ్యి పట్టుకొని...

"ఒక్క క్షణం ఆలోచించండి బాబూ... నా స్థితిగతులు చూసయినా... కనీసం అమ్మాయిముఖం చూసయినా... అతని మాటలకి కసాయి గుండె కరుగుతుందేమోకాని... విశ్వనాధం తండ్రి బండ గుండె కరగలేదు. వారు నిర్ధయగా వెళ్ళిపోయారు...

"దీనికీ జన్మలో పెళ్ళికాదు..." తీరని వ్యధకి గురయ్యాడు జగన్నాధం... ఆ వ్యధ అతన్ని మంచమెక్కించింది... ఆనాటి సంఘటన ఏనాటికీ మరచిపోలేనిదిగా మారింది అన్నపూర్ణ జీవితంలో...

* * *

"మీ పేరు అన్నపూర్ణ కదూ?"

విశ్వనాధం గుండెల్లో తుఫాను మొదలయింది... నాటి సంఘటనకి బదులుగా ఈమె సంబంధం కాదంటుందేమో...? పోనీ గొంతెమ్మ కోర్కెలుగా కట్నకానుకలు కోరితే యిచ్చుకునే స్థో

స్థితిలో లేదు తను... తమ యాచనకి వచ్చిన బిచ్చగాడిలా అన్నపూర్ణ ముందు వున్నాడు... పోసి వెళ్ళి ప్రసక్తి తీసుకురాకుండా వెళ్ళిపోతే... అహం తలెత్తింది... అమ్మాయి జీవితం కళ్ళముందు మెదిలింది... కక్కలేక మింగలేక సతమతమవుతున్నాడు విశ్వనాథం.


"మీరు వచ్చిన పని అబ్బాయి ముందుగానే చెప్పాడు... నా నిర్ణయం మా అబ్బాయి నిర్ణయమే... వాడికిష్టమయిన సంబంధం కాబట్టి ముహూర్తాలు పెట్టించండి... అన్నపూర్ణ మాటలు అతన్ని దిగ్భ్రాంతికి గురి చేసాయి.. నిజాన్ని నమ్మలేక పోతున్నాడు విశ్వనాథం.

"అదేమిటి?! మీరు అమ్మాయిని చూడకుండానే????? కట్నం కానుకలు మాట్లాడుకోకుండానే??????


"డబ్బుతోనే లేదీలోకం విశ్వనాథం గారూ... డబ్బుకోసం ఓ ప్రేమికుల జంటని విడదీసే తత్వంకాదు నాది..." చెప్పుదెబ్బ తగిలినట్టయింది విశ్వనాథానికి... అవును అనాడు తండ్రిని తను ఎదిరించగలిగితే ఆమె తనకు దక్కేది... కృతజ్ఞత నిండిన కళ్ళతో ఆమెను చూస్తున్నాడు విశ్వనాథం... విశ్వనాథానికి బిచ్చం వేస్తున్న అన్నపూర్ణలా వుందామె...

"వస్తానమ్మగారూ..." అహాన్ని చంపుకుంటూ అన్నాడు విశ్వనాథం...

"అదేమిటి కాఫీ త్రాగకుండా వెడుతున్నారు...?" కాఫీ కప్పు అందుకున్నాడు విశ్వనాథం తప్పనిసరిగా..."



యామిని పదవ్యూహం 22



చిరునామా: ____________________


ఆధారాలు

నిలువు :

1. ఇది మించకుండా ఉంటే మంచిది 2. పాండవులలో అందగాడు 3. గంపెడంత పిల్లతో ప్రమాదం 4. రాచరికంలోంచి ప్రజాస్వామ్యంలోకి మార్పు చెందిన యజ్ఞం 5. నలుడికి ప్రణయ సందేశం తెచ్చిన దూత 8. సన్యాసి అయిందా 9. సీసానికి తోకగా డాన్సగర్ల్ 12. వెళ్ళిన పని కాలేదా 13. కస్తూరి 16. వన్నెలకు దిద్దేవి 17. మేషంతో అరు రాశులు

అడ్డం :

1. వరవీణా.... 4. పార్వతి 6. బలములేనివారు 7. నువ్వే నేను 9. ఆదాయం చివరది వ్యయమైతే అంతా మిగులే 10. ఒక జ్ఞానేంద్రియం 11. మోముకు వేడుక 14. తొమ్మిది నిలువుకు వెలకడితే 15. ఆమె పైకి కనబడదు. తక్కువదేం కాదు 18. పిలుస్తే పలుకవు చెవులకేం.... 19. గిరీశం — అగ్నిహోత్రావధాన్లు దగ్గర కుదరవట



పదవ్యూహం-21 విజేత

డా॥ కె. జి. జయరామిరెడ్డి, తాండ్రపాడు.

నిబంధనలు:

1. ప్రతినెల పూరించిన పదవ్యూహం మా కార్యాలయానికి 20 వ తేదీలోగా చేరాలి.
2. సంచికలో గడులే వాడాలి. వేరే కాగితముల పై గళ్ళు గీసి నింపరాదు.
3. గళ్ళనుడి పై చిరునామా తప్పక వ్రాయాలి.
4. నుడికట్టు పంపే కవరుపై "పదవ్యూహసంఖ్య" ని తప్పక వ్రాయాలి.

బహుమతి మొత్తం రూ.100/- విజేతలు ఒకరికంటే ఎక్కువైతే బహుమతి మొత్తాన్ని పంచి పంపుతాము.

బానిసలు

వసుంధర

కొత్తగా చేరాను ఆఫీసులో- జూనియర్ ఆఫీసరుగా!

ఆఫీసులో నాపైన ఒక సీనియర్ ఆఫీసరున్నాడు. ఆయన పేరు పర్వతాలరావు.

నా క్రింద యాభై మంది గుమస్తాలు, పదిమంది చప్రాసీలు- ఉన్నారు. చేతి నిండా పని నాకు.

ఒకప్పుడు పర్వతాలరావొక్కడే ఇంతమందినీ చూసుకునేవాడు. పనెక్కువయిందని జూనియర్ ఆఫీసరుపోస్టు సృష్టించాడాయన. దానికి పై అధికారుల ఆమోదం లభించింది. నేను అపాయింటయ్యాను.

ఎమ్మేలో ఎకనామిక్సు నా సబ్జక్టు. పీహెచ్‌డీ చేయాలని ప్రొఫెసరుగారిని కలుసుకుంటే ఆయన రెండేళ్ళాగి రమ్మన్నాడు.

ఆ రెండేళ్ళూ నేను నిరుద్యోగిని.

ప్రొఫెసరుగారి దగ్గరకు వెడితే- "ఈపాటికి నీకుద్యోగం వచ్చేసి ఉంటుందనుకున్నానే- సరేలే-" అని నన్ను చేర్చుకున్నాడు.

ఒక ఏడాదిపాటు నాకే స్కాలరుషిప్పూ లేదు. అటు స్కాలరుషిప్పులకూ ఇటు ఉద్యోగాలకూ కూడా అప్లై చేస్తున్నాను. ఆ సమయంలో నెలకారు వందల స్కాలర్‌షిప్పూ, ఈ ఉద్యోగమూ ఒకేసారి వచ్చాయి నాకు.

"ఏం చేద్దామనుకుంటున్నావు?" అన్నాడు ప్రొఫెసరుగారు.

"ఉద్యోగమెప్పుడైనా వస్తుంది. పీహెచ్‌డీ చేస్తాను-" అన్నాను.

"పీహెచ్‌డీ ఎప్పుడైనా వస్తుంది. ఉద్యోగంలో చేరు-" అన్నాడాయన. కానీ నాలో ఇంకా విద్యాతృష్ణ తీరలేదు. అదే ఆయనకు చెబితే- "నీకు ప్రపంచ జ్ఞానంలేదు. ఉద్యోగమెలా చేస్తావో ఏమిటో-" అని జాలిపడ్డాడు తప్ప పీహెచ్‌డీ పూర్తిచేయడానికి ఒప్పుకోలేదు.

నేనుద్యోగంలో చేరాను.

ఉద్యోగం గురించి నాకెన్నో ఆశయాలున్నాయి.

నా ఎమ్మే డిగ్రీ చూసి నాకుద్యోగమిచ్చారు. నా ఎకనామిక్సుతో ఉద్యోగానికి పనిలేదు. అంటే చదివిన చదువు నాకేతప్ప దేశానికి ఉపయోగపడడం లేదు. అందువల్ల నేనైనా దేశానికుపయోగపడాలన్నది నా ఆశయం.

నిజాయితీగా ఉండాలి. సమయం వృధాకాకుండా పనిచేయాలి. నా క్రింది వారిపనులన్నీ నేనుకూడా నేర్చుకుని అందులోని సాధకబాధకాలు తెలుసుకోవాలి. అన్నింటికీ మించి నేను వారికాదర్శంగా ఉండాలన్నది నా ముఖ్యాశయం.


అయితే ఆఫీసులో వాతావరణం మరొకలాగుంది.

నా క్రిందివారంతా నేను కనబడగానే లేచి నిలబడుతున్నారు. నేను నా గదిలోకి పిలిస్తే నాతో వంగి వినయంగా మాట్లాడుతున్నారు. నేను సూచనలిస్తే మంచిచెడ్డ లాలోచించకుండా ఒప్పేసుకుంటున్నారు. నాతో మాట్లాడే ప్రతిమాట చివరా సర్ అన్నపదం ఉపయోగిస్తున్నారు.

ఇందుకు నేను బాధపడ్డాను. నా క్రింద పనిచేస్తున్న గుమస్తాలలో నలభైమంది వయసులో నాకంటె పెద్దవారు. ఇద్దరు నా వయసువారు. ఎనమండుగురు మాత్రం నాకంటె కాస్త చిన్న.

ఒకరోజున నేను వారందర్నీ పిలిచి- "మీరు నన్ను పై అధికారిలాకాక మీ స్నేహితుడిగా భావించండి. మనమందరం దేశసేవకై ఒకే సంస్థలో పనిచేస్తున్న సోదరులం. మీరు నన్ను సర్ అని పిలవద్దు. నన్నుచూసి భయపడవద్దు. ఆఫీసు పనిలో నా అభిప్రాయాలు సరైనవి కావని మీకు తోస్తే ఆ విషయం నాకు నిర్భయంగా చెప్పండి. ఇందులో వ్యక్తిగతమైనదేమీ లేదు. మనం తప్పుచేయకపోతే అందువల్ల దేశానికే లాభం! వ్యక్తులకుకాక దేశాన్ని దృష్టిలో ఉంచుకుని పని చేయాలి మనం-" అని చెప్పాను.

ఆరంభంలో నా మాటల నెవ్వరూ సీరియస్‌గా తీసుకోలేదు. కానీ నేను చిత్తశుద్ధితోనే ఆ మాటలు చెప్పానని వారు త్వరలోనే గ్రహించారు. ఆరు



మాసాల్లో వారిలో నేను కోరిన మార్పు వచ్చింది. ఆ కారణంగా నా క్రింది ఉద్యోగుల సమర్థత పెరిగి నాకు పేరు వచ్చింది.

ఒకరోజున పర్వతాలరావు నన్ను పిలిచి- "నువ్వు చాలా సమర్థుడివి. వారానికి పాతిక ఫైళ్ళు కదలని ఆఫీసులో ఇప్పుడు సునాయాసంగా రెండువందల ఫైళ్లుసునాయాసంగా కదులుతున్నాయి ..." అన్నాడు.

అప్పుడాయనకు నేనేం చేసిందీ చెప్పాను.

"ఇది నేనూ విన్నాను. అందుకే నిన్ను పిలిచాను-" అన్నాడాయన.

నేనాయన చెప్పేది వినసాగాను.

భారతదేశం స్వతంత్రంగా ఉన్నది శతాబ్దాలక్రితం. విదేశీపాలనలో బానిస మనస్తత్వంనుంచి భారతీయులుసుమారు నాలుగు దశాబ్దాలుగా స్వతంత్ర వాయువులు పీలుస్తున్నప్పటికీ బయటపడలేక పోతున్నారు. అందుక్కారణమేమిటంటే-


బ్రిటిష్‌వారు బానిస దేశాన్నేలడానికి కొన్ని నియమావళులేర్పరచి అవి మన దేశంలో అమలుపరిచారు. స్వతంత్రం పొందినా భారతదేశం ఆ నియమావళులనే కొనసాగిస్తోంది. ఆ నియమావళి ప్రజలనెప్పటికీ బానిసలుగానే ఉంచుతుంది. అందువల్ల రాజకీయ నాయకులకు ప్రయోజనాలుండబట్టి వారా నియమావళిని మార్చరు. బానిస మనస్తత్వంతో ప్రజలు ప్రచారాన్ని నమ్ముతారు. రాజరికం నశించినా పదవికి వారసత్వముంటుంది. బ్రిటిష్‌వారు విభజించి పాలించారు. అదే ప్రాతిపదికపై దేశాన్ని భాషలు, కులమతాలు పేరిట విభజించి పాలిస్తున్నారు రాజకీయ నాయకులు. అప్పుడు మననేలినది పాశ్చాత్యులు కావడంవల్ల గాంధీవంటి మహాత్ములు ప్రబోధిస్తే ప్రజలు తిరగబడ్డానికి సిద్ధపడ్డారు. ఇప్పుడలాంటి అవకాశం లేదు. ఒక మూలనుంచి వెన్నుపోటు పొడుస్తూనే- నేను మీవాణ్ణి- అని నాయకులు ప్రజలను మోసగించగలరు. ప్రజాసేవ అంటే ఏమిటో తెలియకుండా తమకోసం తాము జీవించినవారు- ఒక్కరోజులో ప్రచారసాధనాలనుపయోగించుకుని రాష్ట్రంలో దేశంలో ప్రధానస్థాయి నల్లంకరిస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లోని నియమావళి ఫైళ్ళను ముందుకు నడిపించదు. అపనమ్మకం ప్రాతిపదికపై ఏర్పడిన ఆ నియమావళి- దేశంలో బ్రిటిష్‌వారి ప్రతినిధిగా ఉంటూ- ప్రజల బానిస మనస్తత్వాన్ని నిలబెడుతోంది.

అపనమ్మకం అవినీతిని ఆపడం లేదు. అయినా నమ్మకం నియమావళికి ప్రాతిపదిక కావడంలేదు.

ఇదంతా ఎందుకు చెబుతున్నారు?" అన్నాను.

"నీ ఉద్యోగం నీవు సక్రమంగా చేయాలంటే నీవవలంబిస్తున్న పద్ధతి సరైనది కాదు. నీ క్రిందివారిని స్నేహితులుగా కాక బానిసలుగా భావించు. వారికి నీవంటే భయముండనీ అందర్నీ దగ్గరకు రానివ్వకు. నిన్ను మరీ ఎక్కువగా గౌరవించే కొందర్ని మాత్రం దగ్గరకు రానిచ్చి గుప్పిట్లో ఉంచుకో. వారి



ద్వారా రహస్యాలు సేకరిస్తూండు. అందర్నీ సఖ్యంగా ఉండనివ్వకు. ఒకరి మీద ఒకరిని గూఢచారుగా నియమించు. అప్పుడంతా నువ్వంటే భయపడతారు. నిన్ను గౌరవిస్తారు."

"అందువల్ల ఎఫిషియన్సీ తగ్గిపోదా?"

"ఎఫిషియన్సీకంటే అధికారం ముఖ్యమైనది. అధికారి అధికారిలాగుండాలి. క్రిందివారు బానిసల్లా ఉండాలి. ఇది మన సమాజం ఆమోదించిన సిద్ధాంతం. నీ క్రింది ఉద్యోగులు నీ కాలికింది చెప్పుల్లాపడి ఉన్నప్పుడే నీ సమర్థత గుర్తించబడుతుంది. వారానికి రెండువందల ఫైళ్ళు కదిలితే- అది నీకెలాంటి ఖ్యాతీ తెచ్చిపెట్టదు-"అన్నాడు పర్వతాలరావు.

"ప్రజల్లోని ఈ బానిస మనస్తత్వానికి ఏదో ఒకరోజు స్వస్తివాచకం పలకాలి. అది నావంటివారితో ప్రారంభం కానివ్వండి-" అన్నాడు.

"మన నియమావళి మారేదాకా అది సాధ్యంకాదు-"

"ఎందుకు సాధ్యంకాదు? నేను మన ఆఫీసులో మార్పుతెచ్చానుగా!"

"ఆ మార్పు కేవలం నీవరకే! నా విషయంలో వారంతా ఎప్పటిలాగే ఉన్నారు. ఆఫీసులో నిన్ను గౌరవించకపోవడం నీకే చిన్నతనం...."

"మీరు కూడా మీ విషయంలో వారిని మార్చండి-" అన్నాను.

"నా విషయంలో వాళ్లు మారరు-"

"నన్ను మార్చమంటారా?"

పర్వతాలరావు కంగారుగా- "వద్దు నేనది సహించలేను-" అన్నాడు.

"ఎందుకని?"

"మార్పు నాపట్ల వ్యతిరేకంగా ప్రోత్సహిస్తే తప్ప వారలా మారరు. నువ్వు వారినలా ప్రోత్సహించడం నేను సహించలేను. ఒక విషయం ఆలోచించు. నీవు వారి ఆలోచనల్లో మార్పు

తెచ్చావు. ఆ మార్పు వారికి నీ వరకూ మాత్రమే సహకరించింది. నాపట్ల వాళ్లెందుకు మారలేదు? అంటే వారిలో బానిస మనస్తత్వం పోలేదు. పోయినా ఏదో క్షణంలో అది మళ్ళీ తలెత్తుతుంది. ఇలాంటివారిని మార్చాలనుకోవడంచాలా తెలివితక్కువ.

నేను బదులివ్వలేదు. కానీ పర్వతాలరావు మాటలను సవాలుగా తీసుకున్నాను. ఒకరోజు స్టాఫందర్నీ పిలిచి- "మీరిక్కడ ఎవరికీ భయపడకండి. నాతోలాగే పర్వతాలరావుతోనూ మసలండి. ఆయన చాలా సంతోషిస్తారు-" అన్నాను.

వాళ్లు వినేసి వెళ్ళిపోయారు. తర్వాత బాపయ్యనే పెద్దాయన నాదగ్గరకు వచ్చి- "బాబూ- నువ్వు కుర్రాడివి. వృద్ధిలోకి రావలసినవాడివి. పర్వతాలరావుగారి వ్యవహారాల్లో జోక్యం చేసుకోకు." అన్నాడు.

"పర్వతాలరావు గురించి నీకు బాగా తెలియదు. ఉదాహరణకు ప్రభాకరం విషయం చెబుతాను. ఒకసారి పర్వతాలరావుగారి భార్య బట్టలషాపులో చీర సెలక్టు చేసుకుని నూటయాభై రూపాయల చీరను వందకిమ్మంది. షాపువాడు వదిరూపాయలకంటే తగ్గనన్నాడు. ఆ సమయంలో అక్కడే వున్న ప్రభాకరం భార్యకా చీర నచ్చి నూటనలభైకి తీసుకుంది. అప్పుడామెకు పర్వతాలరావుగారి భార్య తెలియదు. తర్వాత ఏదో పార్టీలో ఒకరినొకరుతెలుసుకున్నారు. ప్రభాకరం పర్వతాలరావుగారికి నంబర్ వన్ చెంచా. అయినాసరే అతడికి రావలసిన ప్రమోషన్ ఆగిపోయింది. అలా యిప్పటికి మూడుసార్లు జరిగింది. ప్రభాకరం ప్రమోషన్ కోసం పర్వతాలరావుగారి కాళ్ళావేళ్ళాపడుతున్నా పని జరగడం లేదు. అతడి భార్య తన భార్యను క్షమార్పణ అడగాలని ఆయన సూచించాడు. ప్రభాకరం భార్య అభిమానవతి. మీకాయన ఆఫీసరు కానీ నాకావిడ ఆఫీసరు కాదంటుందామె. ఇదీ పర్వతాల పద్ధతి-" అన్నాడు బాపయ్య.

"ప్రభాకరం విషయం నేనుచూస్తాను. మీరు మీ పద్ధతులు పర్వతాలరావుగారి విషయంలో కూడా మార్చుకోగలరా?" అన్నానావేశంగా.

"హామీ యివ్వలేను. కానీ ప్రభాకరానికి న్యాయం చేయిస్తే ఆఫీసులో నీ మాటకు విలువ పెరుగుతుందని చెప్పగలను." అన్నాడు బాపయ్య.

ఆయన్నుపంపేసి ప్రభాకరం ప్రమోషన్ గురించిన ఫైలు తీశాను. అది చదివితే చాలా అన్యాయమనిపించింది. ప్రభాకరం వర్క్‌లో తేడా లేదు. అంతా కాన్ఫిడెన్షియల్ రిపోర్టుల్లో ఉంది. ఒక ఏడాది పూర్ అని ఉంది. మరు సంవత్సరం కూడా అంతే! ఆ తర్వాత ఫెయిర్! కనీసం గుడ్ అనిపించుకుంటే తప్ప ప్రమోషనివ్వరాదని పర్వతాలరావు కవరింగు లెటర్లో వ్రాశాడు.

ప్రభాకరం పర్వతాలరావుకు వ్యతిరేకంగా పై అధికారులకు పిటీషన్ పెట్టుకుని ఉన్నట్లయితే ఈఅన్యాయం బయటపడి ప్రభాకరానికి న్యాయం జరుగడంతో పాటు- పర్వతాలరావు ఇబ్బందుల్లో పడతాడు. పర్వతాలరావు కేసును ప్రభాకరానికి వ్యతిరేకంగా చేయడానికి తగిన శ్రద్ధ తీసుకోలేదని-ఎవరికైనా ఆఫైలును చూడగానే యిట్టే అర్థమవుతుంది. తనేం చేసినా ఎదురులేదన్న మొండి ధైర్యం పర్వతాలరావుకుంది.

మర్నాడు నేను ప్రభాకరాన్ని నా గదికి పిలిచి- "నీకు ప్రమోషనెందుకు రావడం లేదో తెలుసా?" అన్నాను.

"నా దురదృష్టం-" అన్నాడతడు.

"దురదృష్టం కాదు- ప్రయత్న లోపం-"

"ప్రయత్నించాను సర్- ఇక్కడ పర్వతాలరావు నాకెలాంటి బాసో- ఇంటి దగ్గర మా ఆవిడా అంతే- ఒప్పుకోవడం లేదు-"

ఆశ్చర్యపోయి ప్రభాకర్ వంక చూశాను. అతడు సిగ్గుపడడానికి బదులు బాధపడుతున్నాడు. తనకు ప్రమోషన్ రాకపోవడానికి తన భార్య కారణమన్న విషయమందరికీ తెలుసనే అతడనుకుంటున్నాడు. అది దాచిపెట్టాలని కానీ, సిగ్గుపడాల్సిన విషయమని కానీ అతడు భావించడంలేదు.

"నా ఉద్దేశ్యమది కాదు- నీ ప్రమోషన్ గురించి నువ్వు రిప్రజెంటేషనివ్వలేదు. అదీ ప్రయత్న లోపమంటే!

"అధికారుల కెదురుతిరిగి బ్రతకలేము సార్!"

"ఇందులో ఎదురుతిరగడమేముంది? నీకు న్యాయం జరిపించమని విన్నపం చేసుకుంటావు. అంతే!"

ప్రభాకరం తలవంచుకుని- నేను రిప్రజెంటేషనివ్వను. పర్వతాలరావుగారి మనసు మారేదాకా ఎదురుచూస్తాను-" అన్నాడు.

నాకు చిరాకేసి- "నువ్వు స్వతంత్ర భారత పౌరుడిలాకాక బానిసలా ఆలోచిస్తున్నావు-" అన్నాను.

ప్రభాకరం తలెత్తి అదోలా నవ్వి- "సార్- ప్రజలెన్నుకున్న నాయకుణ్ణి ముఖ్యమంత్రిగాచేసేది ప్రజాప్రతినిధులు కారు, ఎక్కడో ఢిల్లీలో ఉండే ఓ పెద్ద మనిషి. ఆయన తల్చుకుంటే ఈనాటి ముఖ్యమంత్రి రేపు ఎమ్మెల్యేగా మారిపోతాడు. ఆదేమని ఎదురుతిరిగితే అయిపులేకుండా పోతాడు. అలాకాక ఎంతటి అవమానాన్నయినా భరించి దిగమ్రింగి సహనాన్ని ప్రదర్శిస్తే- ఏదో ఒకరోజున తిరిగి ఏ కేంద్ర మంత్రి పదవినో, పార్టీ అధికార పదవినో సంపాదించుకోగలుగుతాడు. ఈ స్వతంత్ర భారతదేశంలో ప్రజాబలమున్న నాయకులే న్యాయంకోసం పోరాడ్డానికి బదులు అన్యాయాన్ని సహించడం ఆదర్శంగా పెట్టుకున్నారు. నేను సామాన్యుణ్ణి సర్!" అన్నాడు.

ప్రభాకరం నేననుకున్నదానికంటె తెలివైన వాడని అర్థమయింది. అప్పు

"నీ తరపున వాదించేందుకు లాయర్ ఎవరైనా ఉన్నారా" ముద్దాయిని అడిగాడు జడ్జి.

"లేదండి.... నా అంతట నేనే అబద్ధాలు చెప్పగలను."

—కె. వి. మధుసూదనరావు
కాకినాడ

తతడికి నేను ధైర్యం చెబుతూ- "దేశం పరిస్థితి చూసి నిస్పృగారిపోవద్దు. అది రాజకీయం. ఇక్కడలాకాదు. నేను నీకు సాయపడతాను. మనిషి మనిషిలా బ్రతకాలి. బానిస మనస్తత్వాన్ని విడచి పెట్టాలి...." అంటూ మొదలుపెట్టి- "నీ భార్య ఆత్మగౌరవం నీ కాదర్శం. అధికారుల ప్రభావం ఆఫీసు పొలిమేరలు దాటనివ్వకు-" అంటూ అతడి భార్య నభినందించి- "నీ కేసు చాలా స్ట్రాంగు. ఒక్క రిప్రజెంటేషనిచ్చారంటే చాలు- నీకు మూడేళ్ళక్రితంనుంచే ప్రమోషన్ వస్తుంది-" అంటూ ఆశపెట్టాను.

"ఆలోచిస్తాను సార్!" అని వెళ్ళిపోయాడు ప్రభాకరం.

అతడి నిర్ణయంకోసం నేను చాలా ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. ఆ నిర్ణయంమీదనే ఆఫీసులోని ఇతరుల భవిష్యత్తు ఆధారపడి ఉంది.

వారంరోజులు గడిచాయి. ఒక రోజున బాపయ్య నా దగ్గరకు వచ్చి "ప్రభాకరానికి బ్యాక్‌డేట్‌తో ప్రమోషన్ వచ్చే అవకాశముందన్నావుట. అదెలా సాధ్యం?" అనడిగాడు. నేను వివరించి చెప్పగానే ఆయన కళ్లు మెరిశాయి. "నువ్వు తల్చుకుంటే అయిపోతుంది బాబూ. ఈ కాన్ఫిడెన్షియల్ సమాచారం నీవల్ల తప్ప బైటకు రాదు-" అన్నాడు.

"మీ అందరికీ నా పూర్తి సహకారముంటుంది...." అన్నాను.

"నువ్వు మా అందరికీ సహకరించాలని ఎందుకనుకుంటున్నావ్?"

ఆయనకు నా ఆశయాలు చెప్పాను.

"పర్వతాలరావంటే నీకేమైనా వ్యక్తిగత ద్వేషముందా?"

"లేదు. ప్రభాకరంవంటి వారిగురించి తప్ప వ్యక్తిగతంగా మామధ్య ఏ విధమైన భేదాభిప్రాయాలూ లేవు...."

"రాజకీయంగా నీకేమైనా బలముందా? అంటే ఎవరైనా నీ ద్వారా పర్వతాలరావు ఆటలు కట్టించాలనుకుంటున్నారా?"

ఆయన ప్రశ్నలెందుకో నా కర్థం కాలేదు. ప్రతి విషయానికీ ప్రయోజనాన్నంటగట్టడం ఈనాటి సామాన్యుడి లక్షణం. అందులో కూడా బానిస మనస్తత్వం ప్రతిబింబిస్తున్నదేమో నాకు తెలియదు.

కేవలం వ్యక్తిగతమైన ఆదర్శాలతో నేనీ పోరాటానికి తలపడినట్లాయన్ను నమ్మించేసరికి నా తలప్రాణం తోకకు వచ్చింది. నాకు సంబంధించి నా చిత్తశుద్ధిని, సచ్ఛీలతను అన్నివిధాలుగా ఋజువుచేసుకుందుకు ప్రయత్నించాను.

అలా మరో పదిరోజులు గడిచాయి.

ఒకరోజున పర్వతాలరావు నన్ను పిలిపించాడు. చూడగానే ఆయన కళ్ళలోంచి కురుస్తున్న నిప్పుల్ని గుర్తించాను.

"నీ బుద్ధి పెడదారులు తొక్కింది. సాఫీగా సాగిపోతున్న ఆఫీసులో కలతలు సృష్టిస్తున్నావు. నా ఉద్యోగులను నామైకి ఉసిగొల్పుతున్నావు-" అన్నాడాయన కోపంగా.

"ఎవరు చెప్పారు?" అన్నాను.

"ప్రభాకరం-"

నేను నమ్మలేదు. పర్వతాలరావు తన గూఢచారులద్వారా ఈ విషయం తెలుసుకుని నన్ను దబాయిస్తున్నాడనుకుని- "అంతా అబద్ధం!" అన్నాడు.

"అయితే ఇదేమిటి?" అన్నాడాయన. ఆయన చేతిలో ఓ కాగితముంది. అది నా కందించాడు.



తనకు ప్రమోషన్ రాకపోవడానికి పర్వతాలరావే కారణమనీ, ఆయనకు వ్యతిరేకంగా రిప్రజెంటేషన్ ఇవ్వమని తనను నేను ఫోర్సు చేస్తున్నాననీ ప్రభాకరం పర్వతాలరావుకు నా మీద వ్రాతమూలకంగా ఇచ్చుకున్న ఫిర్యాదు కాగితమది!

నాకు నోటమాట రాలేదు.

"ప్రభాకరం విషయం నాకు చెప్పకున్నాడు. వ్రాతమూలకంగా యివ్వమంటే యిచ్చాడు. అతడు నాకు నమ్మకస్థుడు. ప్రమోషనివ్వనందుకు నన్ను తప్పుపట్టే నీచ మనస్తత్వం అతడికి లేదు. ఇప్పుడీ కాగితంతో నిన్నేమైనా చేయగలను. కానీ నీ గురించి నాకు తెలుసు. నువ్వు మంచివాడివి. ఉడుకు రక్తం నీ మనసును పెడదార్లు తొక్కిస్తోంది. మనమిద్దరం కలుసుండడం ఇద్దరికీ మంచిది. నువ్వు దేశంగురించి, ప్రజలగురించి, తోటి ఉద్యోగులగురించి కాక నీ గురించి ఆలోచించడం నేర్చుకో. నిన్ను నువ్వు బాగుచేసుకుంటే దేశం దానంతటదే బాగుపడుతుంది. దేశం బాగుగురించి ఆలోచించావా- అది బాగుపడదు కానీ నువ్వు చెడిపోవడం తథ్యం. ఇది మొదటి హెచ్చరికగా- నిన్ను వదిలిపెడుతున్నాను. నా హెచ్చరికను లక్ష్యపెట్టకపోతే- ప్రభాకరం వ్యతిరేకంగా రాసిచ్చిన కాగితాన్ని నేనెప్పుడైనా ఉపయోగించగలను...."

నేనక్కణ్ణించి లేచి వెళ్ళిపోయాను.

ప్రభాకరం రిప్రజెంటేషనిచ్చి ఉంటే- నా సాయంతో అతడు తప్పక న్యాయం పొందగలిగి ఉండేవాడు. కానీ అతడు పర్వతాలరావుకు తన నిజాయితీని నిరూపించుకున్నాడు తప్ప నా మాట వినలేదు.

నేను బాపయ్యను పిలిచి ప్రభాకరం చేసిన పని చెప్పాను. నా చిత్తశుద్ధిపై అతడు తీసిన దెబ్బగురించి ఆయనకు తెలుసుకోవాలనిపించింది.

బాపయ్య జరిగిందాని కాశ్చర్యపడలేదు.

"నీకు పర్వతాలరావుగారిపై వ్యక్తిగతమైన కక్షలేదు. నీ వెనుక రాజకీయ బలంలేదు. కేవలం ఆదర్శాలను నమ్ముకుని పోరాటానికి దిగే నిన్ను ప్రభాకరం ఎలా నమ్మగలడు? పర్వతాల

రావుగారి కాదర్శాలు లేవు. వ్యక్తిగత మైన కక్షలో ఎంతైనా చేయగల సమర్థుడాయన. అయన వెనుక రాజకీయ శక్తులున్నాయి. అలాంటివారికి బానిసలుగా పడి ఉండడంలోనే మాబోంట్లకు మనుగడ ఉంది. కేవలం మనుగడ గురించి ఆలోచించే మేము భవిష్యత్తు గురించి ఆలోచించలేము...." అని- "ప్రభాకరానికి గుట్టు తెలియదు. అందువల్ల అతడేమిటో చూడగానే అందరికీ తెలిసిపోతుంది. అలా తెలిసినా తెలియకున్నా మేమంతా కూడా అతడివంటివారిమే-" అనేసి వెళ్ళిపోయాడాయన.

బాపయ్య, ప్రభాకరం- వీరంతా చదువుకున్నవారు.

న్యాయం జరుగడం తప్పనిసరి అని తెలిసికూడా న్యాయంకోసం పోరాడక పోవడంలోనే తమకు మనుగడ ఉన్నదని భావిస్తున్నవారు- స్వతంత్ర భారత పౌరులు.


యధారాజా- తధాప్రజా అందే ఏమిటో అనుకున్నాను.

తమనేలుకుందుకు ప్రజలెన్నుకున్న ప్రజాప్రతినిధులే బానిసలుగా మసలుతున్నంతకాలం- ప్రజలకు బానిస మనస్తత్వమెలా విడిచిపెట్టగలదు?

నేనాలోచిస్తున్నాను.

మార్పు నాక్రింది ఉద్యోగుల్లోకాదు- నాలోనే రావాలేమో!







ఇద్దరూ ఒక మూలగా కూర్చుని తమ చేతులలోవున్న పాకెట్లను బ్యాగ్‌లో వేసుకొని రెండు మటుకు విప్పి ఆ తెల్లటి పౌడరును నీటిలో కలిపి, సిరంజికి ఎక్కించి, ఇద్దరూ ఇంజక్ట్ చేసుకుని అలాగే సోలిపోయారు.

తెల్లవారుతోంది అని తెలియచేయాలన్నట్లు పక్షులు శబ్దం చేస్తూ చెట్ల నుండి ఎగిరిపోతున్నాయి. చంద్రుడు తన పని పూర్తయినట్లు మరుగున పోతుంటే ఇక మీదట నా పని ఆరంభం అన్నట్లు వరుణుడు మెల్లమెల్లగా తన స్థలాన్ని ఆక్రమిస్తున్నాడు. అప్పుడప్పుడే మత్తునుండి మేల్కొంటున్న సహోదర బృందం ఒక్కొక్కరుగా తమతమ గమ్యాన్ని వెదుక్కుంటు, కేబిల్ కార్ల దగ్గర స్టీమ్ బోటు దగ్గరకు పోతున్నారు.

మొదటగా తెలివిలోకి వచ్చిన సూజీ అంజును తట్టి లేపింది. మత్తుగా కళ్లు విప్పిన అంజు అర్థకంగా ఒళ్లు విరుచుకుని లేచి నలువైపులా చూసింది అప్పుడుకాని తను ఎక్కడ ఉందో తెలిసి రాలేదు. రాత్రి జరిగిందంతా కలా నిజమా అన్నట్లు సూజీ మొహంలోకి తేరిపార చూసింది.

"త్వరగా! అంజూ! మనం ఇల్లు చేరాలి. ఆఫీసుకు టయిమ్ అయింది. ఎనిమిదిన్నరకల్లా ఆఫీసులో వుండాలి. లేకపోతే ఆ కోతి గంతులేస్తాడు." పెద్ద పెద్ద అంగలు వేస్తూ ముందుకు నడుస్తోంది. అంజుకు శరీరం ఇంకా మత్తుగా వుంది, కాళ్ళలో ఎలాంటి బలం లేనట్లుగా తడబడుతూ అడుగులేస్తుంటే తిరిగి అక్కడే పడుకుని నిద్రపోవాలని చూస్తోంది. వెంటనే భరత్, మధు గుర్తొచ్చారు. నీరసంగా సూజీ ప్రక్కనే కేబిల్ కారులో ఎక్కి కూర్చుంది. వచ్చినప్పుడున్న ఉత్సాహం ఇప్పుడు మచ్చుకైనా లేదు. ఇల్లు చేరి పడుకుంటే చాలని అనిపిస్తోంది. ఇద్దరూ కారు దిగి తమ ఫ్లాట్ దగ్గరగా ఆగారు. ముందు సూజీ, ఆ వెనుక అంజు దిగింది. సూజీని అనుసరిస్తున్న అంజు ఎందుకో తల ఎత్తి చూసింది. అప్పుడే స్విమ్మింగ్ పూల్‌నుండి వస్తున్నాడు భరత్. ఆకు పచ్చటి చెక్స్‌వున్న స్విమ్మింగ్ డ్రస్‌లో వున్నాడు. నీళ్ళు కారుతున్న శరీరాన్ని టవల్‌తో తుడుచుకుంటూ తల పైకెత్తిన అతను ఆశ్చర్యంతో అంజు వైపు చూశాడు. అంజు కాళ్ళలో నీళ్ళు కారాయి. అరచేతులలో చెమ్మ ఊరుతోంది. కళ్ళు తిప్పుకుని లిఫ్టు దగ్గరగా వచ్చింది. లిఫ్టు క్రిందకు తెరుచుకునే లోపలనే భరత్ వాళ్ళ దగ్గరగా వచ్చి చేరాడు. అదే లిఫ్టులో ముగ్గురు పైకి రాగానే అంజు సూజీని, అతనిని వెనుకకు వదిలి ముందుకు పరుగెత్తింది. అంతకన్న వేగంగా అతని అడుగులు ఆమెను సమీపించి ఒక్కసారిగా ఇద్దరూ హాల్లోకి వచ్చి చేరారు. మధు సోఫాలోనే నిద్రపోతున్నాడు.

"మధూ!" భరత్ అరచిన అరుపుకు ఎగిరి పడ్డాడు అతను.

"ఏమిటన్నయ్యా! వదిన వచ్చిందా!" నిద్రమత్తు వదుల్చుకుని తల ఎత్తి చూశాడు. అంజు తన గదిలోకి తప్పించుకొనిపోను చూసింది.

"ఆగు!" భరత్ గొంతు బుల్లెట్‌షాట్ శబ్దం చేసింది.

"మధూ! నిన్న ఉదయంనుండి ఇప్పటివరకు ఎక్కడికెళ్ళిందో కనుక్కో! నాకు వెంటనే సమాధానం కావాలి." ఏమాత్రం ఆగలేనట్లుగా అసహనంగా అరిచాడు.

"వదినా! మిమ్మల్ని చూసి ఇరవయినాలుగు గంటలు అయింది. ఎక్కడికెళ్ళారు. కనీసం చిన్న స్లిప్పయినా, రాసి పెట్టాలని తెలియలేదా మీకు. రాత్రంతా నిద్ర అన్నది లేకుండా ఇద్దరం ఎదురు చూస్తున్నాం. ఎన్ని హోటల్సుకు ఫోన్ చేశాం. ఎన్ని క్లబ్బులు వెతికాం. మరీ చిన్న పిల్లలా బిహేవ్ చేస్తున్నారు. మా ఆత్రుత తెలుసుకోలేకపోతున్నారు. ఇప్పటివరకు ఎక్కడున్నారు వదినా!" మధు బాధతో కూడిన కోపంతో అడిగాడు.

అంజు పక్కున నవ్వింది. తనలో ఏ మూలో మిగిలిన మందు పని చేస్తున్నది.

"మీకు నవ్వుగా వుంది. మా ఆత్రుతను అర్థం చేసుకోవడంలేదు." నిష్ఠూరత మేళవించిన గొంతుతో అన్నాడు.

"సారీ! ఎదురు చూస్తున్నాం అన్నావే అందుకు నవ్వు వచ్చిందిలే! వెతికాను ఎదురు చూశాను అను మధూ! ఒప్పుకుంటాను. బహు వచనం ఉపయోగించకు. నా గురించి ఎవరూ దిగులు పడకండి. నేను సలక్షణంగా వున్నాను. సూజీతో నిన్నంతా ఈ నగరంలోవున్న ముఖ్యమైన ప్రదేశాలు చూశాను. రాత్రి తన స్నేహితులమధ్య గడిపాను. అంతే! మరే విధంగా చెడిపోలేదులే! నాకు నిద్ర వస్తోంది," అక్కసుగా అంటూ తన గదిలోకి వెళ్ళి తలుపువేసింది.

రోజులు జరిగేకొద్దీ అంజు పూర్తిగా మత్తు మందుకు బానిస అయింది. ఎప్పుడెప్పుడు రాత్రి వస్తుందా అని ఎదురు చూడడమే ముఖ్యమైన పని అయిపోయింది. పగలు ఏ విధంగానూ తగిన సమయంకాదు. వంటావిడకు ఏదైనా అనుమానం తగిలినా అది భరత్‌కు, మధుకు చేరుతుంది. తన అలవాటును మధు కూడా అసహ్యించుకుంటాడు. ఇద్దరూ తనను సూజీతో కలవనీయక కట్టుదిట్టం చేయవచ్చు. అందుకే తను ఎంతో జాగ్రత్త పడుతున్నది. తనకు తెలుసు తను క్రమేణా తన అందాన్ని, తనలోవున్న చురుకుతనాన్ని అన్నీ ధారాదత్తం చేస్తున్నదని, అద్దంలో తన మొహం చూచుకున్నప్పుడు ఇది తన రూపమా అని భయపడుతున్నది. లోతుకుపోయిన కళ్లు, పీక్కుపోయిన చెంపలు, శరీరంలో బలం తగ్గి సన్నగిల్లిన చేతులు, కాళ్ళు, పొట్ట తప్పించి మిగత తన శరీరావయాలు క్షీణ స్థితిలోకి దిగజారుతున్నాయని, కాని తను ఏమైనా పరవాలేదు. తనకు

కావలసింది మనశ్శాంతి. భరత్‌కు ఎదురుపడి చాలారోజులే అయింది. తను కావాలనే తప్పుకు తిరుగుతుంది. అతను ఒక డాక్టరు. తన లోపాలను అతి శులువుగా కనిపెట్టగలడు. చిత్రంగా తన మనస్సులోనుండి భరత్ రూపం కొంచం కొంచంగా తప్పుకుంటున్నది. తన తల్లిదండ్రులను, చెల్లెలిని పూర్తిగా మరిచి పోయింది. మధును కూడా ముందులా స్నేహంగా, అభిమానంగా చూడలేక పోతున్నది. మొదట మధు తన అన్నకొరకు తనను ఆదరించాడని, తన పరితాప పరిస్థితిని గుర్తించికాదని అనిపిస్తోంది. తనను తననుగా గుర్తించి, ఆదరించి- అభిమానించి, ఈమాత్రం మనఃతృప్తి, మనశ్శాంతి పొందగలిగినందుకు కారణం తను ఒక్కతే! తనకి లోకంలో సూజి తప్ప ఎవ్వరూ లేరు. తను అనాధ, వంటరి. సుడిగుండంలో చిక్కుకుపోతున్న గడ్డి వరక. తనకు ఎవరి దృష్టిలో విలువలేదు. తనమీద జాలి తలచి చేయి అందించి తనను బయటపడవేసే వాళ్ళు ఎవ్వరూ లేరు. తన ఆలోచనాగతి ఆ విధంగా పోతుండే, తన నడవడికలలోను, తన అభిరుచులలోను, తనలో ఉన్న తెలివితేటలలోను మార్పు వయస్సు అనుభవాలద్వారా కలగసాగింది.

పోనుపోను మనస్సు పక్వత చెందుతుంటే, ముందుమాదిరి కాలక్షేపం కొరకు చదువుతున్న రొమాంటిక్ నవలలను వదిలి, రాక్సులోవున్న అన్నిరకాల ఇంగ్లీషు జర్నల్స్ చదవడం మొదలు పెట్టింది. పగలు టి. వి. లో విదేశాల డాక్యుమెంటరీలు చూడడం, వాళ్ళవాళ్ళ అలవాట్లు, జీవన విధానం అర్థం చేసుకోవడానికి, శ్రద్ధగా న్యూస్ పేపర్లు చదవడం, ప్రపంచంలోని సాధక బాధకాలు అర్థం చేసుకోడానికి ప్రయత్నించడం ఇలా తన దిన చర్యలలో క్రొత్త మార్పులతో రోజులు గడుపుతుండెది. ఒకనాడు సూజి ఎవరికీ తెలియకుండా రెండు విడియో క్యాసెట్లు అంజు చేతులలో పెట్టింది,

"ఏమిటిది సూజీ! ఈమధ్య ఈ పిక్చర్లు చూడడం బోర్‌గా వుంది. ఒకే కధ, ఒకే రకం ఫైట్లు మార్పు అన్నది లేదు," వాటిమీద ఇంట్రస్టులేనట్లుగా మాట్లాడింది.

"ష్! చిన్నగా మాట్లాడు. ఒక రోజున జూరింగ్ బర్డ్స్ పార్కులో నన్నొక ప్రశ్న అడిగావు గుర్తుందా! ఆనాడు నానోటిగుండా సమాధానం ఇవ్వడానికి వెనుకాడాను. ఇదిగో నీకు కావలసిన జవాబు ఈ రెండు క్యాసెట్లలో వుంది, జాగ్రత్త. మధు కయినా తెలియకూడదు. తిరిగి భద్రంగా రేపు ఇవ్వు." సూజి అక్కడినుండి వెళ్ళిపోగానే ఏమయి వుంటుందా అన్న ఆతృతతో త్వరగా తన రూమ్‌లోకి వచ్చి తలుపు లాక్ చేసుకొని టేప్‌ను వీడియోలోవేసి, టి. వి. ఆన్ చేసింది.

వాళ్ళు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదు. చాలా లోగొంతుకతో మాట్లాడుతున్నారు. అది ఆస్ట్రేలియన్ ఫిల్మ్ అని, ఏవో కొన్ని కాపీరైట్ ఇన్

ఫర్మేషన్ ఇచ్చి వున్నారు. ఒక ఐదు నిమిషాలు గడిచేటప్పటికి అంజు శరీరం జుగుప్సతో జలదరించసాగింది. నరనరం అసహ్యంతో నిండిపోతుంటే చటుక్కున టి. వి. ఆపింది. తను పోనోగ్రఫీ ఫిల్మ్ గురించి, చదివింది, వినింది కాని దాని అర్థం ఈనాడు తెలుస్తున్నది. రెండవది వేసి తిరిగి ఆన్ చేసింది. అది యూరోపియన్ ఫిల్మ్. అది మరీ ఘోరంగా వుంది. చిన్నచిన్న పిల్లలచేత పెద్ద వాళ్ళు చేయించే నీచాతి నీచమైన క్రీడలు. పిల్లలకు ఏదైతే తెలియకూడదని పెద్దలు జాగ్రత పడతారో అదే నాగరికత పేరుతో, అదే పెద్దలు ఇలా డబ్బుకొరకు దిగజారుతున్నారంటే, ఓహ్! భగవాన్, ఈ అల్ప కోరికకొరకా పురుషుడు స్త్రీని అన్ని విధాల బాధ పెడుతున్నాడు. శరీరమంతా కంపిస్తుంటే తిరిగి టి. వి. ఆఫ్ చేసి ఆ రెండు కాసెట్లను తీసి పడక క్రింద దాచింది.

అంజు ఆలోచనలు ఒక్కసారిగా వెనక్కు పోయాయి. అంటే తను— అవును. తనను ఎవరో కాముకుడు ఒంటరిగా దొరికానని, పశువులా తన కోరికను తీర్చుకుని నలిగిపోయిన పూవును విసిరివేసినట్లు విసిరిపోయాడు. తనకిప్పుడు అర్థమయిపోయింది. పేపర్లలో చదువుతున్నప్పుడు, టి.వి.లో న్యూస్ చూపుతున్నప్పుడు యూరోపియన్ కంట్రీస్‌లో జరిగే ఇలాంటి హేయమైన కార్యక్రమాలు తల్లిదండ్రుల సహకారంతో ఏ విధంగా కొన్ని ఆర్గనైజేషన్స్ ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు అన్నది స్లయిడ్స్ ద్వారా చూపుతుంటే అందులోని లోతుపాతులు అర్ధంకాక సగంలో తీసి, మరికొంత తెలియనట్లుగా ఉండిపోయింది.

ఓహ్! ఇన్ని రోజులు తన ప్రపంచం ఎంతో చిన్నది. తల్లిదండ్రుల అనురాగం, చెల్లెలితో చిలిపి తగవులు, స్నేహితులతో కబుర్లు, సినిమాలు, పత్రికలు ఇవి మటుకే తనకు తెలిసిన ప్రపంచం. కాని ఇప్పుడు తెలుసుకుంది, తను చదివిన నవల్సు కేవలం ఊహల్ని, కాలక్షేపాన్ని మటుకే అందచేశాయని, తనలో బొత్తిగా ఎలాంటి విజ్ఞానాన్ని ఇవ్వలేదని.

మరుసటిరోజు సూజీకి అందచేస్తూ ఇలాంటివి మరొకమారు ఇవ్వవద్దని కోరింది. సూజీకి ఇది ఒక అనుకోని షాక్! నీకు ఇవి ఇచ్చి నీ మనస్సును కలతపరచాలనికాదు అంజూ! నీవు ఎంతో అమాయకంగా పసిపాపలా వుండక సర్వం తెలుసుకుని ఉండడం మంచిదని ఇచ్చాను, అంతకుమించి మరొక దురుద్దేశం కాదు." అంది.

ఆ సాయంత్రం మధు త్వరగా వచ్చాడు. స్నానం అది పూర్తి చేసుకుని చల్లగా తిని ముందరున్న వరండాలోకి వచ్చాడు. ఈమధ్య వదినతో ఎక్కువగా మాట్లాడడం లేదు అనుకుంటు "వదినా!" అని పిలిచాడు.

"ఏమిటి మధూ!" అంజూ దగ్గరగా వచ్చి నిలిచింది.

"క్రింద రాత్రికి మా స్నేహితుడు బర్త్‌డే పార్టీ ఇస్తున్నాడు. మీరు వస్తే ఇద్దరం పోదాం," అన్నాడు.

"సారీ మధూ! నేను రాలేను. నీవు వెళ్ళి యంజాయ్ చేసిరా!" అంది.

అతను పరీక్షగా అంజు మొహంలోకి ఆశ్చర్యంగా చూశాడు. ఆ మధ్య తను ఒక రోజంతా ఇంటివద్దలేదని కొంచం కఠినంగా మాట్లాడాడు. అనాటి నుండి వదిన తప్పించుకునే తిరుగుతున్నది! కాని ఆమె ప్రవర్తనలోనేకాదు, రూపంలోను మార్పు.

"వదినా! మీరేం అలా ఉన్నారు. మీ మొహం ఏం అలా వాడిపోయివుంది, ముందున్న మీ అందమైన రూపం, ఇప్పటి రూపం ఎంత వ్యత్యాసం. అసలు మధ్యాహ్నం భోంచేస్తున్నారా! రాత్రి సరిగా తినడం మానుకున్నారు. అడిగితే సహించడం లేదు అనడం! ఇలా వుంటే మీకు డెలివరీ అవడం కష్టం అని డాక్టరు చెప్పలేదా!

"అది నీవు అభిమానంతో అనే మాటలు మధూ! నేను మామూలుగానే వున్నాను. వయసయిపోతుంది కదూ! అందుకే నా మొహంలో మార్పులు, మరేం లేదు,"

తక్కున నవ్వాడు మధు, "ఇంతకీ వదినగారి వయసెంత?"

పద్దెనిమిది పూర్తయి పందొమ్మిది జరుగుతోంది."

"థాంక్‌గాడ్! ఎనభై ఒకటి పూర్తయి తొంభై ఒకటిలోకి వచ్చానని చెప్పలేదు, అందుకు సంతోషం." మధు పకపక నవ్వుతుంటే అంజు కూడా నవ్వింది.

"ఇంతకీ పార్టీకి రానన్టేనా! లేక ఆ రోజు కోపంగా మాట్లాడానని నామీద అలుకా! నిజం వదినా! ఆ రోజు అన్నయ్యా. నేను పిచ్చివాళ్ళమే అయ్యాం. మీరు ఈ వూరికి క్రొత్త. అన్నయ్య సూజీని నమ్మడు. అన్నయ్య హోటల్సు, నేను నైట్ క్లబ్బులు, ఒక్కటి వదలకుండా వెతికాం. అసలు అన్నయ్య ఎందుకో బాధ పడుతున్నాడు. మాటమాటకి నుదురు కొట్టుకోవడం, ఇదంతా తన వలననే జరిగిందని పదేపదే అనడం, నాకు అయోమయంగా ఉండిపోయింది. ఏమిటనీ అడగను ధైర్యం చాలలేదు. ఇద్దరం తెల్లవారు ఝామున ఇల్లు చేరాం. నేను అలాగే సోఫాలో నిద్రపోయాను. అన్నయ్య అయితే కన్ను మూయలా! అందువలననే కొంచం కఠినంగా మాట్లాడవలసి వచ్చింది."

అంజు మనస్సు అర్ధమయింది. కాని వెంటనే ఆ రాత్రి భరత్ అన్న మాటలు గుర్తుకొచ్చి మధుకు ఎలాంటి వివరణ ఇవ్వలేక పోయింది.

"మరచిపోయాను. రేపు మిమ్మల్ని క్లినిక్‌కు తీసుకుని రమ్మని మల్లాల్ ఫోన్ చేసిందట. అన్నయ్య నన్ను పిలుచుకుని చెప్పాన్నాడు. వుదయం త్వరగా నిద్రలేస్తే మనం ఇద్దరం పోదాము."

అంజుకు గుండె గతుక్కుమంది. సూజీ చెప్పింది. డ్రగ్ తీసుకునే వాళ్ళు యూరిన్ టెస్ట్ చేయించుకుంటే తను డ్రగ్ అడిక్ట్ అని డాక్టరుకు తెలిసిపోతుందట. తన రహస్యం బట్టబయులయిందంటే ఇక తనకు ఈ నరకంనుండి విమోచనమే లేదు.

"నేను చచ్చినా మరొకమారు చెకింగ్‌కు వెళ్ళను. ఆ క్లినిక్ వాసన నాకు పడదు. నన్ను నా మానాన వదిలెయ్ మధూ! మీ అన్నయ్యను నా గురించి ఆలోచించడం మానమని చెప్పు. మీ అన్నయ్యేకాదు నీవు కూడా! ఇకమీదట నీవు నా గురించి శ్రద్ధ తీసుకోవడం మానెయ్. నీ పై చదువు, నీ వివాహం వీటి గురించి ఆలోచించు. అనవసరంగా నీ అపురూపమయిన వయస్సును, కాలాన్ని నాకోసం వెచ్చించక నీ అభివృద్ధిని పెంచుకునే దానికి ప్రయత్నం చెయ్! నాకు తెలుసు. నేను త్వరలోనే మరణాన్ని ఆహ్వానించబోతున్నానని. నేను ఇంతకుమించి ఏం చెప్పలేను.

మధు స్టన్నయినట్లు నిలబడిపోయాడు. మరి కొద్ది సేపటికి తేరుకుని "వదినా....మీరు....మీరేనా అలా మాట్లాడుతున్నది. మీరు మునుపటి వ్యక్తికారు. మీలో చాలా మార్పు. నాకు తెలుసు మీరు సూజీతో స్నేహం చేసిన తరువాతే ఇలాంటి మార్పు. సూజీ అన్నయ్యమీద కసి తీర్చుకుంటోంది. అది మీకు అర్ధం కాదు. నేను చెప్పినా నమ్మరు. కాని ఒకటి మటుకు నిజం, మీరు నమ్మినా నమ్మకపోయినా అన్నయ్య మీమీదే తన ప్రాణాన్ని నిలుపుకుని వున్నాడు. ఇక నా గురించి తెలుసుకోవలసిన జాగ్రత్తలు ఏవో నాకు తెలుసు. అవి ఎప్పుడు పాటించాలో కూడా తెలుసు." విసురుగా అక్కడనుండి వెళ్ళిపోయాడు. అంజు అక్కడే కుర్చీలో కూలబడి చేతులతో మొహాన్ని దాచుకుని వెక్కివెక్కి ఏడవ సాగింది.

మధ్యాహ్నపు వేళ. హాల్లో భరత్ గొంతుతోపాటు మరొక క్రొత్త గొంతు వినిపిస్తోంది. అంజుకు ఆశ్చర్యంగా వుంది. ఇలా మధ్యాహ్నపు వేళ భరత్ ఇంటికి రావడం. అయినా తనకెందుకన్నట్లు పుస్తకంలో లీనమయింది.

"నిన్ననగావచ్చి ఈ రోజు గుర్తుకొచ్చానా! అయినా హోటల్లో దిగడమేమిటి, ఇక్కడ గెస్ట్ రూమ్ ఖాళీగానే వున్నప్పుడు, నేను కోలాలంపూర్‌కు వస్తే నీవు నా మొహం చూసేట్లు లేవు." భరత్ గొంతులో కోపంతో కూడిన నిష్ఠూరత వుంది.

"అబ్బ! ఆది వదులు నాన్నా! చెప్పానుగా! నిన్న నా పేషంట్‌తోపాటే ఆ పాత తల్లిదండ్రులు వచ్చారని. వాళ్ళకు అన్ని అరేంజ్‌మెంట్స్ చేయడం, నిన్ననే పాపను హాస్పిటల్లో అడ్మిట్ చేయడం, ఇలాగే సరిపోయింది. నిన్ను కలుసుకోవాలనే ఉన్నా! కాని కేస్ స్టడీచేయడంలో ఆలస్యమవడం, ఆ తరువాత అలసట, అంతే ఆదమరచి నిద్రపోయాను. ఈ రోజు హాస్పిటల్‌కు రాగానే గుర్తుకొచ్చింది, నీవు ఇదే హాస్పిటల్లో స్పెషలిస్టుగా వున్నావని, హార్ట్ సర్జరీ కేసులు ఎక్కువగా నీ చేతుల మీదుగా జరుగుతున్నవని, మీ కో డాక్టరు నరేంద్రన్ చెప్పగానే ఎక్కడలేని ధైర్యం వచ్చింది.

"ఇంతకీ ట్రబుల్ ఏమిటి? ఎవరి పాప."

"చైనీస్ అమ్మాయి,, వయస్సు ఆరు సంవత్సరాలు. ఆ తల్లిదండ్రులకు ఒకే అమ్మాయి, గుండెలో రంధ్రం ఉంది. ఎక్స్‌రేలు అన్నీ తీసి చూశాం. వెంటనే ఆపరేషన్ జరుగకపోతే పాప ప్రాణానికే ముప్పు. వాళ్ళ బాధ చూడ లేక పోతున్నాననుకో! నీకు తెలిసిన విషయమేగా! కోలాలంపూరులో హార్టు కేసులు, ఎనభై శాతం, ఫారిన్ కంట్రీన్‌కు పోతున్నవని. భరత్ ఆ పాపను నీ చేతులలో పెడుతున్నాను. నేను తిరిగి రేపు ఫ్లైట్‌కు వెళ్ళిపోతున్నాను. ఆపరేషన్ రోజున వస్తాను. ఇంతకి ఇల్లాలెక్కడ? రాహలనే ప్రయత్నం. ఎక్కడా తీరిక లేక వస్తున్నాననుకో! మా శ్రీమతిగారు చెల్లాయికి ఇమ్మని ప్రజంటేషన్ ఇచ్చింది. మీరు మరచిపోతారు, ప్యాంట్ పాకెట్‌లో పెట్టుకోండి అది ఇంజక్షన్‌లా తొడ మీద పని చేస్తుంది అని చెప్పింది. త్వరగా పిలువు. ఈ భారాన్ని వదిలించుకోవాలి," భరత్ నవ్వాడు అతని మాటలకు.

"నీవే పిలువు. అదే తనగది," చేయిచాపి చూపించాడు,

"పేరు తెలియందే! ఇంతకీ ఘోషాలో పెట్టావా ఏమిటి? ఇంత సేపు మనం మాట్లాడుతున్నా బయటకు రాలేదు. ఎప్పుడెప్పుడు నీ మనస్సు దోచుకుని కొంగున ముడివేసుకున్న చెల్లాయిని చూడాలని ఆతృతతో నేనేదుస్తుంటే!"

"అందుకే అంత త్వరగా వచ్చావు." భరత్‌లో ఇంకా మిగిలివున్నాయి కోపపు ఛాయలు. అంజుకు వాళ్ల మాట్లాడుకునే ప్రతిమాట వినిపిస్తున్నది. గది బయట అడుగుల చప్పుడు వినిపించగనే చేతిలోవున్న బుక్కు పడకమీద పెట్టింది.

ఇంతలో "మిసెస్ భరత్! మిమ్మల్ని చూడాలని కోలాలంపూర్‌నుండి పనిగట్టుకుని వచ్చాను. మీరు లోపల దాక్కుంటే ఎలా. తలుపు తీస్తారా" అన్న మాటలు వినిపించగనే చటుక్కున తలుపు తెరిచింది.

"గుడ్ ఆఫ్టర్‌నూన్! నా పేరు చంద్రశేఖర్. మీవారు నేను మెడిసన్‌లో క్లాస్‌మేట్స్‌ము. అంతేకాదు బెస్ట్ ఫ్రెండ్స్. నన్ను నేనే పరిచయం చేసుకున్నా. మీ గురించి చెప్పి వీనులు విందు చేయండి." అంజుకు నవ్వు వచ్చింది. అతను డాక్టరయివుండి హ్యూమరస్‌గా మాట్లాడుతున్నందుకు.

"నమస్తే! నా పేరు అంజాన. సెకండ్ బియ్యస్సీ నగంలో గుడ్‌బై చెప్పాను. మీకు డ్రింక్స్ తెస్తాను" అక్కడినుండి కదలబోయింది.

"అదంతా మీ సర్వెంట్ సప్లై చేసింది. మీరు అలా వచ్చి కూర్చుంటే సంతోషిస్తాను." అంజుకు ఇబ్బందిగా వుంది. ఈమధ్య భర్త ఎదుటపడి చాలా రోజులయింది. అతను అక్కడ కూర్చుని ఉండగా తను ఎలా అక్కడ కూర్చుంటుంది. ఇరకాటంలో చిక్కుకున్నట్లు వుంది తన పరిస్థితి. డాక్టర్ చంద్రన్ పాకెట్‌లోనుండి చిన్నగ్లాస్ బాక్స్‌తీసి అంజు చేతిలో పెట్టాడు. "ఇది మీ వదిన

గారు మీకు ఇవ్వమన్న ప్రజంట్. ఆవిడ మిమ్మల్ని త్వరలో సందర్శిస్తామని కలవివ్వమన్నారు."

పక్కున నవ్వింది అంజు తనను తాను మరచి అతను పకపక నవ్వాడు.

అంజు ఒక్కక్షణం అన్నీ మరచిపోయి చనువుగా "మీరు ఇంట్లోను ఇలానే హుషారుగా ఉంటారా!" అంది.

"మరి, నేను దేవదాసనుకున్నారా ఏమిటి? చేతిలో బాటిల్‌తో విషాదగీతాలు ఆలపించను."

అంజుకు నవ్వు ఆగలేదు. అతను అంజువైపు తదేకంగా చూశాడు.

"కంగ్రాట్యులేషన్స్ భరత్! నిన్ను మనసారా అభినందిస్తున్నాను. భీవరకు ఇలాంటి బంగారుబొమ్మను సహచరిణిగా చేసుకున్నందుకు."

భరత్‌లో ఎలాంటి కదలిక లేదు. మొహంలో ఎలాంటి భావం లేదు. అంజు చటుక్కున కిచెన్‌లోకి దూరింది.

భోజనానికి అన్నీ టేబిల్‌మీద సర్ది వంటావిడను పంపింది. స్నేహితులిద్దరూ చేతులు కడుక్కుని టేబిల్ దగ్గరగా వచ్చి కూర్చున్నారు. అంజు వడ్డిస్తుంటే ఆమెవైపు చూస్తున్న చంద్రన్, భరత్ సిస్టర్‌ని సరిగా చెక్ చేయిస్తున్నావా! చూస్తుంటే నెలలు నిండుతున్నట్లున్నాయి. మొహం ఏం అలా వాడిపోయి ఉంది. చాలా వీక్‌గా ఉన్నట్లుంది కూడా! పేరుమోసిన డాక్టర్‌తో ఇంట్లో వుండి స్వంత భార్యను పరీక్షించే తీరుబడే లేదా!"

అంజుకు భయంగా ఉంది. సామాన్యులు కాదు ఈ డాక్టర్లు. అవులిస్తే పేగులు లెక్కపెట్టేట్లు వున్నారు. కరీ తెస్తానంటూ వంటగదిలోకి దూరింది. భరత్ కూడా తనను గమనిస్తున్నాడని మొదటే సందేహపడింది. తిరిగి వాళ్ళకు ఎదురుపడకుండా పండ్లు కోసి ప్లేట్లోకి అమర్చి హాల్లో టీపాయ్‌మీద పెట్టి, అక్కడ అతను తనకిచ్చిన కానుకను తీసుకుని తన గదిలోకి వచ్చి పడింది, ఎందుకోగ్గాని శరీరం వణుకుతుంటే తననుతాను అదుపులో పెట్టుకోవాలన్నట్లుగా చేతిలోనున్న పెట్టెను తెరిచి చూచింది. సన్నని తెల్లగా ధగధగ మెరుస్తున్న మూడు రాళ్ళున్న ఉంగరం వజ్రపుటుంగరం. ఆశ్చర్యంగా దానివైపు చూస్తుండిపోయింది. ఇంత విలువైన కానుకా! బహుశ వాళ్ళకు అతిపెద్దగా అనిపించి వుండదు. మామయ్య ఇచ్చిన నగలే ఇంతవరకు వాడలేదు. అత్తగారి ముత్యాల నగలు తప్పించి.

హాల్లో నుండి స్నేహితుల సంభాషణ చెవులను సోకుతుంటే కదలక మెదలక కూర్చుంది.

"కోలాలంపూరు విశేషాలేమిటి, మనోహర్ ఎలా వున్నాడు" భరత్ అంటున్నాడు.

"అరె! మరచేపోయా! మన మనోహర్‌ది భయంకరమైన కథలే! విన్నావంటే ఆశ్చర్యపోతావు."

"అంతగా భయంకరమైన కథ ఏముంది, ఏం? ఏదైనా గొడవలా!"

"గొడవలయినా పరవాలా! అనుకోని సంఘటన ఎదురయింది. పూర్ మనోహర్?"

"సరే! ఇంతకీ ఏమిటట. వాడి భార్యా పిల్లలు బాగున్నారా!"

"పిల్లలు బాగానే వున్నారు. భార్య సంగతే ఇప్పుడు చెప్పబోయేది. నీకు తెలుసుగా! మనవాడికి కంపెనీ లేందే బుద్ధి ముట్టదని. ఆ రోజు వాడి పెళ్ళాం కర్మ కాలింది. ఎవరూ దొరకలేదని పెళ్ళాం వద్దని ఎంతగా బతిమలాడుతున్నా వినక ఎక్కువగానే తాగించాడు. ఎంత ఎక్కువగా అంటే ఇద్దరూ తమచుట్టూ ఏం జరుగుతున్నదని తెలుసుకునేదానికి కూడా మతిలేనట్లుగా. ఇద్దరూ మంచి నిద్ర. దొంగలుపడ్డారు. ఇంట్లో వున్న నగలు, డబ్బు, వీడియో. టేప్‌రికార్డరు ఇలా విలువయిన వస్తువులతోపాటు, మరొక అత్యంత విలువయిన అదే మనోహర్ భార్య మానాన్ని అందులో ఒకడు దోచుకుని పోయాడు. అప్పటికి ఏంజరిగిందని ఇద్దరికి తెలియలేదు. మరి కొద్దిసేపటికి మనవాడికి పెళ్ళాం అవసరమయి మీద చేయివేసేటప్పటికి కస్సుమందట. ఇప్పటివరకు నా ప్రాణాలు తీసింది చాలదా తిరిగి మొదలా అని. మనవాడికి కొంచెం మత్తు దిగి, "ఏయ్! ఏమిటా వెర్రి వాగుడు. నేనెప్పుడు నిన్ను తాకాను" అని అన్నాడట. "తాకడమా! నా ప్రాణాలు తీసి, తమాషాగా వుందా, ఇంత వెర్రి వుంటే బయటకెక్కడకయినా వెళ్ళండి," అని అరిచిందట. వీడికి పూర్తిగా మైకం వదలి లేచి కూర్చుని భార్యను కూర్చుండబెట్టి బాగా చెప్పు అని కుదిపేటప్పటికి, నిజంగానే, నిజంగానే అని ఆవిడ ఒకే అరుపులట. అప్పటికి వీడికి అనుమానం తగిలి నలువైపులా చూసేటప్పటికి, బీరువాలో గుడ్డలు చెల్లాచెదురయి, డ్రాయర్లను తెరచి, కాగితాలు క్రిందపడి రూమ్ అంతా అల్లకల్లోలంగా వుందట. ఇద్దరికి మత్తు వదలి, ఇల్లంతా కలయచూసి వస్తువులతోపాటే మానం పోయిందంటూ ఆ అమ్మాయి ఒకే ఏడుపు. ఇంతలో బయట పోలీస్‌కార్ల శబ్దాలతోపాటు మనుషుల సందడిలో ఇద్దరూ బయటకు వచ్చి చూస్తే నల్లగా మొద్దుల్లా వున్న ఇద్దరిని గట్టిగా పట్టుకున్న ప్రక్కింటివాళ్ళను చూడగానే వాళ్ళే తమ ఇంట్లోనూ దూరివుంటారని అనుకోగానే ఆగ్రహం పట్టలేక, ఇద్దరిని బాదబాదాడట. పోలీసులు అడ్డుకుని ప్రశ్నిస్తే, పక్కింటి అతను, దొంగతనంచేసి తన భార్యమీద చేయివేయగా చటుక్కున మేలుకుని గట్టిగా అరిచిందని, అతను ప్రక్కనున్న బల్లను వాడిమీదకు విసిరి వాడు క్రిందపడగానే పట్టుకున్నానని పోలీసులతో చెప్తుంటే, వీడు తన భార్యకు జరిగిన అత్యాచారం చుట్టుప్రక్కల వున్నవారిని పిలచి, పోలీసులకు రిపోర్టు ఇవ్వడం, వాళ్ళను దొంగతనం, రేప్ క్రింద అరెస్ట్ చేయడం జరిగాయి. కాని ఆ తరువాతనే వీడిలో ఒకవిధమయిన గిల్టినెస్ మొదలయి, తనవల్లనే అలాంటి అసంభావికం జరిగిందని కుమిలిపోవడం మొదలుపెట్టాడు. ఆ తరువాత పొరుగు

వాళ్ళ మొహాల్ని చూడనే సిగ్గయిందని, వేరే ఇల్లు మారి వచ్చామని, మందివేళ ఇల్లు స్వంతంకాదు కాబట్టి సరిపోయిందని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. ఆ అమ్మాయి అయితే ఒకటే ఏడుపట కొన్నిరోజులు. వీడే ఎంతో ఓర్పుతో తనను మామూలు మనిషిని చేశాడట. అప్పటినుండి తాగడం మానివేశాడు. చూశావా! ఏమైనా వాడిది విశాల మనస్సనుకో! వాడిని చూసి మన మగవాళ్ల నేర్చుకోవాలి. తను ఆ అవమానాన్ని తట్టుకోవడమే కాదు. భార్యను అనునయించి మునుపటి మనిషిలా చేశాడంటే వాడిది వున్నతమైన మనస్సేకాదూ! ఏమిటి అలాగున్నావు. నిజంగా షాక్ ఇచ్చే వార్తే అనుకో!"

"చంద్రన్!" అతని గొంతు చాలా లోతుగా వుంది.

"ఏమిటిరా! నీవేం అలా వున్నావు! మొహం అంతా చిరుచెమట చూడు. చల్లగా ఇంతగాలి వీస్తుంటే నీ మొహాన వానజల్లులా చెమట ఏమిటి?"

"చంద్రన్!"

"ఊ చెప్పు. ఏమిటది."

"చంద్రన్! మనోహర్ స్థలంలో నీవు వుంటే అలా మనస్ఫూర్తిగా స్వీకరిస్తావా!"

"డోన్టాక్ ఫూలిష్! అందులో ఆ అమ్మాయి తప్పు ఏముంది. తప్పంతా మనవాడిది. వద్దన్నా వినకుండా బలవంతంగా ఆ అమ్మాయితో విస్కీ తాగించాడు. తాగించాడే అనుకో! దానికి ఒక లిమిట్ లేదూ! తనతోపాటే సమంగా తాగిస్తే ఆ అమ్మాయి ఎలా నిలదొక్కుకుంటుంది. అందువల్లనే ఏం జరుగుతున్నదని ఆలోచించే శక్తినే కోల్పోయింది. తప్పు మనవాడిదా. ఆ అమ్మాయిదా? ఒక్కసారి నిన్ను ఆ అమ్మాయి పొజిషన్‌లో ఊహించుకో! తప్పెవ్వరిదో ప్రవృత్తి తెలిసొస్తుంది."

"అంటే స్త్రీ శీలం పోగొట్టుకున్నా పరవాలేదు, మనసు విశాలం చేసుకుని ఆదరించు అని అంటావు." భరత్ కోపంగా అంటున్నాడు.

"చూడు భరత్! నీ సంగతి నాకు తెలియదా! ఇద్దరం కలిసి ఆరు సంవత్సరాలు చదివాము. ఎంతో ప్రాణంగా వున్నాము. మన ఇద్దరి స్వభావాలు చుక్కెదురయినా నేనెప్పుడు నీలోని ఉన్నతమయిన ప్రవర్తనకు తల ఒగ్గేవాడిని. నీలాంటి క్రమబద్ధమయిన జీవితం, నీవు అనుసరించే చక్కని పద్ధతులు, నీలో ఉండే స్నేహ భావం, ప్రతిది మా అందరి మనసులో హత్తుకుపోయేవి. మేము నిన్ను అనుసరించి నీలా ఉన్నతంగానే ఉండాలని కోరుకునేవాళ్ళం. కాని అది మావల్ల కానిపని అని తెలుసుకున్నాము. చంద్రునికో మచ్చ అన్నట్లు నీలో ఒక లోపం. అది స్త్రీ విషయంలో. మనం కోరుకున్న విధంగా ప్రతి స్త్రీ ఉండాలనుకోవడం అవివేకం. స్త్రీ మన చేతులలో బొమ్మకాదు. విధి చేతులలో బొమ్మ. తను మనం కోరుకున్న విధంగా అనుసరించాలనుకొన్నా విధి అంత సునాయాసంగా వదలదు. మనోహర్ దాంపత్యం సుఖంగా, సక్ర

మంగా జరిగిపోతూ ఉన్నప్పుడు మధ్యలో ఇలాంటి అవాంఛనీయాలేమిటి? అంతే కాదు స్త్రీ సుఖదుఃఖాలకు కారకుడు ఒక మగవాడు. మనం ఒక రకమైన దుర్మార్గులం. రేపిస్ట్స్ మరొక రకం దుర్మార్గులు అందరం మగవాళ్ళమే. మన అధికారాలకు, మన కోరికలకు బలి అవుతున్నది ఎంత మంది తన భార్యలను అర్థం చేసుకుంటున్నారు, తప్పులు ఎంచడం తప్పించి, మనోహర్ భార్యను అర్థం చేసుకున్నాడు కాబట్టి ఈనాడు సంతోషంగా ఉండగలుగుతున్నాడు. కారణం, అతను అంత మత్తులోను భార్యమీద కోరిక కలిగింది. అందువలననే తనను దగ్గరకు తీసుకోబోయాడు. మనోహర్ అలా ప్రవర్తించకబోతే ఏదీ బయటకు వచ్చి ఉండేదికాదు. ఆ అమ్మాయి తన భర్త అనే సహజంగా ఉండిపోయేది. కాని విధి వుండే అది అంత సులువుగా వదలదు ఏదైతే మనం రహస్యంగా ఉంచుదామనుకుంటామో అదే, గాలిలా నలువైపులా వ్యాపిస్తుంది. అదే మనోహర్ అనేది. నేను ఊరుకుని ఉంటే ఏదీ బయటపడేదికాదు. నాకు నా భార్య అవసరం రాబట్టే జరిగింది. ఏమిటని బయల్పడింది. అలాంటప్పుడు తెలిసివున్నా తెలియకపోయినా జరిగేదేదో జరిగిపోయింది, జరిగిపోయిందానికి తలచితలచి మనస్సును చెడగొట్టుకోవడం తప్ప మరేం ప్రయోజనం ఉంది చెప్పు. నా భార్య చేయని తప్పుకు. నేనే కూడా వేరే శిక్ష వేయాల్నా. ఇప్పటికే తన బాధ చూడలేక పోతున్నాను అని కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు.

ఈమధ్య మలేషియాలో రేప్ కేసులమీద శిక్ష తగ్గించారు. ఋజువులు లేకుండా స్త్రీ చేసిన రిపోర్ట్సు నమ్మి ఎలాంటి శిక్ష విధించడానికిలేదని క్రొత్త లా అమలులోకి తెచ్చారు. రేప్ జరిగిన మరు నిమిషమే పోలీస్ రిపోర్టు ఇవ్వాలని, వెంటనే డాక్టరు సర్టిఫై చేయాలని, ఏ కారణంచేత అలా ప్రవర్తించాడని, ఇలా ఎన్నో ఋజువులు కావాలన్నారు. లేడి జడ్జిలు, లేడి లాయర్లు, యంపిలు, సాధారణ స్త్రీలు ఆ చట్టాన్ని ఖండించారు. కొంతమంది మగ లాయర్లు వాళ్ళను సపోర్ట్ చేశారు. సహజంగా సగంమంది పైన తాము చెరచబడ్డాం అని రిపోర్ట్సు ఇవ్వరు. ముఖ్యంగా మన యిండియన్ స్త్రీలు. రేప్ కేసులమీద సర్వే చేస్తే, రిపోర్టు చేయనివి ఎన్నో బయటకు వచ్చాయి. ఈ సంవత్సరమే నాలుగువందలు నలభై కేసులు పోలీసుల చేతులలోకి వచ్చాయి. కన్నె పిల్లలు, పెండ్లి అయిన వారు, తండ్రిచేత చెరచబడ్డవారు, నమ్మించి నాశనంచేసే బాయ్ ఫ్రెండ్స్, మంత్రగాళ్ళు ఇలా అనేక రకాలు, వీటికి కారకులు మగవాళ్ళం మనమే. ఒక లాయరు అంటాడు తన దగ్గరకు వచ్చిన ఒక డైవర్స్ కేస్ గురించి. ఆ క్లైంట్ భార్య దగ్గరనుండి విడాకులు కావాలన్నాడట. కారణం తన భార్యను తను చూస్తుండగా తుపాకి చూపి మరొకడు రేప్ చేశాడని, ఆ పరిస్థితులలో తను అసహాయంగా వుండిపోయినా, ఏది ఎలా జరిగినా, తను చెడిపోయిన దానిక్రింద లెక్క కాబట్టి తనకు ఆమె అవసరంలేదని, కోర్టులో డైవర్సు దొరికాయి. కాని

ఆ స్త్రీ నాలుగుగోడల మధ్యనుండి బయటకు రావడమేమానుకుంది, మగవాడిని చూస్తేనే వణికిపోతుంది. తను నేరుగా ఒకసారి ఆ అమ్మాయిని కలిసి డైవర్స్ గురించి మాట్లాడితే బదులే ఇవ్వలేదని, భర్త కోరిన విధంగా అలానే సంతకాలు చేస్తానని అందట. ఆ లాయర్ ఏమన్నాడో తెలుసా. నాకేగాని లైసన్సు వుండే ఆ బాస్టర్డ్‌ని నిలువునా షూట్ చేసేవాడిని, వాడొక మొగుడా అని అంటాడు, ఆమె జీవిత గతినే మార్చివేసిన ఈ మగవాళ్ళను ఏం చేయాలి అంటాడు. అంతేకాదు ఇలాంటి కేసులు కోర్టుకు వచ్చినప్పుడు కొంతమంది లాయర్లు ఆ ఆడపిల్లలను వెనుకాలే అవహేళనగా మాట్లాడటం, న్యాయాన్ని అందజేయాల్సిన మాజిస్ట్రేట్ చే, ఒకసారి తనలో ఇవాళ మంచి రేప్‌కేసోయ్, మిస్‌కాకు, కోర్టుకురా అని ముసి ముసి నవ్వులు నవ్వడం తనకు అరికాలిమంట నెత్తికెక్కిందని అంటాడు.

రేప్ కేసులను డీల్ చేసేటప్పుడు, ప్రెస్ వాళ్ళను, ఆడియన్స్‌ను పబ్లిక్‌ని ఎవ్వరిని అలా చేయకూడదని అంటాడు. ఏమయితే ఏం ఇప్పుడు కెమేరా ద్వారా ఆ అమ్మాయిని ఒంటరిగా ఉంచి స్టేట్‌మెంట్స్ తీసుకుంటున్నాను. అలాగే కేసులు డీల్ చేస్తున్నాను, నేను ఒకటి అంటాను భరత్, నీ భార్యను మరొకడు బలవంతం చేస్తున్నప్పుడు నీవు చూస్తూ ఎలా ఊరుకుంటావు. నీలో శక్తి వున్నంత వరకు పోరాడు. వాడి దగ్గర కత్తి వుంది, తుపాకి వుంది అని కుంటి సాకులు చూపకు. అలా నీ ప్రాణానికి భయపడ్డప్పుడు నీ భార్యను స్వీకరించు. బలవంతుడయిన మగవాడివయివుండి అసహాయంగా చూస్తూ వుంటే శారీరకంగా పురుషుని కన్న బలహీనమయిన స్త్రీ తనను తాను ఎలా కాపాడుకుంటుంది. మన యిండియన్ సినిమాలు వున్నాయే అవి అలాగే ఏడుస్తున్నాయి. మన సినిమాలు, మన పుస్తకాలు మనం ఏ దేశంలోవున్నా మన సాంప్రదాయాలను పాటింపచేసే కమ్యూనికేషన్లు చాలా యిండియన్ సినిమాలలో చూస్తుంటాం. స్త్రీ మగవాడి కామానికి బలికాగానే ఆత్మహత్య చేసుకుంటుంది, లేక మారీడ్ అయితే, భర్త చేత, బంధువుల చేత, చుట్టు ప్రక్కల వారిచేత వెలివేయబడుతుంది. సిల్లీగా లేదూ. మనోహర్ నైబర్సు ఎవరూ అవహేళనగా మాట్లాడలేదు, అవమానించలేదు. కాని వీడే భార్య కొరకు వేరే ఇంటికి మారాడు." గుక్క తిప్పుకోవాలన్నట్లు ఆగాడు.

"చంద్రన్! నీవు ప్రతి స్త్రీని అమాయకురాలినిచేసి మాట్లాడుతున్నావు. ఎంతమంది యువతులు లేరు పెండ్లికి మునుపే ఇష్టం వచ్చినట్లు తిరిగి గర్భంతో మరొక పురుషుడి ముందు అమాయకురాలినన్నట్లు నటిస్తూ మోసంతో పెండ్లి చేసుకోవడం, ఆ బిడ్డకు-కట్టుకొన్న వాడిని తండ్రిని చేయాలని భ్రమించడం, దానికి ఏమంటావు. అలాంటి ఆడవాళ్ళను ఏమంటావు. మోసపోయిన మగవాళ్ళను ఏ పేరున పిలుస్తావు. కసాయివాడనే అంటావా! నీకు తెలియదు

చంద్రన్, నాకు ఆడవాళ్ళంటే ఒకప్పుడు ఇంత అసహ్యంలేదు! ఎందుకంటే నా తల్లి, నా పిన్ని స్త్రీలే! ఎందుకో నాకు ఈ ప్రేమలు అవీ నచ్చవు. అందుకే ప్రతి యువతికి దూరంగా వుండేవాడిని. ఒకసారి మధు గర్ల్ ఫ్రెండ్ మధుతో ఇంటికి వచ్చింది. వచ్చిన పది నిమిషాలనుండి, ఆ తరువాత చాలా రోజుల వరకు నన్ను ప్రశాంతంగా ఉండనివ్వలేదు. వేళకాని వేళల్లో ఫోన్‌కాల్స్, హాస్పిటల్‌కు వరుగెత్తుకు రావడం ఒకే డిస్టర్బెన్స్. మధును చెడామడా తిట్టాను, ఇలా ఎవ్వరిని ఇంటికి తీసుకురాకని, ఆ అమ్మాయితో కచ్చితంగా చెప్పాను. ఇలా పిచ్చిపిచ్చి వేషాలే యొద్దని, ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. అలాగే ఇప్పుడే పోలీసులకు, మీ వాళ్ళకు ఫోన్ చేస్తాను. చివరకు ఎలాగయితే ఏం తనను ఒదిలించుకుని ఒడ్డున పడ్డాను. ఇదంతా చూస్తుంటే అసహ్యంగాలేదూ! పెండ్లికాక మునుపు ఎవరి ఎవరో వెనుక చుట్టడం ఆ తరువాత మరొకరిని వివాహం చేసుకోవడం ఛీ! ఛీ! తలుచుకుంటేనే ఛీదరింపుగా వుంది,"

"నీ సంగతి నాకు తెలియదూ! అవర ప్రవరాఖ్యుడివి. పద్మలతను మరచిపోతానా! ఆ రోజు ఏర్‌పోర్ట్‌లో ఎలా వెక్కి వెక్కి ఏడ్చిందో తెలుసా! ఎంత కఠినాత్ముడండి మీ ఫ్రెండు. వారం రోజులనుండి అతను తిరస్కరించినా అతనిని వదలి వెళ్ళాలనేటప్పటికి తిండి తిప్పలు లేకుండా బాధపడుతుంటే, హోటల్లో నాకు గ్రాండ్‌గా సెండ్ ఆఫ్ పార్టి అరేంజి చేస్తాడు. కనీసం ఈ రోజయినా ఏర్‌పోర్టుకయినా వచ్చాడా! మీరెంత వార్నింగ్ ఇచ్చినా నాకు తెలియకుండా నా మనస్సు అతనిచుట్టు భ్రమిస్తూ ఉండిపోయేది. అది నా తప్పుకాదు. అతని రూపం, అతని నడవడిక, అతని తెలివితేటలు నన్ను పిచ్చిదాన్ని చేశాయి. అని ఒకే ఏడుపు. తన సముదాయించేటప్పటికి తలప్రాణం తోకకు వచ్చింది. థాంక్ గాడ్! నేను ఆడదయి పుట్టలేదు. లేకపోతే నేను ఒక వెర్రిదాన్నయి వీధులలో తిరుగాల్సి వచ్చేది. దేవుడు నీకు రూపం ఇచ్చాడుకాని దానిని అనుభవించే హక్కుమటుకు ఇవ్వలేదు. ఏం చేస్తాం. పాపం. అది ఆ అమ్మాయిల దురదృష్టం.

భరత్ నీవు అన్నావే పెండ్లి కాకముందే గర్భవతి అని, అదీ వాళ్ళ తప్పుకాదురా, మనమే దానికి కారణం. ఇద్దరూ ఒకరినొకరు మనస్ఫూర్తిగా ప్రేమించుకుంటే ఇక మొదలుపెట్టాడు మనవాడు, నాతో సినిమాలకు రావడానికి భయమేమిటి, నా గదికి రాకూడదా, అని మొదలుపెట్టి ఆ తరువాత పైన చేయి వేయడం, ఆ అమ్మాయి విదుల్చుకుంటే నీకు నామీద ప్రేమ ఉంటేకదా, లేకపోతే నన్ను కాదంటావా, మనం ఎలాగూ త్వరలో వివాహం చేసుకోబోతున్నాం. అలాంటప్పుడు భయమేమిటి అనీ, ఇలా ఎన్నో ట్రిక్స్‌లు ప్రయోగించి లొంగదీసుకుంటాడు. సహజంగా సున్నిత మనస్కురాలయిన ఆడపిల్ల ఈ మాటలకు లొంగిపోతుంది. తెలివిగల ఆడపిల్ల అయితే తప్పించుకుంటుంది. ఇప్పుడయినా అర్థమయిందా మగవాడిలో వుండే చతురత. ఏమయితేనేం నీ కోరికకు అణు

గుణంగా, చక్కని ప్రతిమలాంటి అమ్మాయి నీకు భార్యగా దొరికింది. "ఫూల్. ప్రేమ దోమ లేదంటూనే మొదటిచూపులోనే అంజానను ఎలా పెళ్ళిచేసుకున్నావు! అది ప్రేమ కాదూ! రోడ్డుమీద ఎదురయిన అమ్మాయిని చూసి వెనుకబడితేనా ప్రేమ. నీది ప్రేమే, మాది ప్రేమే, కాని ఆ ప్రేమించడంలోనే వ్యత్యాసం. అంతే!

అంజు వాళ్ళమాటలు స్పష్టంగా శ్రద్ధగా వింటున్నది. భరత్ తనను మనసులో పెట్టుకునే అలా స్త్రీలను అల్పంగా మాట్లాడుతున్నాడు. తనకు మిగిలి వున్న ఆ కొంచెం ఆశ అడుగంటిపోయింది. ఇక తమ దారులు కలవవు.త్వరలోనే తన దారి తను వెతుక్కోవాలి. బాధగా కళ్ళు మూసింది.

"భరత్! నేను ఒకటి అడుగుతాను. నిజం చెప్తావా!"

అదిరిపడింది అంజు. తిరిగి సంభాషణ ఎటువైపు దారితీస్తున్నదీ అని.

"ఏమిటి?"

"నీవు, సిస్టర్ టేబిల్ దగ్గరకాని, ఇక్కడకాని ఒక్కమాటయినా మాట్లాడుకోవడం చూడలేదు. పైగా తనలోను ఏదో లోపం. నీలోను ముందున్న ఉత్సాహం లేదు. కారణం ఏమిటి? ఇద్దరిమధ్య ఏదైనా స్పర్ధమో!

"ఊహుఁ! అదంతా ఏమీ లేదు. చిన్న మనస్పర్ధ. అంతే!"

"నమ్మలేకపోతున్నాను. చూడు భరత్! నిన్ను నమ్ముకుని, తనవాళ్ళను వదులుకుని సముద్రాలను దాటి ఇంతదూరం వచ్చింది. ఇప్పుడు నీవే తనకు సర్వం. తనను లాలించి, తనను మరిపించి అక్కున చేర్చుకోవాల్సినవాడివి నువ్వు. నీవే పెడమొహంగా ఉంటే తన పరిస్థితి ఏమిటి? తను ఉత్తమనిషి కాదు. ఎన్నో కలలు, కోరికలు వుంటాయి. అవి తీర్చాల్సినవాడివి నువ్వు. నీవు అన్నిటిలోను అదృష్టవంతుడివి. నీకు భగవంతుడు అన్నిటితోపాటు అపూర్వ సౌందర్యరాసిని భార్యగా ఇచ్చాడు. ప్రతి మగవాడు అలాంటి భార్య కావాలని కోరుకుంటాడు. నీవు కోరుకున్నా, కోరుకోకపోయినా ఆ వరాన్ని నీకు దేవుడు ఇచ్చాడు. దానిని కాపాడుకోవలసినవాడివి నువ్వు. ఎంతో తెలివిగలవాడివి, కాని ఆ తెలివి స్త్రీ విషయంలో ఉపయోగించడం లేదు. ఒక స్త్రీ కంట కన్నీరు కురవను, పన్నీరు కురవను కారకుడు ఒక మగవాడు. ముఖ్యంగా భర్త అన్నవాడు. అది గుర్తుంచుకో! అరే! లేటయిపోయింది. మధును చూడాలనుకున్నా! అది కుదరలేదు. నీవు అంజానను పిలుచుకుని కోలాలంపూరుకు రమ్మని ఆహ్వానిస్తున్నా. నా భార్య మీ ఆవిడను చూడాలని చాలా ఆశగా వుంది. నీవు ఇక హాస్పిటల్‌కు పోనక్కేకదా! నేను టాక్సీలో వెళ్ళిపోతాను" అన్నాడు.

"నీ మొహం. ఇక్కడ టాక్సీలు ఎక్కడ దొరుకుతవి. నిన్ను హోటల్ దగ్గర డ్రాప్ చేస్తానురా!" అంటూ అతను తన గదిలోకి వెళ్ళి డ్రస్ మార్చుకొని వెళ్ళిపోయాడు.

"మిసెస్ భరత్! నేను వెళ్ళిపోతున్నాను." హాల్లోనుండి పిలిచాడు. అంజు తలుపు తెరుచుకుని బయటకు వచ్చింది.

"మీ ప్రెజెంటేషన్ చాలా బాగుంది! అక్కయ్యను అడిగినట్లు చెప్పండి. ఈసారి మీరు వచ్చేటప్పుడు అక్కయ్యను పిలుచుకుని రావాలి" అంది.

"అలాగే అమ్మా! ఇలా చూడు. నీవు లేడీడాక్టర్ దగ్గర చెక్ చేయించుకో! చాలా బలహీనంగా వున్నావు. మాస్టరు భరత్ పుట్టగానే బెటర్ ట్రాయి" నవ్వుతూ అన్నాడు.

అంజుకు మొహం వెలవెలపోయింది. అప్పుడే హాల్లోకి వచ్చిన భరత్ మొహంలో నీడలు ఏర్పడడం చూసి మొహం దించుకుంది. అతను అంజుకు గుడ్‌బై చెప్పి భరత్‌తో వెళ్ళిపోయాడు. అంజు నీరసంగా తలపట్టుకుని అక్కడే సోఫాలో కూలబడింది.

సాయంత్రం త్వరగా స్నానం ముగించుకుని డ్రస్ ఛేంజ్ చేసుకుని వరండాలో చల్లగాలికి వచ్చి నిలుచుంది అంజు. మధ్యాహ్నం నుండి మనస్సులో ఏదో కొరత. తనకిక విముక్తే లేనట్లు, తన బాధను పంచుకొనడానికి మరొక తోడు కావాలన్న కోరిక. అందుకే సూజికొరకు ఎదురుచూస్తూంది. ఈ రోజు వచ్చినా తను ఒంటరిగా ఆ గదిలో పడుకోదు. సూజితో ఎక్కడయినా ఈ రాత్రంతా గడుపుతుంది. చాలా రోజులయింది, ఇలా చల్లగా, గాలికోసం సాయం సమయంలో నిలబడి వుండడం కారణం భరత్! అతనికి ఎదుటపడకూడదన్న నిర్ణయానికి రాబట్టి. మధులో కూడా చాలావరకు మాటలు తగ్గించేసింది. ప్రతిరోజు సూజి ఇచ్చే మందుకొరకు రాత్రి పదిగంటల తరువాతనే వెలుపలికి ఎవరికి తెలియకుండా రావడం, అది తీసుకుని వెంటనే తన గదిలోకి పోవడం ఇలా ప్రతిరోజు నిరాటంకంగా జరిగిపోతున్నది. కాని ఈరోజు ఎందుకో మనస్సు పదేపదే తోడు కోరుతోంది. తనకు దగ్గరగా, తల్లి, చెల్లెలు లేరు. తనకు ఒకే ఒక తోడు సూజి. ఈ రాత్రి సూజితోనే పడుకోబోతోంది.

మధు వస్తున్నాడు. అంజును చూడగానే అతని మొహం వెలిగింది.

"అబ్బ! వదినా! ఎన్నిరోజులకు ఇలా నా కోసం ఎదురుచూస్తున్నారు. నా కొరకే కదూ! నిజం చెప్పండి" దగ్గరగా వచ్చి అన్నాడు.

"నీ కొరకే అని ఎందుకు అనుకోవాలి?" ఎదురుప్రశ్న వేసింది.

"అలాగయితే మరెవరికోసమో! ఆఁ. అన్నయ్యకొరకే కదూ!" అతని మొహం చిన్నబోయింది.

"ఛీ! ఛీ! మీ అన్నయ్య మాట ఎత్తకు" చిరాకుగా అంది.

"అయితే మరెవరికొరకు.... ఓహ్! గుర్తుకొచ్చింది. సూజికొరకే కదూ!"

"ఊఁ!"

"ఇప్పటి రోజులలో మీకు మా అందరికన్నా సూజి ఎక్కువయింది"

నిష్ఠూరంగా అన్నాడు.

"ఓ! కోపగించుకోకు మధూ! నీవు నా ప్రియమయిన మరిదివి. సూజి నా మనసుకు నచ్చిన స్నేహితురాలు. ఇలా చూడు. ఆడవాళ్లు మొగవాళ్ళతో చెప్పుకో లేనివి ఎన్నో వుంటాయి. అవి తనతోటి స్నేహితురాలితో మనస్సువిప్పి చెప్పుకో గలదు. తన సమస్యలను కొంతవరకైనా తీర్చుకోగలదు. అరె! మరచేపోయా! ఈరోజు మీ అన్నయ్య స్నేహితుడట. డాక్టరు చంద్రశేఖర్ వచ్చారు. నిన్ను చూడాలని ఎదురుచూశారు. ఇలా చూడు" ఎడమచేయి చాపి చేతికి ఉన్న ఉంగరం చూసింది.

"ఎవరిచ్చారిది."

"అదే! మీ అన్నయ్య స్నేహితుడు. బాగుందా?"

"ఊఁ! వదినా! ఆఫ్టరాల్ ఆ చిన్న వుంగరాన్ని ఎంతో గొప్పగా చూపు తున్నారు. డాడీ ఇచ్చిన నగలు ఎప్పుడయినా ఉపయోగించారా!"

"ఎందుకు లేదూ! ఆ రోజు మీ అమ్మగారి ముత్యాల నగలు వేసుకోలేదూ! ఆ డైమండ్‌వి, ఆ జేడ్‌వి భద్రంగా దాచిపెట్టాను. అవి నీ రాబోయే భార్యకొరకు. నేనివ్వబోయే ప్రజంటేషన్. అవి ధరించే అర్హత, అధికారం నాకులేవు మధూ! నేను ఒక సామాన్యమైన కుటుంబంలో నుండి వచ్చాను. అంతంత విలువైన నగలు ధరించడానికి నా భర్త ఇచ్చినవి కావుగా!"

"ఓహ్! ఈమధ్య మీ మాటలు కఠినంగా ఉంటున్నవి" బాధగా అన్నాడు.

"కొన్ని నిజాలు కఠినంగానే అనిపిస్తాయి. మధూ! ఇంతకూ నీవు పెళ్ళి ఎప్పుడు చేసుకోబోతావు. నీ గర్ల్‌ఫ్రెండ్స్ అంతా ఏమయ్యారు. త్వరగా ఎవరినో ఒకరిని సెలక్ట్ చేసుకో! నాకు తోడుగా వుంటుంది" నవ్వుతూ అతని మొహంలోకి చూసింది.

"ప్రస్తుతానికి ఏ గర్ల్‌ఫ్రెండ్ లేదు. అందరికి ఎప్పుడో గుడ్‌బై చెప్పేశాను. అయినా మీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అన్నాడు.

అంజు పకపక నవ్వింది. "రహస్యమా! మీ అన్నయ్య మధ్యాహ్నం ఒక ఇంప్రైన కథ చెప్పాడులే? నాతోకాదు, తన స్నేహితునితో. నీ గర్ల్‌ఫ్రెండ్ మీ అన్నయ్య వెనుకబడి ఏ విధంగా న్యూసెన్స్‌గా తయారయిందని. అయినా ఎక్కడి మనిషో! అందుకే అంటారు వలచి వస్తానంటే మహా చులకన అని. అది మీ అన్నయ్యకు సరిగా సరిపోతుంది."

"షీలా సంగతా మీరు చెప్పేది. గాడ్! ఇప్పటికి మరచిపోలేను. అన్నయ్య దగ్గర తిట్లు. అదే లాస్ట్. మరెన్నడూ ఇంటికి ఎవరినీ పిలుచుకు వచ్చింది లేదు" తనూ నవ్వాడు.

"ఇంతకి నీ పెళ్ళి సంగతి చెప్పనే లేదు."

"ఈమధ్య మీకి పిచ్చి ఎక్కువయింది. చూడండి వదినా! మీ జీవితం

స్థిరపడేంతవరకు నా పెళ్ళిమాట అనేది లేదు. మరొకసారి ఆ బోరింగ్ మాట ఎత్తకండి" విసుగ్గా అన్నాడు.

"ఏం నీకు మీ అన్నయ్యకులా శీలం పోగొట్టుటున్న ఆడది వస్తుందని భయమా! భయపడకు. పెండ్లికిముందే డాక్టరు దగ్గర చెక్‌చేయిస్తే పోతుంది."

మధు ఆశ్చర్యంగా అంజువైపు చూశాడు. "మైగాడ్! వదినా! మీరు ఏం మాట్లాడుతున్నారో తెలుసా! ప్రతిసారి మిమ్మల్ని మీరే కించపరచుకుంటున్నారు. మీకు అది అవమానంగా లేదూ! మరొకమారు ఇలా మాట్లాడుతుంటే ఇకమీదట మీతో మాట్లాడనే మాట్లాడను" కోపంతో మొహం తిప్పుకున్నాడు.

"అదిగో సూజి వస్తున్నది." సంతోషంగా మధును వదిలి ముందుకు రాబోయింది.

"ఆ సూజిని మర్డర్ చేయాలనిపిస్తున్నది" టక్కున అన్నాడు.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అంది.

"ఆ సూజి మిమ్మల్ని నాదగ్గరనుండి వేరుచేస్తున్నది" కోపంగా అన్నాడు.

నవ్వింది అంజు. "డోన్ట్ బి జలసి."

"వదినా! మీకు పదినిమిషాలు టయిమ్ ఇస్తున్నాను. ఆ తరువాత లోపలికి రాకపోతే నేనే బలవంతంగా లోపలికి పిలుచుకురావలసి వస్తుంది" లోపలికి వెళ్ళిపోయాడు.

అతనిలోని ఆగ్రహానికి అంజుకు చిత్రంగా అనిపించింది. చిన్నగా అర్థం చేసుకుంది. మధు తనమీద విపరీతమయిన అభిమానం పెంచుకుంటున్నాడు. తను మనస్సు సరిలేక అతని ప్రేమను శంకిస్తున్నది. తనకు అన్నలు లేరు. కనీసం బంధువులలోనయినా దగ్గరగా ఎవరూ లేరు. బహుశ సహోదర ప్రేమంటే ఇలాగే వుంటుందేమో!

"అంజూ! ఏమిటి విశేషం. నాకొరకే!" తనకు దగ్గరగా వచ్చిన అంజుతో ఆనందంగా అంది సూజి,

"అవును" తలవూపింది.

"ఏమిటి విశేషం."

"సూజీ! నేను ... నేను ..."

"చెప్పు అంజూ! ఏమిటి కావాలి."

"ఈ రాత్రికి నేను నీతో వుంటాను. నన్ను నీతో ఎక్కడికయినా పిలుచుకుపో! ఈరోజు నా మనస్సు సరిలేదు. ఒక్కదాన్ని ఆ రూమ్‌లో ఉండాలంటే దిగులుగా వుంది. తీసుకుపోతావా?" ఆశగా అంది.

"అలాగే! అంతకన్నా ఏంకావాలి నాకు. నీవేమీవారికి, మధుకు భయపడి శంతోషా ఐలండ్స్‌కు వచ్చిన మరుసటిరోజునుండి రావడం మానుకొన్నావు."

"శంతోషా ఐలండ్స్‌కు రాను, మరెక్కడికయినా పిలుచుకుపో. ఆనాటి అతను గుర్తుకొస్తుంటే ఇప్పటికీ టెర్రర్‌గా వుంటుంది."

"ఓకే! "చేంజ్ అల్లీ"లో మాకు తెలిసినతను గూడ్సు స్టాక్‌చేసి పెడతాడు, అది ముందుక్కు ఉంటుంది. కాని వెనుకన మరొక అతను డ్రగ్స్ సప్లైచేస్తుంటాడు. చూసేదానికి అది బేళ్లుబేళ్లుగా అమర్చివున్న వస్తువుల అంగడని అనుకుంటారు. కాని వెనుక వ్యాపారమే జరుగుతుంది. మనవాళ్ళు అప్పుడప్పుడు అక్కడే కలుస్తుంటది. ఈరోజు అక్కడికి వెళదాం. చేంజ్‌అల్లీ ఆఫీసులకు, బిజినెస్‌కు సెంటరు. "రాబిన్‌సన్" అక్కడే వుంది. అందమైన ఇంగ్లండ్ వస్తువులన్నీ ఒక్కసారిగా అందులో చూడవచ్చు. నీవు ఇంతవరకు చూసి వుండవు. ఎన్నిగంటలకు వస్తావు?"

"నేను, మధు, భరత్‌వాళ్ళ రూమ్‌లకు వెళ్ళిన తరువాతనే రావాలి. నాకోసం, ఎంత ఆలస్యం అయినా వెయిట్‌చేస్తుంటావు కదూ!" ఆతృతగా అంది.

"అలాగే! అంజూ! నాకనిపిస్తుంది నీవు వీళ్ళను వదలివస్తే మనిద్దరం ఎక్కడయినా రూమ్ రెంటుకు తీసుకుని ఎవరి అధికారం లేకుండా హాయిగా ఉండవచ్చుననిపిస్తోంది. ఏమంటావు అంజూ! నీకు ఎక్కడయినా ఉద్యోగం చూస్తాను. ఎవరి జోక్యం లేకుండా ఉండవచ్చు."

"ఆలోచిస్తాను సూజి. నేను భరత్‌కు భయపడటం లేదు. మధుకు గౌరవం ఇస్తున్నాను. మధు నన్ను ఎంతో నమ్మి ఉన్నాడు. అతనిని మోసం చేయలేకనే అనుమానిస్తున్నాను. కాని ఈ రాత్రికి నీవు నాదగ్గరే ఉండాలని కోరుతున్నాను."

"వదినా!" మధు పిలుస్తున్నాడు. ఇంతలోనే భరత్ వస్తున్నాడు. ముదురు రంగు బ్రౌన్‌కలరు పాంటులోకి నావిబ్లూలో చిన్నచిన్న తెల్లని పూవులున్న షర్ట్ టక్‌చేసి వున్నాడు. కుడిచేతిలో గ్యాగుల్సు కారుతాళాలు ఉన్నాయి. ఎడమచేయి పైకెత్తి నుదుటిమీద పడుతున్న వెంట్రుకలను సర్దుకుంటూ వీళ్ళిద్దరివైపు చూశాడు. అంజు అతనివైపు ఒకసారి చూసి కళ్లు దించుకుని మొహం అటువైపు తిప్పుకుంది. భగవంతుడా ఇతనికి భయంకరమైన అందాన్ని ఇచ్చావు, ఆడవాళ్ళను పిచ్చివాళ్ళను చేసి చావమని. ఈ ప్రపంచంలో ఆడపిల్లలే కరువయినట్లు తననుమటుకు ఎందుకు ఎన్నుకున్నాడో. ఈనాడు తనను సుడిగుండంలోకి తోసి తనుమటుకు సంతోషంగా ఉన్నాడు. అతను దాటిపోగానే సూజివైపు చూసింది. సూజి కూడా ఏదో ఆలోచిస్తున్నట్లు వుంది. తనను గుర్తించడం లేదు.

"వదినా! అన్నయ్య పిలుస్తున్నారు," మధు తలుపు దగ్గరవచ్చి నిలబడివున్నాడు.

అంజు సూజి వైపు చూసి రాత్రి నా కొరకు ఎదురు చూస్తూండు అని చిన్నగా పలికి మధు వెనుక లోపలికి వచ్చింది.

* * * *

తెల్లవారు జామున మూడు గంటలకు మెలకువ వచ్చిన సూజి అంజును లేపింది.

"అంజు గెటప్! త్వరగా ఇల్లు చేరాలి. భరత్ ఐదు గంటలకు జాగింగ్‌కు వెళతాడు. ఆ లోపలే నీవు ఇంట్లో వుండటం మంచిది. అతను నిన్న సాయంత్రం మనవైపు అనుమానంగా చూస్తూండి పోయాడు," తొందర చేసింది. సూజీలోవున్న కంట్రోల్ అంజులో వుండదు. మత్తులో కళ్ళు విడివడడంలేదు. అక్కడినుండి కదలాలంటే ప్రాణమే పోతున్నట్లుగా వుంది. కాని తప్పనిసరి. ఇంకా తమతో వచ్చినవారు క్రింద నిద్రపోతున్నారు. విధి లేనట్లుగా సూజీని పట్టుకుని క్రిందకు వచ్చి కారు ఎక్కి కూర్చుంది.

సూజీ కారు స్లోగా డ్రైవ్ చేస్తున్నది. కారు తమ ఫ్లాట్స్‌దగ్గర ఆగగానే అంజూ తూలుతూ దిగింది, ఇద్దరూ లిఫ్టు దగ్గరకు వచ్చారు. లిఫ్టు యంగేజ్‌లో వున్నందువలన వెంటనే పైకి పోలేకపోయారు. అంజుకు ఆలస్యం భరించరానిదిగా వుంది.

"డామిట్! ఈ లిఫ్టు ఎప్పుడూ ఇంతే! సూజీ! కమాన్! మెట్లు ఎక్కిపోదాం, మరొక సెకనయినా ఇక్కడ నిలబడలేను" మత్తుగా వూగుతూ అంది.

"మనది ఆరవఫ్లోర్ తెలుసుకదూ!"

"ఆ! తెలుసు. రా రా! నావల్ల కాదు. లేకుంటే ఇక్కడే పడుకుంటాను.

"ఆ పని చేయకు. మెట్లే ఎక్కుదాం. ఇద్దరూ ప్రక్కప్రక్కగా మెట్లు ఎక్కసాగారు. అంజు గోడపట్టుకుని అరమోడ్పు కన్నులతో ఎక్కుతోంది. చివరిమెట్టు ఒక అడుగులో ఉందనగా గోడను పట్టుకున్న చేయి క్రిందకు జార్చింది. కాలు తడబడటం, హైహీల్ చెప్పు స్లిప్‌కావడం, అన్నీ ఒక్కక్షణంలో జరిగిపోయాయి.

"అమ్మా అన్న కేక నలుమూలలా ప్రతిధ్వనించాయి. అంజు మెట్లమీద నుండి బంతిలా దొర్లుకుంటూ కుప్పలా క్రింద మెట్టుక్రింద రక్తపుమడుగులో పడిపోయి స్పృహతప్పింది. ఒకక్షణం ఏం జరిగిందో తెలియని సూజీ షాక్‌నుండి తేరుకున్నట్లుగా, "అంజూ! అన్న వెర్రికేకతో క్రిందకు పరుగెత్తింది. అంజులో స్మారకం లేదు. అప్పటికే, గార్డ్సు నైట్‌వర్క్ చేస్తున్న టెలిఫోన్ ఆపరేటర్లు, మరొక ఇద్దరు స్టాఫ్ పరుగెత్తుకుంటూ అంజు దగ్గరగా వచ్చారు. సూజీ పిచ్చిగా మధూ, మధూ అంటూ ముందుకు పరుగెత్తి తలుపులు దబదబ బాదసాగింది. తలుపులు తెరుచుకున్నాయి. భరత్, ఆ వెనుక మధు ఒక్కసారిగా బయటకు వచ్చారు.

"వాట్ హాపెన్డ్!" ఇద్దరూ ఒకే కంఠంగా అన్నారు.

"భరత్! మధూ....అంజు...." చెమటలో తడిసిపోతూంది. నోట మాట రావడంలేదు. ఏడుపు తోసుకు వస్తూంది, మనిషి రొప్పుతూంది.

"అంజుకేమిటి, అంజు గదిలో వుంది," భరత్ విసుగ్గా అన్నాడు.

మధు అతనిని తప్పించుకుని ముందుకు వచ్చి "ఏమిటి సూజీ, సరిగ్గా

చెప్పు అన్నాడు."

"మధూ! అంజు మెట్లమీదనుండి పడిపోయింది. మాట్లాడడం లేదు." తిరిగి పరుగెత్తింది.

"ఎక్కడ ..." వాళ్ళ మాటలు గాలిలోకి కలిసిపోయాయి. మధు ముందుకు పరుగెత్తాడు.

భరత్ లోపలికి పరుగెత్తి కోట్ అందుకుని లిఫ్టుగుండా క్రిందకు వచ్చాడు. అతను క్రిందకు వచ్చేటప్పటికే మధు అంజు తలను వడిలో పెట్టుకుని భయంగా చూస్తున్నాడు. అప్పటికే అంబులెన్స్‌కు ఫోన్ చేయడం, మరికొన్ని నిమిషాలలో హారన్ మ్రోగిస్తూ అంబులెన్స్ రావడం జరిగింది. భరత్ ఇంజక్షన్ ఇచ్చి ఎవరో అందించిన దుప్పటితో అంజును చుట్టి రెండు చేతులమధ్య ఎత్తుకుని అంబులెన్స్ లోని స్ట్రెచ్చర్‌మీద పడుకోబెట్టి, మధు వైపు తిరిగి "మధూ కారు తీసుకుని విక్టోరియా హాస్పిటల్‌కు రా." అని "డ్రైవర్ క్విక్!" అంటూ లోనికెళ్ళి కూర్చున్నాడు.

* * *

కళ్ళు తెరిచింది అంజు. కొన్ని క్షణాలు తను ఎక్కడుంది, తనకేమయిందని గుర్తుకు రాలేదు, కళ్ళు పూర్తిగా తెరిచి లేవబోయింది.

"కదలకండి వదినా! అబ్బ ఎన్ని రోజులకు పూర్తిగా కళ్ళు తెరిచారు." మధు గొంతు వినిపించి ప్రక్కకు తిరిగి చూసింది. తన మంచంకు దగ్గరగా తల ప్రక్కగా కుర్చీలో కూర్చుని వున్నాడు మధు.

"నాకేం అయింది మధూ! ఏం కదలలేకపోతున్నాను," నీరసంగా అంది.

"మీకు....మీకు....గుర్తు లేదూ!" మధు మంచంమీద అంజుకు దగ్గరగా కూర్చుంటు అన్నాడు.

అంజు ఆలోచించింది. ఒక్కొక్కటిగా గుర్తుకు రాసాగింది. తను మెట్లు ఎక్కడం, ఒక్క ఫ్లోర్ అయినా పూర్తిగా ఎక్కకముందే, చేయితోపాటు కాలు జారడం, తనకుతాను నిలద్రొక్కుకోలేక దొర్లుకుంటు క్రిందకు జారడం, ఆ తరువాత....ఎంత ఆలోచించినా గుర్తుకు రాలేదు.

ఆ! సూజీ....సూజీ ఎక్కడ?"

"తనను గురించి ప్రస్తుతానికి అనవసరం," కటువుగా అన్నాడు.

"ఇప్పుడు నా గదిలోనే వున్నానుగా?"

"అవును."

"క్రిందనుండి మోసుకు వచ్చావా? బరువు వేయలా!"

"వదినా! మీరు క్రిందపడి వారంరోజులయింది. నిన్నటి వరకు హాస్పిటల్లో వున్నారు. నిన్న కొంచం తెలివిగానే వున్నందువలన అన్నయ్య హాస్పిటల్‌నుండి మిమ్మల్ని తీసుకు వచ్చేశారు. కాని తిరిగి మీరు మైకంలో పడి

పోయారు. మీకు తెలుసా వదినా! మీరు పునర్జన్మ ఎత్తారని. అన్నయ్య మీకు తిరిగి ప్రాణం పోశారు. అన్నయ్యేకాదు మీ దగ్గర మరొక నలుగురు డాక్టర్లు వున్నారు. డాడి, దాన్ అందరూ మీ దగ్గరే ఎప్పుడు కళ్ళు తెరుస్తారా అని అన్నాహారాలు మాని ఎదురు చూస్తూండి పోయారు. అన్నయ్యను చూడు పిచ్చి వాడే అయిపోయారు." అతనికి కళ్ళలో నీళ్ళు చివ్వున చిప్పిల్లాయి.

"మధూ!" అంజు చేయి అందించింది. అతను అది అందుకుని తన రెండు చేతులమధ్య బిగించాడు. మధు చూపులు అంజు వైపే నిలిచిపోయాయి. పాలిపోయిన మొహం, నీరసించిన శరీరం. జీవంలేని కళ్ళు, అంజును చూస్తుంటే అతని ప్రాణం విలవిలలాడసాగింది.

"బాగా భయపడ్డావా! పాపి చిరాయువు అన్నారులే! నాలాంటి వాళ్ళు అంత త్వరగా చావరు. ఇంతకీ మీ అన్నయ్య ఎక్కడ?"

"పిలవనా! హాల్లో వున్నారు."

"వద్దు, వద్దు. నీవు ఆఫీసుకు వెళ్ళలేదూ! మీ అన్నయ్య హాస్పిటల్‌కు వెళ్ళలేదూ."

"అన్నయ్య లీవుమీద వున్నారు. డాడీ, దాన్ మిమ్మల్ని తమతో ఇంటికి పిలుచుకుని పోతామని ఎంతగానో బ్రతిమలాడారు, అన్నయ్య ఒప్పుకోలేదు. ప్రతి పది నిమిషాలకు డాడి ఫోన్ చేస్తూనే వున్నారు మీకు ఎలా వుందని, నిన్న స్పృహలోకి రాగానే ఇంటికి పిలుచుకుని వచ్చారు. కాని తిరిగి కోమాకు వెళ్ళిపోయారు.

"మధూ! నావల్ల మీకెంత కష్టం. మిమ్మల్నంతా చాలా బాధ పెడుతున్నాను." ఏదో అనుమానం వచ్చినట్లుగా ఎడమ చేతితో పొట్టమీద తడివింది,

"అరే! ఇదేమిటి? నా పొట్ట ఫ్లాట్‌గా వుంది. గ్లోబ్ లావున్న పొట్ట ఎక్కడికెళ్ళింది మధూ!"

"వదినా!"

అతని మొహాన బాధారేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎఱ్ఱగా మారిన కళ్ళను చూస్తూ "నీవేమిటి మధూ అలా వున్నావు. నేను చచ్చిపోయానని ఏడ్చావా! నేనులేనూ ఇంత స్టడీగా, ధైర్యంగా వుండాలి, ఇలాంటి అనుభవం ఎదురయి వుండదు, అందుకే అంతలా భయపడుతున్నావు మధూ! ఇంతకీ...." ఆగిపోయింది.

"వదినా మీకు అబార్షన్ అయింది." మెల్లని స్వరంతో అన్నాడు.

"అంటే?"

"అంటే.... మీ కడుపులోనున్న బిడ్డ జీవం లేకుండా బయటకొచ్చాడు."

అంజుకు నోట్లో మాట రాలేదు. అలాగే అతనివైపు చూస్తూండిపోయింది!

"మధూ! నీవు....అ బిడ్డని చూశావా!" హీన స్వరంలో అంది.

"ఊఁ!"

"ఎలా వుంది....ఆడపాప లేక...."

"మగ బిడ్డనే! అచ్చు మీలాగనే ఉన్నాడు, అదే నొక్కుల జుట్టు. చిన్నగా చక్కని ముక్కు. సన్నని పెదవులు, కళ్ళు మటుకు తెలియవు. ఎందుకంటే ఆ కళ్లు మూసుకునే ఉన్నందువల్ల." అతని చేతులమధ్య అంజు చేయి నలిగిపోయింది. అతని మాటలు ఎక్కడో లోతైన ఛాతిలోనుండి వచ్చినట్లుగా వున్నాయి.

చూశావా మధూ! వాడెంత అసాధ్యుడో! నాకు తెలియకుండానే, నా పర్మిషన్ లేకుండా నా కడుపులో చోటు చేసుకున్నాడు. అదే విధంగా నన్నడగకుండా, నాకు తెలియకుండా నా కడుపులోనుండి మాయమయినాడు. చివరకు ప్రాణంలేని ఆ జీవాన్నయినా చూడలేకపోయాను. వాడు అనుకోనుంటాడు ఈ ప్రపంచంలో ఏమూల నయినా నాకు జన్మనిచ్చిన దుర్మార్గుడిని బ్రతికివుంటే ఏనాడో ఎదురు పడకుండా పోను, ఆ కిరాతకుడ్ని చూసేకన్నా ఇలా చావడమే మేలు అనుకుని వుంటాడు. నిజం చెప్పాలంటే నేనే హత్య చేశాను." అంజు కళ్ళలోనుండి నీళ్ళు ధారలు కట్టాయి.

"ప్లీజ్! వదినా! ఏడవకండి. మిమ్మల్ని ఆవహించిన రాహువు వదిలిపోయిందని సంతోషపడండి."

"కాని నాకు ధైర్యం చెప్తూనే నీవు ఎందుకో బాధపడుతున్నావు. మరీ ఇంత సున్నితమైన మనస్సు వుండకూడదు మధూ!"

"నిజం చెప్పాలంటే, మన ఇంట్లో పిల్లలు తిరుగాడే యోగమే లేనట్లు ఉంది. అక్రమమో, సక్రమమో మన ఇంట్లోను ఒక పాపో, బాబో తిరుగాడ్తు తుంటే ఇల్లు నిండుగా వుంటుందని సంతోషపడ్డాను. ఏది ఎలా అయినా ఆ బిడ్డలో మీ రక్తం కలిసి వుంటుందనే ఆశ. కాని ఆ తృప్తి కూడా లేకుండా పోయింది.

"ఛీ! ఛీ! ఏ నీచుడి అంశమో అది. ఆ పవిత్రము ఈ ఇంట్లో తిరుగాడదమా! నీవు పెండ్లి చేసుకుంటే చక్కని రూపం, గుణం ఉన్న పిల్లలు కావాలనుకొన్నంతమంది పుడుతారు. దిగులుపడకు."

"వదినా! నేను ఎంతగా మిమ్మల్ని అభిమానిస్తున్నానో తెలిసి నా దగ్గర నుండి ఎంతో రహస్యంగా వుంచారు. ఇవేనా పురుషుడి దగ్గర చెప్పుకోలేని రహస్యాలు, స్త్రీల మధ్యనే జరిగేవి." అంజు చేతులమీదనున్న సూదుల రంధ్రాలు చూపుతూ అన్నాడు.

అంజుకు క్షణం ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఇప్పుడు తన ప్రవర్తన ప్రతి ఒక్కరికి అర్థం అయిపోయి ఉంటుంది. దానికి తను సిగ్గు పడదు తప్పు చేశానని క్షమించమని అడగదు. తను మనసారా కోరిన కోర్కె అది.

ఎందుకు వదినా మీ శరీరాన్ని ఇలా నాశనం చేసుకున్నారు. ఎందుకు చెప్పండి. అన్నయ్య మనస్సును మనం అర్థం చేసుకున్నదేకదా! అన్నిటిని ధైర్యంతో ఎదుర్కోవాలి అందుకు చాలా ఓర్పు అవసరం అని నిర్ణయించుకున్నామే! అవన్నీ మరచిపోయారా! మీలో దాగున్న మరొక మనస్సును నాకు చూపలేకపోయారు. అంటే నన్ను పూర్తిగా నమ్మలేకపోయారు. నాకిచ్చిన విలువ నాకివ్వలేకపోయారు. అతని మాటలలో అనుకోని దెబ్బతిన్న అవమానంతో కూడిన బాధ.

"ప్లీజ్! మధూ! నన్ను అర్థం చేసుకో! ఆ హెరాయిన్‌కు బానిస అయిన కారణాన్ని ఇప్పటికి చెప్పలేదు. కాని ఇప్పటికి చెప్తున్నాను అది నాకు కావలసిన మనశ్శాంతి ఇచ్చింది. నేను తప్పు చేశాను నన్ను క్షమించు, ఇక చేయను అని మాట ఇవ్వను. నేను సాధారణమైన ఆడపిల్లను, నాలో వేదన నన్నుమించిపోయింది. అది నా వయస్సుకే మించిపోయింది. అది తట్టుకోలేకే అమృతాన్ని అందుకున్నట్లుగా దానిని స్వంతం చేసుకున్నాను."

"మధూ! ఎవరితో మాట్లాడుతున్నావు?" భరత్ గొంతు వినగానే మాటలు ఆపింది అంజు.

"వదిన లేచింది అన్నయ్యా!"

"భరత్ తలుపు తెరుచుకుని లోనికొచ్చాడు. అతనిని చూడగానే అంజు మధు చేతిలోనున్న తన చేతిని విడిపించుకుని అటువైపు తిరిగింది.

భరత్ అంజు దగ్గరగా వచ్చి నుదుటిమీద చేయి ఆనించి చూచాడు.

"మధూ వెళ్ళి హార్లిక్స్ తీసుకురా!" అని మరొక రెండు దిండ్లు తెచ్చి అంజు తల ఒక చేత్తో ఎత్తిపట్టి, మరొక చేత్తో దిండ్లు ఎత్తుగా పెట్టి, తనను కూర్చుండబెట్టి, నుదుటిమీద చిందరవందరగా పడివున్న వెంట్రుకలను సర్దాడు. మధు హార్లిక్స్ తేగానే ప్రక్కనే ఉన్న టేబిల్‌మీదనున్న టాబ్లెట్స్ బాటిల్ తెరిచి చేతిలోకి రెండు టాబ్లెట్స్ తీసుకున్నాడు.

అంజుకు అతను సపర్యలు చేస్తుంటే, ఒక ప్రక్క ఆశ్చర్యం, మరొక ప్రక్క ఆనందంతో మూసిన కళ్ళు తెరవడానికే భయపడింది, తను కళ్ళు తెరిస్తే ఎక్కడ అతను వెళ్ళిపోతాడో అన్నట్లు.

"నోరు తెరువు." అనగానే బుద్ధిమంతురాలిలా నోరు తెరిచింది. అతను మాత్రలు వేసి, హార్లిక్స్ తాగించాడు. తడి టవలుతో మూతి మొహం తుడిచి సరిగా పడుకోబెట్టాడు.

"మధూ! డాడీకి ఫోన్ చేయి మైకం తెలిసిందని. నీకు ఏమైనా పని వుండచ్చు. వెళ్ళి చూచుకో! నేను ఇంట్లోనే వున్నాగా!" అన్నాడు.

"ఊహూ! నేను ఎక్కడకి వెళ్ళనన్నయ్యా! వదినకు తోడు కావాలి. మీరే లీవు కాన్సిల్ చేసుకొని హాస్పటల్‌కు వెళ్ళండి" అన్నాడు.

"నాకు రెండు రోజులు లీవు వుందిగా! ఆ తరువాత హాస్పిటల్‌కు వెళ్ళడం తప్పనిసరి. నేను చూచుకుంటానుగాని, డాడీ అదే పనిగా ఫోన్ చేస్తున్నారు నీవు వెళ్ళిరా! నా లీవు పూర్తయిన తరువాత నీవు రెండు రోజులు ఇంట్లో వుండవచ్చు." అతను అలా అంటుంటే అంజుకు మనస్సులో మధుమీద కోపంగా ఉంది. తమ ఇద్దరిని ఒంటరిగా వదలి వెళ్ళాడే అని.

"ఓకే! అన్నయ్యా! నేను పోతున్నాను. మీరు ఏదో బుక్కు మొహానికి అడ్డుపెట్టుకుని వదినను జాగ్రత్తగా చూడకుండా వుంటారేమో! మీరు నిర్లక్ష్యంగా వుంటే నేను ఆఫీసుకు వెళ్ళనే వెళ్ళను." బెదిరిస్తూ అంజును వదలలేనట్లుగా వదలి వెళ్ళిపోయాడు. అంజుకు తిరిగి నిద్ర వస్తుంటే బలవంతంగా కళ్ళు మూసింది ఎక్కడ ఈ కల కరిగిపోతుందో అన్నట్లు.

"ఏ డాక్టరు తన పేషంటును నిర్లక్ష్యంగా వదలడులే! భయపడకు వెళ్ళు. శ్రద్ధగా చూచుకుంటాగా!" మధును పంపేశాడు.

సాయంత్రం ఆరుగంటలప్పుడు శివసుబ్రమణ్యంగారు, బాన్, పిల్లలు వచ్చారు. సుబ్రమణ్యంగారు కోడలిని పలుకరించి, యోగక్షేమాలడిగి హాల్లో కొడుకులతో మాటలలో పడిపోయాడు. బాన్ అంజుకు టవల్‌బాత్ చేసి, ఒంటి మీదున్న గుడ్డలు, పడక గుడ్డలు మార్చి, సూప్ తీసుకువచ్చి అంజుచేత స్పూన్‌తో తాగించింది. ఆమె అలా చేస్తుంటే అంజుకు కళ్ళలో నీళ్లు తిరిగాయి. అది చూడగానే, బాన్ సూప్‌బేసిను ప్రక్కన టీపాయ్‌మీద పెట్టి అంజును దగ్గరకు తీసికొంది. అంజుకు ఇక దుఃఖం ఆగలేదు. అది ఆపుకోవడం అసాధ్యమయినట్లు ఆమె గుండెలలో తలదూర్చి వెక్కివెక్కి ఏడవసాగింది.

"ఊరుకో అంజూ! అలా ఏడిస్తే తలనొప్పి వస్తుంది. ఇప్పుడు నీ ఆరోగ్యం సరిగా లేదు. ఇలా చూడు. నీ మనసులో కొరత ఏమిటో నాకు తెలుసు. ఇప్పటి సమయంలో నీకు తల్లి తోడు కావాలని నీ మనస్సు కోరుతోంది. ఇలాంటి సమయాల్లోనే ఒక ఆడదిక్కు అవసరం. అందుకే నేను హాస్పిటల్లోనే భరత్‌ను అడిగాను. అతను వినిపించుకోలేదు. మొండిపట్టుదల అతనూ! నేను రోజూ వచ్చి చూస్తుంటాగా. అతనిని తిరిగి అడిగి చూస్తాను. ఏడ్చి మనస్సు, శరీరం పాడుచేసుకోకు." అంజు జుట్టు సరిచేస్తూ అలాగే వుండిపోయింది.

ఇంతలోనే తలుపు తెరుచుకుని లోనికి వచ్చిన భరత్ వాళ్ళిద్దరిని చూసి ఆశ్చర్యపోతూ "ఏమిటి ఏమయింది" అని అన్నాడు.

"భరత్! ఈ అమ్మాయిని నాతో పిలుచుకెళతాను. నేను జాగ్రత్తగా చూచుకొంటాలే! తనకు ఇప్పుడు తల్లి ప్రేమ అవసరం. వారం రోజుల తరువాత పంపుతాగా!" అంది.

"ఊహూ! ఇప్పుడు తనకు తల్లి ప్రేమకాదు ముఖ్యం. డాక్టరు ట్రీట్‌మెంటు. తనకు ఆరోగ్యం సరిపడేంతవరకు వేరొక చోటికి కదల్చడం అపా

యానికి దారితీయడమే! మీరే వచ్చి పోతుండండి చాన్! తనకు పిల్లలతో కాలక్షేపం అవుతుంది" అన్నాడు.

చాన్ నిస్పృహగా అంజు వైపు చూసింది. అంజు ఇక చేసేది ఏమిలేనట్లు వెనుకకు వాలి కళ్ళు మూసుకుంది.

మరునాటిరోజు తిరిగి మైకంతోపాటే జ్వరం మొదలయింది, భరత్ ఇంజక్షన్ ఇచ్చి అక్కడే ప్రక్కనున్న కుర్చీలో కూర్చుండిపోయాడు. అంజు మత్తుగా కళ్ల మూసుకుని వుంది.

హాల్లో అడుగుల చప్పుడుతోపాటే, వంటావిడ గొంతుతోపాటే మరొక ఆడగొంతు వినిపించడంతో భరత్ లేచి హాల్లోకి వచ్చాడు. అక్కడ సూజి.

"నువ్వా!" ఆశ్చర్యంగా అన్నాడు.

"అంజును చూడాలి."

సూజి గొంతు విన్న అంజు నిద్రమత్తు అతికష్టంగా వదుల్చుకుంది. శరీరం బలహీనంగా ఉన్నందువలన లేవలేకపోతుంది.

"వీల్లేదు. మర్యాదగా ఇక్కడినుండి వెళ్ళిపో!" సీరియస్‌గా అన్నాడు.

"నీవు ఏ విధంగా మాట్లాడినా ఐ డోన్ట్ కేర్. అంజును చూసికాని వెళ్ళను" కచ్చితంగా అంది.

"అంజు నా భార్య, నా పర్మిషన్ లేకుండా నీవు తనతో మాట్లాడడంకాని, చూడడంకాని సహించను."

"హుఁ! భార్య. నీకు తను భార్య అయినందువలననే ఆత్మహత్యకు కూడా వెనుదీయలేదు. అంజును ఆదరించి, అనునయించి తన దుఃఖాన్నుండి కాపాడిన దాన్ని నేను. అంజుకు సంతోషాన్ని పంచిఇచ్చినదాన్ని నేను. నువ్వు కాదు. నీవు తన మనస్సును క్షిచిత్రహింసలపాలు చేస్తున్నావు. తనను నరకయాతనకు గురి చేస్తున్నావు. తను ఇప్పుడు నాకు స్వంతంకాని నీకు కాదు. తన మనస్సులో నీకు కాదు స్థానం నాకు. ఈ క్షణాలలో తనను నాతో తీసుకొని వెళ్ళగలిగే చనువు, స్వతంత్రం నాకు ఉంది కాని నీకు కాదు."

ఇదంతా వింటున్న అంజు బిగిసిపోయింది. రెండు భయంకర సింహాలు ఢీకొన్నట్లుగా వుంది. ఏ విధంగానైనా వాళ్ళను ఆపితే చాలు, భగవంతుడా నాకు శక్తినివ్వు. లేవబోతోంది కాని నీరసం వెనక్కు తోస్తోంది.

"సంతోషమా ఇస్తున్నావు. విషాన్ని అమృతమని నమ్మించి తనలోని అణువణువును హత్య చేస్తున్నావు. ఇదిగో! ఇదే లాస్ట్ వార్నింగ్. మరొకమారు నిన్ను అంజుతో చూశానంటే ఆ తరువాత నీవుండేది కమ్ములవెనుక. జాగ్రత్త!" బెదిరించాడు.

"ఏ విధంగా?" వెటకారంగా నవ్వింది.

"ఏ విధంగానా! నీవే డ్రగ్ పుషర్ అని రిపోర్ట్ ఇస్తాను. దీనికి ఆధారం

అంజు గదిలో దొరికిన డ్రగ్స్. మనదేశంలో డ్రగ్స్ వ్యాపారం చేసేవాళ్ళకు శిక్ష ఏమిటో తెలుసుగా! ఉరి. అది గుర్తుంచుకో!"

"యూ ఫూల్! ఆడవాళ్ళను ఎప్పటికి అర్థం చేసుకుంటావు. నిన్ను ప్రేమించి. నీ ప్రేమభిక్ష యాచించాననేకదూ నీకింత చులకన. హూఁ! అందుకే... అందుకే..." అతి వేగంగా వురుకుతున్న ఉచ్ఛ్వాశ నిశ్వాసలను ఆపుకోవాలన్నట్లుగా ఆగి తిరిగి అంది, "నీకు నాలాంటి ఎంగిలి ఆకే దొరికింది అది చాలు నీ అహంకారానికి శిక్ష."

"డోన్టాక్ రబ్బిష్! గెటవుట్ ఫ్రమ్ హియర్" గర్జించాడు.

దబ్ అన్న చప్పుడుతో భరత్ వేగంగా అంజు గదిలోకి వచ్చాడు. అంజు కుప్పలా క్రిందపడి పోయివుంది. శరీరంలో ఎలాంటి చలనంలేదు.

"అంజూ! అంజూ!" భరత్ అంజును కదిలించి చూశాడు. అంజు మైకంలో పడివుంది. రెండు చేతులతో పైకెత్తి పడకమీదకు చేర్చాడు. మరొక రెండు నిమిషాలకు కళ్ళు తెరిచిన అంజు ఎదురుగానున్న భరత్‌ను చూడగానే మొహం తిప్పుకుంది. అతను హార్లిక్స్ తీసుకునివచ్చి స్పూన్‌తో కొద్దికొద్దిగా నోట్లో వదులుతుంటే, అది వద్దని చెప్పలేక బలవంతంగా మింగింది.

అంజు బాగా కోలుకునేటప్పటికి రెండు వారాలు పట్టింది. భరత్, మధు ఇద్దరూ కంటికి రెప్పల్లా కాపాడారు. భరత్ ఈ రెండు వారాలు రాత్రివేళల్లో హాల్లో సోఫాలోనే నిద్రపోయేవాడు అంజు సూజిని కలిసి మాట్లాడాలని తపించిపోతోంది. ఇప్పటికి సూజి అన్న మాటలు తన చెవులలో గింగుర్లు తిరుగుతూనే వున్నాయి. నిన్ను ప్రేమించి, నీ ప్రేమ భిక్షను యాచించాననేకదూ ఈ చులకన. అంటే సూజి, భరత్ వెనుక ఏదో దాగుంది. దానిని గురించి మధుకాని, సూజికాని చెప్పలేదు. హటాత్తుగా ఆవేశంలో నోరు జారింది. అసలు సూజి ఏం తన తల్లిదండ్రులతో చనువుగా, అనురాగంగా కలిసి వుండదు. వాళ్ళ గురించి ఒక్క మాటైనా చెప్పదు. సూజి జీవితంలో ఏదో జరిగింది, తన మనస్సును విప్పి ప్రతిది వివరించింది. కాని సూజి తెరువని పుస్తకంలా అలాగే ఉండిపోయింది.

ఎంగిలి ఆకు, తనేకాదు! సూజి కూడా అంతే! అలా అని సూజియే ఒప్పుకుంది. ఏ విధంగా సూజిని కలవాలి. భరత్ చాలా త్వరగానే వస్తున్నాడు. హాస్పిటల్‌కు వెళ్ళేటప్పుడు. వంటామెకు తనకు కాపలాపెట్టి వెళుతున్నాడు. ఆమె ఒక్క నిమిషమయినా ఏమారడంలేదు. ఈరోజు ఎలాగయినా తనను కలుసుకోవాలి. గట్టిగా నిశ్చయించుకుంది.

అంజు అనుకొన్నట్లు ఆ రోజు జరగలేదు. మరొక రెండు రోజుల తరువాత శనివారం మధ్యాహ్నం వేళ ఇద్దరు కలుసుకున్నారు. అంజును చూడగానే సూజి రెండు చేతులతోచుట్టి కళ్ళనీళ్ల పెట్టుకుంది. "నా వల్లనే కదూ ఇలా

అయింది. అంజూ నన్ను క్షమించు. భరత్, మధు నన్ను అసహ్యించుకుంటున్నారంటే అసహ్యించుకోరూ! నామీద కోపమా అంజూ! నీ కడుపులో వుండే బిడ్డను హత్య చేసిన దానిని నేను. నాకు క్షమాపణే దొరకదు." కళ్ళ నీళ్లు తుడుచుకుంటు అంది.

"ఛీ! ఛీ! అలా ఏడవకు. ఇంతవరకు నీ కళ్ళలో నీళ్లు చూసి ఎరుగను. నీవు నాలా బలహీనురాలివికాదు సూజీ! నీ ధైర్యాన్ని ఆధారంగా చేసుకునే నేను బ్రతుకుతున్నాను. నీవే జేలవైతే నేనెలా కాలం గడపగలను. ఆ బిడ్డ పాపానికి ఫలితం. సరయిన భార్యాభర్తల అనురాగానికి చిహ్నంకాదు. అలాంటప్పుడు నీవు ఏదో కీడు చేశావని కళ్ళనీళ్లు పెట్టుకోవడం సరయినదికాదు. ఇక ఆ బిడ్డ నెలలునిండి పుట్టినా డ్రగ్స్‌తో నిండిన నా రక్తాన్నేకదూ పంచుకుని పుట్టాడు. అలా పుట్టినవాడు సక్రమంగా పుట్టాడా! భగవంతుడు అన్నీ మంచికే చేస్తుంటాడు. కాని ఒక్కటే బాధ, ఆ బిడ్డతోపాటే నేనెందుకు చావలేదు అని. నేనొక డాక్టర్ని కాకుండా ఒక సాధారణ వ్యక్తిని పెండ్లాడి వుంటే ఈనాడు నిండు ప్రాణాలతో నీ ఎదురుగా నిలిచి వుండను," వేదనగా అంది.

"అలా అనకు అంజూ! నీవు ఇలా ప్రాణాలతో వుండబట్టే నాకు భగవంతుని దగ్గర క్షమాపణ అయినా దొరుకుతుంది. నిజంగానే దేవుడు కరుణామయుడు. నిన్నైనా నాకు దక్కించాడు. అంజూ! నాతో వచ్చేయి. మనిద్దరం ఎక్కడయినా ఒకటిగా వుందాం. భరత్ మన ఇద్దర్ని దూరం చేస్తున్నాడు. మన స్నేహాన్ని కించపరుస్తున్నాడు. నా ప్రాణమయిన నిన్ను నానుండి విడదీస్తున్నాడు. ఏమంటావు అంజూ! అతనికి నీకు మధ్య ఎలాంటి అనుబంధం లేనప్పుడు అతడినే నమ్ముకుని అతనితో ఉండడం కేవలం తిండి కొరకేనా! ఆ తిండి అనేది ఈ దేశంలో ఏ చిన్నపనినయినా చేసినా దొరుకుతుంది. ఇది తిండికి గుడ్డకు కరువులేని దేశం. బదులివ్వు అంజూ! చదువుకున్నదానివి, కొన్నైనా స్వాతంత్ర భావాలు ఉండకపోవు. ఎప్పటికైనా నీకు నచ్చినవాడు ఎదురవక పోడు. మరొక వివాహం చేసుకుని పిల్లా పాపలతో సుఖంగా గడపక అతనిన్ని అంటిపెట్టుకుని అడుగడుగునా అవమానాలతో, నీలో నీవే కృంగిపోతూ నీ నిండు బ్రతుకు సర్వనాశనం చేసుకుంటున్నావు. నేను భరత్‌మీద ద్వేషంతో ఈ మాటలు అనడం లేదు. నీమీద ప్రేమవలన నాలో కలుగుతున్న భావాలివి. నిన్ను పూర్తిగా అందరిలా సంతోషంగా గడిపే ఆడ పిల్లలా చూడాలనే!" ఆవేశంగా అంది సూజీ.

అంజుకు సూజికి, తనమీదనున్న ప్రేమాభిమానాలకి కళ్లు చెమ్మగిల్లాయి. తను అంత ధైర్యంగా ఇల్లు విడిచి వెళ్ళగలదా! భర్తకు తనమీద ఎలాంటి అభిమానం, గౌరవం ఉండక పోవచ్చు. కాని తను అలాకాదే! తన ప్రాణాలన్ని అతనిమీదనే నింపుకుని వున్నది. తన మనస్సు ఎంత వద్దనుకొన్నా అతని చుట్టూ

వలయంలా తిరుగుతూనే వున్నది. అలాంటప్పుడు తన జీవితంలో మరొక వివాహమా! మరొక వ్యక్తా! అది ఊహించనైనా ఊహించగలదా!

"మాట్లాడు అంజూ! నా తపన అర్థం చేసుకో! నాకు తెలుసు భరత్ తిరిగి మనల్ని కలువనీయడని, బాగా ఆలోచించు. నా దగ్గర డబ్బుకు కొరవలేదు. నీకు ఎలాంటి లోపం రానివ్వను."

"సూజీ! నిజంగా నామీద నీకింత ప్రేమ అనేది వుంటే ఒక్కసారి, ఒక్కసారయినా నీ గురించి చెప్పావా! నేను నిన్ను నమ్మినంతగా నీవు నన్ను నమ్మకనేగదూ! ఏదో చెప్పలేకపోయావు. భరత్‌కు నీకు మధ్య ఏదో జరిగింది కాని దానిని గురించి నీవు ఏనాడు చెప్పలేదు. అంటే నా దృష్టిలో పలచనయి పోతావనే కదూ!"

"అంటే ఆ రోజు అన్నీ విన్నావా!" ఆశ్చర్యంగా అంది.

"ఊఁ!"

"మై గాడ్! అంజూ! నాకు తెలియనేలేదు. మరి అలాంటప్పుడు ఏం బయటకు రాలేదు."

"రావాలనే ప్రయత్నించాను. మీరిద్దరి తగవు ఆపాలనే అనుకొన్నాను. కాని నా శరీరం నా ప్రయత్నాన్ని విఫలం చేసింది. చివరగా ఎంతో కష్టంమీద పైకిలేచిన నేను తిరిగి స్పృహతప్పి పడిపోయాను."

"అలాగా! భరత్ నిన్ను చూడనీయకుండా అడ్డగించాడు. ఆ పిచ్చి కోపంలో ఏం మాట్లాడుతున్నానో ఆలోచించక నోటికి వచ్చినట్లు వాగాను. అవి మనస్సులో వుంచుకోకు అంజూ!"

"నీవు నోటికి వచ్చినట్లు మాట్లాడిన మాటలు నిజంకాని అబద్ధంకావుగా! నీకు ఇష్టం వుంటేనే చెప్పు, లేకుంటే వదిలేయి. బలవంతంలేదు," నిష్ఠూరంగా అంది.

"కోపగించుకోకు అంజూ! ఏమని చెప్పమంటావు! నేను నీలానే తల్లి దండ్రుల చాటున అపురూపంగా పెరిగిన ఆడపిల్లనని చెప్పనా! వికసించిన వయస్సులో మొట్టమొదటసారిగా ప్రేమ అనే దానికి అర్థం తెలిపిన భరత్ గురించి చెప్పనా! బలవంతంగా ఒక పశువుచేత మానభంగం జరిగిన ఉదంతం చెప్పనా! ఆ తరువాత ప్రతిఒక్కరిచేత వెలివేయబడ్డ సంగతులు చెప్పనా! అదంతా రెండు సంవత్సరాలక్రింద జరిగిపోయిన కథ. తిరిగి నీవు అది వినాలని వుంటే ఎందుకు కాదంటాను. ఓపికవుంటే విను."

"అంజూ! నీలా నేను గ్రాడ్యుయేట్‌నుకాను. కాని మాకు ఇక్కడ ఫిఫ్త్ ఫారమ్ వరకు చదివితే చాలు. ఎక్కడయినా మంచి ఉద్యోగమే దొరుకుతుంది. నేను నా ఫార్మ్ ఫైవ్ పూర్తికాగానే శ్రీకరటరీ కోర్సు చదివి ఒక కంపెనీ ఆఫీసులో శ్రీకరటరీగా చేరాను. నాకు తెలుసు నేను అందంగా వుంటానని, ప్రతి మగ

వాడి హృదయాన్ని కదిలించగలనని. కాని మనస్సుమటుకు ఎవ్వరూ ఆక్రమించలేకపోయారు. నాకు అలాంటి ఆలోచనలేదు. కాని నేను ఊహలలోనయినా తలచని అలాంటి మార్పు అనుకోకుండా ఒకనాడు నాలోను చోటు చేసుకుంది, అది ఒకరోజు సాయంత్రం వేళ లిఫ్టు దగ్గర శరత్‌ను చూడడం, అతనిని చూడడం అదే మొదటి సారి. ఎందుకో అతనిని చూడడంతోనే విచిత్రంగా మనస్సులో ఏదో స్పందన, గుండె వేగంగా కొట్టుకోవడం ఇదంతా క్రొత్త అనుభవం. ఇతను ఎక్కడివాడు. ఈ ఫ్లాట్‌లోనే వుంటున్నాడా! ఈ ఫ్లాట్స్‌లో ఎక్కడ ఉన్నా ఇతనితో పరిచయం చేసుకుని తీరుతాను కాని అలాకాక ఏ విజిటరో అయిన పక్షంలో ఏ విధంగా ఇతన్ని పరిచయం చేసుకోగలను? కాని ఎలాగయినా సాధిస్తాను. నేను వెళ్ళాల్సిన ఆరవ ఫ్లోర్ వరకు ఇతను ఎక్కడ ఆగితే అక్కడ ఆగుతాను. అయినా పలుకరించిచూస్తే తప్పేముంది. నాలాంటి అందగత్తెలోరి పలకరిస్తే ఏ మగవాడు కాదంటాడు,

"హలో! మీరు ఈ ఫ్లాట్స్‌కు క్రొత్తవారా!" పలుకరించాను.

"అవును. నేను రెండురోజుల క్రిందనే స్టేట్స్‌నుండి వచ్చాను. కాని నా బ్రదర్ ఇక్కడనే వుంటున్నాడు," అతను మర్యాదగా బదులిచ్చాడు.

ధైర్యం వచ్చింది. అంటే ఎవరి ఇంటికి విసిటర్‌కాదు. థాంక్‌గాడ్! మనసులోనే నిట్టూర్చాను,

"అలాగా! మీ బ్రదర్ పేరేమిటి? ఏ ఫ్లోర్‌లో ఉంటున్నారు? ఇద్దరం లిఫ్టులో దూరగానే అడిగాను.

"మధుకర్! ఆరవ ఫ్లోర్‌లో చివరి ఇల్లు మాదే!"

ఎగిరి గంతువేయాలనిపించింది. ఎందుకంటే శరత్ ఇంటికి ఇవతలి ఇల్లు మాదే కనుక.

"ఓహ్! లక్కీడే ఈరోజు, మీ ప్రక్కనున్న భాగం మాదే! మధు నాకు తెలుసు." సంతోషంగా అన్నాను.

"ఊహూ!!" అంతే తిరిగి బదులేలేదు.

ఇద్దరం లిఫ్టుదాటి బయటపడ్డాం. అరే! ఇల్లు దగ్గరకి వచ్చేస్తున్నదే! ఇతను మాటలు పెంచడేమిటి. ఏం చేస్తాం. నేనే పొడిగిస్తాను లేకుంటే గబుక్కున ఇంట్లో దూరేటట్లు వున్నాడు. ఇక ఆగలేనట్లు. "ఇంతకీ మీ పేరు చెప్పనేలేదు. ఏం చేస్తుంటారో చెప్పండి," నిజం చెప్పాలంటే అతనిని చూడకపోయినా మధు ద్వారా అతని వివరాలు నాకు తెలుసు.

"నా పేరు శరత్. హార్ట్ స్పెషలిస్టుని!" ఇంటి దగ్గరకు వచ్చేశాం, అతనిని వదిలి వెళ్ళాలంటే అశాంతిగా వుంది.

"నా పేరు అడగనేలేదు." నిష్ఠూరంగా అన్నాను.

"చెప్పండి," చిరునవ్వు నవ్వాడు.

క్షణం నా శరీరం. నా మనస్సు వశం తప్పింది. అతని మధురమైన చిరు దరహాసం చూసి.

"నాపేరు సూజీవాంగ్, మీ ప్రక్క ఇంట్లో ఉండే లిమ్ యూ కూతురిని. సెక్రటరీగా పని చేస్తున్నాను." నాకు నేనుగా వివరాలు అందించాను.

"గ్లాడ్ టు మీట్‌యు," ఒక్కమాటలో కట్‌చేసి లోపలికి వెళ్ళిపోయాడు.

అతను లోనికి వెళ్ళినట్లుగా నేను పోలేకపోయాను. మనసంతా శూన్యంగా వుంది. తిరిగి అతనిని ఎప్పుడు చూస్తాను. ఎలా స్నేహం పెంచుకుంటాను ఇవే ఆలోచనలు. స్నేహం. నిజంగానే ఇది స్నేహమా! స్నేహమయితే ఇలా మనస్సంతా ఏదో కావాలన్న కోరికతో ఏం తపించిపోతున్నది. ఎంతోమంది స్నేహితులు వున్నారే, అప్పుడు కలగని ఈ భావం ఇప్పుడేం ఇలా తన్నువెర్రిదానిని చేస్తున్నది. అతను చివరకు తన జాతి కూడా కాదు. అతను ఇండియన్. తాను చైనీస్. ప్రేమకు జాతి, మతం లేదు అని వూరికే అనలేదు. ఓహ్! అంటే తను ప్రేమలో పడింది. అది మొదటగా! అంటే లవ్ యట్ ఫస్ట్‌సైట్. నాకొరకు భగవంతుడు నిర్ణయించిన వ్యక్తి ఇతనే! భగవంతుడా! ఇవిగో నా మనఃపూర్వక కృతజ్ఞతలు. నాకు చూపించిన ఈ అపురూపమయిన వ్యక్తిని నాకు స్వంతం చేయి. జీవితాంతం నీకు దాసిగా వుంటాను. కనిపించని ఆ దేవుడ్ని మొదటగా మనసారా ప్రార్థించాను.

అతను తిరిగి వెలుపలికి వస్తాడేమో అని రాత్రివరకు ఎదురుచూస్తుండిపోయాను. కాని అతనిని చూడలేకపోయాను. రోజులు గడుస్తున్నాయి. అతనితో పరిచయం ఎక్కువగా పెరగలేదు. కారణం అతని నోటిగుండా ఒక్క సమాధానమేనా పది ప్రశ్నలకు ఒచ్చే జవాబు. ఎంతసేపు అవసరమయినవి, అనవసరమయినవి పిచ్చి ప్రశ్నలతో అతనితో వెర్రిదానిలా సంభాషణ పెంచేదాన్నికాని, అందువలన నాకనివున్న ఆత్మగౌరవం, ఆత్మాభిమానం దెబ్బతింటున్నాయని ఆలోచన కూడా లేకపోయేది. ఒకే ధ్యేయం. అతనిని నావాడిగా చేసుకోవాలన్నదే! అతని అలవాట్లను, వాటికి అతను ఉపయోగించే సమయాలను పనిమనిషి ద్వారా తెలుసుకున్నాను. అతను ప్రతిరోజు ఐదుగంటలకే నిద్రలేస్తాడని, ఆ తరువాత ఆరుగంటలవరకు జోగింగ్‌కు వెళుతాడని, ఆ తరువాత ఏడువరకు స్విమ్మింగ్ చేస్తాడని, ఆటుపిమ్మట అన్ని ఫార్మాలటీస్ పూర్తిచేసుకొని హాస్పిటల్ వెళుతాడని, సాయంత్రం అతను ఒచ్చే టయిమ్ తెలుసుకున్నాను.

ఉదయం అతనితో వెళితే రెండుగంటలసేపు అతనితో గడపవచ్చు. ఇదే నా ప్లాన్. మరుసటిరోజు నాలుగుగంటలకే లేచి కూర్చున్నాను. నాలుగున్నరకల్లా ట్రాక్ సూటులో తయారయి, చిన్న బ్యాగ్‌లో టికిని వేసుకుని వెలుపలికి వచ్చాను. కరక్ట్ ఐదు. అతను వెలుపలికి వచ్చాడు. తెల్ల షార్టు, తెల్ల బనీను టక్‌చేసి వున్నాడు. తెల్ల కాన్వాస్ బూట్లు, చేతిలో చిన్న ప్లాస్టిక్ బ్యాగ్. నాకు

తెలుసు. అందులో అతని స్విమ్మింగ్ ట్రంక్స్, టవల్ ఉంటుందని. అప్పుడే అతనిని చూస్తున్నట్లుగా పలుకరించాను. ఈమధ్య వెయిట్ ఎక్కువయిందని, జోగింగ్ చేయాలని నిర్ణయించానని బొంకాను. అతనినే అనుసరించాను, అది అతనికి నచ్చలేదని అతని మొహమే చెప్తున్నది. కానీ అంత తేలికగా నా ప్రయత్నాలను వదలదలచలేదు. జోగింగ్, స్విమ్మింగ్ అతనిని అంటిపెట్టుకునే చేసేదాన్ని. రోజులు గడుస్తున్నాయే కాని అతని దగ్గరనుండి ఎలాంటి రెస్పాన్స్ లేదు. కాని నేనుమటుకు ఊహలలో అతనితో కాపురం చేసేదాన్ని. నాకూ అతనికి పెండ్లి జరిగినట్లు, అది హిందూ పద్ధతిలో దేవాలయంలో అతనిచేత వసుపుదారం, తాళిబొట్టుతో మూడుముళ్ళు వేయించుకున్నట్టుగా, స్నేహితులకంతా ఇండియన్ పద్ధతిలో డిన్నరు అరేంజి చేసినట్లుగా, ఆ తరువాత అతనితో కాపురం ఏవిధంగా జరిపేది, అతనికొరకు చీర కట్టుకోవడం, వెంట్రుకలు పెంచి జడవేసుకోవడం, మొహాన బొట్టు, తలలో పూవులు, ఒకటేమిటి, ఒక ఇండియన్ స్త్రీకి ప్రతిబింబంగా ఉండాలని, అతను ఇచ్చిన ప్రతి బిడ్డకు తల్లిని కావాలనుకోవడం, అతనితో షికార్లు, అతనికొరకు ఎదురుచూడడం, ఇలా ప్రతి ఆలోచనతో స్వర్గంలో తేలుతుండేదాన్ని. ఆఫీసులో కూర్చున్నా, రాత్రి పడుకున్నా ఎక్కడున్నా, ఏం చేస్తున్నా అతని తలపులే! అతను లేకుండా నేను లేనని, నేను లేకుండా అతను లేడని పిచ్చిదానిలా అతనికే అంకితమయ్యేదాన్ని.

ఇలాంటి టయిమ్‌లో మా బాస్ ప్రవర్తనలో మార్పు. అతనికి దాదాపు నలభై ఐదు పైనే వయస్సు వుంటుంది. మొదట ఎంతో పెద్దరికంగా, చూసేవారికి గౌరవనీయంగా ఉంటున్న అతను క్రమేణా అతని మాటలలో చేతలలో నామీద తనకున్న అభిప్రాయాన్ని చూపించడం మొదలు పెట్టాడు. నాకు అతనిని చూస్తే అసహ్యంతో శరీరం జలదరించేది, కాని ఒక మొండి ధైర్యం వీడు నన్నేం చేయగలడు అన్న. నాకు వీడి ఉద్యోగం జీవనాధారంకాదు. వ్యాపారం మీద ఇంటరెస్ట్ లేకే, మా ఫాదర్ వేరే మనుషులకు జీతాలు ఇచ్చి ఉద్యోగం చేయిస్తుంటే! నేను ఇలా ఆఫీసు లైఫ్ యంజాయ్ చేస్తున్నట్లుగా ఈ ఉద్యోగంలో చేరేనేకాని వాడిచ్చే జీతంకొరకుకాదు. వాడు చాలాసార్లు నైట్ క్లబ్బులకు, హోటల్సుకు ఎక్కడికయినా పోదాం రమ్మని పిలిచేవాడు. నేను చెవిలో వేసుకునేదాన్ని కాను. నా మనస్సంతా నిండిపోయి, నన్ను పూర్తిగా బానిస చేసుకున్న భరత్ రూపం తప్ప నా కళ్ళ ముందర మరొక రూపం నిలువను చోటెక్కడది.

ఎంతో ఓర్పుతో భరత్ దగ్గరనుండి నేనంటే తనకు ఇష్టమేనన్న వార్త వస్తుందని ఎదురు చూసిచూసి చివరకు నాకు నేనే మనసు విప్పి చెప్పాలన్న నిర్ణయానికి వచ్చాను.

ఒకనాడు భరత్ క్రింద పార్టీ ఇస్తున్నాడు. ఆ పార్టీకి నన్ను ఆహ్వానించాడు. సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యాను. అతనిని ఆకర్షించేందుకు అద్భుతంగా అలంకరించుకు తయారయాను. అద్దంలో నా ప్రతిబింబం ముద్దొచ్చేలా వుంది. పార్టీ గ్రాండ్‌గా ముగిసింది. అంతా అతని స్నేహితులు, డాక్టర్లే. పార్టీ ముగిసేంతవరకు, నేనే అతని భార్య నన్నట్లుగా అతనిని అంటి పెట్టుకుని తిరిగాను. పార్టీ ముగిసింది. గెస్ట్స్ అంతా వెళ్ళిపోయారు. నేను మటుకు భరత్‌ను వదలి వెళ్ళలేదు. రాత్రి ఒంటిగంట అయింది. ఇద్దరం కలిసే బయటకువచ్చాం. అతను మా వాకిలి దగ్గరకు రాగానే గుడ్‌నైట్ చెప్పి వెళ్ళిపోబోయాడు. కాని ఇంత చక్కని సమయం వృధా పోనివ్వకూడదని అతనికి దగ్గరగావచ్చి నిలబడ్డాను. తనతో కొంచం మాట్లాడాలని పది నిమిషాలు టైమ్ ఇవ్వమని కోరాను. అతను ఆశ్చర్యపోయినట్లుగా అతని మొహమే చెప్తున్నది. ఇంత రాత్రికి ఏమిటి, రేపు చెప్పకూడదా అన్నాడు. కాని నన్ను నేను కంట్రోల్ చేయడం అసాధ్యమయి పోయింది. అత్యంత సుందరమైన అతని రూపాన్ని ఏ రకంగానైనా నా వశం చేసుకోవాలన్నట్లుగా, ఇక నిలువలేనట్లు అతని చేరువగా వెళ్ళి నా రెండు చేతులను అతని మెడచుట్టువేసి ఐ లవ్ యు భరత్, మీరు లేకుండా ఒక్క క్షణమైనా బ్రతకలేను, నన్ను విడిచి వెళ్ళకండి. నన్ను వివాహం చేసుకోండి భరత్" అని సిగ్గు విడిచి, ఆడదాన్నన్నది కూడా మరచి ప్రాధేయపడ్డాను. అతని చేతులు నన్ను చుడతాయేమో అని ఎదురు చూసిన నాకు అతని రెండు చేతులు తనను చుట్టిన నా చేతులను విధ దీశాయి. మరు క్షణం అతను దూరంగా జరిగి నిలబడ్డాడు,

"చూడు సూజీ! లిక్కర్‌లో ఉన్నందువలన నీవు ఏదేదో మాట్లాడుతున్నావు. పోయి నిద్రపో! రేపు ఉదయం ఇదంతా ఏమి గుర్తుండదు. వెళ్లు. ఇప్పటికే చాలా ఆలస్యమయింది" అన్నాడు.

"లేదు భరత్! నేను చెప్పేది నిజం. నూటికి నూరుపాళ్ళు నిజం. మిమ్మల్ని చూసిన మొదటి క్షణంలోనే మీరు మానసికంగా భర్త అయ్యారు. మీరే నన్ను అడుగుతారని ఇన్ని రోజులు ఎదురు చూశాను. మీ దగ్గర ఎలాంటి బదులు లేకనే నాకు నేనుగా సిగ్గు విడిచి ప్రాధేయపడుతున్నాను. భరత్ మీరు కాదంటే నాకు జీవితమే లేదు. నన్ను కాదనకండి. ప్లీజ్! భరత్! నన్ను.... నన్ను దూరం చేయకండి." అతనిని పట్టుకుని ఏడ్చాను. అతను రాయిలా నిలబడ్డాడేకాని, నా కన్నీళ్ళకు కరగలేదు.

"మాట్లాడండి భరత్! మౌనంగా ఉండకండి" ఎంతగానో ప్రాధేయపడ్డాను.

అతను పెదవి విప్పాడు. అతని నోటిగుండా నన్ను అలరించి ఆనంద పరిచేమాట వస్తుందని ఆశతో నా కన్నీళ్ళ మధ్య ఎదురు చూశాను. కాని నా ఊహల మేడలు కూలిపోతున్నట్లుగా అతని బదులు "సారీ! నీవు అలా భావించుకునేందుకు నేను, నా ప్రవర్తన కారణం అయినందుకు క్షమార్పణ కోరుకుంటున్నాను సూజీ! నీకు నీవుగా నాతో స్నేహం చేశావు. నేను అది ఆదిలోనే తుంచ

ప్రయత్నించాను, కాని నీవే దానిని పొడిగించావు. నాకు ఈ ప్రేమలు వాటిమీద నమ్మకంలేదు. పెద్దలు నిర్ణయించి, నా మనస్సును కదిలించి, తనూ నన్ను మనస్ఫూర్తిగా కోరితేనే నాకు వివాహం అన్నది జరిగేది. అంతవరకు ఇలాంటి ప్రేమ కధలు నా వెనుక పెట్టుకోవడం అన్నది జరగనివ్వను. అంతేకాదు. నాకు నీమీద స్నేహభావం తప్ప మరెలాంటి అభిప్రాయం లేదని మనస్ఫూర్తిగా చెప్తున్నాను. నన్ను మన్నించు" అని వెళ్ళిపోయాడు.

సుడిగుండంలో చిక్కుకుపోయి ప్రాణంమీద ఎలాంటి ఆశలేని వ్యక్తిలా, ఈ ప్రేమ సుడిగుండంలో చిక్కుకుపోయి దానినుండి బయటపడలేక, చేయి అందించే కాపాడే శక్తిలేక అల్లాడి పోయాను. కాని ఎక్కడో మరి కొంచం ఆశ. అతను ఆలోచిస్తాడు. నన్ను చేరదీస్తాడు అన్న ఆశ. ఆ ఆశను చంపుకోలేక పోయాను.

రాత్రంతా ఏడ్చి నిద్రపోయిన నేను ఆలస్యంగా నిద్ర లేచాను. రాత్రి జరిగిందంతా, ఒక్కొక్కటిగా కండ్ల ముందర మెదలసాగాయి. అదంతా కలా నిజమా అన్న అనుమానం, భగవాన్! భరత్ లేకుండా నేను బ్రతకలేను. భరత్ నాకు మటుకే స్వంతం, అతను నా వాడు. నిద్రమత్తు వదుల్చుకుని గడియారం వైపు చూసిన నాకు టయిమ్ పదిన్నర తెలుపుతోంది. భరత్ వెళ్ళిపోయి వుంటాడు. అతని కొరకు కళ్ళు కాయలు కాచేలా సాయంత్రం వరకు బయటే నిలబడి ఎదురు చూశాను,

అంత దూరంనుండి అతను వస్తుంటే గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. కాళ్లు తడబడుతుంటే సంతోషాన్ని, దుఃఖాన్ని కలబోసి ఆశతో ఎదురు పరుగెత్తాను.

చిరునవ్వు నవ్వాడు. "ఎలా ఉన్నావు! రాత్రి పైత్యం దిగిపోయిందనుకొంటాను," అతను అలా నవ్వుతుంటే వెన్నెల కురిసినట్లు వుంది.

బదులు పలకలేక వెన్నంటి వెళ్ళాను. అతను లోపలికి వెళుతుంటే మొట్టమొదటి సారిగా అతను ఆహ్వానించకపోయినా అతని వెనుకనే లోపలికి వెళ్ళాను.

"ఏమిటి? ఏమైనా చెప్పాలా! రాత్రి నీవు చెప్పినదంతా నేను మరచిపోయాలే! ఇలాంటివి ఎన్నోమార్లు విన్నాను." అతను సోఫాలో కూర్చుంటు కాలికున్న సాక్స్ తీస్తున్నాడు. చటుక్కున నన్ను నేను మరచి అతని కాళ్ళ దగ్గర కూర్చొని ఆ సాక్స్ నేనే విప్పబోయాను. అతను కాళ్ళు వెనక్కు జరుపుకుంటూ "సూజీ! ఏమిటిది. రాత్రి మైకంలో ఏదేదో మాట్లాడావనుకొన్నాను. ఇప్పుడు ఇలా!" అతను దిగ్భ్రమగా చూస్తున్నాడు.

"మీరు నావారు. అలాంటప్పుడు మీ పనులు చేయడంలో తప్పేంలేదు." తలవంచుకునే బదులిచ్చాను.

"నీవు....నీవు ఏం మాట్లాడుతున్నావో తెలుసా! మీ తల్లిదండ్రులు చూస్తే ఎంత అసహ్యం. దయవుంచి వెళ్ళిపో; మరొకమారు నన్ను వెతుక్కుంటూరాకు" అతను లేచిపోబోయాడు.

వంటావిడ అక్కడే ఉన్నదికూడా మరచిపోయాను. "ప్లీజ్! భరత్ నన్ను కాదనకు, మీరు కాదంటే నేను పిచ్చిదాన్నయిపోతాను. భరత్ నన్ను నమ్ము," ఏడ్చాను.

"సూజీ! ఇది ఇంపాజిబుల్! రాత్రే చెప్పాను. నా కలాంటి ఉద్దేశంలేదని. అందమైనదానివి నీవు. నీకు తగిన వరుడు మీ జాతిలోనే నీకు భర్తగా వస్తాడు. నిన్ను కళ్ళలో పెట్టుకుని కాపాడుతాడు నన్ను వదిలేయి" అన్నాడు.

అతను విసుగు పైకి చూపడంలేదుకాని అతని మాటలుద్వారా ఋజువవుతోంది. ఏడ్చాను, గొడవ చేశాను, బెదిరించాను. నా కళ్ళ నీళ్ళకు, నా బెదిరింపులకు అతను కరగలేదు, జడవలేదు. ఇదంతా తనకు అలవాటేనన్నట్లు కామ్‌గా ఉండిపోయాడు. చివరకు వంటామెను పిలిచి, నన్ను పంపేయమని తన గదిలోకివెళ్ళి తలుపు బిగించుకొన్నాడు వెర్రిదాన్నయ్యాను. తిండితిప్పలు మానేశాను. నా తల్లి దండ్రులకు ఇదంతా తెలియదు. మా ఫాదర్ మటుకు అప్పుడప్పుడు భరత్‌తో మాట్లాడుతుంటాడు. ఇలాంటి సమయంలోనే జరగరాని ఘోరమే జరిగింది. మా బాస్ ఒకనాడు మర్యాదగా పిలిచాడు. తన కొడుకు బర్త్‌డే అని! తన భార్య నన్ను చూడాలని అంటున్నదని, తనను చూస్తుంటే తన చనిపోయిన అక్క కూతురుని చూస్తున్నట్లుగా ఉంటుందని. నన్ను విందుకు ఆహ్వానించాడు. నేను మొదలుమాదిరి గట్టి మూడ్‌లో ఉండి వుంటే కచ్చితంగా నిరాకరించేదాన్ని. కాని భరత్ వేదనలో మునిగిపోయిన నేను అతని మాట కాదనలేక, అతని భార్యను పరిచయం చేసుకోవచ్చునన్నట్లుగా అతని ఇంటికి ఆఫీసు వదలగానే, పిల్లవాడి ప్రజంటేషన్ కొనుక్కొని అతని కార్లోనే బయలుదేరాను. అతని బంగళా జూరింగ్ ఏరియాలోనే ఉన్నది. అన్ని పెద్దపెద్ద బంగళాలు, కారు పోర్టికోలో ఆగింది. పెద్దపెద్ద కుక్కలు నాలుగు ఎదురయినవి. ఇంట్లో ఏలాంటి సందడిలేదు. నిశ్శబ్దంగా ఒక విధమైన భయంకర వాతావరణం నెలకొని ఉంది. ఎందుకో మనసు కీడును శంకించింది. అయినా ధైర్యం కూడగట్టుకున్నాను. అప్పటికే చీకట్లు ముసురుకుంటున్నాయి. హాల్లోకి అడుగు పెట్టాను. గెస్ట్స్ లేకపోతేపోని కనీసం పనివాళ్ళ అలికిడయినాలేదు.

"బాస్ మీ భార్యా పిల్లలు ఎక్కడ" అని అనుమానం వెలుపరచక ధైర్యం నటిస్తూ అడిగాను.

"అతిధులందరిని ఇన్‌వయిట్ చేయలేదు. అందువల్ల సందడిలేదు. పైన వుంటారు పద" అని ముందుకు పోసాగాడు.

ముందుకు పోవాలా, వెనక్కు తిరిగి పోవాలా ఆలోచిస్తూ, అనాలోచితంగానే ముందుకు అడుగేశాను. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ చివరకు పై భాగాన్ని చేరుకున్నాను. నా వెనుకే నాలుగు కుక్కలు నాలుగు నల్ల పిశాచాల్లా నాలుకలు తెరుచుకుని చూస్తున్నాయి. ఒక్కసారి ఆ హాలంతా కలయచూశాను. చటుక్కున నా వెనుకన తలుపులు మూసుకున్న చప్పుడు. తాళం తిప్పుతున్న చప్పుడు. వెనుకకు తిరిగి చూశాను. వాడు అదే మా బాస్ పళ్ళు ఇకిలించి నిలబడి వున్నాడు.

"బాస్! మీ భార్యా పిల్లలు ఎక్కడ?" భయంగానే అడిగాను.

"భార్యా! పిల్లవాడు, నా భార్య ఇక్కడుంటే నిన్నెందుకు ఇంత తెలివిగా పిలుచుకుని వస్తాను," పకపక నవ్వుతున్నాడు. ఒక్క క్షణం వాడిని చూస్తుంటే టైగర్ బామ్ గార్డన్స్‌లో మనం చూశామే. చిన్న సైజు పర్వతంలాంటి పొట్ట, నున్నటి గుండు, పళ్ళు ఇకిలించి కూర్చునివున్న చీనబొమ్మ అలా ఉన్నాడని పించింది. ఎద్దులా నామీద దూకాడు.

"సూజీ మర్యాదగా ఒప్పుకో! నా చేతిలో చిక్కుకున్న ఆడది తప్పించుకున్న చరిత్రే లేదు. అందులో నీవేమీ తీసిపోవు. నీ అంత నీవు ఒప్పుకున్నావో, కొంచం తేలికగానే కోరిక పూర్తవుతుంది, అలా కాకుంటే నిన్ను చిత్రహింసలు పెట్టి అనుభవిస్తాను. జాగ్రత్త. ఇక్కడనుండి నీవు ఏ విధంగానూ తప్పించుకోలేవు. వెనుకల చూడు, ఆ నాలుగు కుక్కలు నిన్ను ఏ భాగానికాభాగం చేస్తాయి. ఆ కుక్కలకు కనికరమేలేదు."

అడుగడుగు దగ్గరకి వేస్తున్నాడు. ఆ క్షణంలో నాకు గుర్తుకు వచ్చిన వాడు భరత్. నన్ను తను స్వీకరించి వుంటే ఈ క్షణం ఈ భయంకర పిశాచం ఎదురుగా నిలబడి వుండేదాన్నా, ఆ రోజే ఆ ఉద్యోగానికి స్వస్తి చెప్పి ఉండే దాన్ని. ఇలా ఈ వెధవ ఇంటికి వచ్చివుండే దాన్నికాదు.

భరత్! నన్ను సర్వనాశనం చేశావు. నా కడుపుమంట తగలకపోతుందా! నా కథ ఈ రోజుతో ముగిసిపోతున్నది. భగవంతుడు కూడా నన్ను ఈ క్షణం కాపాడలేడు,

"ఏమంటావు?" అప్పుడే జూ నుండి తప్పించుకుని వచ్చిన బాబూన్‌లా ఉన్నాడు. పాములా వాడు నామీద పాకుతుంటే కళ్ళు మూసుకున్నాను. ఆ తరువాత ఏముంది, నాలో ఉన్నది పోగొట్టుకుని పిచ్చిదానిలా వాడి వైపు చూశాను. నాముందు కొంత డబ్బువున్న కట్ట. "ఇదిగో ఇది తీసుకుని వెళ్లు, ఇలా జరిగిందని, పోలీస్ రిపోర్టుకాని, మరెవరికైనా చెప్పావో నీ బ్రతుకు ఆ రోజుతో ముగిసిందనుకో. నా బావమరిది పేరు మోసిన గాంగ్‌స్టర్. వాడి దగ్గర నీ గురించి ఒక్కమాట చెప్పానంటే, చాలు నీ శవం నడిరోడ్డులో పడి వుంటుంది. అలా కాకుండా అప్పుడప్పుడు నా కోరిక తీరుస్తున్నావంటే, కారు, బంగళా అన్ని

ఇస్తాను, వెళ్లు. నేను చెప్పినదంతా గుర్తుంచుకుంటావనుకొంటాను.

నేను నడిచానో, లేక గాలిలో తేలి వచ్చానో నాకే తెలియదు. ఏ విధంగా ఇల్లు చేరానో నాకే అర్థం కాలేదు. నేను చేసిన మరొక పొరబాటు నా తల్లిదండ్రుల దగ్గర చెప్పక పోవడం. కాని నాలో మెల్లగా కసి రాజుకుంటోంది పగ. పోలీసు రిపోర్టు ఇవ్వవచ్చు. వాడికి ఏ రెండుమూడు సంవత్సరాలో జైలు శిక్ష పడుతుంది. తిరిగి యధా ప్రకారం వాడి అక్రమ కార్యాలు సాగుతూనే వుంటాయి. నాకు కావలసింది వాడికి జైలు శిక్షకాదు. వాడు నన్ను ఏవిధంగా భయంచూపి నాశనం చేశాడో అలాగే వాడు అణువణువునా భయంతో కృంగి కృశించి చావడం. దానికి చాలా నేర్పు. ఓర్పు అవసరం. వారం రోజులు వెఱ్ఱి దానిలా ఆలోచించాను, చక్కని ప్లాన్ తయారు చేశాను. కాని అది నెరవేరాలంటే మరొక వ్యక్తి తోడు అవసరం. ఆ వ్యక్తి అందుబాటులో వున్నాడు. ఇన్ని రోజులు అతనిని నేనే దూరంగా ఉంచాను. అతను నాకోసం ఏమైనా చేయగలడు. అతనికి కావలసింది నేను. అంతే! ఒకసారి చెడ్డా, పదిసార్లు చెడినా, చెడినదాని క్రిందే లెక్క. నా వర్జినిటీ నన్ను వదిలిపోయింది. వారం తరువాత ఆఫీసుకు వచ్చాను. అతని పేరు "మైకల్ చువా!" మైకల్‌ను పిలిచాను. అతను పొంగిపోయాడు. సాయంత్రం నా కొరకు కాచుకు వుండమని ఇద్దరం ఏదైనా హోటల్‌కి పోదామని చెప్పాను. ఆఫీసు వదలగానే ఇద్దరం హోటల్ వైపు దారి తీశాం. ఎవరి అంతరాయం లేకుండా మూలగానున్న టేబిల్ బుక్ చేయించుకున్నాము.

"మైకల్!" అతని చేతిని నా చేతిలోకి తీసుకొని నొక్కాను. అతనికి మొదటినుండి నా ప్రవర్తన అయోమయంగా ఉంది. అతను ఆనందంగా నా చేతిని మరొక చేతిలో మూసి సూజీ! నీవు నీవేనా!" ఆశ్చర్యంగా అన్నాడు. "ఇప్పటి సూజి వేరు మైకల్. నీవల్ల నాకొక సహాయం కావాలి. అందుకు ప్రతిఫలంగా నన్ను నేను ఇచ్చుకుంటున్నాను. కాని నేను కోరేకోర్కె చాలా రహస్యంగా వుంచాలి, అది ఏ విధంగా బయటపడినా మనిద్దరం జైలు కమ్మీల వెనుక వుండవలసి వస్తుంది. బాగా ఆలోచించుకో, నేను నీకు కావాలనుకుంటే నేను కోరిన సహాయం చేయి." అతను మనస్ఫూర్తిగా ఒప్పుకున్నాడు, నా ప్లాన్ వివరించాను. నేను ఏ విధంగా సర్వనాశనమయింది రహస్యంలేకుండా చెప్పాను. నాకు కావలసింది పగ తీర్చుకోవడం. అందుకు అతను ఒప్పుకున్నాడు.

రెండు రోజుల తరువాత మైకల్ మా బాస్ బావమరిది గురించి వివరాలు తెలుసుకుని వచ్చాడు. వాడి పేరు టీలూచిన్. సాధారణమైన గాంగ్‌స్టర్ కాదు! బ్లాక్ క్యాట్ గ్యాంగ్ లీడరు. అంతేకాదు అండర్ గ్రౌండ్ మెంబర్ కూడా! వాడు పోలీస్ లిస్టులో మొదటి వాడు. ఒక తమాషా ఏమిటంటే మా బాస్ నన్ను బెదిరించినట్లుగా అది నిజంకాదు. మా బాస్‌కు బావమరిది అంటే టెర్రర్. వాడు

వస్తున్నాడంటే, డబ్బు రెడీగా పెట్టుకుని పీడు కాచుకుని వుండాల్సిందే! ఏ టయిమ్‌లోనయినా, ఎక్కడయినా, పీడిని కలుసుకుని వాడి పని సాధించుకుని పోతాడు. అంత దుర్మార్గుడయినా వాడికి అక్క అంటే ప్రాణం, ఆ అక్క కొరకు ఏదైనా చేస్తాడు. నాకు కావలసిన అద్భుతమైన క్లూ దొరికింది. మరొక వారం రోజుల తరువాత అమాయకురాలిలా కొంచం మాట్లాడాలంటు మా బాస్ ఎదుట నిలిచాను. వాడి మొహం వెయ్యి నియన్‌లైట్ల వెలుగులా వెలిగింది. నేను వాడిని తీసుకొని, హోటల్ వైపు కాదు, జపనీస్ గార్డన్స్ వైపు తీసుకెళ్ళాను.

రకరకాల పూలతోటలు,, అందమైన సరస్సు, ఇంద్ర ధనస్సులాంటి వారధి, ప్రతి క్యామెరాకి పని కల్పించే అందమైన గార్డన్స్ అవి. చీకట్లు ముసురు కుంటుంటే వచ్చిన విజిటర్లంతా వెళ్ళిపోతున్నారు: నిర్మానుష్యంగానున్న చోటు చూసుకుని! పొదలు చాటుగా చేసుకుని ఇద్దరం కూర్చున్నాం. వాడి అవసరం ఆపుకోలేక పోతున్నాడు. సాధ్యమయినంతవరకు నేను అర్థ నగ్నంగా తయారయ్యాను. వాడి పరిస్థితి అలాగే ఉంది. ఫ్లాష్ తటుక్కున నాలుగయిదు సార్లు మెరిసింది. అన్ని రకాల పోజులు వాడితో కలిపి ఇచ్చాను. వాడికి అనుమానం వచ్చినట్లుంది. ఫ్లాష్ వెలుతురులా లేదూ అన్నాడు ఉలిక్కిపడి. ఎక్కడో టూరిస్టులు ఏవో ఫోటోలు తీసుకుంటున్నారులే అని త్రోసి పుచ్చాను. మరుసటి రోజు నా చేతిలో ఐదువేల డాలర్లు పెట్టాడు. ఈసారి డబ్బు వద్దనలేదు. మరొక నాలుగు రోజుల తరువాత లంచ్ అవర్లో ఇద్దరం వాడి గదిలోనే మాట్లాడుతున్నప్పుడు, ప్యూన్ అందించిన టపా విప్పాడు.

"పర్సనల్" అన్న కవర్ అందుకని నా ఎదుటే తెరిచాడు. నేను ఊపిరి ఉగ్గబట్టి చూస్తున్నాను వాడిలో కలిగే మార్పులు తలుచుకుంటు. కవరు తెరిచి లోపలున్న రెండు ఫోటోలు, ఒక చిన్న స్లిప్ బయటకు తీశాడు. స్లిప్‌మీద టైప్ చేయబడిన అక్షరాలు వాడితోపాటే నేను చదివాను. ఈ రెండు ఫోటోలేకాదు, మరికొన్ని పోజులలో మరో నాలుగు నా దగ్గరున్నాయి. యాభై వేల డాలర్లు పెట్టి కవరును రేపు రాత్రి ఎనిమిది గంటలకు మీ ఇంటి బయటనున్న డస్ట్‌బిన్‌లో వేయి. అలా చేయకుండా పోలీస్ రిపోర్టు ఇచ్చావంటే ఈ ఫోటోలు ప్రతి ఒక పేపరుకు పోతుంది. అంతేకాదు నీ బావమరది చేతులలోకి చేరేటట్లు చేస్తాను. ఆ తరువాత ఆ కసాయివాడి చేతులలో నీ పని ఖాళీ, జాగ్రత్త.

అంతే! అది చదవగానే కుర్చీలో మైకంతో పడిపోయాడు. శరీరమంతా చెమటలో తడిసిపోయింది. నా మొహం సంతోషంతో దిగ్విజయంగా వెలిగింది నీళ్ళు తెచ్చి మొహాన చల్లాను. వాడు కళ్ళు తెరవగానే కల్లబొల్లి ఏడ్పులు ఏడ్చాను. వాడు పరువుకుకాదు ముఖ్యంగా ఏడ్చేది వాడి బావ మరిదికి, వాడు తన అక్కకు జరిగే అన్యాయం ఏమాత్రం సహించడు. మరుసటి రోజు డస్ట్‌బిన్‌లో యాభై వేలు క్రొత్త నోట్లకట్లతో కవరు దొరికింది. మైకల్ సగం, నేను సగం తీసుకున్నాము. ఈ విధంగా రెండు నెలల్లో పదిసార్లు చేశాము. ఆ తరువాత అడుగడుగునా ఫోన్ కాల్సు, మైకల్ ఎవరి ద్వారానో చేయించేవాడు. వాడికి డబ్బు మటుకేకాదు, మనశ్శాంతి కరువయేటట్లు చేశాం. ఇంటికి ఆఫీసుకు ఒకే విధమైన ఫోన్ కాల్సు. ఆఫీసులో ఎవరిని చూసినా ఉలిక్కిపడేవాడు. నన్ను చూస్తే త్రాచుపామును చూసి జడుసుకునేట్లు వణికి పోయేవాడు. ఆ తరువాత నా సాన్నిహిత్యం అంటేనే బెదిరిపోయేవాడు. ఒకనాడు సడన్‌గా వాడి బావమరిది వాడి ఆఫీసు గదిలోకి వచ్చాడు. నేను మైకల్‌కు సైగ చేశాను. మైకల్ చాలా తెలివిగా గొంతు మార్చి ఫోన్ చేశాడు. అతని ఫోన్ వచ్చే సమయంలో నేను ఫైల్ తీసుకుని, పని ఉన్నట్లుగా వాడి గదిలోకి దూరాను. బావమరిది ఎదురుగా నిలబడి ఉన్నాడు. వాడి మునికాళ్ళమీద నిలబడినట్లు అసహనంగా ఉన్నాడు. మొదటే బావమరిదిని చూసి వణికిపోతున్నాడు. నేను అక్కడికి రావడం, ఫోన్‌లో మైకల్ చేసే బ్లాక్‌మైల్.

ఒకసారి చమటలు క్రక్కుతున్న మొహంలో నన్ను, వాడి బావమరిదిని మార్చి మార్చి చూసి, "ఆ" అని గుండె పట్టుకున్నాడు. ఫినిష్! వాడి కథ పూర్తయింది. తెరుచుకున్న నోరుతెరుచుకునే ఉండిపోయింది. కళ్ళు తేలిపోయాయి. చలనరహితంగా వుండిపోయింది శరీరం. నా కసి తీరిపోయింది. వాడి బావమరిది పారిపోగానే విరగబడి నవ్వాను. మరుసటిరోజు వాడికి అంత్యక్రియలు జరుగుతుంటే ఆఫీస్ స్టాఫ్‌కంతా నా బర్త్‌డే అని గ్రాండ్‌గా పార్టీ ఇచ్చాను." పకపక నవ్వింది.

అంజు భయంగా, వింతగా, కళ్ళు పెద్దవిచేసి సూజివైపు చూస్తూండిపోయింది. తనకు నోట్లో కూడా మాట రావడం లేదు. తను ఒక క్రొత్త సూజిని చూస్తున్నది. తన సూజియేనా!

చటుక్కున సూజి నవ్వు ఆపింది. కళ్ళనిండా నీళ్ళు చిప్పిల్లాయి, "అంజూ! నా పగ తీరిపోయింది. కాని ఆ తరువాతనే నా అసలు కథ మొదలయింది.

నా కార్యం సాధించేంతవరకు భరత్‌ను కలుసుకోవడంగాని, చూడడంగాని జరగలేదు. ఒకవిధంగా చెప్పాలంటే నా లక్ష్యసాధనలో అతని ఉనికినే మరచిపోయాను. కాని ఒకరోజు.... ఆరోజు ఆదివారం. నా తల్లిదండ్రులు ఇంట్లోనే వున్నారు. మధ్యాహ్నవేళ. బాత్‌రూమ్‌లోకి వెళ్ళిన నేను కాలుజారి పడిపోయాను. దానితో మైకం క్రమ్మింది. కళ్ళు తెరిచేటప్పటికి ఎదురుగా నా తల్లిదండ్రులతోపాటు స్టెతస్కోప్‌తోపాటు భరత్ నిలబడి వున్నాడు. అతని చూపు.... ఆ చూపు.... అంజూ! ఈ జన్మలోనే కాదు ఎన్ని జన్మలయినా గుర్తుండే చూపు. అతనికి నామీద ఉండే ఏవగింపు అంతా ఆ ఒక చూపులోనే దాగుంది. నీరుగారిపోయాను. అతను మొహం అసహ్యంగా తిప్పుకుంటు నన్ను

మరొకసారి చూస్తేనే పులికిపడుతున్నట్లుగా అక్కడినుండి వెళ్ళిపోయాడు. మా అమ్మా నాన్న పిచ్చివాళ్ళే అయిపోయారు. నన్ను ఎదిగిన దాన్ననికాని, నా సంపాదనతో నేను బ్రతుకుతున్నాననిగాని కూడా తలచక కేవలం వాళ్ళింట్లో ఒక బానిసనన్నట్లు గొడ్డును బాదినట్లు బాదారు. దీనికంతా కారణం నేను గర్భవతి. ఆ రోజుతో నాకు వాళ్ళకు మధ్యనున్న అనుబంధం తీరిపోయింది.

అంజూ! మా చైనీస్‌లో ఆడ పిల్లలకన్న మగవాడి పుట్టుకనే ఎక్కువగా కోరుతారు. ఆ సంతోషాన్ని పంచుకోను కోడిగుడ్లను ఎఱ్ఱని రంగులో ఉడకబెట్టి అందరికీ పంచుతారు. మగవాడు డబ్బు సంపాదించడంలోను, వ్యాపార విషయాలలోను, ఎంతో తెలివి తేటలు చూపుతారని, తమ చివరి రోజులవరకు తోడు నీడగా ఉంటారని, ఆడ పిల్లల వలన ఎలాంటి ఆదాయం వుండదని తక్కువ అభిమానమే చూపుతారు. స్పష్టంగా చెప్పాలంటే ఆడ పిల్లల పుట్టుకను విధిలేని పరిస్థితిలోనే స్వీకరిస్తారు. కాని నా విషయంలో నా తల్లి దండ్రులు అలాంటి భేదాభిప్రాయం చూపలేదు. ఇప్పటి నా పరిస్థితి వాళ్ళను పూర్తిగా మార్చేసింది. వాళ్ళు ప్రతి తల్లి దండ్రుల్లా కూతురు ఎలాంటి కళంకం లేకుండా వివాహం చేసుకుని పిల్లా పాపలతో సుఖంగా వుండాలనే కోరుతున్నారు. వాళ్ళ కోర్కె మట్టి పాలయింది. నన్ను చూస్తూనే చీదరించుకునేవారు. ఆనాటినుండి నేనొక "పేయింగ్ గెస్ట్"గానే ఉండిపోయాను. వాళ్ళకు నాకు ఎలాంటి సంబంధ బాంధవ్యాలు లేవు. ఆ తరువాత అబార్షన్ చేయించుకున్నాను, కరాటే, జూడో నేర్చుకున్నాను. అదే ఆర్ట్సు మొదటే తెలుసుకునివుంటే ఆ మద పిశాచిని నా కాళ్ళ క్రిందే తొక్కి వుండేదాన్ని. అందువలననే ఆనాడు శంతోషా ఐలండ్స్‌లో చంద్రన్ నీమీద చేయివేస్తే సహించలేకపోయాను. ఒకేఒక దెబ్బతో క్రిందకు తోశాను. ఆ తరువాత నాకు నచ్చినవాడు అనీ కాదు, నన్ను కోరిన ప్రతి మగవాడిని నన్ను నేను కానుకగా ఇచ్చుకున్నాను. ఒక్కొక్కసారికి రెండువేలుపైనే కలెక్ట్‌చేసేదాన్ని. నాకు మరొక వ్యక్తిమీద పగ. అది నీ భర్త. అతను చూస్తుండగానే రోజుకు ఒకడిని వెంటబెట్టుకుని తిరిగేదాన్ని. వాళ్ళలో మధు కూడా ఒక్కడు. మధు నన్ను కోరినపుడు కాదన్నాను. కాని ఆ తరువాతే నాకు నేనుగా అతనికి లొంగిపోయాను. భరత్ నన్ను అసహ్యించుకునేవాడు. మొహం తిప్పుకునేవాడు. నన్ను చూస్తూనే చీదరించుకునేవాడు. ఒక్క మాటలో చెప్పాలంటే హి హేట్‌మి. అందుకే భరత్ నిన్ను నాతో కలిసి చూడడం సహించలేక పోయేవాడు. నేను నిన్ను నాలా ఎక్కడ మారుస్తాడనో అన్న భయం. తను పెండ్లి చేసుకోబోతున్నట్లు, యిండియాకు పోతున్నానని, తిరిగి వచ్చిన తరువాత పార్టీ అరేంజి చేస్తున్నానని మా ఫాదర్‌తో అంటుంటే కుమిలి కుమిలి ఏడ్చాను. మీ వెడ్డింగ్ కార్డు చూసిన రోజు పిచ్చిదాన్ని అయిపోయాను. అతను బాచిలర్‌గా ఉండడం అదొక తృప్తి. కాని ఇప్పుడు, ఆ తృప్తి కూడా లేకుండా పోయింది.

అతని మనస్సును దోచుకున్న ఆ అమ్మాయి ఎవరో! ఎవరైతే ఏం తానొక పర్జిన్ అయి వుంటుంది. ఎన్ని సార్లో తలచేదాన్ని. ఏ యాసిడో తీసుకునిపోయి అతని మొహంమీద చల్లి అతని రూపాన్ని వికృతంచేసి ఏ స్త్రీ అతనిని చూసినా దడుచుకుని, పారిపోయేటట్లు చేయాలని, కాని నాకు తెలుసు, నేను అలా చేసినా ఈ ప్రపంచంలో ఏ మూలకయినా వెళ్ళి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుని తిరిగి యధా రూపంలో తిరిగి వస్తాడని. యెలాగయితే ఏం అతనికి వివాహం అయింది. నేను మా బాస్‌మీద కసి తీర్చుకున్నట్లు ఇతనిమీద తీర్చుకోలేకపోయాను. ఎప్పటికి అతనిదే పై చేయి. అతనిని నేను జయించలేను అని తెలిసిపోయింది. అతను తిరిగి వచ్చాడు. ప్రక్కన భార్యలేదు. ఎలాంటి పార్టీ ఇవ్వలేదు. మా ఫాదర్ బ్రైడ్ ఎక్కడ అంటే చదువుకుంటున్నది. అది పూర్తయితే వస్తుందని, అప్పుడే పార్టీ ఇచ్చేదని నవ్వుతూ చెప్పాడు. ఇప్పుడనుకుంటే నవ్వు నటిస్తూ చెప్పి ఉంటాడు అనిపిస్తున్నది. కాని అంజూ! అతను పెండ్లి జరిగిన తరువాతనుండి, స్నేహితులకు, పార్టీలకు దూరమయ్యాడు. ఏ సమయంలో వస్తాడో, ఎప్పుడు పోతాడో కూడా తెలియకుండా పోయింది. ఎప్పుడు చూసినా సీరియస్‌గా వుంటాడు. అతని భార్యవైన నిన్ను చూడకముందు ద్వేషించేదాన్ని, అసూయతో మండిపడేదాన్ని. కాని నిన్ను చూసిన తరువాత నీతో పరిచయం చేసుకున్న తరువాత నా ద్వేషం పూర్తిగా తుడుచుకుపోయింది. ఆ రాత్రి నీవు ఏడుస్తూ నన్ను కౌగలించుకుని అమ్మా అని పిలిచావే. అప్పుడే నీవు నాలా అభాగ్యురాలివని అనుకొన్నాను. కానీ అంజూ! మరుసటి రోజు నీవు నన్ను నమ్మి నీ గురించి పూర్తిగా చెప్పినప్పుడు నీమీద జాలేకాదు, భరత్‌మీద నాకున్న కసి తీరిందనుకొని, అతని ముందు నిలబడి విరగబడి నవ్వాలనిపించింది, నీవు నా స్నేహితురాలివికాకుంటే అతను సిగ్గుతో కుమిలేటట్లు చేయాలని, అతనిని అడుగడుగునా అవమానించాలని, మనస్సు వెఱ్ఱిగా గంతులేసేది. కానీ ఏమి చేయలేకపోయాను. కారణం నువ్వు. అమాయకంగా నన్నేనమ్మి, అయినవాళ్లు, అభిమానించేవాళ్ళు లేక ఒంటరిగా నాలానే జీవితాన్ని ఎదుర్కొంటున్నావని తలవగానే నా ప్రయత్నాలన్ని ఆపుకున్నా! నాకు ముఖ్యం నీ మనశ్శాంతి. అతనిమీద ఏదో పగతీర్చుకోవాలన్నట్లు తలుచుకుని నిన్ను నేను కూడా సుడిగుండంలోకి తొయ్యదలుచుకోలేదు. ఇప్పటికీ భరత్‌దే పై చేయి అయింది. ఎందువలనంటే మానసికంగా నీవు పర్జిన్‌వే. నేను ఒక విధంగా చెరచబడితే నీవు మరొకరకంగా శీలం పోగొట్టుకున్నావు. అలాంటప్పుడు గెలుపు నాదెలా అవుతుంది. అంజూ! మనస్సు సమ్మతించక పోయినా ఒక మాట చెప్తున్నాను, భరత్ నిన్ను ప్రాణంలా ప్రేమిస్తున్నాడు. అతని అహం అందుకు ఒప్పుకోదు. దానికి ద్వేషపుపూత పూసి నిన్ను ద్వేషిస్తున్నాడు. ఆ రోజు నీవు మెట్లమీదనుండి పడిపోయినపుడు, మైకంలో వున్న నిన్ను అతను రెండు చేతులతో ఎత్తి గుండెలకు హత్తుకుని. నైట్ డ్రస్

మార్చాలన్న ఆలోచనయినాలేక, అంబులెన్స్ అటెండర్స్ స్ట్రెచ్చర్ క్రిందకు తెచ్చేంతవరకైనా ఓపిక పట్టక ఒక్క వుదుటన అందులోకి ఎక్కి కూర్చుని వెళ్ళాడే, ఆ దృశ్యం నా జన్మలో మరవలేను. మధు అయినా అంతే! నిన్ను నాకు పరిచయంచేస్తే నీవు నాతో స్నేహం ఎక్కడ చేస్తావో అని తెలియనట్లుగానే వుండిపోయాడు. అతనికి నా దేహం ముఖ్యమయింది కాని, నా మనస్సును అర్థం చేసుకుని అదరించే మనస్సు లేకపోయింది. తన వదిన నాలాంటి స్త్రీ అనీ తెలిసి కూడా నీకిచ్చిన గౌరవం నాకు ఇవ్వలేకపోయాడు. మగవాళ్ళను అర్థం చేసుకున్నావా అంజూ! ఐట్ ఐ డోన్ట్ కేర్ ఇట్. ఐ డోన్ట్ కేర్ ఎనీ బడీ! ఐ వాంట్ యూ ఓన్లీ!"

అంజు సూజీ చేయి పట్టుకుని కళ్ళనీళ్ళు కారుస్తూ ఉండిపోయింది. కాలగమనాన్ని ఇద్దరూ గుర్తించలేదు. సాయంత్రం కావడం భరత్ రావడం, ఇద్దరు గమనించలేదు. దగ్గరిగా వచ్చిన అతనిని చూడగానే అంజు, సూజితో చెప్పి అతని వెనుకే లోపలికి వెళ్ళింది.

సూజి కథ విన్నప్పటినుండి అంజు మనస్సు బాధతో కకావికలు చేస్తున్నది. మరీ సున్నితమైన తన మనస్సును తనే కసురుకుంది! కాని ఎన్ని విధాలా తనుతానే ఓదార్చుకున్నా సూజి చెప్పిన కథ కళ్ళముందు రకరకాల దృశ్యాలలో ఎదురవుతున్నది. పురుషులంతా ఇంతే, దుర్మార్గులు, శారీరకంగా బలహీనంగా ఉండే స్త్రీలను మానసికంగాను బలహీనులనుచేసి ఆటలాడుకుంటున్నారు. కిరాతకులు, సూజి బాసేకాదు. తన భర్తలాంటివారు ఎంతోమంది మగవాళ్ళు కూడా! ఆలోచనలతో ఎక్కడా ఉండలేక పోతున్నది. టి.వి. ముందర కూర్చుంది. విసుగేసింది. పుస్తకం చేతికెత్తింది. ఏకాగ్రత కుదరలేదు. పడక మీద వాలి కళ్ళు మూసుకుంది.

కళ్ళు మూసుకున్న అంజుకు ఎదురుగా వికృతంగా నవ్వుతున్న ఆ చీనా మృగం, నాలుకలు చాచుకుని నల్లగా నిగనిగలాడుతూన్న శరీరంలో పొట్టిగానున్న తోకలను కదిలించడానికి ప్రయత్నిస్తూ, ఆకలిగా, ఆత్రుతగా చూస్తున్న జర్మన్ కుక్కలు, బేలగా, అసహాయంగా, తనను కాపాడేవాడే లేనట్లు నిరాశతో చూస్తున్న సూజి ఎదురవుతున్నారు. సూజి స్థలంలో తను ఉంటే, మరుక్షణం మరొక దృశ్యం. దట్టంగానున్న అడవిమధ్య చిమ్మచీకటిలో, రాళ్ళగుట్టలు, పొదలమధ్య స్మారకంలో లేని స్థితిలో పడున్న తను, తనకు దగ్గరగా, తెల్లగా మెరుస్తున్న కళ్ళుతప్ప, మరొక పోలికే తెలియని ఆకారం, తనను అల్లుకుపోతూ.... కెవ్వున కేకవేసింది అంజు. భయంతో, చమటలు కక్కుతూ, గజగజలాడుతున్న శరీరాన్ని అదుపులో పెట్టుకోవడమే అసాధ్యమయిపోయింది తనకు.

"వదినా! వదినా!" మధు మంచం ప్రక్కగానున్న టేబుల్‌లైట్ స్విచ్ ఆన్‌చేసి, అంజును కదిలించసాగాడు.

ఒక్కసారిగా వెలుతురుకు కళ్ళు చిట్లించి మధువైపు చూసిలేచి చటుక్కున నిలబడింది. "మధూ! ఏడుస్తూ అతని దగ్గరగా వచ్చింది. క్షణం తటపటాయించి అతను అంజు వీపుచుట్టు చేతులువేసి దగ్గరకు తీసుకున్నాడు.

"భయంగా వుంది మధూ!"

"భయమా! ఇప్పుడు గంట ఎంతయిందో తెలుసా! తొమ్మిది. మనం ఇంకా భోజనమైనా చేయలేదు. మీరు లైట్ ఆన్ చేసుకోకుండా నిద్రపోయి పీడకలలు కంటున్నారా!" చిన్నగా నవ్వుతూ అన్నాడు.

"ఊహూ! నిద్రపోలేదు."

"వాట్! నిద్రపోకుండానే కలలు కంటున్నారా! ఇంతకీ ఆ కల ఏమిటి చెప్పండి. మరీ విపరీతంగా చెమటలు కారుతున్నాయి." అంజును పట్టుకునే ప్రక్కన వున్న తెల్లటి టవల్ అందుకొని అంజు మొహం తుడవసాగాడు.

"అది.... అది... "

"మధూ! తనను తీసుకోని డైనింగ్ హాలుకురా!" భరత్ గొంతు గంభీరంగా పలికింది. అప్పుడుకాని ఇద్దరూ తలుపుకు దగ్గరగా నిలుచుని వున్న భరత్‌ను గుర్తించలేదు. అప్పటి తన స్థితి గుర్తుకు వచ్చి చటుక్కున మధు చేతుల నుండి విడిపించుకుని దూరంగా జరిగింది.

"భోంచేస్తాంరా వదినా మధు అనురాగమంతా మాటలలో చూపుతూ పిలిచాడు.

"ఊహూ! నా కాకలిలేదు. నీవు వెళ్ళి భోజనం చేయి" మెల్లిగా అంది.

"మీరు అలా అంటే నేను ఏమి తినను. అన్నయ్య నేను టేబిల్‌మీద ప్లేట్లు సర్దుతుంటే మీ కేక వినిపించింది. అన్నయ్య వెయిట్‌చేసుంటారు రండి." అంజు మరేం జవాబు చెప్పక అతనిని వెంబడించింది. మధుకు ప్రక్క కుర్చీలో కూర్చున్న అంజు ఒక్కసారయినా తలెత్తి భరత్‌వైపు చూడలేదు. తన ప్లేటులో కూరలు వడ్డిస్తున్న అతనివైపు చాలు అని చెప్పడం కూడా చేతకానట్లు మౌనంగా వుండిపోయింది.

మధు అంజుచేత ఏదైనా మాట్లాడించాలని ఎంతగానో ప్రయత్నంచేసి చూశాడు. కాని అంజు మూగదే అయింది. బలవంతంగా కొద్దిగా తిని ప్లేట్ తీసేసి హాల్లోకి వచ్చింది. మరికొన్ని నిమిషాలకు హాల్లోకి ప్రవేశించిన మధు అంజుకు ప్రక్కగానున్న సోఫాలో కూర్చుంటూ అంజు చేతికి కోసిన ఆపిల్, ఆరంజ్ ముక్కలు వున్న ప్లేటు అందిస్తూ కబుర్లలోకి దిగాడు. అతను ఎలాగైనా అంజు భయం పారద్రోలి మామూలు మనిషిని చేయాలన్న ఆలోచనలో, తన యూనివర్శిటీ కబుర్లు చెప్తున్నాడు. అంజు వింటున్నట్లు నటిస్తుందేగాని, మనస్సుమటుకు సూజికి జరిగిన అన్యాయాన్నే ఆలోచిస్తున్నది.

ఇంతలో ఫోన్ రింగవడం, ఫోన్ అందుకుని మాట్లాడుతున్న మధు వెంటనే తన గదిలోకి పోయి డ్రస్ మార్చుకుని వచ్చి "వదినా మా స్నేహితుడికి ఆక్సిడెంటయి హాస్పిటల్లో ఉన్నాడట. నన్ను రమ్మని దగ్గర మరెవ్వరూ లేరని మరొక స్నేహితుడు ఫోన్ చేస్తున్నాడు. నేను త్వరగా వచ్చేస్తాగా! మీరు ఏ భయాలూ పెట్టుకోకుండా హాయిగా నిద్రపోండి." అంటూ భరత్‌తో చెప్పి వెళ్ళిపోయాడు.

తనకు ఒంటరితనం కావాలన్నట్లు అంజు గదిలోకి వచ్చేసింది. కాని ఆ ఒంటరితనమే తనను భయంకరంగా వేటాడుతూ పలురకాల ఆలోచనలతో వెర్రి దాన్ని చేస్తున్నది. అంజుకు తను ప్రశాంతంగా, ఏ ఆలోచనలు లేకుండా నిద్రపోవాలంటే తనకు కావలసింది ఒకే ఒక మందు.... అది తనలో చేరకపోతే ఈ వెర్రి ఆలోచనలతో తల వగులగొట్టుకుని చావను కూడా సంశయించదు. కాని అది సూజిదగ్గర వుంది. ఏ విధంగానైనా సూజిని పిలిచి అది తీసుకోవాల్సిందే. ఇక ఆలస్యం జరగడం తనవల్ల కాదన్నట్లుగా గది తలుపు తెరుచుకుని హాల్లోకి వచ్చింది. హాల్లోకి వచ్చిన అంజుకు అడుగు ముందుకు పడలేదు. అక్కడ భరత్ సోఫాలో కూర్చుని టేబిల్‌లైటు క్రింద బుక్కు చదువుతున్నాడు. వెనకకు తిరిగి వచ్చింది.

"హు! పుస్తకం చదవాలంటే తన రూమ్ లేదూ! లోపలికి వెళ్ళి చదువుకోక హాల్లో పనేమిటి?" విసుక్కుంది. అంజుకు నిద్ర రావడంలేదు. మందుకొరకు శరీరం పెట్టే యాతన భరించడం తన శక్యం కావడం లేదు. మరొక గంట తరువాత తిరిగి తలుపు తెరిచింది. హాల్లోకి ప్రవేశించిన అంజుకు భరత్ పుస్తకంలో నుండి తలెత్తి చూసి తిరిగి అందులో లీనమవడం చూసి ఏంచేయను అర్థంకావడం లేదు. తన పరిస్థితి బోనులో చిక్కుకున్న సింహంలా వుంది. అడుగు ముందుకు వేయాలంటే ధైర్యం చాలడంలేదు. గదిలోను నిలువలేకపోతుంది. తిరిగి వెనుకకు వచ్చింది. ఇంకొద్ది సమయం ఇలా ఉంటే తనకు పిచ్చిపట్టేది సత్యం. ప్రతిరోజు పదిగంటలకల్లా గదిలో దూరి తలుపులు మూసుకునే ఇతను ఇలా గార్డులా తనను కాపలా కాయడం ఎందుకో? తనన్న అనహ్యమయినపుడు తన మానాన తనను వదిలి వేయకూడదూ! ఇప్పుడు తనకు ఒక ఖైదీకి తేడా లేకుండా పోయింది. ఇది ఒక లక్ష్యూరియస్‌గానున్న పొలటీషియన్ జైలులా ఉంది. టైమ్ పన్నెండు కావొస్తున్నది. మధు జాడలేదు. భరత్ నిద్రపోయి వుంటాడు. ధైర్యంగా తలుపు తెరుచుకుని హాల్లోకి వచ్చి భరత్ వైపు చూసింది. అతను సోఫాలో మొహాన పుస్తకం మూసుకుని నిద్రపోతున్నాడు. అమ్మయ్య అనుకుంటు తలుపు దగ్గరగా వచ్చి పిడిమీద చేయి వేసింది. తలుపు తెరుచుకోలేదు. ఏమయి వుంటుందా అని ఆలోచిస్తుండగా "అది లాక్‌చేసి వుంది" అన్న గంభీరమైన గొంతు వినగనే ఎగిరి పడింది అంజు.

అతను మేలుకునే ఉన్నాడు. అతని మొహానవున్న పుస్తకం చూసి అతను నిద్రపోతున్నాడని అపోహపడింది.

"గో ఇన్‌సైడ్," తిరిగి అన్నాడు.

అంజు కదలలేదు, ఎలాగైనా తను సూజిని కలువాల్సిందే.

"ఐ సె గో ఇన్‌సైడ్," సోఫాలోనుండి లేస్తూ అన్నాడు. అంజు నిర్లక్ష్యంగా నిలబడింది, తన చేయి డోర్‌నాబ్ మీదనుండి కదలలేదు.

"చెప్పేది నీకు కాదూ! ఒక్కసారి ఫూల్ చేసినట్లు తిరిగి చేయాలనే! మర్యాదగా లోపలికెళ్ళు" దగ్గరగా వస్తూ అన్నాడు.

అంజుకు ఎక్కడలేని ధైర్యం ఒక్కసారిగా పొంగింది. "నేను లోపలికి పోదలుచుకోలేదు, తాళం తీయండి. నేను....నేను వెళ్ళిపోతాను. భయం ఒక వైపు, త్వరగా పోవాలన్న తొందర మరొక వైపుతో వణికిపోతోంది.

"అది జరగని పని. నీ వాడిందే ఆటనుకొన్నావా! లోపలికి పోతావా లేదా.!"

"వెళ్ళను, వెళ్ళను. మీరేం చెప్పినా వినను. తలుపు తీయండి, తలుపు తీయండి" తలుపును పిడికెళ్ళతో గుద్ద సాగింది.

"యూ క్రేజీ లిటిల్ ఫూల్! అంత ధైర్యమే!" అతను రెండు చేతులతో బలంగా అంజును చుట్టి తన గదివైపు సగం లాక్కు వచ్చినట్లుగా, మరి సగం ఎత్తుకు వచ్చినట్లుగా తీసుకుపోసాగాడు.

"వదులు, వదులు, నేను వెళ్ళిపోతాను. తిరిగి రాను, ఈ జైల్లో అడుగు పెట్టను. ఆ గదిలోకి నన్ను తీసుకుని పోకు," అరుస్తూ, ఏడుస్తూ, అతనిని కాళ్ళతోను, చేతులతోను తోస్తోంది. కాని భరత్ పట్టు ఉడుం పట్టులా వుంది. అంజు ఎంతగా పోరాడినా, గింజుకున్నా అతనిదే పై చేయి అయింది. అతని బలమైన చేతులనుండి శరీరంలోని చిన్న అణువైనా విడిపించుకోలేక పోయింది. అతను తన గదిలోకి రాగానే ఎడమ కాలితో తలుపును తన్ని అంజును పడకపై వేసి రాక్ వైపు తిరిగాడు. అంజు భయంగా కళ్ళు పెద్దవి చేసి అతనివైపు చూస్తూండి పోయింది. భరత్ సిరంజీలోనికి మందు ఎక్కించి అంజు చేతికి ఇంజక్ట్ చేశాడు. క్రమేణా ముందున్న ఆరాటం తగ్గి ప్రశాంతంగా అతని వైపు చూస్తూండి పోయింది. మరి కొద్ది సేపటికి తనకు తెలియకుండానే కళ్లు మూసింది.

"అరే! అదేమిటి? అంత త్వరగా వచ్చావు పని ఎగ్గొట్టావా! లేక ఆరోగ్యం సరిలేదా!" మధును ఆశ్చర్యంగా చూస్తూ అంది. శనివారం తప్ప మిగత రోజులలో ఐదు గంటలపైన ఇల్లు చేరే మధు మూడు గంటలకే రావడం ఆశ్చర్యంగా వుంది.

"అదేం లేదు వదినా! రాత్రికి స్నేహితుడొకడు హోటల్లో వెడ్డింగ్ పార్టీకి

ఆహ్వానించి ఉన్నాడు. చాలా ఆలస్యమవుతుంది' కొద్ది సేపు రెస్ట్ తీసుకుని సాయంత్రం వెళ్ళేటప్పటికి ఫ్రెష్‌గా వుంటుందని వచ్చేశాను. డాడీ గొణుగుతూనే ఉండి పోయారు. తిరిగి మళ్ళీ చూడకుండా పారిపోయి వచ్చాను," చిరునవ్వు నవ్వాడు.

"అబ్బ! వనిదొంగ, నీవు లెక్చరర్‌గా వచ్చావంటే మొదటి రోజు స్టూడెంట్సుకు ఫేవరెట్ మాస్టరు అవుతావు. అయినా ఫస్ట్‌క్లాస్‌లో ఎలా పాసవుతున్నావో కాని- పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులో ఫేవరిజం ఉందట. ఏదో లంచం పెట్టి క్లాస్ కొట్టేసి ఉంటావు" అంజు కిలకిల నవ్వింది.

"పొండి వదినా! సింగపూర్లోనే బి.యస్సీ చదివాను. ఇక్కడ క్లాస్‌లోనే పాసయ్యాను. చదువు వేరే! యన్‌టర్‌టైయిన్‌మెంట్సు వేరే! చదువుకునేటప్పుడు చదివే పాఠంమీద కాన్‌సన్‌ట్రేషన్ ఉంటే చాలు. ఒక గంట చదివినా సరిపోదూ! ఇంతకీ వదినగారి చదువు గురించి చెప్పలేదు."

"నేను నీ అంత జీనియస్‌ను కాదులే. ఏదో చదువుకుపోయే రకం."

"ఎప్పుడు మా యూనివర్శిటీ కబుర్లు చెప్పమంటారే కాని మీ కాలేజీ కబుర్లు చెప్పనే చెప్పరు. అంతేకాదు మీ యక్స్‌కర్షన్ గురించి కూడా చెప్పండి. ఏయే ఊళ్లు తిరిగారు."

మధు ఏదో తెలుసుకోవాలన్నట్లుగా అడుగుతుంటే అంజు మొహం వెలవెలబోయింది. ఏదైతే మరచిపోవాలని ప్రయత్నిస్తున్నదో అదే ఈనాడు మధు తెలునుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. అతనిని ఎందుకు కాదనాలి. అసలు ఏంజరిగిందని తనకుమటుకు తెలుసునా! ఇలా జరిగి వుంటుంది అని తల్లిదండ్రులతోటి తను ఒక అభిప్రాయానికి రావడమే కాని.

భరత్‌తో గొడవచేసిన నాటికి ఇప్పటికి అంజులో చాలా మార్పే కలిగింది. ఇప్పుడు డ్రగ్స్ కావాలని కోరడం లేదు. ఆలస్యంగానయినా తను ఆ ఊబిలో నుండి తప్పుకుంది కారణం భరత్. అతను రాత్రంతా అంజును కనిపెట్టుకుని ఉండడమే ముఖ్యమైన ధ్యేయంగా తన నిద్ర చంపుకుని, కావలి కాసేవాడు. అంజుకే అతని పరిస్థితి జాలి కలిగించేది. తన ప్రతి కదలికకు అతను లేచి కూర్చునేవాడు. తన దినసరి నడవడికల నుండి, తన ఆహార విషయాలలో కూడా తగు జాగరూకత వహించేవాడు. తల్లి తన పురుటిలో ఉన్న కూతురును చూసుకొన్నట్లుగా అతి శ్రద్ధతో అంజును మునుపటిలా పూర్తి ఆరోగ్యంతో కళకళలాడేట్లు చేశాడు. అంజు గట్టిగా నిశ్చయించుకుంది. ఇకమీద భరత్‌ను ఏవిధంగాను బాధపెట్టకూడదని. నాటికి జరిగిపోయిన సంఘటనలు గురించి తను ఆలోచించి, తన మనను, శరీరం సర్వనాశనం చేసుకొని సాధించేది ఏదీలేదని గట్టిగా నిర్ణయించుకుంది. అదంతా విధి. విధి చేతులలో బొమ్మలు తామిద్దరు. తామిద్దరులాంటివాళ్ళు మరెందరున్నారో ఈ ప్రపంచంలో. జరిగిపోయిన సంఘట

నలు గురించి ఆలోచించి మనస్సు పాడుచేసుకోవడం అనవసరం. క్రమేణా అంజులో మునుపున్న వేదన తరిగి మనస్సు నిర్మలం కాసాగింది. మెదడులో ఆలోచనలు కొరవడడంతో శరీరంలోకి ఉత్సాహం చోటుచేసుకోసాగింది. ఆ ఉత్సాహంవలననే మొహంలోకి జీవకళ చేరుకోవడం, బ్రెయిన్‌కు సరయిన ఆహారం భరత్ చూపే శ్రద్ధ. నిర్మలంగా ఉన్న మెదడు, అంజులో క్రొత్త అందాలు నింపుకోసాగాయి. కాని ఈ రోజు మధు పాత జ్ఞాపకాలను తిరగతోడమంటున్నాడు. అది వివరించడంలో తను నష్టపోయేది ఏమీలేదు. మధు నమ్మినా నమ్మకపోయినా తను చెప్పేది నిజం. అది తన మనస్సుకు తెలుసు. మధు మంచి మనసున్నవాడు కాబట్టి అది నమ్మవచ్చు. కాని భరత్ నమ్మడు. తను వాళ్ళు నమ్మాలని జరిగింది చెప్పడం లేదు. తను ఎవరిని సాక్షిగా తీసుకుని రాగలదు? తను చేయని తప్పుకు ఘోరంగా నరకం అనుభవించింది. తన పందొమ్మిది సంవత్సరాల వయస్సుకు తొంభయిఒక్క సంవత్సరాల అనుభవాలు అనుభవించింది. ఇక తను ఎవరికి, ఎందుకు భయపడదు.

"ఏమిటి వదినా ఆలోచన, కాలేజి లైఫ్ మరిచిపోయారా!"

"నిజమే! నీవన్నట్లు కాలేజి ఏమిటీ, మా అమ్మా నాన్నలను, చెల్లాయిని కూడా మరిచిపోయాను. చాలా సెల్ఫిష్‌గా తయారయ్యాను. నీవు మా కాలేజి గురించి అడుగుతున్నావో లేక నాకు గర్భం ఏవిధంగా వచ్చిందని అడుగుతున్నావో తెలియదు కానీ నాకు తెలిసినంతవరకు నిజమే చెప్తున్నాను. నీవు నమ్మినా నమ్మకపోయినా నేను చెప్పేది సత్యం.

"నేను ఇంటర్ మంచి మార్కులతోనే పాసయ్యాను. మెడిసన్‌కు అప్లై చేశాను. సీటు రాలేదు. తిరుపతి వుమన్స్ కాలేజీలో బి.యస్సీకి అప్లై చేశాను. అది సీటు వెంటనే దొరకలేదు. ఆ తరువాత ఉన్న ఊర్లోనే కో ఎడ్యుకేషన్ అయినా పరవాలేదని అదే సైన్స్ కోర్సుకు అప్లై చేశాను. సీటు దొరికింది. సంతోషంగా చేశాను. ఇప్పుడనిపిస్తుంది తెలుగు మెయిన్‌గా తీసుకుని బి.యేలో చేరివుంటే కథలు వ్రాసుకుని స్వతంత్రంగానైనా బ్రతికేదాన్నేమో! రెంటికీ చెడ్డ రేవణ్ణయ్యాను, అట్ల సైన్స్ చదివి ఉద్ధరించింది లేదు. ఇట్ల తెలుగు పూర్తిగా చదివి తెలుసుకుంది లేదు. నీకు తెలుసుగా కాలేజీలో జరిగే గొడవలు. మగపిల్లలు ఆడపిల్లలను, లెక్చరర్లను నిక్‌నేమ్స్ పెట్టి ఏడిపించడం, తామే మహా అందగాళ్లన్నట్లు, మిగతావాళ్లు వానర వంశానికి వారసులయినట్లు ఏడిపిస్తూ, ఎక్కిరిస్తూ తమకుతామే ఆనందించడం, ఇదంతా ప్రతి కాలేజీలోను జరిగే సాధారణ విషయమే! అందులో మా కాలేజీ ఏమీ తీసిపోదు. మొదటి సంవత్సరం ఇలా అల్లరితో, ఆనందంతో గడిచిపోయింది. దిగులు, విచారం తెలియని దశ విద్యార్థి దశ. అలాంటి అద్భుతమైన దశలో ఏ క్షణాన నాలో రాహువు ప్రవేశించాడో

తెలియదు కాని ఆ విద్యార్థి జీవితం పూర్తిగా అనుభవించింది లేదు. రెండవ సంవత్సరంలో బాటనీ ముఖ్యమైన సబ్జక్టుగా తీసుకునే వాళ్ళను ప్లాంట్ కలక్షన్‌కు తీసుకొనిపోవడం ఒక ముఖ్యమైన పాఠ్యభాగం అయినందువలన మమ్మల్ని ఏ వూరు పోయేది సెలక్ట్ చేసుకోమన్నారు. ఊటీ లేక కొడైకెనాల్. ఆఖరుకు కొడైకెనాల్ ఎన్నికయింది. నాకు ఊటీకన్నా కొడైకెనాల్ వెళ్ళడమే ఇష్టం. ఊటీ మనకు పెద్దదూరం అనిపించదు. బెంగుళూరు టూరిస్ట్ స్పాట్‌వలన ఊటీకి ఎప్పుడైనా పోగలం. కాని కొడైకెనాల్ అలా కాదు. మధురకు దగ్గరుండే కొడైకెనాల్ అతి దూరపు ప్రయాణమే! అది తల్లిదండ్రులతో కలిసిపోయే తేలిక ప్రయాణం కాదు. అందుకే నేను కొడై కావాలంటూ చేయెత్తాను.

సహజంగా ప్రతి సంవత్సరం ప్లాంట్ కలక్షన్‌కు దసరా హాలిడేస్‌కు పోతారు. కాని కాలేజీ స్ట్రయిక్‌వలన మా ప్రయాణం పొంగల్ శెలవులకు వాయిదా పడింది.

చలి అధికమని, మమ్మల్ని స్వెట్టర్లు, రగ్గులు, స్కార్ఫులు అన్ని ఇబ్బంది లేకుండా తెచ్చుకోమన్నారు. సాధ్యమైనంతవరకు తక్కువ లగేజ్‌తో రమ్మన్నారు. ఎవరి లగేజ్ వాళ్ళే మోయాలని మొదటే చెప్పేశారు. ప్రయాణపు రోజులు దగ్గరకు వచ్చే కొద్ది సంతోషంతో మాకు నిద్రపట్టేది కాదు. భోజనం సహించేది కాదు. ఎప్పుడూ ఆ రాబోయే ప్రయాణపు కబుర్లే! మేము కలలుగన్న రోజు రానే వచ్చింది. ఇద్దరు లెక్చరర్స్ ఒక అటెండరు, మొత్తం ముప్ఫయిమందిదాకా బయలుదేరాం. ఓహో! ఆ రోజు. జీవితంలో మరువలేనిరోజు. రైల్వేస్టేషనంతా ఒకే కోలాహలం. మామా ఆరాధకులతో రైల్వేస్టేషనంతా ఒకే అల్లరి. కొంత మంది మిగతా ప్రయాణీకులతో దెబ్బలాడి మాకు వసతిగా సీట్లు ఏర్పాటుచేశారు. మేమేదో కాలేజీ వదలిపోతున్నట్లు వాళ్ళలో విషాదం. ట్రైన్ కదిలింది. ఫేర్‌వెల్ విషస్ అందుకుని సంతోషంగా మా సీట్లలో కూర్చుని ఒకే కబుర్లలో పడిపోయాం. మద్రాసువరకు రిజర్వేషన్ లేదు. మద్రాసులో ట్రైన్ మారగానే మాకు రిజర్వుచేసిన కంపార్ట్‌మెంట్స్‌లో ఎక్కి కూర్చున్నాం. మరుసటిరోజు ఉదయం ఆరుగంటలకు కొడై రోడ్డు చేరి, తిరిగి బస్సు ఎక్కి కొడైకెనాల్ కొండపైకి మధ్యాహ్నానికి చేరాం. క్రిందనే ట్రైన్ దిగగానే మా లెక్చరరు మాకంతా ఒక ఆశ పెట్టారు. వారు బుక్కు వ్రాస్తున్నానని, ఇంతవరకు కనిపెట్టబడని క్రొత్త మొక్కలను, వాటి జాతులను కనుగొన్న వారి పేర్లు. ఫోటోలు తన పుస్తకంలో వేస్తానని, అంతకుముందు సంవత్సరం ఒక రేర్ స్పీసీస్ మధురై కాలేజివాళ్ళు కనిపెట్టారని, అది మేము బస్సుకొరకు వేచివున్న రోడ్డుకు ప్రక్కగానే దొరికిందని అన్నారు. మేము అలాగే కనుక్కొని మా కాలేజీ పేరు నిలబెట్టాలని మాలో ఉత్తేజం నింపారు. ఇక చెప్పవలెనా మాలోని వుత్సాహం. మా కళ్ళు నలువైపులా పరుగెడుతుంటే ఏ మొక్క కనబడినా అటువైపు పరుగెత్తే

వాళ్ళం. పైకి చేరగానే, మాకని బుక్‌చేసిన లాడ్జిలో, అందరం సర్దుకున్నాము. మా దినసరి కార్యక్రమం, ఉదయం ఐదుగంటలకు లేవడం. స్నానాలు పూర్తి చేసుకుని టీ తాగి భుజాలకు బ్యాగ్‌లు తగిలించుకుని ప్లాంట్ కలక్షన్‌కు బయలుదేరే వాళ్ళం. వాహనాలు ఎంతదూరమైనా ఉపయోగించేవాళ్ళం కాము. అన్ని మైళ్ళు నడిచి వెళ్ళేవాళ్ళం. కొండలు, గుట్టలుగుండా నడుచుకుంటూ, కావలసిన మొక్కలను బాగ్‌లో వేసుకుంటూ, అలసట అన్నది మరచి సంతోషంగా ఉత్సాహంగా ఎంతదూరమైనా పోయేవాళ్ళం. ఫేరిఫాల్స్, సిల్వర్‌కాస్కేడ్, పిల్లర్‌రాక్స్ ఇలా రోజుకొక చూడవలసిన స్థలాలను చూచుకుంటూ, సన్నని కాలువలప్రక్కన అందమైన జిమ్నెకప్స్, పిచ్చర్స్, గోల్డన్‌ఫెరన్, సిల్వర్‌ఫెరన్, ఇలా రకరకాలవి చూచుకుంటూ, బెరీలుతో నిండిన తోటలు, అందమైన లాండ్‌స్కేప్స్, ఒకదేమిటి ప్రతిది వచ్చగా కళ్ళను, హృదయాన్ని ఆకట్టుకొనేలా ఉన్న చెట్లతో నిండిన కొండలను, మంచుతో నిండిన లోయలను చూసి ఆనందిస్తూ, ఆ అందాలని ఆస్వాదిస్తూ గడిపేవాళ్ళం. మాతోపాటే కాలికట్ నుండి వచ్చిన ఉమన్స్ కాలేజి అమ్మాయిలను, మద్రాసు యూనివర్శిటీ స్టూడెంట్స్, పిక్నిక్‌కొరకు వచ్చిన మధురై మెడికల్ కాలేజి స్టూడెంట్స్, సినీమా షూటింగ్ కోసం వచ్చిన సినిమా యాక్టర్లు అందరిని కలిశాము.

కాలికట్ నుండి వచ్చిన అమ్మాయిలు మరీ నాటి. మా స్టూడెంట్స్, మా బాచ్‌లర్ లెక్చరర్ ఒక ఆయన వాళ్ళనుచూసి బెదిరిపోయేవాళ్ళు. మా స్టూడెంట్స్ అంటుండేవాళ్ళు. మన అమ్మాయిలు బంగారుబొమ్మలు సార్. ప్రతి ఆడపిల్ల నేర్చుకోవాల్సిన సత్ప్రవర్తన మన అమ్మాయిలలోనే వుంది. మమ్మల్ని ఎంత అపురూపంగా చూచుకునేవాళ్లు తెలుసా! మాకే ఆశ్చర్యం. వీళ్ళే నా కాలేజిలో అంత అల్లరిచేసే గడుగ్గాయిలు అని.

ఆ రోజు ఫేర్‌ఫాల్స్‌కు బయలుదేరాం. ఆకుపచ్చ వెల్వెట్ తివాసి పరచినట్లున్న తోటలతో నిండిన కొండలు, విశాలమయిన పచ్చికబయళ్ళు, ఉండి ఉండి బంగారు కాంతులను వెదజల్లుతున్న చిరుచిరు ఎండలు, పూలజల్లులా కురుస్తున్న సన్నని వర్షపు తుంపరులు, అది ప్రకృతి సౌందర్యానికి నిర్వచనమనిపించేట్లుగా వుంది. అక్కడే ఎన్నో ఫోటోలు తీసుకున్నాం. ఎప్పుడూ మధ్యాహ్నం మూడు గంటలకు మా ప్లాంట్ కలక్షన్ ముగించుకుని లాడ్జి చేరేవాళ్ళం. సాయంత్రం బోట్ షికారు, షాపింగ్ సెంటరు అన్నట్లుగానున్న చిన్నచిన్న అంగళ్ళు అవి చూసుకుని రాత్రి ఎనిమిది లోపలే గూళ్ళు చేరేవాళ్ళం. అలాంటి సాయంత్రపు వేళలోనే మద్రాసి యమెస్సి స్టూడెంట్స్‌ను కలుసుకుంది. అందులో ఒక అమ్మాయి మా కాలేజి యక్స్ స్టూడెంటట. అందువలననే వాళ్ళ వివరాలు తెలిసినయి. అలాగే ఒక తమిళ సినిమా షూటింగ్ చూశాము.

పిల్లర్‌రాక్స్ చూసుకుని, అక్కడేనున్న అస్ట్రానమీకి సంబంధించిన

సెంటర్ చూచుకుని మూడుగంటలకు తిరిగి బయలుదేరాం. పిల్లర్‌రాక్స్ చూసే దానికి చాలా దట్టుకట్టి టాక్సి మాట్లాడుకున్నాం. కాని అది డైరక్టుగా ఊర్లోకి కాదు. ఊరికి ఒక మైలు ముందరే దిగి మరికొన్ని ప్లాంట్స్‌కొరకు రోడ్డుకు రెండువైపులానున్న కొండలమీదకు చీలిపోయాం. అమ్మాయిలమంతా ఒక జట్టుగా ఒకవైపు బయలుదేరాం. మాకు ఒక వయస్సయిన ప్రొఫెసరు తోడు. ఆయనంటే మాకు ప్రాణం. ఆయన మమ్మల్ని తన స్వంత పిల్లలు అన్నట్లుగా చూచుకునే వారు. అలా జట్టుగా పోతున్న మాలో నేనెలా వేరయ్యానో నాకే తెలియదుకాని సడన్‌గా చీకట్లు ముసురుకొనేటప్పటికి వెనక్కుతిరిగి చూశాను. అక్కడ నా ఫ్రెండ్స్ ఎవరూ లేరు. అదిరిపడి నాలుగడుగులు అటు ఇటుకేసి, గొంతెత్తి పిలిచాను. కాని బదులుగా ఎవ్వరి గొంతు వినిపించలేదు. గడియారంవైపు చూస్తే టైమ్ క్లియర్‌గా తెలియలేదు. కటిక చీకటి. బహుశ చాలా దూరమే వాళ్ళను వదిలి వచ్చానేమో అనుకుంటు, మనసులో భయం అనిపిస్తున్నా, దగ్గర్లోనే ఫ్రండ్స్ వుంటారులే అన్నట్లు లేని ధైర్యం తెచ్చుకుని వెనుకకు మరొక పది అడుగులు వేశాను. అంతే తలకు బలంగా ఏదో ఒంగిన కొమ్మ తగలడం మరుక్షణం బాధతో అరవడంమటుకే తెలుసు. ఆ తరువాత ఏమయిందో తెలియదు. తిరిగి కళ్లుతెరిచిన నేను తలకు కట్టుతో గిరుకుపోయిన కాళ్లు చేతులకు వేసిన ప్లాస్టర్లతో పరుపుమీద పడుకుని వున్నాను. నా ఎదురుగా మా లెక్చరర్సు, స్టూడెంట్సు నిలబడి వున్నారు. అందరి మొహాలలో ఆందోళన, ఆతృత నిండివున్నాయి. నీరసంగా పిలిచాను. నాకేమయిందని అడిగాను. మునుపున్నంత చలి లేదు. చాలా వెచ్చగా వుంది. వేడి కాఫీ స్పూన్‌తో నా నోట్లో పోశారు. కాఫీ కడుపులోకి దిగుతుంటే క్రమేణా జరిగినదంతా ఒక్కొక్కటిగా గుర్తుకు రాసాగాయి. భయంతో వణికిపోతుంటే, ఇక భయపడ పనిలేదని, ధైర్యంగా వుండమని మాస్టర్లు నన్ను రెస్ట్ తీసుకోమని వెళ్ళిపోయారు. ఆ రోజంతా పడకమీదే వుండిపోయాను. శరీరమంతా నీరసంతో పైకి లేవడానికి కూడా శక్తిలేనట్లు బలహీనమయింది. స్నానం చేయాలని, నాతోటి అమ్మాయిలతో షికారు చేయాలని కోరిక. కాని మా లెక్చరర్సు నన్ను ఎక్కడికీ పిలుచుకునిపోలేదు. మరుసటిరోజు ప్లాన్‌ప్రకారం మరొకరోజు గడపాల్సిన మా ప్రోగ్రామ్స్‌ను కాన్సిల్ చేసుకుని మధురకు వచ్చేశాం. కాని నాలో ముందున్న ఉషారు తగ్గింది. జరిగినదంతా స్నేహితులద్వారా తెలుసుకున్నాను. ఒక రాత్రంతా, ఆ చలిలో, కారుచీకట్లో, భయంకరమైన ముళ్ళపొదలలో స్పృహ లేకుండా, ఒక రాత్రంతా గడపడం ఇప్పటికి తలచినా వెన్నులో చలి పుట్టుకు వస్తుంది. మా స్నేహితులూ, మా లెక్చరర్ అంత చీకట్లో ప్రతి స్థలం వదలకుండా టార్చిలైట్లతో వెదికి వేసారిపోయారంట. ఆ చీకటికి తోడు విపరీతమైన వానట. చివరకు నేనే దారితప్పి రోడ్డుచేరి వుంటానని నేను లాడ్జికి ఏదో ఒకవిధంగా చేరివుంటానని కొన ఆశతో వచ్చామని, అక్కడ నేను కనిపించక

పోయేటప్పటికి మాస్టర్లు ఇద్దరూ తిరిగి వెదకడానికి బయలుదేరారని చెప్పారు. కాని ఆ రాత్రి వాళ్ళ ప్రయత్నాలు వృథా అయ్యాయని మరునటిరోజు ఉదయాన్నే అదే స్థలానికి వెదుక్కుని వచ్చిన తమకు రోడ్డుకు పక్కగా చినిగిన గుడ్డలు, రక్తపుచారలు తోటి మైకంగా వున్న నేను కనిపించానట. ఎంతగా కదిలించినా కదలలేదట. శరీరం మంచువలన గడ్డకట్టుకుపోయిందట. అటువైపుగా ఫిలిమ్ కంపెనీ కారును ఆపి నన్ను తీసుకుని లాడ్జికిచేర్చి డాక్టరును పిలిపించబోయామని, ఆ లోపలే హీటరు తెచ్చి గదంతా వేడి చేయించగానే నాలో కదలిక కలిగిందని చెప్పారు.

"భగవంతుడు దయామయుడు అంజూ! నీవు లేకుండానే తిరిగి మనవూరు చేరవలసి వస్తుందేమో అని భయపడ్డాం. నీ అదృష్టమో, మన బాధ్యత తలమీద వేసుకున్న లెక్చరర్ల అదృష్టమోకాని తిరిగి నిన్ను మేము ప్రాణాలతో చూడగలిగాము అన్నారు. కాని మాకు అర్థంకాని ఒకేఒక సమస్య ఎంత వెతికినా, ఎంతగా అరచినా కనిపించని నీవు ఆశ్చర్యంగా రోడ్డుకు ప్రక్కగా చిన్నచిన్న మొక్కలమీద పడుకుని వున్నావు. అదే నమ్మరాని నిజం" అన్నారు.

ఆ తరువాత ఒక రోజు మధురై, మరొక రోజు రామేశ్వరం గడిపి తిరిగి మద్రాసు చేరి అదే రాత్రి ట్రైనుకు మా వూరు వచ్చేశాం. మాస్టర్లు జరిగినది మా ఇంటికివచ్చి వివరిస్తామన్నారు. నేనే వద్దని వారించాను. నేను సలక్షణంగా ఉన్నాను, అలాంటప్పుడు మా అమ్మా నాన్నకు చెప్పి వాళ్ళను వేరే భయభ్రాంతులను చేయడం అసవసరమయిన విషయం అని చెప్పాను. కానీ మధూ! అది అంత తేలికగా వదలనట్లు తిరిగి తిరిగి గుర్తు చేసుకోమన్నట్లు రెండు నెలల తరువాత పెండ్లి పీటలమీద మీ అన్నయ్య ద్వారా మరల బయటపడింది. ప్రమాణ పూర్వకంగా చెప్తున్నాను మధూ! నేను ఏ తప్పు చేయలేదు. ఎవరి ప్రేమలో పడిందిలేదు. దానికి ఇంకా వయస్సు ముందుందని, నా కొరకు ఏ రాజకుమారుడు కాచుకుని వుంటాడని అనుకునేదాన్నేకాని ఆలా నీచంగా మటుకు ప్రవర్తించిందిలేదు. కాని నన్ను ఎవరూ నమ్మరు. నేను నిరపరాధినని పలికే సాక్షులు ఎవరున్నారు. నన్ను అలాంటి స్థితికి తీసుకువచ్చిన ఆ కామపిశాచి, ఆ భూమి, ఈ ఆకాశం అక్కడున్న వృక్షాలు ఇవే సాక్షులు. అవి అన్ని పలకలేవు. ఇక ఆ దుర్మార్గుడ్ని ఎక్కడున్నాడని వెతకను. ఏ మూలనున్నాడని వెతకను. ఏ ఆధారంతో వెతకను!" అంజుకు ఏడుపు ఆగలేదు. "మీ అన్నయ్యను ఎలా ఒప్పించ...." వాక్యం పూర్తికాలేదు. భరత్ బెడ్‌రూములోనుండి భళ్ళున గ్లాసు బద్దలయిన శబ్దం వినిపించింది. అంజు భయంగా మధు వైపు చూసింది. మధు చటుక్కునలేచి పడకగదివైపు పోబోయాడు. అంజూ చటుక్కున మధు చేయి పట్టుకుని "మధూ! పోకు అక్కడ ఎవరో దొంగ దూరినట్లు

వున్నాడు, అతని చేతులలో కత్తి, తుపాకి ఉంటుంది, వెళ్ళకు మధూ! చేతిలో ఏమైనా తీసుకో!

"ఉండండి వదినా! మనం ఇక్కడ ఉండగా దొంగ దూరడమేమిటి! చూడనివ్వండి." అంజును వదిలించుకుని భరత్ గది తలుపు తీశాడు. లోపలికి చూసిన అతను మాట రానట్లుగా నిలబడిపోయాడు. పడకమీద భరత్ తలను దిండు క్రింద దూర్చి కణతలు వత్తుకుంటున్నాడు, గాజు గ్లాసు క్రింద పడిపోయి వుంది. అది ముక్కలు ముక్కలుగా చెల్లా చెదురుగా పడివుంది.

"అన్నయ్యా!" మెల్లిగా పిలిచాడు.

అతను దిండులోనుండి తల ఎత్తి చూశాడు. అతని కళ్ళు ఎఱ్ఱగా చింత నిప్పులా మెరుస్తున్నవి. తలంతా చెదిరిపోయి వుంది. అతను డ్రస్సయినా మార్చకుండా పడకమీద వున్నాడు.

"ఏమిటన్నయ్యా అలాగున్నారు. ఆరోగ్యం సరిగాలేదా! అసలు ఎప్పుడు వచ్చారు? కాఫీ తీసుకురానా!"

మధు భరత్ దగ్గరగాపోయి చేతిని, అతని నుదుటిమీద తాకించి తల వెచ్చగా వుండడంచూసి టాబ్లెట్లు కొరకు ర్యాక్ వైపు తిరిగాడు!

"టాబ్లెట్లు తీసుకొన్నాను. నీళ్లు తాగేటపుడు గ్లాసు జారింది. ఉదయమే షార్ట్ ఆపరేషన్ ఒకటి చేశాను. మరేం కేసులు లేవు. అలసటగా అనిపించింది. రెస్టు తీసుకుందామని ముందే వచ్చాను. నేనొచ్చినప్పుడు నీవు లేవు" భరత్ అన్నాడు.

"భోజనం చేశారా!" ఆతృతగా అన్నాడు.

"ఊఁ! అక్కడే భోంచేశాను."

"కాఫీ తీసుకుని రానా?"

"అక్కర్లేదు నీవు వెళ్ళు. కొద్దిసేపు నిద్రపోతే అదే తగ్గిపోతుంది" అతను అటు వైపు తిరిగి పడుకున్నాడు. మధు చప్పుడు చేయకుండా తలుపు మూసి బయటకు వచ్చాడు.

అంజు బిక్కచచ్చిపోయి చూస్తూ వుంది. తను చెప్పినదంతా అతను వినలేదుకదా! నేను కథ కల్పించి చెప్తున్నానని కోపంతో గ్లాస్ విసిరేసి వుంటారేమో! అన్ని గదులలో ఎ. సి. వున్నా తమది ఆరవ ఫ్లోర్‌లో వున్నందువలన ఎప్పుడు రివ్వున వీచే గాలికి ఎ. సి. ఎక్కువ వాడడం మానేశారు. ఎండలు అధికంగా వున్నప్పుడు మటుకే ఉపయోగిస్తుండడంవలన హాల్లో మాట్లాడే ప్రతి మాట బెడ్‌రూములకు స్పష్టంగా వినిపిస్తుంది. భరత్ తనను ఇప్పుడు అబద్ధాల కోరుగా కూడా నిర్ణయిస్తాడు. తన దురదృష్టం అతను ఈ రోజు ఇంట్లో ఉండడం, తను అది గుర్తించక పోవడం.

* * * *

"అంజూ నీకొక శుభవార్త చెప్పబోతున్నాను. నాకేమి బహుమతి ఇస్తావు." సూజి సంతోషంతో వెలిగిపోతున్న మొహంతో అంజును దగ్గరకు తీసుకొని బుగ్గలమీద ముద్దు పెట్టుకుంది.

"ఏమిటి అంత సంతోషమైన వార్త. మొదట చెప్పు. ఆ తరువాత బహుమతి మాట." తనూ ఉత్సాహంగా అంది.

"చెప్తున్నాగా! కాని నాకు ప్రామిస్ చెయి, ఎవరికి చెప్పనని. కార్యం పూర్తవగానే అప్పుడే అందరికి తెలిపేది."

"ఎవరున్నారు చెప్పడానికి! మధూ ఒక్కడేగా! చెప్పనులే! త్వరగా చెప్పు, సస్పెన్స్‌తో చంపక."

"మరి....మరి....మరొక వారం రోజులలో మిస్ సూజి మిసెస్ సూజిని కోలాన్‌గా మారబోతోంది. అలా పలుకుతున్నప్పుడు సూజి మొహాన సిగ్గు కనిపించలేదు కాని సంతోషం మటుకు వెయ్యి దీపాల వెలుగులా వెలుగుతోంది.

"వాట్! సూజి! నీవు చెప్పేది నిజమా! ఇంతకీ ఎవరా లక్కీచాప్," అంజుకు ఆశ్చర్యంతోపాటు ఆనందంగా వుంది.

"నిజం అంజూ! నిక్ అమెరికన్, టూరిస్ట్‌గా వచ్చాడు. ఇద్దరం మూడు రోజుల క్రింద నైట్ క్లబ్‌లో కలిశాం. ఆ కలయిక, స్నేహంగా మారి, స్నేహం అనుబంధం అయింది. అతను అంత త్వరగా పెళ్ళి చేసుకొమ్మని అడుగుతాడని అనుకోలేదు. అతను హటాత్తుగా అలా అడిగేటప్పటికి, నేను దిమ్మెర పోయాననుకో. మొదట అతను ఫూల్ చేస్తున్నాడేమో అని కూడా తలిచాననుకో! కాని అతని ప్రపోజల్ నిజం. అతను డైవర్స్‌డ్ అంట. మంచి ఉద్యోగం ఉంది. వయస్సు ముప్పయి అయిదు సంవత్సరాలట. మా ఇద్దరికి వయస్సులో ఎక్కువే వ్యత్యాసం. కాని అతను చాలా బాగుంటాడు తెలుసా! అతని గురించి చెప్పినపుడు నేను నా గురించి దాచడం అవివేకం అని తలిచాను. అందుకే అతనికి వర్జిన్ కానని, జరిగినది టూకిగా చెప్పాను. అతను నా పాస్ట్ అనవసరమని ఫ్యూచర్‌లో తామిద్దరు అనుకూలమైన దంపతులుగా ఉండడమే తనకు కావలసిందని కోరాడు. నేను అతనికి ప్రమాణం చేశాను. ఎట్టి పరిస్థితులలోను నా వలన తనకు ఏవిధంగాను తిరిగి ఎందుకు పెండ్లిచేసుకున్నానా అనే ఆలోచనేరాని విధంగా నడుచుకుంటానని. అంజూ! రేపే మా ఎంగేజ్‌మెంట్. నిక్ రేపు మెర్లిన్ హోటల్లో పార్టీ ఇస్తున్నాడు. ఎవ్వరూ లేరులే. నీవే ముఖ్య అతిధివి. రిజిస్ట్రేషన్‌కు అప్లయి చేశాము. మరొక నాలుగయిదు రోజులలో రిజిస్టర్ ఆఫీసులో సంతకాలు పెట్టుకుని భార్యాభర్తలు అనిపించుకుని, ఇద్దరం కలిసే పోతాం అమెరికాకు. ఈ పెళ్ళితంతు పూర్తయేదాకా మా తల్లి దండ్రులకు తెలియకూడదు. ఆ తరువాతనే చెప్పదలచుకున్నాను. అంజూ! నీకు సంతోషంగా లేదా!"

రెండు చేతులతో సూజీ మొహాన్ని తనకు దగ్గరగా తీసుకుని మెరిసే కళ్ళతో అంది. "మనసారా సంతోషిస్తున్నాను సూజీ. నీ జీవనగతి సరయిన బాటగుండా పోతున్నందుకు, నిన్ను నిన్నుగా కోరి తన స్వంతం చేసుకుంటున్న అతను ఉన్నత మనస్కుడు. ఐ యామ్ సో హాపీ. ఇంతకీ అమ్మగారికి కావలసిన బహుమతి ఏమిటో!" చిలిపిగా అంది అంజూ.

"ఇదిగో ఈ రెండు చెంపలమీద తీయని రెండు ముద్దులు."

"ఛీ! నాటీ! నేనేం మగవాడినా అలా ముద్దు పెట్టుకోను."

"ఊహూ!! ఒప్పుకోను, నాకు కావలసింది అదే స్వీట్."

"ఓకే! కళ్ళు మూసుకో! పూర్తయేవరకు కళ్ళు తెరువకూడదు." బెదిరించింది.

సూజీ కళ్ళు మూసుకున్నట్లు మూసుకొని అంజూ మెత్తని పెదవులు తన చెంపలను తాకగనే చటుక్కున కళ్ళు తెరిచింది. అంజూకు సిగ్గనిపించింది. "కళ్ళు తెరవకూడదని ముందే చెప్పానుగా!" ముద్దుగా గుణిసింది.

"అబ్బ! మీ యిండియన్ స్వీట్‌లా ఉంది," పకపక నవ్వింది.

"అవును నన్ను ముఖ్యమైన గెస్ట్ అన్నావు. నేనెలా రాగలను. భరత్ రానిస్తాడంటావా!" అనుమానంగా అంది.

"మైగాడ్! అతనికి తెలియడమే! నిన్ను లోపలపెట్టి లాక్ చేస్తాడు. రేపు ఐదు గంటలకల్లా రెడీగా ఉంటే మనిద్దరం కలసి వెళ్ళిపోదాం. ఆ లోపల మధు కూడా రాడుగా! డిన్నరు డాన్స్ పూర్తవగానే వచ్చేద్దాం. మరీ ఆలస్యమయితే డాన్స్ సగం చూసి వచ్చేద్దాం. నీ గురించి నిక్‌కు చెప్పాను, నీవు నా బెస్ట్ ఫ్రెండ్ అని! అతను నిన్ను కలుసుకోవాలని ఆతృత పడుతున్నాడు, సమ్మతమేనా!"

"భయంగా ఉంది సూజీ. ఆ తర్వాత భరత్ గొడవ చేస్తాడేమో అని, కాని మన చివరీ కలయికను వదలదలుచుకోను మనస్సు రావడంలేదు, సూజీ.... నిన్ను ....నిన్ను వదలాలంటే గుండెలంతా మండుతున్నట్లుగా వుంది. కాని నా స్వార్థంకోసం నీ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకొమ్మని కోరను," అంజూ కళ్ళు తడిగా అయ్యాయి.

"నేను అదే ఆలోచించాను అంజూ! నేను 'నిక్'తో నీ గురించి మాట్లాడాను. అతను అన్నీ అర్థం చేసుకున్నాడు. అతను ఒక బాధ్యతగల ఉద్యోగి మాత్రమే కాదు. కొన్ని జనరల్సుకు రిపోర్టర్ కూడా! ఇప్పుడు కూడా సింగపూరులోని కొన్ని ముఖ్య స్థలాలను గురించి, ఇక్కడి ప్రజల సమైక్యత గురించి కొన్ని వ్యాసాలు వ్రాస్తున్నాడు. నాకు నిన్ను వదలి వెళ్ళాలనిలేదు. కాని నీవే ధైర్యం చూపడం లేదు. నేను వెళ్ళిన తరువాత బాగా ఆలోచించుకో! నా స్నేహం నీకు కావాలని, అది నీ భర్తమీద నీకున్న పేమకన్న ముఖ్యమయినది

అనీ అనుకుంటే నాకు జాబు వ్రాయి. నేను నీకు టిక్కెట్టు, వీసా పంపుతాను. నీవు నా దగ్గరకు వచ్చావంటే నీ ఫ్యూచరే మారుస్తాను. ఎన్ని రోజులు అతనిలో మార్పును ఎదురు చూస్తావు. ఇలాగే జీవితాంతం సన్యాసిలా గడుపుతావా! నీకు భర్త అనురాగం, పిల్లల మమత కావాలని లేదూ! నీకు ఏమి తక్కువని అతని కరుణకోసం కాచుకుని వుంటావు. లోకంలో భరత్ ఒక్కడే మగవాడు కాదు అంజూ! ప్రేమ బంధం. పవిత్రమైనదే! అది విడదీయలేనిదేకాని అది రెండు వైపులనుండి పెనవేసుకున్నప్పుడే. నీది ఒక వైపు రాగం. నీకు విద్య, రూపం, గుణం అన్నీ వున్నవి, అవి వుపయోగించుకోక ఎన్ని రోజులు అతని కొరకు ఎదురు చూస్తూ వుంటావు. నీ జీవితాన్ని మరొక మలుపు తిప్పుకొనేందుకు ప్రయత్నించు అంజూ, నేను మారలేదూ! భరత్ లేకుండా బ్రతకలేను అనుకున్నా! ఏదో ఒక సంఘటన మనల్ని మారుస్తూనే వుంటుంది. నేను వెళ్ళిన తరువాత బాగా ఆలోచించుకో! నీమీద వున్న విపరీతమైన ప్రేమ వలననే నిన్ను ఇంతగా ప్రోత్సహిస్తున్నాను."

"థ్యాంక్స్ సూజీ! నీవు చెప్పినదంతా ఆలోచిస్తాను. కాని మరొక వివాహం గురించి కాదు. నా కాళ్ళమీద నేను నిలబడే దానికి ప్రయత్నిస్తాను. ఈ ఇంట్లో నేను పిలవని అతిధినే! నిజమే! నాకు ఏం అధికారం ఉందని ఈ ఇంట్లో శాశ్వతంగా ఉంటాను, నేను అనేది లేకుంటే అతనైనా మరొక వివాహం చేసుకుంటాడు. ఇప్పుడు నేనొక బాధ్యతను అతనికి."

"ఓకె! రేపు ఎలాంటి చీర కట్టుకోమంటావు. అది పెద్ద హోటలేమో! చాలామంది ఉంటారనుకొంటా! భయంగా ఉంది బాబూ!" తిరిగి వుత్సాహంగా అంది.

"ఊ!! పెద్ద హోటలే! అంజనాగారు ఎలాంటి చీరలోనయినా ముద్దుగా మగవాళ్ళను మైకంతో క్రింద పడేటట్లుగా ఉంటారు. రేపు సరిగ్గా నాలుగున్నరకు రెడీగా వుండాలి." తిరిగి హెచ్చరించింది.

"సూజీ! మధుకు ఒక స్లిప్పు వ్రాసి పెట్టనా!" తిరిగి అంది.

"వద్దువద్దు. మధు తప్పకుండా వాళ్ళ అన్నయ్యకు చెప్తాడు. అతను ఈ సింగపూర్లో నీవు నాతో ఎక్కడున్నా లాక్కొచ్చేస్తాడు. మన పార్టీ అంతా రసాభంగమే!"

"అలాగే! రహస్యంగానే వస్తాలే!" అంజూకు సంతోషంగా వుంది. తిరిగి సూజీతో కొన్ని గంటలు హాయిగా గడపబోతున్నందుకు.

మరుసటి రోజు అనుకున్న ప్రకారం నాలుగున్నరకు రెడీ అయింది. మామగారు ప్రజంట్ చేసిన చీరలో పింక్ కలర్‌లో తెల్లని తీగలతో, చిన్న చిన్న పూవులతో బార్డరుగానున్న జపాన్ జార్జెట్ చీర కట్టుకుంది. అదే రంగు జాకెటు, ఎఱ్ఱ రాళ్ళ నగలు, గట్టిగా బిగించి వేసిన రెండు జడలు తిరిగి కాలేజికి

పోతున్న లావణ్యవతిలా ఉంది అంజు. అంజును చూసిన సూజి కళ్ళు తిప్పుకో లేక పోయింది,

"అబ్బ! ఉషస్సుకు విచ్చుకున్న ఎర్ర గులాబిలా వున్నావు అంజూ! నిక్ నిన్ను చూడగానే నన్నెందుకు సెలక్ట్ చేసుకున్నానా అని మథనపడుతాడు, మూర్ఖుడు భరత్!"

"అదిగో! వాడిని అలా అంటే నాకు కోపం వస్తుంది."

"సారీ, సారీ! అనను అనను!" సూజి తమాషాగా ఒంగి పైకిలేచి నవ్వుతూ ముందుకు బయలు దేరింది. సూజికి ప్రక్కగా నడుస్తున్న అంజు సూజి వైపే చూస్తోంది. ఎంత అందంగా ఉంది సూజి ఈ రోజు! ఇది సాధారణమైన రోజా! తన యంగేజ్‌మెంటు రోజు. పెద్దవాళ్ళులేని నిశ్చితార్థం. లేత అరటాకు పచ్చ రంగు షిపాన్ మాక్సి బంగారురంగు శరీరంమీద గుండెల వరకు వుంది. రెండు స్ట్రిపులు మటుకు భుజాలమీద సపోర్టింగ్‌గా ఉన్నాయి. చెవులకు, మెడకు, చేతికి, వేలికి జేడ్ నగల సెట్టు, మాక్సి రంగుకు మాచింగ్‌గా వున్నాయి. భుజాల వరకు వున్న జుట్టును, కుడిసైడు పైకి దువ్వి ఆకు పచ్చని క్లిప్ వేసివుంది. అందమయిన మేకప్, అతికినట్లుగా మరీ ఆకర్షణీయంగా ఉంది, ఇంత అందాన్ని కాదన్నాడట భరత్. అతను సన్యాసి అయి వుంటాడు! లేకుంటే అభిరుచి తెలి యని వాడయి వుంటాడు. అతనికి అందంలోను, నాగరికతలోను నిండివున్న సూజి నచ్చలేదు. ఎంతో మామూలుగా పూర్తి తెలుగుతనంలో ఉన్న తను నచ్చింది. సూజీనే భర్త ప్రక్కగా పోల్చి చూసింది. చక్కని జంట అను కుంది, మరుక్షణం తనను దగ్గరకు తీసుకున్న అనుభవం సూజితో ఊహించు కుంది. మనస్సు అంగీకరించలేదు. అతని స్పర్శ తనకు మటుకే స్వంతం, సూజీయేకాదు. మరే స్త్రీ అయినా అతని స్పర్శ అనుభవించకూడదు. భరత్ తన వాడు. ముందురోజు అతని మరొక వివాహం గురించి ఆలోచించినందుకు ఇప్పుడు నవ్వు వస్తుంది. అది ఉక్రోషంగా ఊహించుకుంటే బాగానే వుంటుంది. కాని నిజ జీవితంలో తలుచుకుంటే అసూయతో ప్రాణమే పోతుంది.

చిన్నగా నవ్వుకుంటూ సూజి ప్రక్క సీట్లో కూర్చుని సీట్ బెల్ట్ ఫిక్స్ చేసుకుంది. ఇద్దరూ ఆరున్నరవరకు సిటీ చుట్టిచూసి, ఆరున్నరకు మెర్లిన్ హోటల్ చేరారు. హోటల్ పార్కింగ్ ప్లేసులో కార్లమధ్య ఈగ దూరనయినా సందులేనట్లు వుంది. దేశ విదేశాల వ్యక్తులు అతి ఆడంబరంగా వస్తున్నారు, పోతున్నారు. ఆకర్షణీయమైన స్త్రీలకు కొదవే లేనట్లు రంగురంగుల దుస్తులతో, తళుక్కున మెరిసే నగలతో ప్రతి స్త్రీ మెరిసిపోతున్నది. సిరి అంతా అక్కడే వున్నట్లనిపిస్తున్నది: అక్కడున్న చాలామంది కళ్ళు వీరిద్దరి మీదనే వున్నవి. చెలిమికి జాతి మతభేదం లేనట్లు ఇద్దరూ చేతిలో చేయి వేసుకుని నడుస్తుంటే చూడ ముచ్చటగా వుంది చూసేవారి కళ్ళకు,

లాంజ్‌లోకి రాగానే పొడవుగా, అందుకు తగ్గ లావుగా! ఆకుపచ్చ కళ్ళ తోటి, లేత గులాబి వర్ణంగల శరీరంతోటి. నల్లగా నిగనిగలాడుతున్న వెంట్రు కలతోటి ఎదురయిన వ్యక్తిని "నిక్‌లాన్" అని పరిచయం చేసింది సూజి. సిగ్గు పడుతూనే అతను అందించిన చేయి అందుకుని వదిలేసింది.

"నిక్! ఎలా వుంది నా ఫ్రెండ్, పేరు అంజనా. అంజు అని పిలువు." సూజి చెప్పగనే అతను చిన్నగ నవ్వి "నీ వన్నట్లు నీ ఫ్రెండ్ బ్యూటిఫులుగా వున్నారు, కాలేజి చదువు చదివి ఇంత సిగ్గుపడే అమ్మాయిని నేనెక్కడా చూడ లేదు."

అతను అలా అంటుంటే అంజుకు మరీ సిగ్గుతో ప్రాణం కుంచించుకు పోయేటట్లు ఉంది. వీరిద్దరూ తనను గురించి మాట్లాడడం ఆపితే చాలు, తను ఫ్రీగా మూవ్ అవుతుంది. అతను ఇద్దరిని తీసుకుని లిఫ్టుగుండా చివరి ఫ్లోర్ చేరి తమకని బుక్ చేసిన టేబిల్ దగ్గరకు వచ్చి కూర్చున్నారు. అది రౌండ్ టేబిల్ అయినందున ముగ్గురు ఎదురెదురుగా కూర్చున్నారు, ఆ హాల్లోని లైట్లు డిమ్‌గా వెలుగుతున్నవి. లైట్లు వెలుగుతున్నా ప్రతి టేబిల్‌మీద, స్పూన్లు, ఫోర్కులు, లిక్కర్ గ్లాసులతోపాటే పూలతో నిండివున్న చిన్న వాజులు. వెలుగుతున్న ఎర్రని కాండిల్స్, ఇవి ఎందుకా అన్నట్లు చూస్తోంది. అది వెస్టరన్ కస్టమ్ అని ఆపైన గుర్తు తెచ్చుకుంది. హాలు నలువైపులా దృష్టి సారించింది అంజు. చాలా వరకు టేబిల్స్ నిండి వున్నవి. కొంతమంది కబుర్లతో గ్లాసులలోనున్న రంగు ద్రవాలను తాగుతున్నారు. చిన్నగా మాట్లాడుకుంటున్నారు, గ్లాసుల చప్పుళ్ళు, స్పూన్లు, ప్లేట్ల చప్పుళ్ళు కొంచం కోలాహలంగానే ఉంది. స్టేజిమీద ఒక అమ్మాయి ఇంగ్లీషు పాటలు పాడుతోంది. ప్రక్కనున్న ఆర్కెస్ట్రా పాటకు అను గుణంగా మ్యూజిక్ ఇస్తున్నారు.

అంజు దృష్టి తిరిగి సూజి, నిక్‌మీదకు మరలింది. సూజి చిన్నగా అత నితో ఏదో మాట్లాడుతోంది అతను సూజి మాటలతో పూర్తిగా లీనమయివున్నాడు. మొట్టమొదటి సారిగా పరీక్షగా చూస్తున్నట్లు అతనివైపు చూసింది, తను సూజి ముప్పై సంవత్సరాలు పైబడిన వ్యక్తి అనగానే వయసయిపోయి, తల నెరసి, బట్టతలతో ఎర్రగా దొండపండులా ఉంటాడనుకొంది. కాని సూజి అతనిముందు బాలా పొట్టిగా ఉన్నట్లుంది. భరత్ ముప్పై సంవత్సరాల వయస్సులో ఎలా ఉంటారు ఆలోచనలో పడింది. తన కళ్ళముందు ఒక వింతయిన దృశ్యం వన్నిగా కనుపించింది. అరడుగుల రెండంగుళాల భరత్ రెండు అంగుళాలకు వంగిపోయిన పొట్టతోటి, సోడాబుడ్డి కళ్ళద్దాలతోటి, చేతిలో ఒక పొడుగాటి కర్రతో, సన్నగా, గాంధీతో బెన్‌కింగ్స్లేలా బాబోయ్! తననుతానే మరిచి పకపక నవ్వింది.

"ఆఁ! అంజూ! ఏమిటి? ఏమిటి అంతగా నవ్వించే సీన్." సూజి అంజును కదిలించింది.

ఉలిక్కి పడింది అంజు. "మైగాడ్! నన్ను నేనే మరచిపోయాను. సారీ!" సంభ్రమంగా అంది.

"ఊహూ! అదంతా వీల్లేదు. విషయమేమిటి చెప్పు," బలవంతం చేసింది.

"ఓ! సూజీ! నన్ను వదిలెయ్ బాబూ. నీకు పుణ్యం ఉంటుంది, కారణం చెప్పితే నీవు నవ్వుతావు."

"అదే నాకు కావలసింది, ఇంతకీ ఏమిటి చెప్పు, లేకపోతే నిన్ను వదలనే వదలను."

"నేను చెప్పిన తరువాత మీరిద్దరూ నవ్వనే నవ్వకూడదు."

"ఆల్ రైట్! నవ్వంలే! త్వరగా చెప్పు."

"అది....అది....మరి నీవు నీ ఫియాన్స్ వయసు ముప్పయి అయిదు సంవత్సరాలన్నావు కదూ! నేను మరొక రకంగా ఊహించుకున్నాలే!"

"ఎలా?"

"ఎలా అంటే, తెల్లబడి పలచబడిన జుట్టు, ఎర్రగా కందిపోయిన జుట్టు, చిన్నవిగా బండ వెలుతురు అంటే భయపడే కళ్లు, లావుగా పొట్టిగా, దాడీ, మీసాలులోవున్న వయసయిన ఆయన అనుకున్నా! అలాగే భరత్‌ను పోల్చు కున్నా, వంగిపోయిన గడ కర్రలా, పొట్ట లేకపోతే జెన్‌కిగ్లీస్‌లా! ఓహ్! నేను చెప్పనుపో...." తిరిగి కిలకిలా నవ్వింది. అంజుతోపాటే సూజీ, నిక్ కలసి శబ్దం చేస్తూ నవ్వారు. వీళ్ళ నవ్వులకు మిగత టేబిల్స్ దగ్గర కూర్చున్నవారు తిరిగి చూస్తున్నారు.

"అంజూ! ఏమి జోక్! మైగాడ్! ముప్పయి అయిదు సంవత్సరాలకు ముసిలివాళ్ళయ్యేదేమిటి, ఇన్ని ఇంగ్లీష్ సినిమాలు చూస్తున్నావు. యాభై సంవత్స రాలపైన వయసుంటేనే కదా నాయకుడు అని తెలియదూ! అంతలోనే మరచి పోయావా!"

చటుక్కున అతనన్నాడు. "మీ యిండియాలో థర్టీఫయివ్‌కు ముసలివాళ్లు అయిపోతారా!"

"ఊఁ! చేసే ఉద్యోగపు ఆదాయానికి మించిపోయే ఖర్చులకు ఎలా వుంటారు. పెళ్ళాం, బిడ్డలు, తల్లి దండ్రులు, జబ్బులు, వేలు అప్పుచేసి అక్క చెల్లెళ్ళకు పెళ్ళి చేసిన ఖర్చులు, తమ్ముళ్ల చదువులకయ్యే ఖర్చులు. ఇన్ని బాధ్య తలతో ఎలా వుంటారు. ముప్పయి అయిదు సంవత్సరాలుగాదు, పాతిక సంవత్స రాలు పైబడితేనే చాలు, తిన్నా తినకపోయినా పెరిగిపోయే పొట్ట, కళ్ళకు తల నొప్పి సాకుతో అద్దాలు, ఆలోచనల కొరకు అప్పుడప్పుడు జుట్టు పీక్కునేదానికి నాలుగు వెంట్రుకలు వుండనీ అని రాలిపోగా మిగిలిన జుట్టు....కాని ఒకటిమటుకు మా మగవాళ్ళను మెచ్చుకోవాలి, మీలా ఇరవయి ఒక సంవత్సరం ముగియడం తోటే బాధ్యతలు తెంచుకుని ఎగిరిపోరు."

"స్టాపిట్ అంజూ! ఈరోజు అమ్మాయిగారు బలే హుషారుగా వున్నారు, ఏమిటి కథ!"

"నీవు అమెరికా వెళ్ళిన తరువాత నేను గుర్తుండాలి కదా అందుకు."

"అంజూ!" సూజీ కళ్ళలో నీళ్ళు నిండాయి.

"డోన్ట్ బి సిల్లీ! సూజీని కొట్టి పారేస్తున్నదే కాని తనకు ఏడుపు వచ్చేట్లు వుంది. అతను వీళ్ళిద్దరి వైపు ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"ఇది సంతోషకరమైన రోజు, మనం వచ్చింది యంగేజ్‌మెంట్ పార్టీ కొరకు. మీరిద్దరూ మీమీ మూడ్సు కొంచం ప్రక్కన పెడితే నేను సంతో షిస్తాను. లేకపోతే మీతోపాటు నేను ఏడవాలి." అతను ఏడుపు వస్తున్నట్లుగా నటించేటప్పటికి ఇద్దరూ పక్కున నవ్వారు.

"థాంక్‌గాడ్! హారిబుల్ సీన్! ఆ ఏడుపులే నాకు పట్టవు. ఒకే! మిసెస్ అంజనా, మీనాక్షిగా సూజీ వాంగ్‌ను నాకాబోయే భార్యగా నిశ్చయం చేసుకుంటు న్నాను. దానికి ఇదిగో ఈ రింగ్ నిదర్శనం." అతను కోటు పాకెట్‌లోనుండి చిన్న గ్లాస్ పెట్టె తెరిచి అందులోనుండి తెల్లగా ధగధగ మెరుస్తున్న రాళ్ల పొదగబడిన ఉంగరం తీసి సూజీ చేతి వేలికి తొడిగి, చెంపలమీద ముద్దు పెట్టు కున్నాడు. సూజీ తిరిగి అతని కుడి చెంపను తన పెదవులతో స్పృశించింది. ఆ తరువాత అతను టేబిల్‌మీద అప్పటికే చిన్నచిన్న గ్లాసులలో నింపివున్న ద్రవాన్ని తను అందుకుని మిగిలిన రెండు ఇద్దరిని తీసుకొమ్మని చీర్స్ చెప్ప మన్నాడు. సూజీ తీసుకుంది కాని అంజు తాకలేదు.

"ఊ తీసుకో! అంజూ అది మైకం కలిగించే విస్కీకాదు. ఓన్లీ వైన్. తాగి చూడు- ఆ తరువాత నీకే నచ్చుతుంది." సూజీ బలవంతం చేస్తుంటే అది తీసుకొని వాళ్ళిద్దరి గ్లాసును తాకించి ఒక గుక్కలో తాగేసింది. తాగిన తరువాత బాగుందనే అనిపించింది.

"ఎలా ఉంది" సూజీ అంది.

"పరవాలేదు."

"అంటే మీకు నచ్చిందన్నమాట. మరొక గ్లాసు తీసుకోండి." అతను తిరిగి అంజు, సూజీ గ్లాసులకు నింపసాగాడు.

అంజు అది తాగేసి అబ్బ కడుపు నిండిపోయింది అంది.

"దీనితోనే! మన డిన్నరు సంగతేమిటి?"

"సూజీ! నాకు మీ చైనీస్ ఫుడ్, ఇంగ్లీష్ ఫుడ్ దిగవు. నన్ను మటుకు వదిలెయ్!"

"నాన్సెన్స్! అం... తేలి... వదులుతాననుకొన్నావా! అన్ని తినాల్సిందే! బీఫ్, పోర్కు వదిలెయ్. ... ఫిష్ ...ందిగా!"

అంతలోనే సర్వర్లు ఒక్కొక్క ఐటమ్ మెను ప్రకారం తెచ్చి ముందర పెడుతున్నారు. అతను తన ప్లేట్ ఒక్కొక్కటి తీసి పెట్టుకుంటుంటే సూజీ తనతోపాటే అంజుకు ప్లేట్లో ప్రతి పదార్థం సర్ద సాగింది. ఆ సలాడ్ వాసన అంజు కడుపులో తిప్పుతున్నట్లుగా ఉంది. కాని తప్పని సరి.

ఇంతలో అతను తిరిగి మరొక గ్లాస్ అందించాడు. "ఇదిగో ఇది తాగండి. ఆ తరువాత మీరు ఏం తింటున్నారో కూడా తెలియదు." అంజు అది అందుకుని గబగబ తాగేసింది. కాని ఈసారి ఘాటుగా గొంతును కడుపును మండించింది. అంజుకు తెలియదు, అతను చాంపేన్‌లో విస్కీ కలిపింది.

"ఎలా ఉంది?" అతనన్నాడు.

"కడుపు మండుతున్నది" అంజు మెల్లగా అంది. శరీరం మెల్లగా తేలుతున్నట్లుగా ఉంది.

"అది చల్లారాలంటే మీ ముందున్న పదార్థాలు తినాలి." అతను ఒత్తిడి చేస్తుంటే ఒక్కొక్కటిగా తిన సాగింది. దాని రుచి తెలియడం లేదు, అతను తిరిగి తిరిగి విస్కీ నింపిన గ్లాసు అందిస్తున్నాడు, అంజుకు అది వారించే శక్తి లేదు.

"ప్లీజ్! నిక్! స్టాపిట్! ఆ తరువాత మిస్టర్ భరత్ మీ మీద కేసు పెడతాడు," సూజీ వారించింది.

"నీకు తెలియదు, ఇలా పార్టీకి వచ్చిన గెస్ట్స్ మైకంలో పడిపోయేంత వరకు డ్రింక్ ఇవ్వాల్సిందే. అదే పార్టీ అంటే. గుర్తుంచుకోవాలిగా, నికోలాస్ ఎంగేజ్‌మెంటు పార్టీలో ఎక్కువగా తాగి పడిపోయాను అలా అంతకు ముందు ఎప్పుడు జరగలేదని. తాను తీసుకుంటుంటే మధ్యలో నీకు బాధేమిటి?"

సూజీ అతను స్టడీగా వుండడం. తను మటుకు ఇలా తూలడం ఆశ్చర్యంగా వుంది అంజుకు.

సూజీ తిరిగి అంటుంది. "నీకు అంజు భర్త, మరిది సంగతి తెలియదు. వాళ్ళు ఈ వూర్లో పేరున్న బిజినెస్ మాగ్నెట్ కొడుకులు. ఆ తరువాత విపరీతానికి దారి తీయొచ్చు

"యూ సిల్లీ! దీనికి భయపడడమేమిటి? ఇంతకీ మీ ఫ్రెండ్ భర్తను కలుసుకోవాలని వుంది."

"ఓ! దానికేం అబ్జక్షన్ చెప్పడు, ఎందుకంటే అతనికి ఇష్టమయినవాళ్లు మగవాళ్లే."

"అంటే ఆడవాళ్ళంటే అలర్జీయా!"

"అలర్జీ కాదు, ఎక్కడ తనను తినేస్తారో అన్న భయం."

"వాట్!"

"భరత్ ఈజ్ ది టాప్‌మోస్ట్ హాండ్‌సమ్‌గై ఇన్ హోల్ సింగపూర్!"

"అలాగా! మరి నీవు నైబర్‌గా ఉంటూ లవ్‌లో పడలేదా!"

"ఎందుకు పడలేదా! పడ్డాను! అతని ద్వారా అతని కుక్‌చేత మెడబట్టి గెంటించుకో బడ్డాను.

"థాంక్స్ టు హిమ్! నిన్ను నా కొరకు వదిలేశాడన్నమాట," నవ్వాడు అతను.

"సూజీ! ఏమిటా తెలివి తక్కువ వాగుడు. కాబోయే భర్తతో మాట్లాడే మాటలేనా అవి," అంజు వచ్చిరాని తమిళంలో అతనికి అర్థం కాకుండా అంది.

"భయపడకు డార్లింగ్. మా ఇద్దరి మధ్య రహస్యమే లేనపుడు ఇది దాచి ఉంచడం ఎందుకు. నిక్ ఏం అనుకోడులే!" సూజీ కొంచెం బెరుకు లేకుండా అంది.

"నీ ధైర్యానికి మెచ్చుకోవాలి."

భోజనం పూర్తయింది. డాన్సు ప్రోగ్రాం మొదలయింది. ముగ్గురమ్మాయిలు డిస్కో చేస్తుంటే మొదట బాగానే ఉందనిపించింది. కాని నిక్ మరోమారు అందించిన విస్కీతో అంజూ పూర్తిగా తన స్వాధీనం తప్పి టేబిల్ మీద తల వాల్చి పడుకుంది, పూర్తిగా డాన్స్ చూడనేలేదు.

అంజూ! అంజూ! లే! ప్రోగ్రాం పూర్తయింది, ఇంటికి పోదాం." సూజీ అంజు భుజాలు పట్టుకుని కుదపసాగింది. బలవంతంగా కళ్లు తెరిచిన అంజుకు సూజీ మొహం మసకగా తెలుస్తోంది.

"అరె! అప్పుడే అయిపోయిందా! ఇప్పుడే కదూ మొదలయింది. అంజుకు మత్తులో మాటలు ముద్దముద్దగా వస్తున్నాయి. "నేను....నేను....నేనిక్కడే పడుకుంటాను సూజీ." తిరిగి తల వాల్చింది.

అతనికి నవ్వు వస్తోంది. సూజీ బలవంతంగా అంజును లేపి, తన భుజంపై అంజు తలను వాల్చి అంజు నడుముచుట్టు చేయిపోనిచ్చి అతని సహాయంతో లిఫ్టుగుండా క్రిందకు వచ్చింది. అతనికి గుడ్‌నైట్ చెప్పి అంజును మెల్లగా వెనుక సీట్లో పడుకోబెట్టి కారు డ్రైవ్‌చేసుకుంటు ఇల్లు చేరింది. అతి కష్టంమీద తను నడిపించుకుంటు, బటన్ నొక్కింది. తలుపు తీసింది భరత్. సూజీకి శరీరం సన్నగా వణికింది. అయినా తనకు లెక్కలేనట్లు అంజును కుదిపి "అంజూ లే! కళ్ళు తెరు. లోపలికి వెళ్ళు అంది.

ఎంతో కష్టంపై కళ్ళు తెరిచిన అంజు తూలుతూ లోపలికి వచ్చి హాల్లో సోఫాలో పడిపోయింది. నిప్పులు కక్కుతున్న భరత్‌నుకాని, ఎంతో ఆతృతతో ఎదురుచూస్తున్న మధునుగాని గమనించే స్థితిలో లేదు.

భరత్ విసురుగా అంజును కదిల్చి లేపి కూర్చుండబెట్టాడు. "యూ ఇడియట్! ఎక్కడికెళ్ళావు ఇంతవరకు? ఇంత రాత్రివరకు ఎక్కడ తిరిగొచ్చావ్! లే! లేచి బదులు చెప్పు" అంజును భుజాలు పట్టుకుని ఊపేస్తున్నాడు. కళ్ళు తెరిచి

అతనివైపు చూసిన అంజు "నువ్వా! నీకు చెప్పనుపో!" కసిరింది. మత్తులో అతనిని మీరు అనడం కూడా మరచిపోయింది.

"మధూ! మధూ! ఎక్కడున్నావు?" అంజు మధుకొరకు వెదుకుతూంది.

"ఇక్కడే వున్నాను వదినా! మీ ప్రక్కనే వున్నాను" అతను అంజుకు దగ్గరగా వచ్చాడు.

"వదినా! ఎవడా వెధవ. త్వరగా చెప్పండి! మిమ్మల్ని ఇంతగా తాగించి వంపించాడు. వాడి రక్తం కళ్ళచూస్తాను."

"ష్! అలా....మర్యాద.... లేకుండా... మాట్లాడకు.... అతను....అతను...."

"ఊ త్వరగా చెప్పండి వదినా! వాడు ఎక్కడున్నాడు? వాడి అంతు తేలుస్తాను" మధు అంజు చేతులు పట్టుకుని తొందర చేస్తున్నాడు.

"మధూ! నూజి.... నూజి.... నూజిలేదూ!"

"డామ్ నూజి! ఆ తిరుగుబోతు గురించి చెప్పకు' కస్సుమన్నాడు.

"నూజిని అలా అంటే చెప్పను" తిరిగి వడుకుంద.

ఇదంతా శరత్‌కు వినుగ్గా వుంది. "మధూ నీవులే! నేనే తేల్చుకుంటాను. దీనికి ఒక ఫుల్‌స్టాప్ పెట్టకపోతే అనంతంగా సాగిపోయేట్లు వుంది.

"వద్దన్నయ్యా! నేను కనుక్కొంటాను. వదిన అమాయకురాలు. నూజికి పూర్తిగా బానిస అయింది."

"వదినా! ప్లీజ్! లేచి ఏంజరిగిందో చెప్పండి. రాత్రి రెండువరకు ఎక్కడికెళ్ళారు. లేచి చెప్పండి వదినా!"

అంజు తిరిగి తల విదిల్చి లేచి కూర్చుంది.

"మధూ! నూజిలేదూ! నూజికి.... అమ్మో! అది రహస్యం. నూజి చెప్పవద్దన్నది. ప్రమాణం చేయించుకుంది కూడా!"

"ఫరవాలేదు వదినా! నేనెవ్వరికి చెప్పనుగా! రహస్యంగానే వుంచుతాను. ఏమిటో చెప్పండి."

"ఒకే! నీకు.... ఒక్కడికే.... చెప్తాను. నూజికి ఈ రోజు.... "ఓక్" అనే శబ్దం చేసింది.

"మధూ! వాంతి వచ్చేట్లు వుంది. నన్ను.... నన్ను.... బాత్‌రూమ్‌లోకి తీసుకుపోవూ!"

"అలాగే మీరు లేచి నిలబడండి' అంజును లేపి వీపుచుట్టూ చేయివేసి నడిపించుకుంటూ బాత్‌రూమ్‌లోకి పిలుచుకుని పోయాడు. అంతే! బక్కున వాంతి చేసింది. కడుపులో ఉన్నదంతా బయటకొచ్చేసింది. కళ్ళలో ముక్కులో నీళ్ళు. క్రింద మీద అయింది. చీర అంతా నాశనమయింది. మధు అంజుదగ్గర నోరు కడిగించి, మొహం చేతులు కడిగి, తుడిచి డైనింగ్‌హాల్లో కుర్చీలో కూర్చుండబెట్టి అంజు గదివైపుపోయాడు మాక్సి తీసుకుని రాను.

అంజు నీరసంగా తలవాల్చి కూర్చుంది. ముందున్న మైకం కొంచెం తగ్గినట్లనిపించింది. కాని తలనొప్పి మొదలవుతోంది. నిద్రవేరే ముంచుకు వస్తున్నది. అలాగే నేలమీదయినా పడుకోవాలనిపిస్తున్నది.

మధు మాక్సి తెస్తుండడం చూసిన శరత్, "మధూ! అది ఇలా ఇవ్వు" అని అది అందుకుని డైనింగ్‌హాలువైపు వచ్చాడు. మధు అక్కడే నిలబడి పోయాడు.

శరత్ అంజుకు దగ్గరగా పోయి జాకెట్‌కు వెనుకగానున్న హుక్స్ విప్పి, తడిగానున్న చీరను క్రిందకు లాగి, మాక్సి తలమీదుగా వేసి జాకెట్ లాగి వేశాడు. మెడలోనున్న నెక్లెస్‌ను తీసివేశాడు. అతను ఏంచేస్తున్నా అంజులో కదలికే లేదు.

అంజును నడిపించుకుంటూ హాల్లోకి తీసుకుని వచ్చాడు. సోఫాలో కూర్చున్న అంజుకు దాహంతో నోరెండిపోతున్నది. "మధూ! తలనొప్పిగా ఉంది."

"కాఫీ తెస్తాను ఉండండి వదినా!" అతను కిచెన్‌లోకి పోయి, ఫ్లాస్కులోనున్న వేడినీళ్ళతో కాఫీ కలిపి, 'పెనడాల్' మాత్రలు రెండు తీసుకుని వచ్చి అంజుతో వేయించి కాఫీ తాగించాడు. రెండు నిమిషాలలో తల భారం తగ్గింది. తల ఎత్తి శరత్ మొహంవైపు చూసి తల తిప్పుకుంది.

"వదినా! ఇప్పుడు చెప్పండి. ఏంజరిగింది. మీకు ఎవరు ఇంత ఓవర్‌గా తాగించారు. వివరంగా చెప్పండి." మధుకు కసిగా ఉంది. ఆ తాగించినవాడెవడో ఎదురుగా ఉంటే నిలువునా చీరేసి ఉండేవాడు.

"అది.... నికోలాస్ బేబిచాంప్ అని ఇచ్చాడు. అది ఘాటుగా కడుపు మంటపుట్టేట్లుగా ఉంది. అంతే నిద్రపోయాను."

"ఇంతకీ ఎవరా ఇడియట్?"

"అలా అమర్యాదగా మాట్లాడకు. అతను నూజికి కాబోయే భర్త. ఈరోజే నూజికి యంగేజ్‌మెంట్ జరిగింది. మెర్లిన్ హోటల్లో పార్టీ ఇచ్చాడు. నే నొక్కదాన్నే గెస్టు. మధూ! నూజి ఏమందో తెలుసా! నన్ను తనతో వచ్చేయమంది. అతను కూడా చెప్పాడంట. నాకు టిక్కెట్టు, వీసా అన్నీ అతనే తీసిస్తాడంట."

"అంటే మీరు వాళ్ళతో పోవాలనుకుంటున్నారా!" మధు గొంతులో తీవ్రత ఉంది.

"అవును. ఇక్కడవున్నా, ఎక్కడవున్నా ఒక్కటే! నాకెవరు వున్నారు. ఎన్నిరోజులు మీమీద ఆధారపడి ఉండను. అందుకే నూజీతో వెళ్ళిపోవాలనే అనుకుంటున్నా!"

అంతే! మధు విసురుగా వెనక్కు లాగబడ్డాడు. అంజు చెంపలు అదిరి పోతున్నాయి.

"యూ రాస్కెల్! ఎంత ధైర్యం! ఎంతగా తెగించావు. చివరకు తనతోటి

పారిపోవాలని చూస్తున్నావా! అమెరికాకు వెళ్ళి ఏంచేస్తావు? తనతోపాటే ప్రాస్టిట్యూట్‌లా మారాలనా!" అన్నిరోజుల అతని ఆవేదన ఆవేశంగా మారి, ఆవేశం, ఆగ్రహంగా రూపొంది తననుతానే మరచి భరత్ అంజును ఇష్టం వచ్చినట్లుగా చెంపలను అదరగొట్టసాగాడు. అంజుకు భయంతో నొప్పికి ఏడవాలన్నది కూడా తెలియకుండా, ఆ దెబ్బలను తప్పించుకోను కూడా ప్రయత్నించక అతనివైపు అలాగే చూస్తూండిపోయింది.

"అన్నయ్యా! వదులు! వదినను కొట్టకు. వదులన్నయ్యా! వదినను కొట్టకండి." మధు భరత్ చేతులను పట్టి వెనక్కు లాగుతున్నాడు. అతను మధును ఒక్క విదిలింపులో వెనక్కు నెట్టాడు.

"నీవు జోక్యం కలిగించుకోకు. నీవల్లనే తనిలా తయారయింది. తను ఇలాంటి నీతిలేనిదనే ఆనాడు వదిలేసి వచ్చాను. నీవే తిరిగి తీసుకువచ్చి నన్ను నరకయాతనకు గురిచేశావు. హుఁ! ఇంతటి గుణహీనకు భర్తనయ్యాను.

మధు అతికష్టంమీద అంజును విడిపించాడు. ఏదో నిశ్చయానికి వచ్చినట్లు, అంజువైపు చూసి "వదినా నిజంగానే వెళ్ళిపోవాలనుకుంటున్నారా!" అన్నాడు.

ఎర్రగా కందిన చెంపలను తడుపుకుంటూ, కళ్ళనిండా నీళ్ళతో "అవును. నాకెవరున్నారు మధూ. మీకు ఎన్నిరోజులు భారంగా ఉండను. అందుకే నా దారి నేను చూచుకోబోతున్నాను" అంది.

"నేను ఉన్నాను వదినా! మీకు నేను వున్నాను."

"హుఁ! నా మెడలో మూడుముళ్ళు వేసినవాడే నాకు స్వంతం కానప్పుడు నీవెలా నాకు బంధం అవుతావు మధూ!"

"అవుతాను వదినా! అన్నయ్యకన్నా మీమీద నాకే అధికారం వుంది. అన్నయ్య మీ మెడలో మూడుముళ్ళు వేశారేకాని, మీమీద ఎలాంటి అధికారం చూడలేదు. కాని నేను.... మీ ఇప్పటి పరిస్థితికి పూర్తి కారకుడ్ని నేను. అన్నయ్య మూడుముళ్ళు వేయకముందే, మిమ్మల్ని తల్లిగా చేసినవాణ్ణే నేను."

క్షణం నిశ్శబ్దం.

అక్కడున్న ఇద్దరికి అతను ఏం చెప్తున్నాడన్నది అర్థం కావడం లేదు.

ఇద్దరూ వింతగా మధువైపే చూస్తున్నారు. ఇద్దరికి ఏం మాట్లాడాలన్నది తోచడంలేదు. మధు ఏదో కాకమ్మ కథ చెప్తున్నట్లు నమ్మనట్లుగా స్థాణువుల్లా నిలబడి వున్నారు.

క్షణాలు సెకన్లు, సెకన్లు నిమిషాలులా మారుతున్నాయి.

భరతే తేరుకుని "మధూ! పిచ్చివాడిలా మాట్లాడకు. తను తాగివచ్చింది కాని, నీవు కాదు. నీకు తనమీద ఎంత అభిమానమున్నా ఇలా తన తప్పు నీమీద వేసుకోను ప్రయత్నించకు. దేనికయినా కొన్ని ఎల్లలనేవి వున్నాయి."

ఆ మాత్రమయినా పలుకలేని అంజుకు నోరు పెగిలి రాలేదు. భరత్

చెప్పింది నిజమే! మధు చూపించే దయకు ఒక ఎల్లయే లేదా అని ఆలోచిస్తున్నది.

"ఎంత నమ్మకం అన్నయ్యా మీ తమ్ముడిమీద. కాని అదే నమ్మకం మరొక ఇంటి ఆడపిల్లమీద చూపలేకపోయారు. వదినా! ఏదో ఆదర్శం పేరుతో, నాగరికత సాకు చెప్పి మిమ్మల్ని యిండియా నుండి తీసుకు వచ్చింది మీ పరిస్థితికి జాలి కలిగి అనుకుంటున్నారు కదూ! నేను ఒక సాధారణ మగవాడినే వదినా! నేను చేసిన పాపానికి పరిష్కారం వెదుక్కోను మిమ్మల్ని ఇంతదూరం తీసుకుని రావడం, ఏదో మా అన్నయ్య మనశ్శాంతికొరకు మటుకేకాదు. మీ కడుపులో పెరుగుతున్న నా బిడ్డను నేను తీసుకోవాలనే ఉద్దేశ్యంతో కూడాను. ఈ విషయం మొదటే చెప్పాలనుకొన్నాను. కాని మీ గర్భానికి కారకుడు నేను అని తెలిస్తే అన్నయ్య మిమ్మల్ని పూర్తిగా కాదంటాడని, కనీసం మీరైనా అన్నయ్యమీద అంతటి మమత పెంచుకొనకుండా వుంటే మీకైనా చెప్పివుండేవాడ్ని. నేను చేసిన పొరపాటువల్ల మన ముగ్గురి జీవితాలలో శాంతి అన్నది లేకుండా పోయింది. ఏ బిడ్డకొరకయితే మిమ్మల్ని మీ వాళ్ళని ఒప్పించి తీసుకువచ్చానో, ఆ బిడ్డ కూడా దూరమయింది. నేను చేసింది క్షణికమైన ఆవేశంలో పొరపాటు. అంతే! మిమ్మల్ని మీ ఇంట్లో కలిసినప్పటినుండి ఇప్పటివరకు నేను మిమ్మల్ని నా అన్న భార్యగా తప్ప మరెలాంటి చెడు అభిప్రాయంతో మసలిందే లేదు.

అన్నయ్యా! మీరు అడ్డుకోకుండా వినండి. వదిన తన కాలేజి యక్స్‌కర్షన్స్ గురించి చెప్పడం మీరు వినే వుంటారు. ఒక వేళ వినకున్నా ఇప్పుడు నేను చెప్తున్నాను వినండి. వదిన తన కాలేజి స్టూడెంట్స్‌తో కొడైకెనాల్‌కు ప్లాంట్స్ కలక్షన్ కొరకు వచ్చింది. ఆ రోజు రెడ్ ఇంక్‌లో అండర్‌లైన్ చేయాల్సిన రోజు, జనవరి ఐదవ తేది. వదిన చెప్పిన మద్రాసు యమ్మెస్సి స్టూడెంట్సులో నేను ఒకడ్ని. వదిన మా లేడి స్టూడెంట్స్‌ను కలిసినపుడు నేను లేను. అందువలననే నేను వదినను చూడలేదు. ఆ రోజు జనవరి ఐదవ తేది, నేను మా స్టూడెంట్సుతో కలియక కొన్ని ఫోటోలు తీసుకోవాలన్నట్లుగా బయలు దేరి, నాకు నచ్చిన దృశ్యాలను కెమెరాలో బంధిస్తూ ప్రకృతి సౌందర్యాలను తిలకిస్తూ కనిపించిన దారికుండా వస్తున్నాను. ఇంతలో సడన్‌గా చీకట్లు ముసురుకున్నాయి. సన్నగా పడుతున్న తుంపర కుంభవర్షంగా మారింది. ఒక్కసారి ప్రకృతి అంతా కాటుకలా మారింది. కాని నా వీపునవున్న నాప్‌శాకల్ అవసరానికి కావలసిన ప్రతి వస్తువు వున్నందువలన వెంటనే దాన్లోనుండి టార్చిలైట్ తీసుకుని వెలిగించి వస్తున్నాను. విపరీతమైన చలి. నా వంటిమీద ఉన్న స్వెట్టరు, దాని పైనవున్న జాకెట్‌ను మించిపోయింది. త్వరత్వరగా అడుగులు వేస్తూ వస్తున్నాను. ఇంతలో కాలికి మెత్తగా ఏదో తగిలినట్లయి ఎగిరిపడి ఏమయి వుంటుందని వంగిచూశాను. పవర్‌ఫుల్‌గా వెలుగుతున్న ఆ పెద్ద టార్చిలైటు వెలుగులో నా కాళ్ళదగ్గరున్నది ఒక యువతి శరీరం అనిపించింది. వానకు తడిచి, ఒంటికి అంటుకుపోయి

మోకాళ్ళ వరకు తొలిగిన పావడ జాకెట్‌మీద తడిచి ముద్దయిన గులాబి రంగు స్వెట్టరు తప్ప పమిట కూడా లేదు. తలమీద గడ్డకట్టిన రక్తం గుండా ఇంకా రక్తం కారుతూనే వుంది. ఒక్క క్షణం భయంతో బిగుసుకుపోయాను. కారణం, ఎవరో ఈ అమ్మాయిని కొట్టి కనిపించకుండా ఇక్కడ ఈ ముళ్ళ పొదలలో విసిరేసి వుంటారని అనుకున్నా. వంగి పరీక్షగా చూశాను. గుండెలు కొట్టుకుంటున్నాయి. ఉచ్ఛ్వాసనిశ్వాసలు యథా ప్రకారం తమ పని తాము చేసుకుంటున్నాయి. ఆ అమ్మాయిని తాకి చూశాను. శరీరమంతా మంచుగడ్డలా వుంది. కాని చలనంలేదు. ఎంతగా కదిపించినా, పిలిచినా ప్రాణంలేని బొమ్మలా వుంది.

మెల్లగా రెండు చేతులతో పైకెత్తి ప్రక్కనే వున్న పెద్ద చెట్టుక్రిందకు తీసుకుని వచ్చాను. అక్కడ ముళ్ళు, కొమ్మలు లేకుండా చేసి పండబెట్టాను. ఆ తరువాత ఏం చేయాలో తోచలేదు, తనను అలా నిర్దయగా ఆ కారు చీకట్లో వదలి వెళ్ళలేను. అలా అని తనను ఎత్తుకుని ఈ చీకట్లో రెండు మూడు మైళ్ళు నడచి టౌన్ చేరడం సాధ్యమయిన విషయంకాదు. ఆలోచించాను, చేతి గడియారం చూచుకున్నా, గంట ఏడయినా కాలేదు. ఈ అమ్మాయికి ఏ క్షణంలో నయినా స్పృహ రావచ్చు. అప్పుడు ఇద్దరం ఏలాగో ఊరు చేరవచ్చు. అంత వరకు తను ఇక్కడ గడపాల్సిందే అనుకుంటు. నామీదనున్న జాకెట్ ఆ అమ్మాయి స్వెట్టరు విప్పి కప్పాను. నా బ్యాగ్ తెరిచి దూదితీసి రక్తాన్ని తుడిచాను. మరి కొంచం దూది అద్ది కర్చీఫ్ కట్టాను.

బ్రాంది బాటిల్ తెరిచి, నేను కొంచం తాగి తన పెదవులు విప్పి నోట్లో పోశాను. కాని నేను పోసినది పోసినట్లే తిరిగి వచ్చింది. అలాగే లైటు కాంతిలో ఆ అమ్మాయి వైపే చూస్తుండి పోయాను, తడిసిన వెంట్రుకలు, ఒంటికి అంటుకుపోయిన పావడ, వళ్ళంతా గీరుకుపోయినా వాన నీళ్ళకు తుడుచుకు పోయినందువల్ల ఎక్కడా రక్తపు కఱలు లేకుండా తెల్లగా తళతళలాడుతున్న కాళ్లు, చేతులు, ఎంతో అందాలతో మెరుస్తున్న మొహం, నాలో మెల్లిగా మరొక మనిషి మేల్కొంటున్నాడు. చలికి నా శరీరం వణుకుతుంది. క్రమేణా కడుపులోనున్న మందు పని చేయడంతో, చేరువలోనున్న అమ్మాయిని దగ్గరకు తీసుకోమన్నట్లుగా తొందరచేసే శరీరాన్ని అరికట్టలేకపోయాను. మరుక్షణం నన్ను నేనే మరిచాను. సుఖం కావాలనుకొన్నప్పుడు పూలపాన్పులు అవసరంలేదు, మెత్తని ఫోమ్ బెడ్‌లు అవసరం లేదన్నట్లుగా ఆ ఆకులే పడకగా తలుచుకుంటూ ఆ అమ్మాయిని దగ్గరకు తీసుకున్నాను. ఇంత జరుగుతున్నా ఆ అమ్మాయిలో చలనమే లేదు. నా కోరిక తీరింది. నాలో వేడి చల్లారింది. ముంచి పోస్తున్న వాన తగ్గింది. అమాయకంగా ఇంకా కళ్లు మూసుకునే ఉంది ఆ అమ్మాయి. మెలకువ వచ్చేంతవరకు అక్కడే గడపాలనుకొన్నాను. ఆ రాత్రి అక్కడే తన ప్రక్కనే

నిద్రపోయాను. తిరిగి కళ్ళు విప్పిన నాకు గంట చూస్తే నాలుగున్నర అయింది. ఆ అమ్మాయి తలకున్న కర్చీఫ్ విప్పేశాను. నా కోటు తీసుకుని తడిసిన స్వెట్టరును తిరిగి వేశాను. టార్చ్‌లైట్ బెల్టుకు కట్టుకుని రెండు చేతులతో తనను ఎత్తుకుని రోడ్డు వరకు నడుచుకుంటు వచ్చాను. రోడ్డుకు ప్రక్కగా కనిపించేట్టుగా తనను పరుండచేసి దూరంగా పోయి చూస్తూ కూర్చున్నాను. ఎవరైనా తీసుకుపోతారేమోనని. త్వరలోనే స్టూడెంట్స్, లెక్చరర్స్ ఇద్దరూ ఆ అమ్మాయిని చుట్టుకోవడం, ఏవేవో మాట్లాడుకోవడం, ఆ తరువాత అటువైపే పోతున్న కారును నిలిపి ఆ అమ్మాయిని తీసుకుని పోవడం అన్నీ చూశాను. ఆ అమ్మాయి భారం వదిలింది. ఆ మరుసటిరోజే మద్రాసుకు వచ్చేశాను. అప్పుడప్పుడు ఆ అమ్మాయి గుర్తుకొచ్చేది. వెంటనే అది కల అన్నట్లుగా ఊహించుకుని మరచిపోయేవాడిని. అంతేకాని నేను చేసింది ఒక ఘోరమైన కార్యం అని ఏనాడూ తెలియలేదు. మీ వివాహానికి హడావిడిగా కొంతమంది స్నేహితులతో, ఫ్రెండ్ కారు తీసుకుని నేనే డ్రైవ్ చేసుకుంటూ వస్తున్నాను. ఎదురుగా లారీ రావడంతో కారు కంట్రోల్ తప్పడం, ఆ తరువాత అది వెళ్ళి రోడ్డుకు ప్రక్కగానున్న రావైన్‌లోకి దొర్లడం అన్ని క్షణాలలో జరిగిపోయాయి. తిరిగి కళ్ళు విప్పింది హాస్పిటల్లోనే: మీ దురదృష్టమో, నా అదృష్టమో మీ పెండ్లికి రాలేకపోయాను. ఒకవేళ నేనే ఆ మ్యారేజ్‌కి వచ్చివుంటే ఏమైవుండునో ఇప్పటికీ ఆలోచించినా అర్థం కాదు. మీరు నన్ను చూడకనే తిరిగి సింగపూరుకు వచ్చేశారు. ఆ తరువాత పిన్ని, చిన్నాన్న నన్ను చూడవచ్చారు. కాని మీ వివాహ ప్రసక్తి నా ముందర ప్రసంగించిందేలేదు. నా కోర్సు పూర్తవడంతో, పిన్ని, చిన్నాన్నలను చూసి వెళదామన్న ఉద్దేశంతో అక్కడికి వెళ్ళాను. కాని అక్కడ పిన్నిద్వారా షాక్ గలిగించే న్యూస్ బయటపడింది. పిన్ని కళ్ళనీళ్ళు పెట్టుకుంది. ఆ అమ్మాయి ఎక్కడుందని అడిగాను. అదే వూరని. చదువు ఆపేసి ఇంట్లోనే వుందని చెప్పింది. నాకెందుకో ఒక్కసారి అమాయకంగా తనకేం జరుగుతున్నదో కూడా తెలుసుకునే స్థితిలోలేని ఆ అమ్మాయి గుర్తుకొచ్చింది. ఒక్కక్షణం నేనుచేసిన తప్పుకు అన్నయ్య శిక్ష అనుభవిస్తున్నాడా అన్న ఆలోచన కలిగింది. అందుకు తోడు పిన్ని మీ పెండ్లి ఫోటోలు, వదిన పాస్‌పోర్టు వున్న కవర్ నా ముందర పడవేసి, చూడు ఆ అమ్మాయి భరత్ జంట ఎంత అందంగా వుందో! భగవంతుడే వాళ్ళ జంటను ఓర్చలేకపోయాడు. అని తిరిగి ఏడ్చింది. నా చేతులు వణికాయి. మెల్లగా ఆ ఫోటోను తీసి ఒకటొకటిగా తీసుకుని చూస్తుంటే నా కాళ్ళక్రింద భూమి కంపిస్తున్నట్లయింది. నా చేతులలోనున్న కాఫీ కప్పు క్రిందపడి బద్ధలయింది. ఊరికే అనలేదు. చేసిన పాపాలు నీడలులా వెన్నంటే వస్తాయని, పిన్ని ఏదో చెప్పుకుపోతూంది. కాని అది వినిపించుకునే స్థితిలో లేను. నా బిడ్డ వదిన కడుపులో పెరుగుతోంది. ఆ బిడ్డకు మీరు తండ్రి అని ఎలా సరిపెట్టుకో

గలరు. ఎంతగా కోరుకున్న అమ్మాయి అయినా ఒకనాటికి మీరు ఆ అమ్మాయిని స్వీకరించరు. వివాహం కాకముందే తల్లిని నేను చేస్తే, పెళ్ళిచేసుకున్న మీరు ఆ అమ్మాయిని నడిసముద్రంలో ముంచిపోయారు. ఎవరుచేసిన తప్పుకు ఎవరు బాధ్యులు. నాకు ఒకసారి వదిన స్థానంలోనున్న ఆ అమ్మాయిని చూడాలనిపించింది. పిన్నికి చెప్పకుండానే వాళ్ళ ఇంటికి వెదుక్కుంటూ వెళ్ళాను. నిశ్శబ్దంలో, శ్మశానవాటికను గుర్తుతెస్తూ వెలవెలబోతున్నట్లు ఉంది ఆ ఇల్లు. ఇక ఆ ఇంట్లో మనుషులు కేవలం మరబొమ్మలులా ఉన్నారు. వదిన పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. నోరు విప్పనే భయపడుతుంది వదిన. తనను చూసిన క్షణానే ఎక్కడో కొట్టుకుంటున్న కొన ఆశ తను తను కాకూడదు అన్న ఆ ఆశ అడుగంటిపోయింది. నేను చేసిన తప్పుకు నేను బాధ్యుడను. వదిన బాధ్యత నాది. వదినను ఎలాగైనా మన ఇంటికి పిలుచుకుని రావాలనుకొన్నాను. మీరు కాదన్నా ఔనన్నా వదిన స్థానం మన ఇల్లు. వదిన మనస్సులో మీరుతప్ప ఎవరూ లేరని తెలుసుకున్నాను. వదిన తలిదండ్రులను అతి కష్టంమీద ఒప్పించాను. ధైర్యంగా ఇంటికి పిలుచుకువచ్చాను. వదిన నన్ను క్షమించింది. నాకు సహోదరి ప్రేమను ఇచ్చింది. కేవలం తన పరిస్థితికి జాలిపడే నేను తనమీద కరుణ చూపుతున్నాననే అనుకుంది. చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకుంటున్నాడని ఈ దుర్మార్గుడు అనుకోలేదు. కానీ అన్నయ్యా! ప్రమాణంచేసి చెప్తున్నాను. మీకు భార్యగా నాకు వదినగా ఈ ఇంట ప్రవేశించిన వదినమీద నాకెలాంటి చెడ్డ అభిప్రాయం ఈనాటివరకు కలగలేదు. తను మీ కొరకే పుట్టింది, మీకుమటుకే స్వంతం అని ఈనాటివరకు అనుకుంటున్నాను. ఎంతో ఓర్పుతో ఎదురుచూశాను మీరు వదినను స్వీకరిస్తారని. అది అసంభవం అని తెలిసిపోయింది. అందుకే.... అందుకే!" మధు అంజువైపు తిరిగాడు. అంజులో కాని, భరత్‌లో కాని చలనం అన్నది లేదు. ఇద్దరూ రాతిబొమ్మలా నిలబడి వున్నారు. ఇద్దరి కళ్ళుమటుకే మధువైపు చూస్తున్నాయి.

"అంజూ!" వదిన అన్న వరుసను వదలినట్లు పేరుతో పిలుస్తుంటే ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చినట్లు అతనివైపు ఏమిటన్నట్లు చూసింది.

"అంజూ! ఈనాటినుండి నీవు నాకు స్వంతం. ఇక్కడినుండి పోదాం. పెళ్ళిచేసుకుందాం. మునుపు మీకు జరిగింది బొమ్మలపెళ్ళి అనుకుందాం. మీ ఇన్నిరోజుల నరకయాతనకు ఒక ముగింపు పెడుదాం. ఇకమీదట మీ జీవితంలో ఎలాంటి అపస్వరం పలుకనీయకుండా చేసే బాధ్యత పూర్తిగా నాది. కమాన్!" మధు ముందుకు రెండడుగులు వేశాడు.

తెప్పరిల్లిన అంజు మెడలోనుండి పసుపుదారాన్ని పైకిఎత్తి "దీనిని ఏం చేయమంటావు" అంది.

"అది వెంటనే తీసిపారేయండి. అన్నయ్య ఆనాడే చెప్పారుగా తెంచి పారెయ్యమని."

"అలాగే! కాని నేను నీలా నవీన నాగరికతకు వారసురాలుగా పెరగలేదే! నీవన్నట్లు అంత సులువుగా తెంచిపారెయ్యను. మీ అన్నయ్య ఆ పని చేయరు. ఎందుకంటె ఆయన నన్ను తాకితేనే భస్మమయిపోతారు. అదేదో నీ చేతులమీదే జరిగిపోనీ! ఈ కాలానికి ప్రతినిధివి నీవు. నీకు ఎందులోను తప్పొప్పులు కనిపించవు." మొహం ఎలాంటి భావావేశాలు కనుపరుచక తొణకకుండా అంది.

భరత్ ఇదంతా చూస్తూనే వున్నాడు. అతని మైండ్ పూర్తిగా బ్లాంక్ అయినట్లు. తనముందు జరుగుతున్నదంతా ఏమీ తనను సోకనట్లు నిశ్చలంగా నిలబడి వున్నాడు.

మధు ఒక అడుగు దూరంలో అంజుకు దగ్గరగా వచ్చి తన చేతులను అంజు మెడచుట్టూ వేయబోయాడు.

మరుక్షణం.

అంజు రెండు చేతులు ఎక్కడలేని బలం తెచ్చుకుంటూ అతనిని విసురుగా వెనక్కి నెట్టాయి. వెలుపలికి అతను స్టడీగా వున్నట్లు కనిపిస్తున్నా, ఆంతరంగికంగా అతని శరీరంలోని అంగాంగం చచ్చుబడిపోవడం అతనికి తెలుస్తూనే వుంది. ఏ దేశంలో పుట్టినా, ఏ దేశంలో పెరిగినా అతను ఒక భారతీయుడే! అతనిలోను ఆ భారత రక్తమే ప్రవహించేది. మరొక దేశంలో పుట్టగానే రూపురేఖలు ఎలా మారవో కొన్ని సాంప్రదాయాలు, మరికొన్ని కట్టుబాట్లు అలాగే మారవు. అలా అని బాహ్యంగా అతను ఒప్పుకోకపోయినా ఆంతరంగికంగా అతనికి తెలుసు. కాలం మారవచ్చు. కొన్ని అలవాట్లు మారవచ్చు. కట్టుబాట్లు మారవచ్చు. కాని పూర్తిగా కాదు. అలా ఎన్నటికి మారనిది, విలువ తరగనిది అగ్నిసాక్షిగా జరిగిన వివాహం. దానిని మార్చను ఎవరితరంకాదు. మానసికంగా అతను బలహీనుడయినందువలననే అంజు తోసిన తోపుకు దూరంగా సోఫామీదకు విసురుగా పడ్డాడు.

"అంజూ!"

"షటప్! మరొకమారు పేరుతో పిలిచావో నీ ప్రాణాలు తీస్తాను."

అతను పైకిలేస్తూ "అంజూ! నా మాట విను. మొదట అది అసంభవమే అని అనిపించవచ్చు. కాని అది జీవితాంతం కాదు. పాదరసంలాంటి మనస్సును మనం ఎటువైపు అయినా తిప్పుకోవచ్చు. అది మన ప్రయత్నం మీద ఆధారపడి వుంది. మీ మనస్సు మారుతుంది. అది మారేదాకా నేను కాచుకుని వుంటాను. కాని అంతవరకు మన కలయిక అవహేళనకు గురికాకుండా భార్యాభర్తలు అనే అధికారపూర్వకమైన అనుబంధానికి కట్టుబడి పెళ్ళిచేసుకుందాం." ఆ మాటలతో అంజు పూనకం పట్టినదానిలా ఊగిపోతూ, కాలికి దగ్గరగానున్న టీపాయ్ విసురుగా చేతులలోకి తీసుకుని దగ్గరగా వస్తున్న మధుకు అందిన ...గ సర్వం మరచి వేగంగా బలంగా అతనిని కొట్టసాగింది ...నిలుచున్న కాళ్ళ అతని నుదుట తగిలి రక్తం ధారలు కడుతోంది. ర...పుతోంది అంజు. కారే రక్తాన్ని

తుడుచుకోవడం కాని, ఆ దెబ్బలను అడ్డుకోవడం అన్నదికాని మధు చేయడం లేదు. అది కోర్టువారు తనకిచ్చే శిక్షకన్నా చాలా స్వల్పం.

"ఏమనుకున్నావ్ నన్ను. మీ చేతులలో ఆడే ఆటబొమ్మననుకొన్నారా! నేను మనిషిని కానూ? నాకు మనస్సు లేదూ? నీది కావొచ్చు పాదరసంలాంటి మనస్సు. కాని అందరిది అలాగే వుంటుందని అనుకోకు. ఈ రోజు నిన్ను చంపి నేను చస్తాను. ఈనాటితో మన కథ ముగిసిపోతుంది" ఎగిరెగిరిపడే గుండెలను అదుపులోకి తెచ్చుకోవాలన్నట్లుగా ఆగింది.

అంతవరకు శరీరంలోని ప్రతి అణువు మొద్దుబారిపోయినట్లు, ఎదుట జరుగుతున్న బీభత్సం కూడా ఆకళింపు కానట్లు కోవెలలోని శిలావిగ్రహంలా నిలబడిపోయిన భరత్ అంజు మాటలతో ఇహంలోకి వచ్చిపడ్డాడు.

మధు. అవును తన మధు. తన ప్రియమైన తమ్ముడు ఏంచేశాడు.

"మధూ!" ఒక్కసారిగా పెద్దగా కేకబెట్టాడు. అప్పుడుకాని తన ఎదురుగా అపరచండిలా వున్న అంజును, నుదుటినుండి, ముక్కు, చెంపలుమీదుగా కారుతున్న రక్తంతో నిలబడివున్న మధుని గుర్తించలేకపోయాడు.

మరుక్షణమే అంజును బలంగా, విసురుగా వెనక్కు తోశాడు. "యూ ఇడియట్! మధును చంపేస్తున్నావు." అంటూ మధు తలను దగ్గరకు తీసుకొని సోఫాలో పడుకోబెట్టి, ఫోన్ అందుకున్నాడు.

"ఏం? మీకు తోడబుట్టినవాడనేకదూ అంత మమత? నా గురించి ఏనాడయినా ఆలోచించారా! నేను వేరొక తల్లి కన్నబిడ్డనేకదూ! ఆ తల్లి గుండెలు ఇలాగే మండివుంటాయి అని తెలియదూ! ఒక్కనాడు ..ఒక్కనాడు ప్రశ్నించారా ఏమయిందని. ఎలా అడుగుతారు? మీ దృష్టిలో నేను పెళ్ళికాకముందే ఎవడితోనో కడుపు తెచ్చుకున్నదాన్ని. సెక్స్ మేనియాక్‌ని, నీతిలేనిదాన్ని, చెడిపోయిన వంశంలోనుండి వచ్చినదాన్ని. మీ దృష్టిలో ప్రతి ఆడపిల్ల సిగ్గు వదిలేసినదే! మీరంతే! మీ మగజాతి అంతే! మీరు, మీ తమ్ముడు, నా తండ్రి ప్రతి ఒక్కరూ ఒక్కటే! మీకు ఆలోచనాశక్తి శూన్యం. ఏది ఎలా జరిగినా ఆ తప్పు ఎదుట నున్న ఆడవాళ్ళమీద పెట్టి నిందించడం మీ గొప్ప మనసుకు గౌరవం. మీరు.... మీరు.... పురాణకాలాన్ని ముందుకు తెచ్చి అందులోనుండి సతీ సావిత్రులనో, సతీ అనసూయలనో ఎన్నుకుని వివాహం చేసుకోండి. వస్తా! గుడ్‌బై!" పరుగెత్తింది.

"అంజూ! ఆగు!" భరత్ మాటలు గాలిలోకి కలిసిపోయాయి.

ఒకే పరుగు, కాళ్ళకు ఎక్కడినుండి వచ్చిందో అంత శక్తి. కనిపించిన మెట్లగుండా ఒక్కొక్క అంతస్తు చేరుకుంటు చివరగా ఉపరి భాగానికి చేరుకుని మూడడుగులైనా ఎత్తులేని గోడ దగ్గరగా వచ్చి ఆగింది. అదిరదిరి పడుతున్న గుండెలు, వేగంగా వస్తున్న వుచ్ఛ్వాసనిశ్వాసలు! వణుకుతున్న కాళ్లు. చెమటలు

కక్కుతున్న శరీరం, అలాగే నిలబడి క్రిందకు చూడసాగింది.

అయిపోయింది, తన జీవిత కథ ఈనాటితో సమాప్తి. ఇరవయి సంవత్సరాలలోపే ఎన్ని భయంకర అనుభవాలు! ఏనాడు పెండ్లి పీటలమీద కూర్చున్నదో కాని అనాటినుండి తన బ్రతుకు ముళ్ళదారిగుండానే నడిచింది. మధు.... మధును ఎంతగా అభిమానించింది. మధు ప్రేమ నిస్వార్థమైనదనే తలచింది. కాని అతనే కథా నాయకుడని తలచలేకపోయింది. ఒక్క క్షణంకాదు! అర క్షణం మధు తనుచేసే నీచకార్యంముందు ఎదుటి ఆడపిల్ల భవిష్యత్తు ఏమవుతుందా అని ఆలోచించి వుంటే తన బ్రతుకు ఇలా అర్థాంతరంగా ముగిసిపోతుందా! తను అందరి ఆడపిల్లలులా భర్త, పిల్లలతో సుఖంగా జీవించి ఉండేది కదూ! ఇంత కథ జరగాలని విధి నిర్ణయించినప్పుడు తన ఆలోచనలు, ఆశలు వ్యర్థం. ఎక్కడో పుట్టింది. మరెక్కడో చావబోతూంది. క్రింద అంతా ప్రశాంతంగా వుంది. చిన్న చప్పుడయినా వినిపించేటట్లుంది. రేపటికి నిర్జీవమైన శరీరం, చెల్లా చెదురుగా పడివున్న కాళ్లు, చేతులు చెదిరిపోయిన మొహం. అందమైన అంజు అతి భయంకరంగా అందరి కళ్ళ బడుతోంది. కాని ఒకటిమటుకు తృప్తి అనిపిస్తున్నది. భరత్ అనుకున్నట్లుగా తను నీతిలేనిదాన్ని కాదు అన్నది ఋజువైంది. అది ఒక్కటి చాలు నెమ్మదిగా ఈ లోకం విడిచిపోను. ఆత్మహత్య అన్నది తన నుదుటిమీద వ్రాసి పెట్టింది కాబోలు. తనకు అంతకు మించి వేరే గత్యంతరంలేదు. తప్పు తనది కాకపోయినా ఒంటరిగా ఎంతకాలం ఎవరి ఆదరణ లేకుండా గడుపుతుంది. తను సూజిలాంటి ధైర్యశాలికాదు. తన బ్రతుకు తను బ్రతకడానికి ఒక్కసారి కళ్లుమూసుకొని, గాలిలోకి ఎగిరితే చాలు. తన కథ మరుగున పడుతుంది.

మెల్లిగా ఒక కాలు గోడపైన పెట్టింది, రెండవ కాలు కదుపుతోంది. వెనుక చప్పుడు. చటుక్కున వెను తిరిగింది.

తనకు కొన్ని అడుగుల దూరంలో అతను నిలబడి వున్నాడు. చెదిరిన తల, చెమటలు కారుతు పాలిపోయి ఉన్న మొహం, ఎప్పుడూ ఎంతో గంభీరంగా, మగసిరి వుట్టిపడేట్లుగా ఉండే అతనేనా ఇతను, అలాగే గోడ పట్టుకునే చూస్తోంది అతని వైపు.

"అంజూ!" మెల్లగా పిలుస్తూ ఒక అడుగు ముందుకు వేశాడు.

"దగ్గరకు రాకు. మరొక అడుగు ముందుకు వేశారో ఇక్కడినుండి దూకేస్తాను. వెళ్ళిపొండి. వెళ్ళండి ఇక్కడనుండి," అరిచింది.

అతనికి తెలుసు, గోడ ఎక్కి దూక అవసరంలేదు. కొంచం ముందుకు వంగినా రివ్వున వీస్తున్న గాలి అంజు కోరికకు సహాయపడేట్లుగా తన ప్రాణాలను అనంత వాయువుల్లోకి లీనమయేటట్లు చేస్తుందని. అంజును ఆ ప్రయత్నం నుండి ఆపాలి. తను అన్నిటికి తెగించి నిలబడి వున్నది.

"అంజూ! ఒక్కమాట. ఒకేఒక మాట విను. ఆ తరువాత నీ అభీష్టాన్ని నెరవేర్చుకో! నీ ప్రాణం తీసుకునేముందు నా మనసులోనున్న మాట ఒక్కటే ఒకటి చెబుతాను. అది విని కూడా ఆత్మహత్యే నీకు శరణ్యం అనుకుంటే నేను అడ్డురాను. ప్లీజ్! అంజూ! నేను చెప్పేది వింటావు కదూ!" ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నాడు. వేస్తున్నాడు అనడంకన్నా జరుగుతున్నాడు అన్న సబబు. అంజు అది గుర్తించడం లేదు. తన చూపులు ముందుకు వెనక్కు చూస్తున్నాయి.

"ఊహూ! మీరేం చెప్పినా వినదలుచుకోలేదు, నా ప్రయత్నాన్ని నేను ఆపను. ఆపదలుచుకోలేదు. దయవుంచి వెళ్ళిపోండి." అంజు రెండవకాలు పై కెత్తుతోంది. తనలో ఎక్కడలేని తెగింపు. ఆనాడు లేని తెగువ ఈనాడు తను చేసే పనికి త్వరగా చేయమని బలవంతం చేస్తోంది.

"అంజూ, అంజూ! నా మాట విను. నన్ను వదలి వెళ్ళకు." అతని కళ్ళలో నీరు, గొంతులో జీర, అంజు గోడ పట్టుకునే ఆగింది.

"అంజూ! నా మాట విను. నా కళ్ళలోకి చూడు, నా మనస్సు అర్థం చేసుకో. నిన్ను ఎంతో పిచ్చిగా ప్రేమించాను. నా సర్వస్వం నీవే అనుకొన్నాను. నీవు నా కొరకే పుట్టావనుకొన్నాను. నిన్ను చూసిన మొదటి క్షణంలోనే! కాని నీవు గర్భవతి అని తెలియగానే పిచ్చివాడినే అయాను. నేను అంతగా కోరిన అమ్మాయి మరొకరి చేతులలో నలిగి వాడిన పూవు అని తెలియగానే అవమానంతో, ఆవేదనతో క్రుంగిపోయాను, నీవు నా మటుకే స్వంతం అయి వుండాలని కానీ నీవు నాకన్నా ముందు మరొకరికి స్వంతమయి నన్ను మోసం చేశావని ఆవేశంతో నోటికి వచ్చినట్లల్లా మాట్లాడాను. అధికమైన ప్రేమ వలననే నిన్ను అంతగా ద్వేషించాను. అంజూ! బాగా విను. ఐ లవ్ యూ! ఐ లవ్ యూ సో మచ్! నీ ప్రాణాలు తీసుకొని నన్ను జీవచ్ఛవాన్ని చేయకు, నీవు నాకు కావాలి." చివరి అంగలో అంజు నడుమును రెండు చేతులతో బంధించి దగ్గరకు లాక్కున్నాడు.

(సమాప్తం)

Edited & Published by V. Leelavathy Raghavaiah at 1-8-519/11, Chikkadapalli, Hyd-20, & Printed by P. Ramakrishna at Raghava Printers 1-8-4/1/1, Chikkadapalli, Hyderabad-20.

